భారతి

మాసపత్రిక

*

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

*

మార్చి 1977

సంపుటము : 54 సంచిక : 3

విడిప్రతి వెల రూపాయిన్నర

కలలు నిజమవుతున్నవి

స్నిగ్ధ మనోహర వీక్షణాలు లలిత లావణ్యాకృతులతో పేరొందిన కేవలం భౌతిక మానవస్వభావానికి ప్రతిరూపాలుగా అలరారుతున్న అద్భుతమైన బిద్రీ వస్తువులు తెలుగువారి హస్తకళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నాయి.

ఈనాడు ఆంధ్రప్రదేశ్ ఆర్థికపరిస్థితులుకూడా బిద్రీ ఆకృతులవలె సహజంగా సమృద్ధంగా, సంతృప్తికరంగా ఉన్నాయి. రాష్ట్ర సమైక్యతకు రూపొందించబడిన ఆరు సూత్రాల పథకాన్ని నిబద్ధవంతంగా అమలు జరిపాము. వెనుకబడిన ప్రాంతాల సత్వరాభివృద్ధికి ఉద్దేశించిన పటిష్టమైన కార్యక్రమాన్ని గత రెండు సంవత్సరాలకు పైగా అమలు జరుపుకుంటున్నాం. ఐదవ ప్రణాళిక నిమిత్తం కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు రు. 90 కోట్ల ఉదార సహాయం అందజేయడంవల్ల యీ కార్యక్రమం అమలు సాధ్యమైంది.

20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం, కొత్త సవాళ్లతోపాటు, కొత్త అవకాశాలనుకూడా కలుగజేసింది. ఆంధ్రప్రదేశ్ యీ బృహత్తర కార్యక్రమాన్ని నూతనోత్సాహంతో అమలు జరుపుతున్నది. అత్యవసర వస్తువుల ధరలను అదుపులో పెట్టారు. భూసంస్కరణల చట్టాన్ని ముమ్మరంగా అమలు జరుపుతున్నారు. ఈవిధంగా కర్షకుల కలలు నిజరూపం ధరిస్తున్నాయి. ఇంతవరకు 3.50 లక్షల ఎకరాలకు పైగా భూమిని మిగులు భూమిగా నిర్ణయించారు. వెనుకబడిన వర్గాలకు పెద్ద ఎత్తున యిండ్ల స్థలాలను కేటాయిస్తున్నారు. ఈ కార్యక్రమం క్రింద 1975 ఏప్రిల్ నుండి దాదాపు 5 లక్షల వెనుకబడిన వర్గాలకు చెందిన కుటుంబాలకు యిండ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు.

యిండ్ల యాజమాన్యపు హక్కు కలుగజేయడం, వెట్టిచాకిరీ రద్దు చేయడం, గ్రామీణ ఋణాలపై మారటోరియం కనీస వ్యవసాయ వేతనాలను ఎక్కువ చేయడం వంటి యితర కార్యక్రమాలను అమలు జరపడంతో సమాజంలోని పీడిత వర్గాలకు నవోదయం అయింది.

రాష్ట్రంలో నెలకొన్న అనుకూల పారిశ్రామిక వాతావరణం ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఆశా కిరణంగా ఉంది. 1976 జనవరి నుండి అమలులోకి వచ్చిన సవరించబడిన ప్రోత్సాహక పథకం అనుసరించి ఆరు సూత్రాల పథకం క్రింద వెనుకబడిన ప్రాంతాలుగా ప్రకటించబడిన ప్రదేశాలలో నెలకొల్పబడే కొత్త పరిశ్రమలకు రు. 10 లక్షల పరిమితికి లోబడి పెట్టుబడిలో 10 శాతం పెట్టుబడి సబ్సిడీగా యిస్తున్నారు. గిరిజన ప్రాంతాలలో నెలకొల్పబడే యూనిట్లకు రు. 15 లక్షల పరిమితికి లోబడి పెట్టుబడిలో 20 శాతం ఎక్కువ పెట్టుబడి సబ్సిడీ యిస్తారు.

డైరెక్టరు
సమాచార, పౌర సంబంధ శాఖ,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.

19/76-77

విషయానుక్రమణిక

మార్చి 1977

మధూదయము

శ్రీ గడియారం శేషఫణిశర్మ

అమలిన మల్లికా సముదయమ్ముల సాంద్ర మధు ద్రవమ్ములన్
ప్రముదిత మత్తకోకిల రవమ్ముల, పంచమ నిస్స్వనమ్ములన్
భ్రమర కలానులాప విసరమ్ముల, గీత నిబంధనమ్ములన్
సమధిక చైత్రశోభ పరిణాహ సుఖావహమయ్యె నెచ్చెలీ !

వచ్చె వసంతవేళ, యిదె వచ్చె నిసర్గ సుగంధిలానిలం
బచ్చెరువందజేయ వినవచ్చె కుహూముఖ రాగమంజరుల్
నెచ్చెలి ! లెమ్మ, రమ్మ, కరుణించె వసంతుడు, పల్లవాక్షతల్
దెచ్చె ననుగ్రహింప, వినుతింతము దోసిలొగ్గి ఆతనిన్.

ఏమి మహేంద్రజాలము రచించెనొ ఈ మధుమాస వాసర
స్వామి ఇతండు, శైశిర విశా విషమాలసి గీతికల్ మధు
శ్రీ మహితాక్షరస్థితి భజించె ! ప్రఫుల్ల మయూర పింఛికా
శ్యామల కోమలద్యుతి ప్రసారములన్ పులకాంకితమ్మలై !

ఊహాలలోన, రెక్కలుదయించి యెదన్ గదలాడుచున్న ఈ
ఊహాలలోన, ఆశలకు నూపిరులూదెడు నవ్యజీవనో
త్సాహము లేవియో ప్రచురతాండవకేళి ఘటించె, రాగసం
దోహము పల్లవించె, సుమనోద్గమలక్ష్మి హసించె నెచ్చెలీ !

సతిమిరపుంజమౌ శిశిర శర్వరి వీడ్వడి గతించె, నల్లదే
అతను శరప్రశస్త కుసుమాంకిత పాండురవత్సరాగ సం
గతి, ధవళమ్ములయ్యెడి దిగంచలముల్, మలయానిలోర్మి సం
భృత సుమనస్సు గంధములు పెంపు వహించె, మధూదయమ్మిదే !

ఈ శిశిరావసానమున, ఈ ప్రసవోద్గమ సాంధ్యవేళ, నా
శాశఫరీ విలాస మవిశమ్ము భృశమ్ము వహించు హర్ష బా
ష్పాశయ రాగపంకిల తటాంచల మందిటు నిల్చి, కైశికీ
పేశల భావగీతి వినిపించుదునా [illegible] ప్రేయసీ !

పలుకుదునా సఖీ ! ప్రణయ పల్లవగీతి, వియోగ వేదనా
మలిన విపంచి వీచికల మ్రగ్గిన ఈ హృదయమ్ము, మాధవా
నిల హిమడోలదేలి, రసనిర్భరమై, పులకోద్గమ క్రమా
కలన బరిక్రమించి, శ్రుతిగల్గును, పల్లవి నూలు కొల్పగన్.

విస్కీ తాగిన పక్షులు

శ్రీ రామాచంద్రమౌళి

అర్ధరాత్రి...ఒంటరిగా...నిశ్శబ్దంలో...
  నిన్న నడిరోడ్డు మీదినుండి నడచిపోతూంటే
గాలి నా చెవుల్లో ఏడ్చి,
సృష్టి నా మనస్సును నిప్పులా తాకి—
ఏదో కనిపించని ఆత్మ గుసగుసపెట్టింది
చీకటి సముద్రంలో ఎన్నో అగ్నిపర్వతాలు కనిపించినట్లు నాకింకా గుర్తే...,
ఔనూ ! అగ్నిపర్వతం బ్రద్దలైతే ఏమిటి...?
లావా నా గుండెకన్నా ఎర్రగా ఉంటుందా !
నేను యిదివరలో ఎప్పుడో లావాను మలచి మందారపూలుగా
ఆకాశంలోకి విసిరేసినట్లు జ్ఞాపకం
పగిలిన కళ్ళజోడునుండి చూస్తే ప్రపంచం బీటలువారి కనబడింది
కాని...పగిలిన హృదయంలోనుండి చూస్తే
యీ మనుషులు నా సానుభూతిలో తడుస్తూ దేవతల్లా కనిపిస్తున్నారు.

నేను
నా మనసు మబ్బు తునకపైనుండి నా ప్రేయసి నడచిపోయిన పాదముద్రలను
స్మృతిగా చుట్టుకుని దోసిలిలో దాచుకున్నాను యిదిగో —
ఆమె నిరంతరం వెలిగే కర్పూర జ్వాల
హారతిని కళ్ళ కద్దుకోవడమే ముద్దు
ముట్టుకుంటానంటే తీయగా కాల్చి నవ్వుతుంది నిశ్శబ్దంగా
నాకు చిగురాకు పాడే తీపిపాటా,
శిశిరపత్రం రాలుతూ ఆలపించే అపశ్రుతి—రెండూ తెలుసు.

ఒక్క వీణను మీటడమేకాదు
తెగిన తీగను అతికించడంకూడా తెలియాలి మనిషికి

చిన్నప్పుడు —
కాగితపు పడవతో ఆడుకున్న క్షణాలు ఎవరికైనా చేదుగా ఉంటాయా
తొలకరిలో పులకించని మనిషి ఉంటాడా—

నేను నాలోనే నిక్షిప్తం చేసుకున్న
కొన్ని క్షణాలు విస్కీతాగిన పక్షుల్లా మత్తుగా నా గుండెల్లో పడుకుని
ముసురు పట్టిన రాత్రి
మంటల్లా లేచి మధురంగా నన్ను గాయం చేస్తాయి

చిరుజల్లు వానలో తడుస్తూ,
దీపస్తంభంక్రింద కూర్చుని జ్ఞాపకాలను నెమరేసుకుంటూంటే
— ఏమిటో,
ప్రకృతి నాలోకి చిరుయేరులా ప్రవహిస్తూంటుంది
తెరచాపలూ, గాలిపటాలూ కాదు ఆదర్శాలు నాకు
పర్వత శిఖరాలూ, నక్షత్రాల నవ్వులూ ప్రాణాలు నాకు.

విలువైన భూగోళాలు

శ్రీ గుంటూరు శేషేంద్రశర్మ

ప్రేమకు దానికోసం ఎంత బాధయినా పడదగినంత విలువుంది. అందుకే నేను ఒంటరిగా వంతెనమీద కూర్చొని నామీద చంద్రుడిచేత వెన్నెల కురిపించుకుంటున్నా —

నీ నవ్వుల్లో ఏ పువ్వులున్నాయో ఎరగని రోజుల్లోనే నిన్ను ప్రేమించాను; ఇటుకలతో కాదు, పూలశాఖలతో ఇల్లు కట్టి నీతో కాపురం పెడదామనుకున్నాను. చంద్రుడు ఆకాశంకోసం చేయబడినట్లు నీవు నాకోసం చేయబడ్డావనుకున్నాను. కోకిల మామిడి కొమ్మ కతికినట్లు నీవు నా బాహువులకే అతుకుతావనుకున్నాను —

దునియాలో నేను గెలిచినపుడల్లా నీవు నిలుస్తావు నా కన్నులో ఆనందాశ్రువై — నీవు స్త్రీవి కావు అందాల తుఫానువి, నీవు చీరా తారా కలిపి చేసిన రూపానివి; నీ చేతులు పువ్వుల దండలు నీ నవ్వులు నక్షత్రాల కండలు —

కనకనే గాలి ఆకుల్లో శాశ్వత ప్రేమికుడైనట్లు నన్ను నీ కన్నుల నీలి రేవుల్లో తీరాలకోసం వెతకని నావికుడ్నిగా మార్చుకున్నాను ...

నీవులేకపోతే నాకు ఆకాశం మాత్రం ఏమిటి? సూర్యుడు చంద్రుడూ నక్షత్రాలూ కలిపిన శూన్యమే తప్ప —

నన్ను నీవు అనక నేనొక కలల వర్తకుడ్ని; నా బజారుల్లో నీ కళ్ళు రెండు విలువైన భూగోళాలు

ఈ వీధుల్లోనే ఎగురుతా!

శ్రీ వెళ్ళపిళ్ళ సూర్యనారాయణమూర్తి

"నీలో బాధఉందా ! – అయితే నువ్వింకా బ్రతికున్నట్లే లెఖ్ఖ"
ఎవరది ?... ఆ మాటలంటున్నది ?
నా గుండెలో నిద్రించే భావాల్ని లేవగొడుతున్నది
నా గొంతులో దాక్కున్న రాగాల్ని తరిమిగొడుతున్నది
సమస్యల సందుల్లో పిచ్చిగా పచార్లు చేస్తున్న నన్ను
కలల పూలతోటల్లోకి పారిపొమ్మంటున్నది.
ఎప్పుడు నేనూ నా మనస్సూ రెక్కలై
వాళ్ళని ఎగరవిచ్చామో !,
ఇప్పుడు నవ్వూ నా మనస్సునూ
ఎగరమంటూ రెక్కలిస్తామంటున్నారు
నన్నో సీతాకోకచిలుకనై పొమ్మంటున్నారు
మరో లోకపు తలపుల తెమ్మెరలు చల్లబరచే
పూల కప్పుల్లోని వేడి పాయసాల్ని ఆస్వాదించమంటున్నారు
వెళ్తున్నా ! పూలు రమ్మంటున్నాయి —
వాటిలోని పాయసాల్ని పుచ్చుకొమ్మంటున్నాయి
గుప్పిళ్ళతో పుప్పొళ్ళను ఒంటిపై చల్లుకొమ్మంటున్నాయి
వెళ్తున్నా !
వాళ్ళ చిరునవ్వుల్ని నా రెక్కల్లో పట్టుకెళ్ళి
అక్కడ నా ముక్కుతో వాటిని
మకరందాల పాయసాల్లో సుగంధాలుగా కలుపుకొని ఆస్వాదిస్తూ
అవి అందించే అమరత్వంతో శాశ్వతంగా సీతాకోకచిలుకనై
ఈ ప్రపంచపు వీధుల్లోనే ఎగురుతా !
నా ఒంటిపై చల్లుకొన్న కలల పరిమళాల పుప్పొళ్ళను
అక్షతలుగా చల్లుస్తూ
ఈ ప్రపంచాన్ని దీవిస్తూ.

శిథిల భ్రాంతి

శ్రీ కొంపెల్ల రామకృష్ణమూర్తి

నిజమే —
నిర్విచార తత్త్వం నీవు లేనప్పుడే సిద్ధిస్తుంది.
తీరా నువ్వు హృదయాన్ని ఆక్రమిస్తే
తీగలు సాగుతున్న మహోద్యమం సైతం మట్టిగొట్టుకు
పోతుంది.

భ్రాంతీ !
గ్రీష్మతపంలో దాహార్తుడైన జీవికి
మధురామృత పూరంలా కనిపించే ఎండమావీ !
ఎన్నెన్ని పవిత్ర జీవన కుసుమాల్ని
కాలరాసిన కసాయితనం నీది !
ఎన్ని తరాలనుంచి నిక్షిప్తం చేసుకున్న కర్కశత్వం నీది !

ఒక దీర్ఘరాత్రి —
నాలో నాతోబాటు ఎదిగిన జాడ్యమా !
పెదవి వంపుతో - మందగమనంతో
కనుసైగతో నునువెచ్చని చుంబనంతో
నన్ను బానిసను చేసుకున్న విషకన్యా !
'దినక్షపా మధ్య' నిర్జీవ సంధ్యా !
ఈనాడు నీ నిజస్వరూపం గోచరిస్తోంది—
నీ ముఖానికి నువ్వు అందంగా పులుముకున్న
సువర్ణ వర్ణం - కాకి బంగారమని తేలిపోయింది.
యుగయుగాల నిజహృదయ కాలుష్య దుర్గంధానికి
మృదూక్తుల పుష్ప సౌరభం పూసి—
ముహుర్ముహుర్వివేక పరాజిత శిథిల శరీరాన్ని
సిగ్గులేక - హరిచందన చర్చతో గుబాళింపజేసికొని —
ఆ రాత్రివేళ భయంకర స్వైరిణిలా
నా ప్రశాంత సదనంలో ప్రవేశించి - నీ చేతి వేళ్ళతో
ఏ దురదృష్ట గీతం నా నుదుట లిఖించావో !
ఏ అపస్వరం నా స్వర పేటికలో పొదిగావో !
తదాదిగా నా లేఖిని రక్తం కక్కుతుంది—
నా స్వరం శివరంజనిగా సాగింది.

భ్రాంతీ !
ఏ బలహీనతా సిసలైన మనిషిని లొంగదీసుకోలేదు
తాత్కాలిక మోహం—
ఏ శాశ్వత విసర్గ చైతన్యాన్ని సమాధి చేయలేదు.

నీ ఆజ్ఞతో నన్ను అస్పష్టాలోచనల సంకెళ్ళతో
బంధించిన నీలిరాత్రి —
నా వివేక సూర్యోదయంతో భగ్నమైపోయింది.

నిన్నరాత్రి నాగుండెను కోసిన శివరంజని
ఈ ఉదయం - అపురూప భూపాళంగా మారిపోయింది.

భ్రాంతీ ! ఓ పొగమంచూ !
ఏమైపోయావు నువ్వు ?
ఏ దురదృష్టవంతుణ్ని మళ్ళీ నీ కౌగిట ముడివేసుకున్నావు!
ఏ పాతాళలోకంలో "పాట" కన్యలా దాక్కున్నావు !

రెండు

శ్రీ ప్రసాద్ ఎమ్వీఎస్.

అప్పుడు
ఆ చీకటి గదిలో
స్వేదాన్ని ఆశ్వాసిస్తూ,
దిగంతాల్ని కొలుస్తూన్న
నేను

ఒక్క మాటు
న్యూమేటిక్ డోర్‌లాంటి
చందమామను ఒత్తిగిలించి
చూశా.

వెలుతురు సముద్రం
కట్టు తెంచుకుని
గదిలోకి పారింది.

కొండ చరియల్లో
కోనిఫెరస్ అడవుల్లో
ప్రతిధ్వనించిన
నా పిలుపు నందుకుని
మేలిమి వలువలలో
హవాయి సుందరిలా —
పట్టు నవ్వులు నవ్వుతూ
వెన్నెలలో తడిసిన
ఇసుక తిన్నెలమీంచి
జారుతూ
ఉన్మత్త సౌరభాల్ని వెదజల్లుతూ
నా ఒడిలోకి వొచ్చి పడ్డావు

[ఎవడూ ఈ డోరు మూయడేం ?]
అంగారకుడి నైట్ బల్బు వెలుగులో
నీ జుత్తు వింజామరలలో
నా ముఖాన్ని కప్పుకున్నా.
సంపెంగలు —
నా ముఖంపైన
మున్వద్దిన
లాక్షారుణ దరహాసం.
[ఇంత నిశ్శబ్దంలో ఒక్క మాటా వినబడదేం?]
ఈ ఖర్జూర వృక్షం కింద
సొమ్మసిలిన నీ మేనితో
మాట్లాడ్డానికి ప్రయత్నించినపుడెల్లా
నా మనస్సు అరణ్యపు మూలల్లో
వెనుళ్ళు అరుస్తూ పరుగులెత్తుతాయి.
అందుకని
ఇంద్రధనుస్సులపైనుంచి జారి
నీ కళ్ళ ఆల్చిప్పల్లోకి వొచ్చిపడతా.
అప్పుడు, రెప్పలు మూసేద్దుగాని.

కానీ,
వొంటినిండు కూ
వర్షం
కుండపోతగా నూ
చల్లగా నూ
నీ బుజాలపైనుంచి జారుతో
వొణికిస్తూ —
నీస్ఫటికపు చెక్కిళ్ళలోకి
నా పెదవుల దవాక్షాలగుండా
చూస్తే
ఎన్ని రంగుల లోకాలు !
అనంత తేజోమండలాలు !
వాటిలో ఒక రేణువునై
రోదసిలోకి
నీ ఊపిరితో
దూది పింజలా విసిరిపోతా.
యుగాలపాటు —
కొన్ని కాంతి సంవత్సరాలు
ఇలా పరిభ్రమిస్తూనే ఉంటా.

ఆశారేఖ

శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తి

తరుణ పల్లవ మంజరీ భరిత మగుట
అలసి పోయెనో, నిదురించు ఆమ్రములు,
శోకములు, వన వీధిలో శుభవసంత
శార్వరీ మధ్యమున, ఈ ప్రశాంతవేళ.

దినము దినమెల్ల భ్రమర లాలనల తనిసి
గంధములు, పుప్పొడులు, మకరంద ఝరు
ధారగాబోసి సోలిన చారు చిత్ర
వర్ణ పుష్పాళి జారె స్వప్నార్ణవమున.
ఎవరో దివ్యులు పయనింతురేమొ, ఆ సు
వర్ణ శోభా ప్రదీప్త శుభ్రప్రసన్న
చంద్రబింబంపు నావ సుచారు గతుల
కదలుచున్నది ఆ నీలి కడలిలోన.

కదలవాకులు – కదలదు...గాలి తరగ—
ఏటి కెరటాలు సైకత వాటికలను
ఆదమరచి నిద్రించు నీ అర్ధ రాత్రి—
కాని మానవు కూయ పికాలు రెండు.

గగన మంటెడు ఒక అశోకమ్మునుండి
గుబురుగాఉన్న ఒక మావి గున్న నుండి
వినగ వచ్చెడు విసుగును విరతి లేక
జాలినిండిన ఆ పికస్వర యుగమ్ము.
పంచమమ్మున మ్రోగు ఆ ప్రతిరవంపు
లోతు అందేదొ తపన – అలోకమగుచు

అందరానట్టి దేనికో ఆరటమ్ము—
అదృశమగుచున్న దేనికో వెదకులాట.

పూర్వజన్మలో తపసున మునిగిపోయి,
మౌనముగ భగవాను నామము జపించి
ఎంత పిలిచిన వెలుగు కాన్పించ కన్నె
ఇహము వీడిన ఋషులేమొ ఈపికాలు?

మధుర కేగిన మాధవు మరువలేక
"కృష్ణ, కృష్ణా!" అనుచు బృంద ఏడ్చి ఏడ్చి
తుదిని యమునానదీ నీల తోయములను
దూకి మరణించిన వ్రజవధూద్వయమ్మొ?

స్వర్గమున దూరి సర్వనాశనము సేయు
రాక్షసుల ధాటి కోడి ధర్మమును సత్య
వెలుగు నిరసింపగ పరమేశు శరణు
కోరుకొనుచున్నవో ఇట్లు కూసికూసి?

వానితోపాటు నేనును ఈ నిశీథ
మందు గొంతెత్తి గట్టిగా అరవదొడగ
మనసు పుటెడు – ఈ భవమ్మున జవాబు
దొరక బోదను నిజమది ఎరిగిగూడ.

ఏది ఏమైన ఈ ఆర్తనాదములను
ఆశమటుకు ద్యోతము – నిశ్చయముగ విప్పుడో
ఎవ్వరో ఇవి విని కటాక్షించి లేచి
ఉచిత ప్రత్యుత్తరము నిత్తు రొక్కనాడు!

యవ్వనం మిగలని వసంతం

శ్రీ బండి రాధాక్రిష్ణ

ఆకాశంలో అందంగా ఉదయించి
ఆశలురేపి, తెల్లవారే సరికి
అదృశ్యమైపోయిన ఓ నక్షత్రమా !,
నా అంతర్మథనం నుంచి జనించిన
ఆవేదన వినిపో !

ఆశగా చూస్తున్న నన్ను,
రాగానే ఉక్కిరి బిక్కిరి చేసి,
విగిరిపోయిన వసంతానివి నువ్వు.

చెప్పలేని దిగులుతో గడిపిన రాత్రుళ్ళు,
కప్పలేని కాంక్షకు చిహ్నమైన కళ్ళు,
దప్పిక తీర్చలేని ఒయాసిస్సుల ఆరళ్ళు,
ఇప్పటికీ మరిచిపోలేను నేను.

దళంతో దాడిచేసిన 'బిడారి గుంపు' తో
నా స్వప్న వీధిలో అనుమతి లేకుండా ప్రవేశించి,

ఈ జగత్తంతా ఒక రంగుల చిత్రంలాచేసి,
ఊహా ప్రపంచంలో నడుస్తున్న పేషెంటును చేసావు.

ఏది నిజమో, ఏది భ్రాంతో
తెలుసుకునేలోగా,
చలికాలపు 'సెగలుచిమ్మే నోటిపొగ' లా,
గుప్పున బయట పడ్డావు.

ప్రపంచమంతా నాదేనని ధీమాగా నడిచాను నాడు.
ప్రపంచమంటే ఇదేనా అని దడుస్తున్నాను నేడు.
పద్దెనిమిదేళ్ళవాడికి,
తాను గెలుచుకుందేదో తెలియదు.

లక్షరూపాయలువస్తే, ఏం చేస్తామని, ?
సవాలక్ష ఆలోచనల వలలో చిక్కిన చేప,
చెరువులో నీరెండిపోయిందని చూసుకోలేదు.

మరి,
ఇరవయ్యారేళ్ళ వసంతంలో వచ్చిన యవ్వనాన్ని,
ఏంచేసావంటే ?, ఏం చెప్పను ?

రూపలయ

రాగమాలిక రఘురూప

అంకురితంగా ...
అనిర్వచనీయ రూపలయ
మంద్ర శబ్దాలు
సాంద్ర తేజస్సు—
— శూన్యం పలికే రాగం
వస్తు ప్రపంచం నుండి
దిరవాటేసిన
అంతరంగం
నాలో
పారదర్శకతమస్సును

చీల్చుకుంటూ...
ఉదయించిన వెలుతురు బిందువు
—కాసేపు గమకించి...
ఆధ్యాత్మికంగా చితికి...
ఉనికిని కోల్పోయి...
పాయలు-పాయలుగా
ప్రయాణిస్తోంది—
అగమ్యానికి...
—బహుముఖాలుగా

కావలి వెంకటరామస్వామీస్

బయోగ్రాఫికల్ స్కెచెస్ ఆఫ్ ది దక్కన్ పోయట్సు

KAVALI VENKATA RAMASWAMI'S

BIOGRAPHICAL SKETCHES OF THE DEKKAN POETS

(First Published in 1829) 1

కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావు

(1)

నేటి దక్షిణ భారతమునకు పూర్వము "దక్కను" అని పేరు. ఈ ప్రదేశమున విలసిల్లిన సంస్కృత, తెలుగు, తమిళ మహారాష్ట్ర కవుల చరిత్రలను కావలి వెంకటరామస్వామియను పండితుడు ఆంగ్ల భాషలో రచించి, క్రీ. శ. 1829లో తొలుత ప్రకటించెను. ఆ గ్రంథమే తిరిగి క్రీ.శ. 1847లో పునర్ముద్రితమైనది. ఆ పునర్ముద్రిత ప్రతి ఆధారముగా శ్రీ సి. వి. రామచంద్రరావుగారు రెండేండ్ల క్రిందట ఆంగ్లభాషలో విపుల పీఠికతోడను, వివరణములతోడను, వెలయించిరి. దీనిని నెల్లూరు వర్ధమాన సమాజమువారు ప్రకటించిరి. ఇది గ్రంథస్వరూపము.

గ్రంథ సంపాదకులకు గ్రంథము ముద్రిత ప్రతి 1847నాటిది లభించుటచే దాని ననుసరించి యీ గ్రంథము ముద్రించినట్లు ఆ గ్రంథ ముఖపత్రము నిందిచ్చినారు. అది ఇట్లున్నది :

Biographical Sketches
of the
Dekkan Poets

Memoirs of the lives of several eminent bards both anicient and modern who have flourished in different provinces of the Indian peninsula compiled from authentic documents

By

Cavelly Venkata Ramaswami Pundit carre. sponding member to the Royal Asiatic Society. Bombay.

Printed at the Victoria Press by Ramachandra Dhondieti April 1847.

ఈ గ్రంథము 1847లో ద్వితీయముద్రణ మందినను నా వెనుక క్రీ. శ. 1888లో కూడ ముద్రింపబడినది. దీనిని గూర్చి సంపాదకులు వారి ఉపోద్ఘాతములోనూ, వివరణలు 70 పుటలలోనూ తెలిపినారు. కాని ముఖపత్ర మీయలేదు. ప్రథమ ముద్రణ ముఖపత్రమందున్నది దానిని యీ క్రింద నిచ్చుచున్నాను.

Biographical sketches of Dekkan poets being memoirs of the lives of several eminent bards both ancient and modern who have flourished in different provinces of the Indian peninsula compiled from authentic documents

By

Cavelly Venkataramaswami c late Head Translator and Pandit of the library and antiquarian Department.

Calcutta 1829.
Madras
Higginbotham & Co.

---

1 Edited with introduction and notes by C. V. Ram • Chandra Rao M. A. Ph. D. Publishers The Nellore Progressive Union, Nellore, A P. S. India) 1975 Pages 208.(101 + 107) Price Rs 30/—

by appointment in India to His Royal Highness, the Prince of Wales 1888 [1]

ఈ ముద్రణమున 1829లోని ముఖపత్రము యథాతథముగా నుండుటయేగాక, రామస్వామి కలకత్తా గ్రంథాలయమున—భాషాంతరీకరణ శాఖకేగాక- ప్రాచీన శాఖకు కూడ అధిపతియన్న విషయము తెలుపుచున్నది. 1847 నాటి కతడు రాయల్ ఆసియాటిక్ సొసైటీ వారి సభ్యుడైనట్లు ముఖపత్రము తెలుపుచున్నది. దీనినిబట్టి 1847 నాటికతడు కలకత్తాయందలి యుద్యోగమునుండి విరమించి, విశ్రాంతి గొనుచున్నట్లు మన మూహింపవచ్చును.

పై వివరణనుబట్టి యీ గ్రంథమునకు నాలుగు ముద్రణలు గలవు -

1829 ప్రథమ ముద్రణము
1847 ద్వితీయ ముద్రణము
1888 తృతీయ ముద్రణము [2].
1975 చతుర్థ ముద్రణము

1963 లో నేని గ్రంథమును, తృతీయ ముద్రణ ప్రతి ననుసరించి, మదరాసు విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధనశాఖా పత్రికలో ప్రకటించుటకు ప్రారంభించితిని. సంస్కృత కవులలో వరాహమిహిరుని వఱకు ముద్రితమైనది. ఆ సంవత్సరాంతమున నేను విశ్వవిద్యాలయమునుండి విశ్రాంతి గొనుటచేత, ఆ ముద్రణ మాగిపోయినది. ఇది యీ గ్రంథముద్రణ చరిత్ర.

(2)

ఈ గ్రంథమున నీ క్రింది భాషల కవులు గలరు —

సంస్కృతము

శంకరాచారి—ఏతేశ్వరోపాధ్యాయుడు అనంతభట్టు శితికంఠుడు భట్టోజీ దీక్షితుడు-నాగజీభట్టు సోమనాథభట్టు -శాకల్యమల్లుడు—అక్షోభ్యదీక్షితుడు— విల్లయ—గజపతి ప్రతాపరుద్రుడు — క్షీరస్వామి—శాలివాహనుడు - భాస్కరాచారి—వరాహమిహిరుడు — గణకనందుడు—కదంబుడు—పురుషోత్తముడు — కల్యాణ మల్లుడు—వరదాచార్యులు—విద్యారణ్యలేక మాధవభట్టు—విద్యానాథుడు—వేదాంతాచారి - లక్ష్మీనారాయణప్ప-వేంకటాచారి-అప్పయ్యదీక్షితుడు—అయ్యదీక్షితుడు-రామానుజాచారి—సర్వధరుడు — తాతాచారి—పోతయ—పెద్దిభట్టు - లక్ష్మణకవి కేలాది బసవప్ప నాయకుడు — ఉరగప్ప దండనాథుడు — జగన్నాథపండితుడు[3] — మహేశ్వరభట్టు. 37 గురు.

తెలుగు

నన్నయభట్టు—తిమ్మయసెట్టి తిక్కన సోమయాజి - భట్టుమూర్తి—తిమ్మన—మారన- తెనాలి రామలింగము- అయ్యల భాస్కరుడు—అప్పకవి అల్లసాని పెద్దన - అథర్వణాచార్యుడు - ఆంధ్రకాళిదాసు అబ్బనకవి -అన్నయాచారి—గోవిందకవి — రామభద్రుడు — వేంకటపతిరాజు - బాల సరస్వతి-భాస్కరుడు - బడబానలభట్టు - బందెన- బప్పనకవి—భైరవకవి- బసవకవి - భీమకవి — గంగాధరుడు — ఘంటయకవి — జగన్నాథుడు—లక్ష్మణకవి - లింగకవి- రెండవ లక్ష్మణకవి—లింగరాజు - లోక బాంధవుడు - లింగయ — నాచనామాత్యుడు — మొల్ల — మాధవరాయుడు—మల్లన - ముద్దురంగ చొక్కనాథుడు—మల్లయ—పోతరాజు—శ్రీనాథుడు—చినవీరన—చక్రపుడు మోహనాంగి — కృష్ణరాయలు—46 గురు.

తమిళము

అగస్త్యుడు - అవ్వయారు - కపిలరు - తిరువళ్ళువరు అధికమాన్ అప్పర మురుగ - వలి శఠకోప జ్ఞానసంబంధరు—అప్పరు—సుందరరు —మాణిక్యవాసరరు. 13 గురు.

మహారాష్ట్రము

జ్ఞానోబా—నామదేవు - రామదాసస్వామి — తుకోబా — సూరపాఠక్—ఏకనాథస్వామి- శ్రీధరస్వామి చోఖమేళ గోరకుంబరు - సుభాన్‌రావు హేమండుపంత్ - దామాజీపంత్ - మహేశ్వరభట్టు — 13 గురు.

తెలుగు

కావలి వెంకట బొర్రయ్య—ఈ బొర్రయ్య జీవిత మీ గ్రంథమునగల కవుల చరిత్ర లన్నింటికన్న పెద్దది. కావున గ్రంథము చివర చేర్చబడినది—ఇందు వర్ణితులైన కవులసంఖ్య 110.

సంస్కృతము—37[4]
తెలుగు —47
తమిళము —13
మహారాష్ట్రము —13
110

ఈ గ్రంథము నాంగ్లభాషలో గ్రంథకర్త యగు రామస్వామి ఒక పీఠిక వ్రాసియున్నాడు—అది యిందు తొమ్మిది పుటలలో ముద్రితమైనది—అందు పాశ్చాత్య మతానుసారము కవితా విద్యావ చరిత్రాంశదు—అంతేకాక గ్రంథమందలి కవుల చరిత్రలన్నియు, తాను స్వయముగా తన యధికారియైన మెకంజీదొర వారితో, ఆయా ప్రదేశముల

యందు - అనగా, తెలుగు - తమిళ, మహారాష్ట్ర ప్రాంతముల నెక రించిన విషయములను గ్రంథస్థము గావించితని స్పష్టపఱచినాడు—

వేంకటరామస్వామి బహుభాషా పాండిత్యము

సంస్కృతము

వేంకటరామస్వామికి సంస్కృతమున మంచి పాండిత్యము గలదు - ఆతడు వేంకటాధ్వరి సంస్కృత విశ్వగుణా దర్శమును నాంగ్ల ములోని కనువదించుటయే యిందుకు సబల సాక్ష్యము. ఈ గ్రంథ మందుగల సంస్కృత శ్లోకముల ఆంగ్లభాషాను వాదము లీ విషయ మును ధ్రువపఱచును.

తెలుగు

తెలుగుభాషయందు నాతడు పండితుడనుటకు శేష ప్రధాన ముగు వసుచరిత్రనుండి - తొలి ఏడు పద్యములను రెండవ యాశ్వాస మున 86-90 పద్యము లాంగ్లములో ననువదించుట ప్రమాణము

తమిళము

ఇందిచ్చిన తమిళకవుల వృత్తాంతములన్నియు నాతడా యా తమిళగ్రంథములను చదివి వ్రాసినవియే - అప్పటికి తమిళ కవులను గూర్చిన గ్రంథములు లేవు—

మహారాష్ట్రము

మహారాష్ట్రభాషయాతనికి సుపరిచితమనుటకీ గ్రంథము నందిచ్చిన కవుల చరిత్రయే మనకు ప్రమాణము. ఈ దక్కను కవుల చరిత్ర అచ్చువేయుటకు దేశీయులలో మహారాష్ట్రులే హెచ్చుగా తోడ్పడిరి. ఆ భాషయందు రామస్వామి పండితుడగుటయే వారి తోడ్పాటుకు హేతువు —

ఆంగ్లభాష

ఆంగ్లభాషలో నాతడు - సిద్ధహస్తుడు - యానాద్వారత వర్ష మున నాంగ్ల భాషా రచయితలలో తృతీయుడు. ఆతడీ గ్రంథమునే గాక—ఈ క్రింది గ్రంథములను నాంగ్ల భాషలో రచించినాడు—

1) విశ్వగుణాదర్శము
2) మూలికా సంకలితము
3) పాఠశాస్త్రము—5

ఈతని ఆంగ్ల వచన రచన - ఇంగ్లీషు భాషయందు జాన్సను వచన రచనను తలపించుచుండును -

(3)

గ్రంథ విశిష్టత - కవుల చరిత్రలు

పై వివరణమునుబట్టి యీ గ్రంథమున నొక్క తెలుగు కవులను గూర్చియేగాక తక్కిన తమిళ, మహారాష్ట్ర దాక్షిణాత్య సంస్కృత కవుల చరిత్రలు గలవని విశదమగుచున్నది — ఇందువలన దాక్షిణాత్య సారస్వతములలోనేకాక — సంస్కృత సారస్వతమునగూడ నీ దక్కను కవుల చరిత్ర ప్రాథమికమని నిర్వివాదముగా తేలుచున్నది. ఈ గ్రంథ రచన యిప్పటికి రమారమి నూటయేబది యేండ్లక్రింద నాటిది యగుటచేత—

> యానాద్వారత వర్షమున కవుల చరిత్రకు
> మార్గదర్శకులు తెలుగువారేయనియు
> నందు కావలి వేంకటరామస్వామి
> ప్రథముడనియు, నవీనయుగమునకిట్టి
> గ్రంథరచనా గౌరవము మొదట తెలుగు
> వారికే దక్కినదని నిశ్చయముగా చెప్పవచ్చును

వేంకటరామస్వామి విషయసేకరణము గావించి వానిని కవుల చరిత్రగా దిద్ది తీర్చుట—ఆతని ప్రతిభా విశేషము వెల్లడించుచున్నవి— సంస్కృత సాహిత్యముననేమి — దేశ భాషాసాహిత్యములనేమి, కవుల చరిత్ర ఆధునిక యుగమున నవీన ప్రక్రియ-నవీనయుగము నీ ప్రక్రియకు తన దక్కను కవుల చరిత్రమూలమున నాంది ప్రస్తావన చేసినవాడు కావలి వేంకట రామస్వామి — ఆంగ్లభాషలో Johnsons Lives of Poets - అను గ్రంథమే - అంతకుముందు సంస్కృత భాషా సాహిత్యములలేని యీ ప్రక్రియ ప్రవేశ పెట్టుట కతని కాధార మైనది—

తెలుగు కవులు-పరిశోధన

వేంకటరామస్వామి తెలుగు వాడగుటచేత — ఆతడీ గ్రంథమున 47 మంది తెలుగు కవులను గూర్చి తెలిపినాడు—కావలి సోదరులలో[6] కావలి వెంకట బొర్రయ్య - యానాద్వారత వర్షమునకు చారిత్రక పరి శోధనకు, శాసనములు చదువుటకు ప్రథముడైనచో, వేంకటరామ స్వామి తెలుగువారిలో సాహిత్య చరిత్ర పరిశోధకులలో ప్రథముడు — ఆతడు క్రీ. శ. 1829 లోనే తెలుగు కవుల చరిత్ర పరిశోధన ప్రారంభించినాడు—ఆనాడతడు ప్రారంభించిన పరిశోధన నేటివరకు సాగుచునే యున్నది —

ఆనాడు వేంకటరామస్వామి పరిశోధన ప్రారంభించినపుడు చారిత్రక సామగ్రి గాని, శాసనములు గాని అందుబాటులోలేవు.

ఆతడు స్వయముగా తాళపత్రగ్రంథములను పరిశీలించియు, జనశ్రుతి ననుసరించియు, నితరుల ద్వారమున లభించిన కవులను గూర్చిన పత్రములను బట్టియు నతడాకాలమున సేకరించి, వాని కొక గ్రంథరూపమునిచ్చెను - అంతకుముందులేని కవుల చరిత్ర నతడు సృష్టించుటచేత, అతని పరిశోధన మౌలికమేగాక, అత్యాశ్చర్య జనకమై యాతని పరిశోధనా ప్రతిభ చాటుచున్నది-

ఈనాటి కవుల చరిత్రలు పరిశీలించిన — నీ గ్రంథమున కవులనుగూర్చి—కాల నిర్ణయముల విషయమున గ్రంథకర్తృత్వ విషయమున—వ్యత్యాసములుండవచ్చును- కాని ఈ గ్రంథమున నిచ్చిన కొంతమంది కవులు, వారి కృతులు నేటివరకు ముద్రితములైనవో, ఈ గ్రంథ ప్రాశస్త్యమును మన మెఱుగ గలము—

గ్రంథసంపాదకులైన శ్రీరామచంద్రరావుగా రందరి కవులం దఱిగూర్చి విశేషించి తెలుగు కవులనుగూర్చి విపులముగా వ్రాసియున్నారు-వారు వ్రాసిన వివరణములకు చేర్పదగిన యంశములను దెలుపుచున్నాను- ఈ సందర్భమున నింకొక మాట చెప్పవలసియున్నది- ఈ గ్రంథ మీనాటి కవుల చరిత్రకారులకు పరిచితమైనను, ప్రథమ కవి చరిత్రకారులగు గురుజాడ శ్రీరామమూర్తిగారికిని, తరువాతి వారైన కందుకూరి వీరేశలింగముగారికిని నిది సుపరిచితమే-యయా కవులనుగూర్చి తెలిసినపుడే విషయము దెలుపుదును —

1 నన్నయభట్టు

ఆంధ్రశబ్ద చింతామణి లక్షణసారము-ఒకే గ్రంథమైనట్లు, వేంకటరామస్వామి పొరబడెనని వివరణమున గలదు - కాని యది సరికాదు - He wrote a grammar of the Telugu Language and entitled it Andhra Sabda Chintamani and Lakshnasara - అనగా Andhra Sabda Chintamani and Lakshnasara (ఆంధ్రశబ్ద చింతామణి మరియు లక్షణసారము)- అని యున్నది గాని — Andhra Sabda Chintamani or Lakshnasara ఆంధ్రశబ్ద చింతామణి లేక లక్షణసార-అని లేదు- ఇందువలన రెండును వేఱు-రామస్వామి గ్రంథ పీఠికలో (7 పుట) నన్నయభట్టునకు — అనపార్య అని పేరున్నట్లు వ్రాసియున్నాడు. A Brahmin named Anaparya alias Nannayabhat wrote a Telugu grammar and he was encouraged by the above named monarch to translate the Mahabharata into Telugu - నన్నయకు అన్నయ అను పేరున్నట్లు నింతవరకు నే కవి చరిత్రకారులు వ్రాయలేదు కాని కస్తూరి రంగకవి-- అల్లాను రాజా రామకృష్ణకవి (ఆంధ్రశబ్ద చింతామణి వ్యాఖ్యాత) నన్నయను అన్నయగా పేర్కొన్నారు —

నన్నయభట్టు ఇంద్ర విజయములోనిది అని యొక పద్యము- ముద్రిత గ్రంథ చింతామణి పత్రిక-1894 లో ప్రకటితమైనది-

2 తిమ్మయసెట్టి

ఈతని కృతి కన్యకా పురాణము యక్షగానము. ఇది నేటివఱకు ముద్రితము. దీనికి తాళపత్ర ప్రతులు మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము తిరుపతి) యందు గలవు వాని సంఖ్యలు - డి 1843, ఆర్, 977, 1048 ఆంధ్రసాహిత్య పరిషత్తులో 4 ప్రతులు గలవు ఈ కవి కాలనిర్ణయము చేయుటకు నీ గ్రంథమే యాధారమైనది. ఈ గ్రంథ తాళపత్ర ప్రతులలో నొకదాని యందిది క్రీ. శ 1810లో వ్రాయబడినట్లు కలదు రామస్వామి గారు ప్రతినే చూచి యుండవచ్చును. నేను తొలుత భారతి (మార్చి 1955)లోని విషయము వెల్లడింపగా-ఆ వెనుక ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్రకర్త దానిని గ్రహించినారు. (ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర-పుటలు—76-77. (ఆంధ్ర విశ్వవిద్యాలయ ముద్రణము (1961)

తాళపత్ర ప్రతులలో స్పష్టముగా నీతని యింటిపేరు 'ఇటికెల' వారని కలదు. కావుననే పై యక్షగాన వాఙ్మయ చరిత్రమున-ఇటికెల తిమ్మయ-అని యీతని చరిత్ర వ్రాయబడినది. ఇతడు వైశ్యుడు. తండ్రి పేరు చెన్నమసెట్టి—తాత గురువయసెట్టి—కావుననే రామస్వామి యీతనిని తిమ్మయసెటి అని పేర్కొన్నాడు.

3 తిక్కన సోమయాజి

ఈ గ్రంథరచననాటికి నిర్వచనోత్తర రామాయణము లభించకపోవుటచే రామస్వామి దానిని పేర్కొనలేదు. తిక్కనకవి రాజునకు శిష్యుడని చెప్పుట కేవలము జనశ్రుతి ననుసరించినది.

4 భట్టుమూర్తి

భట్టుమూర్తిని గూర్చి యీ గ్రంథమునగల విషయమును-క్రీ. శ. 1893లో గురుజాడ శ్రీరామమూర్తిగారు తన కవి జీవితములలో యథామాత్రముగా నుదాహరించినారు.

రామస్వామి వసుచరిత్రనుండి ఆంగ్లభాషాంతరీకరణము చేసిన వానిని నీ గ్రంథమునుండి గ్రహించి, వావిళ్లవారు ప్రచురించిన వసుచరిత్ర చతుర్థ ముద్రణమున చేర్చిరి- (1954)

భట్టుమూర్తి కృష్ణరాయలకాలమునలో యువకవియైనట్లుగా మంత్రి తిమ్మరసు పై చెప్పిన యాతని "లొట్ట యిదేటిమాట—" అను చాటు పద్యోత్పలమాల తెలుపుచున్నది.

5 తిమ్మన

ఇందు తిమ్మన యింటిపేరు ముక్కువారని యున్నది. కవులు కొందఱు ముక్కు తిమ్మనయని స్మరించుటయే దీనికి హేతువు. ఇతని యింటిపేరు నందివారని—ఇతడు మైసూరులో కోలారు నుండ లనువాడని—కె. యస్. కోదండరామయ్యగారి గ్రంథమాధారముగా సంపాదకులు నిర్ణయించినారు.

6 సూరన

పింగళి సూరన, అల్లసాని పెద్దన మనుమరాలి భర్తయని కథ

యున్నది అది గ్రంథస్థమై నది. అందువలన నతడు కృష్ణరాయల అష్టదిగ్గజ కవులలో నొకడు కాకపోయినను భట్టుమూర్తివలె యువకవియై యుండవచ్చును. రామస్వామికి కళాపూర్ణోదయము లభ్యముకాని కతమున నాతడుదాహరింపలేదు. ఈ సందర్భమున నింకొక విషయము చెప్పవలసియున్నది.

ఈనాడు కట్టమంచివారి ధర్మమా అని కళాపూర్ణోదయమునకు సారస్వతమున స్థానము లభించినది గాని పూర్వకాలమున పింగళి సూరన కృతులలో రాఘవ పాండవీయమునే అందరు పరిగణించెడివారు "ఊహింపకుండగ పింగళి సూరన కళా పూర్ణోదయము వ్రాసెనని సమకాలికులు హేళన చేసిరి. "కేవల కల్పనా కథలు కృతిపు రత్నములని వసుచరి తతో రామరాజభూషణుడు కళాపూర్ణోదయమును నిరసించినాడు.

7 తెనాలి రామలింగకవి

తెనాలి రామలింగకవి యింటిపేరు గార్లపాటివారని గురుజాడ శ్రీరామమూర్తిగారు తెలిపినారు. వీరేశలింగముగారు – రామలింగని జనన కాలమునుగూర్చి వ్రాయునపుడీ గ్రంథము నుదాహరించినారు (1896 రామలింగని ఉద్భటారాధ్య చరిత్ర నేను పరించి, ఇతడు కృష్ణరాయల అష్టదిగ్గజములలో నొకడని–సంపాదకులు నిరూపించుట సరిగా నున్నది.

ఈ ఉద్భటారాధ్య చరిత్రను నేను రెండేండ్ల క్రిందట పరిష్కరించి, 200 పుటల పీఠికతో వెలయింపజేసితిని.[7] అందు రామలింగని యింటిపేరు గార్లపాటివారని, అతడష్టదిగ్గజకవులలో నొకడని సోపపత్తికముగా నిరూపించితిని.

తెనాలి రామలింగని కథలను తొలుత గ్రంథస్థము చేసినది రామస్వామియే-గురుజాడవారు దానిని తమ కవి జీవితములలో నిచ్చినారు. రామలింగకవి చెప్పిన స్త్రీ వర్ణన పద్యములను (రామస్వామి పేర్కొన్నవి) గురుజాడవారు తమ కవిజీవితములో నిచ్చినారు.

11 అథర్వణాచార్యులు

అథర్వణాచార్యులు భారతమున విరాట, ఉద్యోగ భీష్మపర్వములే కాక–ఆది, అరణ్య పర్వములను గూడ రచించినట్లు, ముండల లక్ష్మీనరసింహకృతమగు ఆంధ్రకౌముదియను వ్యాకరణ గ్రంథమునుబట్టి తెలియుచున్నది. (చూడుడు–తెలుగు కవుల చరిత్ర మదరాసు విశ్వవిద్యాలయము-అనుబంధము 1953)

అథర్వణాచార్యులు సభాపర్వమును గూడ రచించినట్లు జగ్గన ప్రబంధరత్నాకరమునుండి తెలియుచున్నది. అందు 4 పద్యములుదాహరింపబడినవి[8] ఆంధ్రకౌముదిలో అథర్వణునికి చతుష్షష్టి కళాధుర్యుడను బిరుదున్నట్లు–"చతుష్షష్టి కళాధుర్యాథర్వణాచార్యస్తు యుదాహ" అను వాక్యమువలన తెలియుచున్నది.

12 ఆంధ్రకాళిదాసు

ఈతని కృతి శంకర విజయము లేక ఆచార్య విజయము క్రీ. శ. 1868లో ముద్రితమైనది-ఈతడు భాగవతమున దశమస్కంధమునంతయు యక్షగానముగా పార్థసారథి విజయము అనుపేర రచించినాడు-అది అముద్రితము.

15 గోవిందకవి

పోలూరి గోవిందకవి "రాగతాళ చింతామణి" అని సంగీతమొక్క సంగీత శాస్త్రమునకు సంబంధించిన అయిదాశ్వాసముల పద్యకావ్యము రచించినాడు. అది మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము వారిచే క్రీ శ 1950లో ప్రకటింపబడినది. తాళదశ ప్రాణ ప్రదీపికయు వారిచేతనే 1950లో ముద్రితమైనది. పర్వతనాందోపాఖ్యానము ముద్రితమైనది.

16 రామభద్రుడు

రామాభ్యుదయకర్త రామభద్రుడు వేఱు, సకల కథాసార సంగ్రహకర్త రామభద్రుడు వేఱు అని ఇటీవలనే నిర్ణీతమైనది (చూడుడు–అష్టదిగ్గజములు అను వ్యాసము – ఆంధ్రపత్రిక మన్మథ సంవత్సరాది సంచిక– 1955)

20 బడబానల భట్టు

బడబానలభట్టు పద్యమును అప్పకవి యుదాహరించినాడు. (2 374) ఆపద్యమువలన నతడు శాసాను గహ[illegible]డని తెలియుచున్నది- ఈతడు మాతపురాణము అని ద్విపదకావ్యము రచించినట్లు తెలియుచున్నది. (చూ. ద్విపద కావ్యముల గ్రంథసూచిక మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము) సంస్కృతమున వీడు సద్నాయక చరితమను గ్రంథము రచించినట్లు కస్తూరి రంగకవి చెప్పినాడు. (చూడుడు: గురుజాడ శ్రీరామమూర్తిగారి రావు వంశీయుల చరిత).

21 బద్దెన - (బందెన)

నీతిసారము వేఱు : నీతిసారముక్తావళి వేఱు. నీతిసారము మొదటి ప్రతాపరుద్రునిది-నీతిసారముక్తావళి బద్దెనది-బద్దెన నీతిసారముక్తావళిలో–"ప్రతాపరుద్ర నరపాలునిచే రచియింపబడ్డయా పరువడి నీతిసారము" అని నీతిసారమును పేర్కొన్నాడు–

22 బప్పనకవి

'బప్పనకవి యని రామస్వామి పేర్కొనిన కవి 'అప్పనకవి'. అప్పన ఆంధ్ర ప్రయోగరత్నాకరము అని రంగరాట్ ఛందస్సులో గలదు– "ఆంధ్ర ప్రయోగరత్నాకరము" వ్రాసిన కవి గణపవరపు వేంకటకవి - వేంకటకవికే వేంకటప్పయని నామాంతరము -అందువలననే కస్తూరి రంగకవి యాతనిని 'అప్పన' అని పేర్కొన్నాడు–

రామస్వామి జన్మశ్రుతినిబట్టి 'బప్పన' అని తెలిపినాడు. ఆంధ్ర ప్రయోగరత్నాకరము తంజావూరు సరస్వతీమహాల గ్రంథాలయమున నున్నది దానికి రెండు ప్రతులు గలవు. సంఖ్య 695-696. ఇది నేటివరకు ముద్రితము.

24 బసవకవి

బసవకవి రామాయణము నాంధ్రీకరించినట్లుగా నీ గ్రంథమున కలదు. కాని బసవకవి రామాయణమునంతయు తెలుగు చేసినటు కనబడదు. ఈతనికృతి నిరోష్ఠ్యసీతాకల్యాణము–అందలి గద్యయిది.

"ఇది శ్రీ దక్షిణామూర్తి ప్రసాదిత సమాసాదిత సరస సాహిత్య సాహిత్యానువర్తి పిడుపర్తి బసవనాచార్య సత్పుత్ర బసవప్ప ప్రణీతంబైన సీతాకల్యాణ చరిత్రంబను నిరోష్ఠ్య కథా ప్రబంధంబు నందు చతుర్థాశ్వాసము–"

ఈ గద్యనుబట్టి బసవకవి యింటిపేరు పిడుపర్తి వారని తెలియుచున్నది—వీరశైవ కవియగు పిడుపర్తి బసవ కవికి, ఇూ బసవకవికి సంబంధ మేమాత్రము లేదు. ఈ బసవకవి తండ్రి బసవ నాచార్య అని యుండుటచేత వీతడు విశ్వకర్మకులజుడు–

ఈ గ్రంథము ముద్రితము – తంజావూరి పుస్తకశాలలో నున్నది. గ్రంథ సంఖ్య 169.

25 భీమకవి

భీమకవి తూర్పుగోదావరీ మండలమున దాక్షారామ క్షేత్రమున దాక్షారామ భీమేశ్వరుని కృపచే జన్మించినాడు. ఈతడు వేములవాడ భీమకవియని శ్రీనాథుడు "వచియింతు వేములవాడ భీమన భంగి నుద్దండలీల నొక్కొక్కమాటు" అను సీసపద్య పాదమువలన స్పష్ట మగుచున్నది– "కవి జనాశ్రయము" అను పేరనున్న ఛందో గ్రంథము వేములవాడ భీమకవిది కాదు అది మల్లియ రేచన కృతము[9] జైన కృతియగు దీనిని శైవుడగు భీమన రచింపడు – లక్షణ కర్తలు కొందఱు భీమనదిగా చెప్పిరి–దానినిబట్టి ఇూ గ్రంథమున వట్లు గలదు –

భీమకవి జ్యోతిషమృత సారమును గురుజాడవారు తమ కవి జీవితములలో ముదించిరి – ఇది భీమన కృతము కాదనుటసరికాదు. ఇది పారసీభాష లోనికి భాషాంతరీకరింపబడినది. (చూడుడు మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము పుస్తక సూచి సంపుటము–2)

27 ఘంటయకవి

రామస్వామి సురభాండేశ్వరము ఘంటయకవిదిగా వ్రాయుట సరియైనదే నేడు లభ్యమగుచున్న సురభాండేశ్వరము – ఘట్టు సభు పుది – ఘంటయకృతమే – ఘంటయ అనునది ఘట్టు ప్రభువుకు నామాంతరము – ఈ నాడు కవి చౌడప్ప సమకాలికుడు. "ఘంటన – చౌడగాడు రా" అని చౌడప్ప చెప్పినాడు – (చూడుడు: శతక కవుల చరిత్ర) –

28 జగన్నాథుడు

జగన్నాథుని రాజనీతి గ్రంథముపేరు రాజనీతి రత్నాకరము – ఈతనిపేరు కొప్పోలు జగన్నాథ కవి – ఈ గ్రంథము తాళపత్ర ప్రతి ఆంధ్ర సాహిత్య పరిషత్తు (కాకినాడ) వారి పుస్తక భాండాగారమున గలదు–ఇంతవఱకు నీకవిగాని గ్రంథముగాని కవుల చరిత్రకెక్కలేదు–

లింగకవి

లింగకవి రచించినది సానంద చరిత్ర – ఈ సానంద చరిత్ర ద్విపద కావ్యము. రామస్వామి చెప్పినట్లుగా నిందు మూడాశ్వాసములే కలవు–ఇతనిపూర్తిపేరు 'భదకవిలింగకవి' ఈతడు సానంద చరిత్రయే గాక దేవాంగ పురాణము అను ద్విపద కావ్యమును రచించియున్నాడు– ఈ దేవాంగ పురాణము శ్రీ కాళహస్తి నాయకుడను నొక సామంతుని కంకితము చేయబడియున్నది – ఆతడు 1530-42లో విజయ నగర సామ్రాజ్యము పాలించిన అచ్యుత దేవరాయల కాలములోవాడని ఆతడు వేయించిన శాసనములనుబట్టి తెలియుచున్నది – సానంద చరిత్ర–దేవాంగ పురాణము రెండు కృతులు ముద్రితములైనవి – వివరములకు చూడుడు దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము–మదరాసు విశ్వవిద్యాలయము – పుటలు 10-16. గ్రంథకర్త ప్రస్తుత వ్యాసకర్త.

34 లింగయ

35 మంచనామాత్య

రామస్వామి యిచట–మంచెన కృతిని లింగయ కృతిని ఒకరిది మఱియొకరిదిగా వ్రాసినాడు–దానిని నపాఠకులు చూపియున్నారు – లింగకవి రచితమైన సాముద్రికము – పద్యకృతి – మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారము(తిరుపతి) యందున్నది – అతని పూర్తి పేరు అద్దంకి లింగకవి.

36 మొల్ల

మొల్ల కవయిత్రి కృష్ణదేవరాయల కాలమునాటిది. ఆమె చేసిన కవిస్తుతిలో శ్రీనాథుడు కడపటివాడు –

37 మాధవరాయ

చంద్రికా పరిణయకర్తయగు మాధవరావు సుభాషిత త్రిశతి నాంధ్రీకరించిన ఏలకూచి బాలసరస్వతి పోషకుడు గాడు బాలసరస్వతిని పోషించినవాడు మాధవరాయని పుత్రుడు మల్లరాయడు.

సురభిమల్లా నీతివాచస్పతీ
సురభిమల్లా మానినీ మన్మథా
సురభిమల్లా వైదుషీ భూషణా

అని యందలి మకుటములు —

39 ముద్దురంగ చొక్కనాథుడు

ముద్దురంగ చొక్కనాథు డనగా విజయరంగ చొక్కనాథుడే ఈతని తండ్రిపేరు ముద్దు వీరప్ప నాయనయ్య. విజయరంగ చొక్కనాథుడు శ్రీరంగమాహాత్మ్యము అను కృతియే గాక మాఘమాహాత్మ్యము అను మఱియొక కృతి రచియించినాడు. ఈ రెండును వచన కృతులే—రెండును నింతవఱకు నముద్రితములు—వివరణ పుట 73లో "Vijaya Ranga Chokkanatha (A. D. 1706—1732) The Nayak King of Tanjavuru" అనుటసరికాదు — అతడు మధుర నాయకుడు — వివరములకు (చూడుడు— దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయము, మధురాపురాంధ్ర వాఙ్మయము పుటలు 330-333)

ఈ సందర్భమున వివరణలో సంపాదకులు జెంటూ శబ్దమును గూర్చి విపులముగా 72-73 పుటలలో చర్చించిరి — ఈ శబ్దమును గూర్చి యింతకుముందు డాక్టరు జె. మంగమ్మగారు చర్చించి వ్రాసిరి[10]. విలియమ్ బ్రౌను అనునతడు జెంటూ వ్యాకరణము (Grammar of the Gentoo Language) కాక - జెంటూ వకాబ్యులరి (Gentoo Vocabulary అను పేర నిఘంటువును 1808 లో రచించి ప్రకటించినాడు ఇదియే తెలుగు భాషలో మొదటి తెలుగు—ఇంగ్లీషు నిఘంటువు. ఇది 1950 లో పునర్ముద్రిత మైనది.

43 చి న వీ ర న

రామస్వామి చినవీరన యని పేర్కొన్నాడు గాని అతడు 'పిన వీరన'యని యాశ్వాసాంత గద్యలలో చెప్పుకొనియున్నాడు. 'వాణి నా రాణి' అన్న పినవీరభద్రుని కథను తొలుత గ్రంథస్థము చేసినది రామస్వామియే. పంచడాబు లేక పంచడబ్బు అనగా కల్పిత కథయని యర్థము. తెలుగున జైమిని భారతము, మైరావణచరిత్ర, గయోపాఖ్యానము, శతకంఠ రామాయణము, సహస్రకంఠ రామాయణము అనువని యైదును పంచడబ్బులు.

44 చ క్ర పు డు

మోచర్ల దత్తప్ప కవిని గూర్చి, అతడు సర్వజ్ఞ కుమారయను వాడు నిచ్చిన సమస్యల నెట్లు పూరించినది మొదట గ్రంథస్థము చేసిన వారు గురుజాడ శ్రీరామమూర్తిగారు (1893) కవిజీవితములు పుటలు 687-692 [11] దత్తప్పకవి సమస్యాపూరణములు వావిళ్ల వారు 'తెలుగు సమస్యలు' అనుపేర ముద్రించిరి మోచర్ల వెంకన్న కవి దత్తప్పకవి సోదరుడు

46 కృ ష్ణ రా య లు

కృష్ణరాయల అష్టదిగ్గజకవులు 1. అల్లసాని పెద్దన 2. నందితిమ్మన 3. మాదయ్యగారి మల్లన 4. తెనాలి రామలింగము 5 ధూర్జటి 6. కందుకూరి రుద్రకవి 7. పుత్తేటి రామభద్రుడు 8. రాధామాధవకవి యని చర్చించడమైనది[12].

కృష్ణరాయని మరణ కాలము క్రీ. శ. 1525 అని చెప్పటయు విమర్శించుచు క్రీ. శే. కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావుగారొక వ్యాసము వ్రాసినారు - "కృష్ణదేవరాయల నిధన కాలము" అని ఆ వ్యాసముపేరు. వారు క్రీ. శ. 1525లో తిరుమల దేవరాయని శాసనము, క్రీ. శ. 1526లో అచ్యుతదేవరాయల శాసనము, క్రీ. శ 1528లో అచ్యుతదేవరాయల శాసనమును చూపి- పెద్దనాటు పద్యము నందలి కాలమును సమర్థించుచు క్రీ. శ 1530కి ముందు రాయల శాసనములను పరిశోధింపవలెనని వ్రాసినారు[13]

సంస్కృతకవులు

రామస్వామి తన గ్రంథమున 37గురు సంస్కృత కవుల నిచ్చుట ప్రశంసనీయము ఆ కాలమునాటికి పాశ్చాత్య దేశములో కూడ సంస్కృతవాఙ్మయమునుగూర్చి,కవులనుగూర్చి పరిశోధన ప్రారంభము కాలేదు.

త మి ళ క వు లు

మహారాష్ట్ర కవులు

తమిళ మహారాష్ట్ర భాషలలో మొదటి కవుల చరిత్ర రామస్వామిదే-

ప్రస్తుత సంపాదకులీ గ్రంథమునకు వ్రాసిన ఉపోద్ఘాతము, వివరణము వారి అసాధారణ పరిశోధనా పాటవము చాటుచున్నవి- చారిత్రక పరిశోధనలో సంపాదకులు సిద్ధహస్తులు

కావలి సోదరులు - పరిశోధన

ఈ దక్కను కవుల చరిత్ర ప్రకటన మూలమున సంపాదకులు కావలి సోదరులను గూర్చిన పరిశోధనకు నాందీ ప్రస్తావన గావించినారు. వారు కావలి సోదరులను గూర్చిన పరిశ్రమయే ధ్యేయముగా పెట్టుకొని యీ సోదరుల యీ క్రింది గ్రంథములను ప్రకటింతురు గాక—

వెంకటబొర్రయ్య

1. On the manners & Customs of the Jains Essay.

2 Political conditions of the Carnatic during Moghul times-Tract.

పై రెండుగాక విల్సను కేటలాగులోనున్న యీ క్రిందివి సంపాదించి ప్రకటింపవలెను-(ఇవి అముద్రితములు)

Page 500 - Vol. III, (No 31) Borrials Historical Collections of Mysore,

Page 559 Vol IX. (No 1) Account of seranga. patam and Mysore Country.

రా మ స్వా మి

1) Viswaguna darsanam 2) Ekasila Nagara Vruttantam 3) Moolikasankalitamu 4) Pakasastramu 5) Descriptive and Historical sketches of cities and places in the Dekkan 6) Castes of Southern India.

విల్సను కేటలాగులో రామస్వామి రచించిన మరియొక ఆంగ్ల గ్రంథమున్నది.

Vol 1. Page 500, No 33 Account of Pulicat.

పై గ్రంథములు పునర్ముద్రించుటయేగాక సంపాదకులు—

History of Kavali Brothers

అను పరిశోధన గ్రంథమును రచించి కావలి సోదరుల ప్రతిభ ఖండాంతరముల ప్రకాశింపజేయుదురుగాక

ప్రస్తుత గ్రంథమును ప్రకటించిన నెల్లూరు వర్ధమాన సమాజమువారు అభినందనీయులు—

అ ధో జ్ఞా పి క లు

1 తెలుగు కవుల చరిత్ర మదరాసు విశ్వవిద్యాలయ ప్రచురణ — 1953.

ఆధార గ్రంథములు —

గ్రంథకర్త — ప్రస్తుత వ్యాసకర్త.

2 ఈ తృతీయ ముద్రణము చేతి ప్రతి నావద్ద నున్నది.

3 ఈ గ్రంథ మాంగ్లభాషలో నుండుటచేత [illegible] యున్నా రీతి [illegible] ననుసరించి ఉపాధ్యాయ దీక్షిత-భట్టు-నంబి-కదంబ [illegible]—ఇత్యాదిగా మూలమున వ్రాయబడినవి. నేను తెలుగు రీతిగా వ్రాసితిని.

విషయసూచికలో సంస్కృత కవులు సరిగా విభజింపబడలేదు - వరాహమిహిరుని తరువాత—'తెలుగు' అని శీర్షిక క్రింద జగన్నాథ పండితుని వఱకు కవుల పేరీయబడినవి— వెనుక నన్నయభట్టు తెలుగు కవులు నీయబడి యున్నారు — విషయసూచికలో రెండవపుటలో మొదట "సంస్కృతము' అని జగన్నాథపండితుని వెనుక - "తెలుగు" అని యుండవలెను—

4 విషయసూచికలో మాహేశ్వరభట్టు -మహారాష్ట్ర ములో చేర్చబడినాడు కాని అది సరికాదు 89వ పుటలో Additional Sanskrit Poet Maheshwar Bhut ' అని కలదు. కాబట్టి అతడు సంస్కృతకవి సంస్కృత విభాగమున నుండదగును.

5 సంపాదకులు తమ ఉపోద్ఘాతములో మరి రెండు గ్రంథముల నిచ్చినారు. వాని వివరములు తరువాత తెలుపుదును.

6 కావలి సోదరులు—కావలి వెంకట బొర్రయ్య, కావలి వెంకట లక్ష్మయ్య, కావలి వెంకట రామస్వామి అనువారు ముగ్గురు— వీరిని గూర్చి తొలుత నేను మదరాసు విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధనా పత్రిక (1962) లో The poineers of English writing in India, The Cavelly Telugu Family అను వ్యాసమునందు వివరముగా తెలిపితిని—

7 ప్రచురణ కర్తలు- యమ్. సాంబశివరావు—లోటస్ పబ్లిషర్సు మెయిన్‌రోడ్డు - తెనాలి— వెల 15 రూపాయిలు.

8 ప్రబంధ రత్నావళి — వేటూరి ప్రభాకరశాస్త్రి. ద్వితీయ ముద్రణము పీఠికాకర్త ప్రస్తుత వ్యాసకర్త (1976)

9 వావిళ్ల ముద్రణము 1952. ఈ ముద్రణమున కవి జనాశ్రయకర్త మల్లియ రేచనయని సప్రమాణముగా చూపబడినది. పీఠికాకర్త ప్రస్తుత వ్యాస కర్త.

10. Dr. J. Mangamma-Gentoo.the TeluguLanguage Itihasa.Journal of the Andhra pradesh Archives vol. 1. No.2 July to December 1973.P. 17-27.

11 వావిళ్ల పునర్ముద్రణము-1925.

12 అష్ట దిగ్గజములు — ఆంధ్రపత్రిక ప్రమాథి సంవత్సరాది సంచిక (1955)

వ్యాసకర్త ప్రస్తుత వ్యాసకర్త.

13 లక్ష్మణరాయ వ్యాసావళి పుటలు 47-53 (1965)

వైర భక్తి

జమదగ్ని

(గత సంచిక తరువాయి)

ద్వితీయాశ్వాసము

అపుడు విదర్భ దేశమున కాత్మగుణంబుల ప్రోవు, పాల సం
ద్రపు వెనులోతు, మేరువగ ధైర్యము కల్గు మహానుభావుఁ, డ
ప్పపు మణియైన భీష్మకుఁడు క్ష్మాపతి, వానికి పుత్త్ర పంచకం
బుపరి జగత్పవిత్రి యన నొప్పు నొకానొక పుత్త్రియుండగున్॥

కాలము తీరు బట్టి నిజకాయజులందున నగ్రజుండు ను
ద్వేలత చూపుచున్ మనసు తెల్పుచునుండగఁ, దానుదక్కడై
యాలము పేసికోక మరియాదగ నిర్భరుఁడై చెలంగు, దు
ష్కాలము దాటుచో నగును సర్వ శుభంబులటన్న ధైర్యమై॥

అయిదుగురాత్మజుల్ పిదప నంబుధి వెల్వడు లక్ష్మివోలె ని
శ్చయముగ నామెయే కరుణ సోకగ పుట్టెన దన్న తృప్తి కి
క్క యగుచు నేక పుత్త్రిగ నకారణ వత్సలతన్ జనించు త
ల్లియె సకలమ్ముగా మను కులీనుడతండు ప్రశస్తి నందెడున్॥

మథిత సుధా సముద్ర నవ మాన్యహృదంతరమందు దుర్భర
వ్యథ గను హేతు వొక్కఁ డుదయంబయి తీరకయున్న రాజ్య సా
రథిగ స్వతంత్రతన్ గనగ రాని కుమారుఁడు లొంగియుండ, శే
వధియగు ముద్దు కూతుకయి ప్రాణములన్ వహియించు నాతఁడున్॥

రుక్మియని తొలి కుమారుఁడు,
రుక్మ రథుఁడు, రుక్మబాహు, రుక్మ శిరోజుల్,
రుక్మ నయనుండు తనయులు;
రుక్మిణి కడగొట్టు బిడ్డ రోచిష్మనకున్॥

అతఁడెంత రుక్మమతియో
ప్రతిదిన సంనుత హిరణ్యవర్ణను హరిణిన్
సతతస్మృతి నిలుపుకొనన్
సుతులకు సుతకట్టి నామసూనము లుంచెన్॥

ఆ తల్లి ప్రీత మతియై
యాతని సుత యయి జనించు టే మబ్బుర మౌ?
శీతనగ పయస్సింధు
శ్వేత విభాగరిమ కితని విశ్రుతి కతమా॥

హరిహర పాదముల్ కడిగి యట్టి కుమార్తెల నీయగల్గుమన్
మరల గురుత్వమున్ బడసి మాన్యులచేఁ బ్రణతుల్ గొనంగ నా
యిరువురు నెన్ని జన్మముల నెంతటి పుణ్యము లాచరించిరో?
వరసుత రుక్మిణిం బడసి వారిని మించెను భీష్మకుండిటన్॥

తనయింట బిడ్డగా జనియించి నంతనే
శ్రుతి పథంబున మనుస్మృతిని నిల్పె
ఘలు ఘల్లుమని కాలి గజ్జెయల్ మ్రోయుంగ
తిరుగాడి యిల్లు శ్రీపుర మొనర్చె
ఫుల్లాస్యమున నవ్వు పువ్వులే విరియంగ
మనసు నానంద ధామమ్మొనర్చె
గుజ్జెన గూళ్ళతోఁ గూర్చు బొమ్మ పెండ్లి
యాటలందే తెల్పె నమరలీల

పూర్ణయౌవన మమః పూఁబోణి యగుచు
షోడశీ పాథవంబు సంపూర్ణముగను
నెఱపి ముల్లోకములు తానె సిగిడె దనుచు
నర్మి యువభావనా లోకమందు వెలిఁగె

ఆ యమ తన్ను తానెఱుఁగు, నయ్యెడిదేమి యెఱుంగుచుండెఁ, దా
ధ్యేయము యోచు, నర్త్యల కహీన కృపన్ శుభమంది యిచ్చుచున్
శ్రేయము కాక యేరికిని, చిన్మయియై సకల స్వరూపమై
మాయి మహేశ్వర ప్రణుత మానసయై చరియించు నిప్పటన్॥

శిశు బాల గోపవిదితా!
యశనాయా ప్రశమస్తైక హోర్ణనయోష్ణ!
పశుభూత సర్వజగతీ
శిశువిక వన సర్వ కార్య శిక్షణ లీలా!

వినుమ నిజ పుత్రికాఁగఁ గనిన నేను, త్వదర్చనము సేయగల్గు సే
వను గొని, నన్ గృపన్ గనుము బాలయాలించుము తం డినిల్పఁ; దా
నను జగఁ బుట్టుటన్, మొదలెయున్న, ఁదనంతట నన్ను వెంబడిన్
జనుట తలంచుమున్, నిజవశం వద తానని యెంచుచుండుఁగన్॥

చేది విదర్భ దేశములు చేరువయ్యె, సరిహద్దు మాత్రమే
భేదము గాగఁ జల్మి పెనవేసిన వౌటఁ, దమంతఁ దాము. బా
ల్యాదిగ గాఢమైత్రి నడయాడుచు. నన్నిట నిర్విరోధ్య మ
ర్యాదను నిల్చురన్న నుడి కాకర మైత్రి నృపాలి నందనుల్॥

తన చెలికాని చెల్లెలు, సుధానిధి గర్భము లక్ష్మియున్న మా
టను విని చైద్యుఁ, డెంతయు విడంబన మొప్పఁగ మాటి మాటికిన్
జనపునఁ గుండినన్ నిలిచి, చానను గెల్చుకొనంగ నెంచు. న
న్నను బడి మైత్రి చూపినను నాతి నిజాంతర మీయదెన్నఁడున్॥

స్త్రీ యను శబ్దమున్ దెసగు రేఫ తకార సకార వర్ణముల్
మాయను దెల్పు, నిర్గుణుఁడు మాయి మహేశ్వరుఁడౌచు విశ్వ రూ
పాయతిఁ దోఁచు టెల్ల త్రిగుణాత్మకయౌ తదభిన్న శక్తి, వే
సీయది సత్య మెల్లెడల నింతి యనన్ ఇను మాయ సుంపగున్॥

ఉన్నటులేఁచు, నున్నయన మున్నది, లేదనలేదు, గట్టిగా
నున్నదనంగఁ జాలమెవు. డున్నది ప్రస్తుత మంతమూ తమే,
మిన్నని మున్నరీతి కనమిన్, నిజమున్నది కొంత, మిథ్యయౌ
తెప్పి స్త్రీ స్వభావ పరిధిన్ గనఁజాలు నేవఁడు సృష్టిలో!

శక్తి యొకండె యూమె కను స్వామి, తనంతట తాను లొంగి స్త్రీ
శక్తి సౌనర్చు నాతనిని, శక్తివిహీనుఁడెయ్యెన, నేటియై
రిక్తుఁడె పూరుషుండు, సురరీ కృతుఁడుండెయు లేవియట్లగున్:
శక్తి యొకండె, శక్తుల ససంఖ్యముగా వహియించుచుండెడిన్॥

నానాత్వం బఖిలమ్ము శక్తి దగు, భిన్నంబై ప్రపంచమ్ముగా
నూనం జేయును పూరుషున్, నిజము నందున్నట్టి దాతండె, తా
నై నానాత్వము నందినట్టుగను శక్త్యావిష్టుఁడై, తల్లి దెం
దానన్ నిల్చి రహస్యముం దెలుపఁ దత్త్వాంబెల్ల విస్పష్టమౌ॥

ఈ పరమార్థమే ప్రకృతి నెల్లెడ విస్ఫుట వౌచు నుండుటన్
స్త్రీ పురుష ప్రసంగముల ధనిదు లిద్దనుబట్టిపోక, సం
దీపిత ధర్మమార్గమున, ధ్యేయపదస్థితినంది కొంటకై
ప్రాపుగ, స్త్రీ పరిగ్రహణ, రాజపథంబున గాంతురెవ్వఁడున్॥

పిత్రు పరిపాలకత్వమున బిడ్డ లెసంగుట, పిల్లి యాయగా
ప్రతివను గొంట ధర్మ్యమగు నార్షమతంబది; నర్యులందుఁ; దా
త్రివ స్వతంత్రతయె విషయ్యయుంపర మందున నెన్నికొంటయున్
తి గొన రాజమార్గమగు శ్వశ్రుగులందు ప్రశస్త పద్ధతుల్॥

కన్నిచ్చ వడినట్టి కామినికె పోక
పరమార్థ మెఱుఁగని పాశవంబు
దార గ్రహణమెల్ల తన భోగమున కంటు
పశు ప్రవృత్తికి సిగ్గుబాటు మాట
పితృదత్తయును గాక స్వేచ్ఛమై వరియింప
నట్టి కన్యను గోరుట ధమ మెపుడు
హృదయ మన్యునకిచ్చి యెదుటనుండిన యంతఁ
దన దంట మృగతృష్ణఁ దగులు కొనుట

మూఁడు జన్మల పెనువైరమున తనువగు
వ్యర్థమతి శిశుపాలుఁ డయ్యతివ గాంచి
రుక్మి చెలికాఁడుగాన నీ రుక్మిణియును
తనకు వశ వౌ నటంచు స్వాంతమున నెంచె॥

అన్నతోఁ బనియందు వతఁడున్న లేకున్న
నను పదంబునఁ దిరుగాడుచుండి
పని యున్న లేకున్నఁ బ్రతి పదంబునఁ బేరు
పెట్టి పిల్చుచుఁ గనిపించుకొనుచు
దుప్పికొమ్ములు పులితోళ్ళు నేనుగు దంత
ములుదెచ్చి తన మెప్పుఁ బొంద వేచి
బహువిధంబుల తిమబండముల్ గొనివచ్చి
తినకున్న నురక న్యుదికుఁడగుచు

వాఁడు పడు బాధఁజూచి యాబాల చాల
జాలిగొని హద్దు నందుంపఁజాల కకట
కట కటంబడి యున్న తత్కపటి కంటె
యోగ్య వరుఁడుండఁబోఁడంచు భాగ్యమెన్న॥

పరమ గభీరులైన పితృ పాదులకున్ శ్రమకల్పనీక స
త్వరముగ నుద్వాహంబగు నుపాయము తానుగనెంచి, సర్వథా
గురుశరణంబె మార్గమని, కోమలి రుక్మిణి బ్రాహ్మణోత్తమున్
వరకృపుఁదోడి తెమ్మనుచు వార్తను బంపెను నర్మదూతిచే॥

అగ్నిద్యోతనుఁడా బుధోత్తముఁడు, శిష్యోపార్థ మర్మజ్ఞుఁ, డు
ద్విగ్నుండై వెనువెంటవచ్చి, వను దేవీ యేల పిల్పించి, తీ
వగ్నిన్దూకు మటన్న దూకెదను నీకై తల్లి!, యాజ్ఞాపింపవే
నగ్ని ద్యోతను జన్మ సార్థకము చేయంబూనుకోలే యనన్॥

స్వామీ! నాయెడ మీ యెదం గలుగు వాత్సల్యంబు గుర్తించియే
యీమైఁ బిల్పఁగఁబంచితిన్, హృదయమం దేమున్నదో సర్వమున్
మోమునంజూచి గ్రహింపఁగల్గిన కళాపూర్ణుల్, దివాకో గురుల్,
నా మర్యాదను మీరె నిల్పవలెఁ బ్రజ్ఞాపాటవం బొప్పఁగన్॥

పశువయి వాఁడు, తల్లియును భావము దెల్పక, స్త్రీనటంచునన్
వశముగఁ జేసికోఁదలఁచు, ద్వారక నాకలు వేచియున్న యా
ప్రశమిత వైరిసింగనఁడు, భ్రాతయు వానిన యోగ్యుఁడన్న ధీ
శిశుత వహించుఁ, తండ్రికిది భేద్యముకాని సమస్యయయ్యెఁబో॥

విఱిఁగి యొఱఁగి వేసె తుది కిట్లు తెగించితి. లగ్న నిర్ణయం
బెఱుఁగఁగఁజాలఁబంచితి, మహీశ్వరు లెల్లరు పెండ్లి కంచుదా
మురువడి రాగ, వాఁడు మురియున్ దన పెండిలి యౌనటంచు, నే
నెఱుఁగుదు వచ్చి నన్నుగొని యేగును శ్రీ ప్రభుఁడాత్మ వస్తువున్॥

జరిగెడి దిద్దియే యయిన స్వామి! మహాప్రభు చిత్తమేను మీ
కెఱుఁగఁగఁ జెప్పగా వలయునే? తన కేమియుఁబట్టనట్టులే
పరఁగును స్వామి, నా కొఱకుఁబట్టిన యట్లుగుపించునంతె, మీ
రరిగి పరిస్థితిన్ దెలిపి యా విభుఁడేఁ గరుణింపఁగావలెన్॥

స్వామి స్మరింపఁడా మునుపు వాఁడు నడుంగొని పోయి లంకలో
నామెయి నుంచుటల్, రిపు కృతాపహృతిం బరివాద మేచుటన్,
క్షేమ మటంచు భిన్నమగు జీవితముల్ సహియించు, టప్పుడే
యామెయిఁదాల్ప నెంచుటయు, నేల యెఱుంగఁడు నిన్నుఁజూచుచున్॥

ఫాలమునందు నగ్ని కనుపట్టకయున్నను, చేతమెమ్మెనన్
దాలుపకున్న, నెవ్వెడుట దర్శన మిచ్చిన యంతలోననే
శ్రీలలితుండు మిమ్మెఱుఁగు, చిత్తము సర్వము మత్కృతింగనన్,
హాలములేని మిమ్ముబడి వచ్చుడు నాకయి బ్రాహ్మణోత్తమా!

నేఁడె ప్రయాణమై చనుఁడు, నింగిని దూకిన యట్లు పోయి, య
ప్పేడి వెలుంగు ప్రాగ్గగన వీథి స్ఫురించెడు వేళ, స్వామికిన్
వాడిన నన్ను దెల్పి, యెడఁబాటిక సైపదయా రమాపతీ!
చేడియఁదిప్పి కొమ్మనుచుఁజెప్పుడు, చిత్తము తొందరింపఁగన్॥

తనదగుదాని న్యాసముగ దాచిన మజ్జననుండు, తాను వ
చ్చిన బదువెల్ల తీఱినటు చెందును మోదము, రుక్మియన్నచోఁ
దన చెలికానికై పగచు, దైత్యుఁడు వైద్యుఁడదేమి చేయు! ర
చ్చిన క్రుధ హద్దు మీఱినను, శీర్షము లున్నవి స్వామి చేతిలో॥

విప్రుడెఱింతురు మీ రటం చిట నిరీక్షింతున్ సదా వ్యగ్రనై,
వపు వెందున్నది, వట్టికట్టెయిది, రూపప్రాభవంబంది ని
ప్రసవమ్మై ముగ్ధ మొనర్చు లోకముల, చిత్రాకృతిన్ సత్య మం
చపలాపింపెడి తద్రిపుం డెఱుఁగఁ జంచత్ప్రాణ గొంపోనగున్॥

విర్మి విహాలగ్నమన నిచ్చట తాము రమా విధేయులో
నుల్లము పొంగ నేడె పదముంపఁగఁబోలును, పెండ్లినాఁడు నే
నెల్లరుఁజూడఁ గోవెలకు నేగి తపః ఫలసిద్ధ భర్తయౌ
తల్లి భజింతు, గౌరి సవిధంబున పాణి గ్రహించి వెంబడిన్॥

భూపతు లెల్లరున్ గనఁగ పూరుషుఁడో యదురాజమౌళి ని
క్షేపముగాగ నన్నుగొని స్వీయ రథస్థితఁ గొంచుఁబోవ నా;
శ్రీపతి కీ కృతిం గలుగు సేగి యొకింతయు లేదు, తా మునూ
ప్రాపిత దూత తోట ఫలవంతమ యౌ పథకమ్మిదంతయున్॥

నా పలుకురిత్త సేయకుఁ,
డే పలు కాడంగ నింద నేమియుఁబని లే,
దీ పూట పయనమై చని
రేపటికే తిరిగి రండు శ్రీపతితోడన్॥

పదునారేడుల బాలయీ పగిది విప్ర శేషుతోఁ బల్క నా
ముది వగ్గెంతయు విస్మయం పడుచు, ముమ్మొఁదున్న యా జడ్డ భా
వద మందున్ గనుచుండి, తన్మయత స్తంభంబంది, దేహాస్మృతిన్
బద యుగ్మంబున శీర్షముంచుటను దత్పూర్వున్ గనం జాలుచున్॥

ఇదె పోదున్ గొనితెత్తు శ్రీపతిని తల్లీ! నన్ గటాక్షింపవే
యెద నుద్వేగము నందబోకు మింక, నీ వృద్ధేమి యిట్లింతలో
నదయా తన్ జని ద్వారకన్ విభుని సంభాషించి తోడ్తో పునః
పదమందే గొని తెత్తు నేమనుచు సంభావింపకో తల్లి రో!

నీ దయగల్గ వృద్ధుఁడగు నిత్తఁల యౌవనుఁ, డాత్మవేత యౌ
వేదియు నెరనట్టి మతిహీనుఁడు నీ విల చూచుచుండఁగా
యాదవ సార్వభౌము నను యాతుని నీకడనుంతు నమ్మమీ!
శ్రీదయితుండు నీ కరము చేకొననన్ మఱువంగఁబోకుమీ!

అనుచుం బోవఁగఁ దత్ప్రయాత్న గురుమార్గాబద్ధ దృష్టి న్వె
కనుచుండన్, మినుమార్గ మీదిన మహా కాలాంశుఁడో స్వామియో
ఘనరాఁగా, వృపకన్య ధన్యమతి, లోక త్రాణ దీక్షా పని
ష్టిని స్వామిని సంస్మృతిన్ నిలిపి, యర్చించెన్ మనఃపూర్తిగన్॥

మనసె సమస్తమౌ ననెడి మాట నిజంబగు, పొంగువేళ న
య్యనిమిష లోకమందికొని హాయిని గాంచును, క్రుంగువేళనే
మనుటకు వీలుగాని దశనంది యధోగతిబట్టి వేదనం
గనును, సుఖంబు దుఃఖమవు గాములు రెండును మానసం బతా॥

పొంగుచుఁ గ్రుంగుచున్ గదలు పోడిమి కల్గిన మానసంబె త
క్కుంగల సర్వసంస్కృతికి కూకటి వేరగు, దాని సోకడల్,
ముంగల నున్న వానరము పోలిక గాంచును, స్వస్వఁదోచు ని
ల్యంగల జీవి,కి బ్రదుకు భారము కాదొక స్వప్నమా తవా॥

గురు నటు పంపుచోఁ గుసుమ కోమలి సర్వజగత్పవిత్రయౌ
పరువము తోడఁబుల్కినది, వారటు లేగిరి, నాటి రాత్రియే
మరునటి నాఁడు వచ్చినది, మానిని చిత్తము రుక్మి చెల్లెలన్
గిరికొని క్షోభమందినది, క్రీడనమస్తము దేహ చూడఁగన్॥

చేసినదెల్ల తప్పనెడి చిత్తము శాంబర వృక్షమట్లుగా
మూసిన దన్ని దిక్కులను, మోహము క్రమ్మెటు సర్వ మంధమై
గాసి బడం దొడంగినది, కాయ మొకండిట గల్గు మాటచే
పూసి, యవశ్య సంస్కరణ మాలినదై దిగులందె పెల్లుగన్॥

రాచని సుంగు గావున పరం పరగా పరిచారికాళి కా
ల్యాచరణీయ సత్క్రియలకై యరుదెంచి, కుమారిఁ జూచియున్
దోచక హెచ్చరించియును ధ్యానన మంది తొలంగుచుండు, రం
దే చెలియో యొకర్తె యిదియేమని నిల్చిన మాట చెప్పదున్॥

చిత్తేశుం డరుదెంచు దారిఁ గను దృష్టిన్ ద్రిప్పకట్టె సరం
బొత్తెన్ గండతలం, బదెంతకు నటే యుండున్ విడఁబోయినా,
మత్తా నీకృత కంఠయై నిలుచు నా యున్మాదనింగాంచి, తా
రెత్తన్ గుండియ లుత్తలం పడుచు, నింకేదారి కన్పింపకన్॥

తలికిఁ దండ్రికిం దెలుపఁ దల్లడ మందుచు వారు వచ్చి 'మా
తల్లి! యిదేఁ మనంగఁ గనుదా మరలన్ మరలింప బోద - యీ
రెల్ల ప్రసాత్మ జాతకయి యింత మహోత్సవ మందునుండ నీ
తల్లి యిటవోట యంతయును దాఁగక పొక్కిన దెల్లచోటులన్॥

రాజకుమారి పెండ్లియన రాజ్యము నందలి యెల్లగేస్తులున్
రాజని గాక తండ్రియని రాజును గాంతురు గాన, గేహముల్
రాజనివాసముల్ బలెనె రమ్యములన్ బొనరించి, వేడుకల్
తేజరిలంగ నుత్సవ మతిన్ ముదమందుచు పొంగుచుండుచో॥

సాక్షాల్లక్ష్మి యటంచు విశ్రుతముగా సర్వాశలందుండి నా
నాక్షత్రాన్వయ జాతులెల్లరు మహానందంబునన్ వచ్చి, యీ
రక్షయ్యాం బొనరించి, మూర్తమునకై యాత్రంబువందుండ, దు
ర్భిక్షంబై నృపకన్య యిట్టగుట విన్పించెన్ మహాహానిగన్॥

అందఱెఱుంగుమాట యిదియైనను, మున్నెవరున్ వివిరతం
బందగ జేయ, రిప్పుడది యంతట నొక్కట భిన్నవైఖరిం
బొందిన; దెంత ఘోరమిది? పుట్టక పుట్టిన యొక్క బిడ్డకున్
జెందని వాని గట్టుటకు సిద్ధము కా, నిటులయ్యె పాపమై॥

రాజస్వయంవరం బనిన రాజులు వచ్చెడి తీరువేఱుగన్,
రాజకుమారి పెండ్లియన రాజుల రాక వినోదమాత్రమౌ,
భోజ సుతాకరాంబుజము పోడిమి నందగఁ బట్టి నంద గో
రాజ వినోది యావ్వఁడు రాఁడట, రాసుత యేమియౌనొకో?

సుందరి కృష్ణునిన్ వలచె, సుందర సుందరుఁడాతఁడొక్కఁడే
సుందరికిం దగున్, మనసుచూఱ యొసంగిన మానినీ మణిన్,
బొందియధీనమైనదని పొందిక సుంతయులేని చైద్యునిన్
జెందగఁజేయు కంటిఁగడు సిగ్గరి చేతయు నుండఁబోలునే!

అన్న యెఱుంగకుండినను నయ్య యెఱుంగఁడ కూతుడెంద, మ
న్నన్న జగంబెఱుంగు గదా, యీ రమ కృష్ణగతాంతరంగ, తాఁ
జిన్నతనంబునుండియును జెప్పక చెప్పను, యాదవుండు రా
కున్న కతాన నిట్లయిన, దూర్చును పొందు నతండె వచ్చినన్॥

రాజని క్షత్రియుండనుచు రాక్షసు వేత నెఱింగెఱింగి యం
భోజ దృశాకరంబును సంబోవు టె రాక్షస; మిట్టివేళ నా
రాజకులస్థ రాక్షస హర ప్రభవాధి కుఁడేగుదెంచి రా
రాజగ రుక్మిణిం గొనుట రాక్షసమెట్లగు? దైవమయ్యెడిన్
పేరున రాక్షసంబయి గభీర మహార్థమునందు నిత్య శృం
గార మహత్త్వముం దెలుపు గాథయగున్, రసరాజు రాజగా
కౌర! పరాత్పరార్ద్రయగు నా మహనీయ హృదబ్జ పీఠి దు
ర్వార దురాశ నందికొనఁ బాఱెడి వారలు రాజలౌదురే?

తనమొఱఁగల్గు కోర్కెనిటు తల్లి జనంబులు వ్యక్త వైఖరిన్
గనుఁగొనుచేసి, విగ్రహముగా దిన మంతయునట్లె సేవ్యఁ, గుం
డిన నభ మంతటన్ బరువిడెన్ గరుడధ్వజ కోటి, సాధు స
జ్జనముల గుండియల్ విరియ చందమునన్ విభురామ మెన్నుచున్॥

కృష్ణా కృష్ణ యటన్న యారవము సాగెన్ మింట, నేత్రద్వయం
బుష్ణ ప్రశుల్ ప్రసవియింప మేల్కొనియె, సద్యోజాత చైతన్యయై
తూష్ణీం భావము వీడి రాజసుత, నాథుంబిల్వ నవాణి రా
గోష్ణాంబున్ జ్వలియింపఁజేయ, నెలో నుద్విగ్న యోచున్ గడున్

ముదుసలి బ్రాహ్మణున్ వెదకి మోయు మటంచును నెత్తికెత్తితిన్,
నదయుఁడు పూనె గాని, యెటు సాగును ద్వారక, కెట్లు చెప్పునా
హృదయము స్వామికిన్, దిరిగి యెట్లుగ రేపటిలోనఁ దెచ్చు. ని
యదనున నాకు దిక్కెవరు? వ్యర్థమతిన్ గడువెల్ల తీతెడిన్॥

బాలిశుఁడైన చైద్యునకు బంధులు మిత్రులు నెల్ల పార్థివుల్
వావిరి కుండినన్, రవియు వాలెను పశ్చిమ దిక్కునందు, గో
పాలుఁడు వచ్చుజాడ పొరపాటుగ నైనను దోపకుండె, మ
ద్యేలత నందు గుండియయు వ్రీలునొ యేమొ నిశాంతమందునన్॥

అనుకొన్నట్లుగ స్వామివచ్చినను హస్తాకృష్ట లీలాంబుజం
బనగాఁగైకొని, రాజమార్గమున గంధానేక పంబట్లుగాఁ
జనుచోఁ, జూచును గ్రామసింహములు పుచ్ఛంబుల్ దిగంజార్చి, లే
దను మానంబని చెప్ప గుండియకుఁగల్యాణం బగుం గావుతన్॥

వట్టి వ దేశకాలములు, బద్ధ మొనర్చును దేహమాత్రమున్
గట్టి వ యన్నరీతి, నెద కానగ రానివి యెందునున్నె? చూ
పట్టనదే వియత్పదము పట్టిన బంధురుఁ డగ్ని నే తుఁడీ
చట్టు నను గ్రహించు వయశాలి యదూత్తము చెంతస్పష్టమై॥

ఇచ్చటనుండి నే నిటులహీన మతిన్ దనకై తపించు న,
ట్లచ్చట స్వామియున్ దరుణ మౌటకు వేచును నన్నుగూర్చి, నేఁ
డచ్చొటు చేరు బ్రాహ్మణుని మోమున నా వలపెల్ల వించుఁ దా
ముచ్చటలాడు మోదమున, ముప్పఁ దలంగగ వచ్చు రేపటన్॥

ఊరక భావనా వశత నున్నవి లేనివి కల్పితంబులై
యీ రమణం బిదేమి? తరియింపఁగఁ జేయునె యాపదబ్ధిఁ, గ
న్నారఁగఁ గృష్ణుఁగాంచు వఱకు ఆట తీరదు, రాత్రియెల్ల జా
గారము సేయుచున్ శివుని గానము సేయుదు శ్రేయముం గనన్॥

తను వితరమ్ము కాక సహధర్మచరిన్ నిజదేహమందె ని
ల్పిన శివ! నన్ను నా ప్రియుని లీన మొనర్పుము దక్షిణుండవై,
కొనకొని నీకునై తను వగున్ గుఱిఁగానఁగఁ బెక్కురీతులన్
పెనగొను, సేవకున్ ఫలము పెంచుము నీవుగ చంద్రశేఖరా!

యదువంశాంబుధి సోముఁడెట్టులయినఁ దానై వచ్చి నన్గొంచుఁబో
వ దయం జూడుము, నిత్యయుక్తుఁడవు సాంబా! నీకు మా యావ్యథా
పద దుర్జ్ఞేయము, దుర్జయంబగుట సంభావ్యంబు గాదయ్య! నా
యెదకున్ దాపము తీఱ మీర్పిలువుఁ డంతే చాలు విశ్వేశ్వరా!

చల్లని తల్లి యీ యుమయె చాలును దుర్గములన్ దరింప, నే
నెల్లి వివాహ లగ్నమున కెంతయు ముందు సఖీ సమేతనై
తల్లిని దేవళాన గుడిదైవత పూజను గొల్వఁబోదు మే
నుల్లము వాక్కు నొక్కటయి యుండఁగఁ జూడుము పార్వతీపతీ!

[ఇంకా వుంది]

సిగరెట్టు

డా. పి. జి. రామారావు

"ఏమండీ! ఇలా చూడండి. నా సిగ బాగావచ్చిందా?" అంది ప్రియంవద నిలువుటద్దంముందు నిలబడి సిగచూసుకుంటూ.

"బాగానేవుంది," అన్నాడు ప్రకాశరావు అప్పుడే అయిపోయిన సిగరెట్టుతో ఇంకో సిగరెట్టు ముట్టిస్తూ.

ప్రియంవద ముఖం చిట్లించింది. అతని సమాధానంలో ఆమెకు ఏదో వెలితి కనిపించింది. అతడు తనవేపు అసలు చూసినట్లే లేదు. రెండేళ్ల క్రితం తమ పెళ్ళయిన కొత్తలో అద్దంముందు తాను నిలబడితే తననీ, తన అలంకరణనీ, ముఖ్యంగా తన శిరోజాలనీ ఎంత మెచ్చుకొనేవాడు! ఇప్పుడు తన సంగతే పట్టదు అతనికి. ఆమె మనస్సు వికలమైపోయింది. "ఈ రెండేళ్లలోనే తనంటే మోహం మొత్తిపోయిందా ఆయనగారికి?" ఆమెకు ఇటువంటి ఆలోచన ఇంతకుముందెప్పుడూ రాలేదు. అద్దంలో అతన్ని చూసింది.

పొగమేఘాల వెనుక లీలగా నీడలా కనిపిస్తున్నాడతడు. తన చుట్టూ పొగతో గోడలు కట్టుకుంటున్నట్లుంది అతని ప్రతిబింబం. ఆమె ఏదో అర్థంకాని ఒంటరితనంతోనూ, నిస్పృహతోనూ గిజగిజలాడింది.

"త్వరగా తెములు. టైమయిపోతూంది." పొగమేఘం ఉరిమింది.

అప్పటికిగాని తెలియలేదు ఆమెకు తానేదో చెప్పలేని వేదనతో కొంతసేపటినుంచి బాధపడుతున్న సంగతి.

"నాకు ఒంటో బాగాలేదండీ. ఈవేళ రాలేను." అన్నదామె.

"అరె! ఇప్పటివరకు బాగానేవున్నావే. ఇంతట్లో ఏమయింది?" అన్నాడు ప్రకాశరావు ఆదుర్దాగా దగ్గరకువస్తూ. "ఈ సినిమా ఈవేళతో ఆఖరు. చూడాలని ఎంతో సరదా పడ్డావు. టిక్కెట్లు కూడా తెప్పించేశాను," అన్నాడు అనునయంగా ఆమె నుదుటిమీద చెయ్యి వేస్తూ.

ప్రియంవద హృదయం ఆర్ద్రమైంది. ఎంత కంగారు పడుతున్నాడు తన కనారోగ్యమంటే! నిజంగా తనంటే ఎంత ప్రేమ!

కాని ఏదో అర్థంకాని అసంతృప్తి మనస్సును తొడేస్తున్నది. ఏదో విముఖత. హృదయంలో ఏదో వేదన.

"అబ్బే, మరేం కంగారు అవసరంలేదు. కొంచెం తలనొప్పి, వికారమూను. అంతే. మీరు మానకండి. చాలా మంచి సినిమా అంటున్నారంతా," అన్నది ముఖం మీదికి నవ్వు తెప్పించుకోడానికి వృథా ప్రయత్నం చేస్తూ.

ప్రకాశరావు ధర్మామీటర్ తెచ్చి టెంపరేచర్ చూశాడు. జ్వరంలేదు. "సినిమానుంచి తిరిగి వచ్చేటప్పుడు ఏదైనా మందు తెస్తానని" బయటికి వెళ్ళిపోయాడు.

ప్రియంవద పడగ్గదిలోకి పరిగెత్తి పక్కమీదపడి వెక్కివెక్కి ఏడ్చింది. ఎందుకో ఆ దుఃఖం తనకే అర్థంకాలేదు. ఎంతో ప్రేమిస్తున్నాడనుకున్న భర్త తనకు ఒంట్లో బాగులేనప్పుడు, తన్నువదిలి అలా సినిమాకు వెడతాడని ఆమె కల్లోకూడా అనుకోలేదు. తాన వెళ్లమంటేమాత్రం? ఈ సినిమా చూడాలని తను ఎప్పటినుంచి ఉవ్విళ్లూరుతున్నది. తీరా ఆ అవకాశం వచ్చినప్పుడు తన ఉత్సాహం ఖాళీ అయిపోయింది.

చుట్టూ పొగతో గోడలు కట్టుకుంటున్న భర్త ప్రతిబింబం ఆమె మనస్సులో మెదిలింది. తనంటే ఎందుకంత నిరాదరణ?

ఆలోచిస్తున్నకొద్దీ హృదయం ఇంకా ఇంకా బరువెక్కుతూంది. భరించలేక మళ్లీ దిండులో తలదాచుకుంది ప్రియంవద.

ఇంటర్వెల్‌లో హాలు బయటికి వచ్చిన ప్రకాశరావు మిత్రుడితో, "బ్రదర్, సినిమా చాలా బోరింగుగావుంది. నాకు నిద్రముంచుకొస్తోంది. ఇంటికి పోతున్నా. ఏం అనుకోకేం," అంటూ రిక్షా ఎక్కాడు.

మెడికల్ షాపులో ప్రియంవదకు మందుతీసుకుని ఇంటికి చేరేటప్పటికి సినిమా వదలే టైమయింది. నిద్ర మేల్కొని తలుపు తెరచిన ప్రియంవద ఎదురుగా పొగమేఘాలలో మసక మసగా కనిపిస్తున్న భర్తనుచూసి ఏదో భూతాన్ని చూసినట్లు గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది.

"ప్రియా! ఇదిగో, మందు తెచ్చాను. ఎక్కడ పెట్టమన్నావ్?" అన్న అతని కేకకు వంటగది తలుపులు భళ్ళున సమాధాన మిచ్చాయి.

ప్రకాశరావుకు షాకు తగిలినట్లయింది. వివాహమయ్యాక ఇటువంటి సన్నివేశాన్ని అతడెన్నడూ ఎదుర్కోలేదు. ఆమె అలా ఎందుకు ప్రవర్తించినట్లు? మందుసీసా టేబిల్ మీదపెట్టి వంటగది తలుపులు తట్టాడు. లోపల గడియవేసివుంది. ఎంత తట్టినా అది తెరుచుకోలేదు. ప్రాణం విసిగింది. ఒళ్ళు మండింది.

సిగరెట్టు మేఘాల్లో తేలిపోతూ పడగ్గదిలో ప్రవేశించాడు ప్రకాశరావు.

మాంత్రికుడి గుహలా పొగతో నిండిన ఆగదిలో ఏడువేతి మీద చెంప ఆన్చి పత్తిగిరి యోగనిద్రలో వున్నట్లు పడుకున్న అతని మనస్సు పరిపరి విధాల పోయింది.

"తన భార్య ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నట్లు? తనవల్ల ఏదైనా పొరపాటు జరిగిందా?" అతను చాలా గాఢంగా ఆలోచించాడు. అయినా తన ప్రవర్తనలో ఏం లోపంవుందో అతనికి తెలియలేదు. వివాహమయ్యాక అతనిలో వచ్చిన మార్పల్లా ఈ సిగరెట్ అలవాటు మాత్రమే. అదైనా ఆమె ప్రోద్బలంమీద ప్రారంభించినదే. అతనికసలు ఈ సిగరెట్లుమీద వ్యామోహం లేకపోవడం అటుంచి, దానిమీద, పొగతాగే వాళ్లమీద ఎంతమాత్రం గౌరవం వుండేదికాదు. అయితే ప్రియంవదకు ఈ విషయంలో వేరే అభిప్రాయాలుండేవి. సిగరెట్లు కాల్చడం నాగరక లక్షణం మాత్రమేకాక ప్రత్యేకమైన పురుష లక్షణం అని భావించేది ఆమె. ఆమెతండ్రి, ఇద్దరన్నలు విపరీతంగా సిగరెట్లు కాల్చేవారు. వాళ్ళఇల్లు పొగతో నిండి ఒక చిన్న పారిశ్రామిక నగరంలా వుండేది. అటువంటి వాతావరణానికి అలవాటుపడ్డ ఆమెకు తనభర్తకా అలవాటు లేకపోవడం ఒక పెద్ద దౌర్బల్యంగాను, లోపంగాను కనిపించసాగింది. వివాహమైన తర్వాత రెండు నెలల కతనిచేత తొలిసారిగా సిగరెట్టు కాల్పించ గలిగిందామె.

ప్రకాశరావు ఆమె ఆనందంకోసం అడపా దడపా ఆమెముందు మాత్రం సిగరెట్లు కాలుస్తూ వుండేవాడు.

తర్వాత క్రమేపీ ఆమె పరోక్షంలో కూడా కాల్చసాగాడు. ఇప్పుడేమో సిగరెట్టు లేకుండా క్షణం గడవదతనికి.

ప్రకాశరావు కిదంతా స్ఫురణకి వచ్చింది. తనలో వచ్చిన మార్పు ఇదొక్కటే. ఇది ఆమె దృష్టిలో లోపం కారాదే! ఆమె కోసమేగదా తానీ అలవాటు చేసుకున్నది. అతనికి నవ్వు వచ్చింది. అంతలోనే ఆందోళనకలిగింది. ఎన్నడూ లేనిది సిగరెట్టు పొగలో వుక్కిరి బిక్కిరి అయ్యాడు. తెరలు తెరలుగా దగ్గు వచ్చింది. గుక్కెడు మంచి నీళ్ళు తాగి మళ్ళీ నడుం వాల్చాడు. టేబిల్‌మీది భోజనం అలాగే వుండిపోయింది.

* * *

తూర్పు తలుపులు తెరుచుకున్నాయి. ప్రకాశరావు ఇవతలకు రాగానే మొదట సూర్యభగవానుడు, పిదప దంతధావన సామగ్రితో ప్రియంవద ప్రత్యక్షమయ్యారు. అలవాటు ప్రకారం భర్తకవి అందిచ్చి వంటింటి లోకి వెళ్లి పోయిందామె

మొహం కడుక్కోవడం పూర్తికాగానే తువ్వాలు అందివ్వడం, తర్వాత కాఫీ తీసుకురావడం, షేవింగు సామగ్రి తేవడం, స్నానానికి నీళ్ళు పెట్టడం, వంటచేయడం, వడ్డించడం అన్నీ యాంత్రికంగా జరిగిపోయాయి. ముక్తసరిగా అవసరమైన మాటలు తప్ప ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ఇద్దరూ గుండెల్లో పెద్ద బరువు దాచుకుంటు న్నట్లు మసిలారు. చాటుగా కళ్ళు తుడుచుకుంటున్న ప్రియంవదని ఆఫీసుకి వెళ్లిపోతూ ప్రకాశరావు సిగరెట్టు పొగలోంచి లీలగా చూశాడు. అతని మనస్సు పొగ చూరినట్లయింది.

ప్రకాశరావు మనసంతా అదోలా అయిపోయింది. ఆరోజు ఆఫీసులో అన్నీ పొరపాట్లే. ప్రియంవద ఆ రీతిగా ఎన్నడూ కంటతడి పెట్టలేదు. కళ్ళు తుడుచుకుంటున్న ప్రియంవద రూపం రోజల్లా అతనికి సిగరెట్టు పొగలో కనిపిస్తూనే వుంది. ఆమె బాధేమిటో తెలుసుకోవాలని అతని హృదయం ఆరాటపడింది.

సాయంత్రం ఇంటికివస్తూ ఆమె కిష్టమయిన గులాబీలు తీసుకువచ్చాడు.

"ఇదిగో ప్రియా, నీకోసం తెచ్చాను గులాబీలు," అన్నాడు తలుపు తెరచిన ప్రియంవద చేతిలో అవి తొందరగా పెట్టేస్తూ.

ప్రియంవద వాటిని కింద జారవిడిచింది. అతని గుండెలమీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడుస్తూ, "నాకివేమీ వద్దు. నాకు... నాకు...మీరు కావాలి. ఇంకేమీ అక్కరలేదు," అన్నది.

ప్రకాశరావుకంతా అయోమయంగా వుంది. అదేమైనా హిస్టీరియా సంబంధమేమో అని ఒక్కక్షణం కంగారు పడ్డాడు. ఆమెను హృదయానికి హత్తుకుని బుజ్జగిస్తూ, "ఏదేమిటి ప్రియా, నేను నీవాడినేగా," అన్నాడు.

"ఏమో, నాకు తెలీదు. నాకేమిటో భయంగావుంది. మీరు నాకు దూరమైపోతున్నట్లనిపిస్తున్నది," అందామె వెక్కుతూ.

ఏమనాలో తెలియలేదతనికి. "నీవన్నీ పిచ్చి పిచ్చి భయాలు ప్రియా," అంటూ ఆమెను పొదివి పట్టుకుని సోఫాలో కూర్చోబెట్టి, పక్కనే తనూ కూర్చున్నాడు.

అతని భుజంమీద తలవాల్చి కూర్చున్నదామె.

ఇద్దరూ అలా ఎంతసేపో వుండిపోయారు. హఠాత్తుగా ప్రకాశరావుకి జ్ఞాపకం వచ్చింది. ఒక గంటనుంచి సిగరెట్టు కాల్చలేదన్న సంగతి.

సిగరెట్టు జ్ఞాపకం రాగానే అతని హృదయంలో ఏదో వేదన ప్రారంభమైంది. తలనొప్పి, పళ్ళసలుపు మొదలైన యాతి బాధ లనేకం హఠాత్తుగావచ్చి పడ్డాయి. ఎప్పుడూలేనిదీ రోజు సిగరెట్టు పాకెట్ అయిపోగానే కొత్త ది కొనుక్కోవడం మరచిపోయాడు.

కంగారుగా లేచాడు ప్రకాశరావు.

"ప్రియా! కాసేపు ఇలా పడుకో. నీకు విశ్రాంతి అవసరం. ఇప్పుడే అయిదు నిముషాల్లో వస్తాను," అంటూ బయటికి పరిగెత్తాడు.

ప్రియంవద సమాధి భగ్నమైంది: ఎప్పుడూ తామిలాగే వుండాలని తీయని కలలు కంటున్న ప్రియంవదని ఎవరో కుదిపి లేపినట్లయింది. వంట యింట్లోను, పెరట్లోను తనకోసం ఎదురు చూస్తున్న అనేక పనులు ఆమెకు జ్ఞాపకమొచ్చాయి.

నీరసంగా లోపలికి నడిచింది ప్రియంవద. కాసేపటికి గుప్పుమని సిగరెటు వాసన భర్త వచ్చిన సంగతి చెప్పిందామెకు.

*　　　*　　　*

మర్నాడు పొద్దుట ప్రియంవద గది సర్దుతూంటే టీపాయ్ మీది 'యాష్ ట్రే' ఆమె కొంగు తగిలి కిందపడింది. శుభ్రంగా తుడిచిన నేలంతా సిగరెట్ల నుసితో అసహ్యంగా తయారయింది. పియం వదకు అదంతా చూసేసరికి ఎక్కడలేని చిరాకువచ్చింది. ఆ 'యాష్ ట్రే' తీసుకుని కిటికీలోంచి వీధిలోకి గిరవాటు వేసింది. అలాచేశాక ఆమె మనస్సుకెంతో తృప్తి కలిగింది.

ప్రకాశరావు సిగరెట్టు కాలుస్తూ పడగ్గదిలోంచి డ్రాయింగు రూములోకి వచ్చి 'యాష్ ట్రే'కోసం చూస్తే అది కనపడలేదు. మళ్లీ పడగ్గదిలోకే వెళ్లి అక్కడి 'యాష్ ట్రే' తెచ్చుకోవలసి వచ్చింది.

మళ్లీ టిపాయ్‌మీద ప్రత్యక్షమైన యాష్ ట్రేవైపు చురచుర చూపింది ప్రియంవద. ఒక తల నరగ్గానే పుట్టుకొచ్చిన రావణుడి ఇంకో తలవైపు రాముడు చూసిన చూపది. నిర్జీవమైన ఆ 'యాష్ ట్రే', ఒకనాడు తను స్వయంగా భర్తకు బహూకరించిన 'యాష్ ట్రే'. ఇప్పుడు తన కళ్లకు గర్భశత్రువులా, క్రూర సర్పంలా ఎందుకు కనిపిస్తున్నదో ఆమెకు అర్థంకాలేదు. మళ్లీ దాన్ని దొరకబుచ్చుకుని గిరగిరతిప్పి వెళ్లినంత దూరం విసిరేయాలనిపించిందామెకు. అయితే భర్త ఎదురుగా అంత సాహసం చెయ్యలేకపోయిందామె. తెల్లని పొగతో తాను నిర్మించుకున్న తెరల వెనుక అతడు అప్పుడే వచ్చిన పేపరుచూస్తూ కూర్చున్నాడు.

ఆ 'యాష్ ట్రే' అంటే తనకంత అసహ్యం ఎప్పటినుంచి కలిగిందో, ఎందుకు కలిగిందో ఆలోచించుకుంటూ, కూరలు తరుగుతున్న ప్రియంవద వేలుకోసుకుంది.

భర్తకు తెలిసి ఎక్కడ లోపలకు వస్తాడో అని ఆమె కిక్కురుమనకుండా అంత బాధా ఓర్చుకుంది. గాయంమీద పంచదారవేసి కట్టు కట్టుకుంది.

ముందురోజు భర్త సన్నిధిలో తన అనుభూతిని ఇప్పటి విముఖతతో ఎలా సమన్వయించుకోవడమో తెలియక తికమకగా వుందామెకు

తలుపు దగ్గర ఏదో చప్పుడై ఆలోచనల్లోంచి ఇవతలకు తొంగి చూసేసరికి భర్త సిగరెట్టు పొగలోంచి తొంగి చూస్తున్నాడు, "వంట ఎంతవరకు వచ్చింది ప్రియా? ఆఫీసుకు టైమయిపోతుంది" అంటూ.

గబగబా మొహానికింత చిరునవ్వు పూసుకుని; "ఆఁ, అయిపోయింది; ఇప్పుడే అయిదు నిముషాల్లో వడ్డిస్తాను" అంది ప్రియంవద.

భోజనంచేస్తూ ప్రియంవద వేలికికట్టు చూశాడు ప్రకాశరావు.

"అదేమిటి ప్రియా, ఏమయింది?" అని అడిగాడు కంగారుగా.

"ఏమీలేదు. వేలు కొద్దిగా తెగింది. అంతే" అన్నదామె.

"మరి చెప్పావుకాదేం? బెంజాయిన్ వేసి కట్టేవాడినే. ఇంతకీ ఏం వేసి కట్టావు?" నిష్ఠూరంగా అన్నాడు. "చిన్న దెబ్బతగిలినా, చివరికి వంటయింట్లోకి వానపాము వచ్చినా పెద్ద కేకలేసి చెప్పే దానివే. ఇంతలో ఏం మార్పు వచ్చింది?"

ఆ మాటలకన్న అతని చూపుల్లోవున్న నింద ఆమె గుండెల్లో గుచ్చుకుంది.

తలవంచుకుని, "ఈ మాత్రానికి మీ పని పాడుచేయడం ఇష్టంలేక పిలవలేదు...పంచదారవేసి కట్టాను. రక్తం కట్టేసింది" అన్నది.

ప్రకాశరావు చిరాకుపడ్డాడు.

"నా పనంటే ఇంత శ్రద్ధ ఎప్పటినుంచీ? నువ్వు చాలా మారిపోయావు ప్రియా" అన్నాడు.

తనను కాదన్నట్టు ప్రియంవద పెరట్లోకి వెళ్లిపోయింది. ఛెళ్లున కొరడాదెబ్బ తిన్నట్టయిందతనికి.

భోజనం పూర్తికాకుండానే లేచి డ్రెస్ వేసుకుని ఆఫీసుకు వెళ్లిపోయాడు.

*　　　*　　　*

ఆ యింట్లో ప్రచ్ఛన్న యుద్ధం ప్రారంభమైంది. భార్యాభర్తలకు మాటలులేవు. అయితే దినచర్య యధావిధిగా జరిగిపోతున్నది.

ప్రియంవద ముఖం మబ్బుకమ్మి ఏ క్షణం వర్షిస్తుందా న్నట్లు వుంటున్నది.

ప్రకాశరావు పరధ్యానం పెరిగిపోయింది. అతడు తెల్లని మేఘాల్లో తల దాచుకుని కాలక్షేపం చేస్తున్నాడు. యాష్ ట్రే అక్షయ తూణీరంలా ఎప్పటికప్పుడు నిండుగానే వుంటున్నది. అతని ధాటికి పాకెట్లు ఆగడంలేదు. అస్తమానూ లేచి వెళ్లి సిగరెట్టు పాకెట్లు తెచ్చుకోవడం అతనికి విసుగ్గా వుంది, అంచేత డబ్బాలు తెప్పించడం మొదలు పెట్టాడు ప్రకాశరావు.

ఇప్పుడు ప్రతి గదిలోనూ డబ్బా 'యాష్ ట్రే' తప్పని సరిగా కనిపిస్తున్నాయి.

చేతిలో సిగరెట్ డబ్బాలేకుండా అతడెక్కడికీ వెళ్లడంలేదు.

ఇంట్లో ఎక్కడచూసినా సిగరెట్ డబ్బాలే- పాతవీ, కొత్తవీ.

ఉన్నట్టుండి ఒకరోజు ప్రియంవదలో ఒక వింతమార్పు వచ్చింది. ఏదో కొత్తశక్తి పుంజుకున్నట్లు, ఏదో గట్టి సంకల్పంతో వున్నట్టు ఆమె ముఖంలోని తేజస్సు స్పష్టం చేస్తున్నది. తెల్లవారి లేవగానే కనిపెట్టాడు ప్రకాశరావు ఈ సంగతి. అతనికి భయంకలిగింది.

ఆఫీసుకు వెళ్లేవరకు ఆమె ఎదుట పడకుండా, పడినా తల ఎత్తి చూడకుండా, ముఖం చాటుచేసుకుని తిరిగాడు.

సాయంత్రం రోజూకన్న త్వరగా ఇంటికి వచ్చిన ప్రకాశరావు తాళం చూడగానే పిడుగు పడ్డట్టయ్యాడు. మనస్సు పరిపరి విధాల పోయింది. ఎదురింటి అరుగుమీది ముసిలాయన్ని అడిగాడు 'ప్రియంవద ఎక్కడి కెళ్లిందో తెలుసునా' అని.

ఆమె కాలవ దిక్కుగా అప్పుడే వెళ్లిందనీ, చేతుల్లో రెండు పెద్ద బుట్టలు మాత్రం వున్నాయనీ చెప్పాడాయన.

ప్రకాశరావుకు మతిపోయింది.

చేతిలోని సిగరెట్‌డబ్బా ఆ అరుగుమీద వదిలేసి పిచ్చివాడిలా పరిగెత్తాడు కాలవ వైపు.

అతని పరుగు హఠాత్తుగా ఆగిపోయింది. అల్లంత దూరంలో ఏదో విచిత్రమైన క్రీడలో మునిగిపోయిన ప్రియంవదనుచూసి ఆశ్చర్యంతో వున్నచోటే నిలబడిపోయాడు.

ఆమె బుట్టలోంచి ఏవో వస్తువులు ఒక్కొక్కటితీసి గిరగిర తిప్పి ఆటల పోటీల్లో చక్రం విసిరినట్లు దూరంగా కాలవలోకి విసురుతున్నది. ఎవరో అదృశ్య శత్రువుతో యుద్ధంచేస్తున్నట్లున్నాయి ఆమె భంగిమలు.

మరేమి ప్రమాదం జరగనందుకు సంతృప్తిగా నిట్టూర్చాడు ప్రకాశరావు. వగర్చుకుంటూ తన్ను సమీపిస్తున్న భర్త అలికిడికూడా ఆమెకు వినిపించలేదు.

కాలవ దగ్గర ఇంకెవరూ లేరు. ఇంకా ఆటలవేళ కాలేదో ఏమో పిల్లలెవరూ చేరలేదు.

ప్రకాశరావు బుట్టలు చూశాడు

అందులోవున్నవి ?

తన సిగరెట్ డబ్బాలు !

ప్రియంవద మరోడబ్బా విసరే ప్రయత్నంలోవున్నది. అతడు ఆమె చేతిని వొడిసిపట్టుకుని, "ఏమిటిది ప్రియా ! నీకు పిచ్చిగాని ఎత్తలేదుగదా ? అన్నాడు రూక్షంగా.

ఆమె గిరుక్కున తిరిగి అతడిని ఎదుర్కొన్నది.

"పిచ్చి ఎత్తడంకాదు. ఇన్నాళ్లూ పట్టిన పిచ్చి ఇప్పుడు పోతున్నది."

ఆమె ముఖంలో ఏదో అసాధారణమైన వెలుగు కనిపించింది ప్రకాశరావుకు.

ప్రొద్దుట తాను చూసిన సంకల్పబలం ఆమె ముఖంలో కొట్టొచ్చినట్టు కనిపించింది. ఎంతో ప్రశాంతంగా వుందామె. ఆత్మ విశ్వాసాన్ని అన్నివైపులకు వెదజల్లుతున్నాయి ఆమె చూపులు.

"ఇప్పుడు నా ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పండి," అన్నదామె నిందితుడిని న్యాయమూర్తి శాసించినట్టు.

బెరుగా ప్రశ్నార్థకంగా చూశాడు ప్రకాశరావు.

చేతిలో సిగరెట్టు డబ్బా అతని ముఖానికి దగ్గరగా పెడుతూ, "మీకు నాకన్నా ఇది ముఖ్యమా?" అని అడిగింది.

అది ఖాళీ డబ్బా అయితే అతనికి సమస్య వుండేదికాదు. ఆ డబ్బా చూడగానే అతని హృదయంలో మామూలు అశాంతి బయల్దేరింది.

"ఇది మన భవిష్యత్తు నిర్ణయించే పరీక్షా సమయం. అంతా మీ జవాబుమీద ఆధారపడి వుంటుంది," అన్నదామె గంభీరంగా.

ప్రకాశరావు హృదయంలో అశాంతి కాసేపు సుళ్లు తిరిగి చివరకు అణగిపోయింది.

"నాకు నువ్వే ముఖ్యం ప్రియా," అన్నాడు చెమర్చే కన్నులతో.

"అయితే నాకోసం మీరు దాన్ని వదలి పెట్టండి, నేను చేస్తున్నట్లే చెయ్యండి," అని ఆజ్ఞాపించిందామె.

ఆమె విసరినడబ్బా నీటిలో ఒక్కక్షణం అలజడి లేవదీసింది.

కాస్సేపు సుళ్ళు తిరిగి సర్దుకుంది నీరు.

అతని మనస్సు తేలికైంది ఏదో అనిర్వచనీయమైన ఆనందం కెరటంలా లేచింది.

తనుకూడా ఒక సిగరెట్ డబ్బా అందుకుని గిరగిర త్రిప్పి ప్రియంవదకన్న ఎక్కువదూరం విసిరాడు. ఒక్కొక్కడబ్బా విసురుతూంటే ఆమె ముఖం మరింత వెలిగిపోతున్నది.

ఒకరిమీద ఒకరు పోటీగా విసరుతున్నారు.

ఈలోపుగా ఆటలకోసం అక్కడకుచేరిన ఇద్దరుపిల్లలు ఈ తమాషా ఆశ్చర్యంగా చూడడంకూడా వాళ్లకు తెలీదు.

రివ్వురివ్వున ఎగురుతున్నాయి సిగరెట్ డబ్బాలు.

వికటకవిత్వము

శ్రీ యు. ఏ. నరసింహమూర్తి

వికటకవిత్వమనే ప్రయోగం తెలుగులో చాలా తేలికదృష్టితో చూడబడుతున్నది. సామాన్య జనుల దృష్టిలో తెనాలి రామకృష్ణుడు వికటకవి. రామకృష్ణుని పేర వ్యాప్తిలోనున్న హాస్యపూరితములైన, శబ్దాడంబరముతో కూడిన కొన్ని పద్యాలుగాని, పరంపరంగావస్తూన్న వాడుకగాని ఇందుకు కారణాలు కావచ్చును. రామకృష్ణుని గూర్చిగాక ఇతరస్థలాలలో కూడా మనకు వికటకవిత్వ ప్రస్తావన కనవస్తుంది.

కాసర కూసరయై మిగుల గందరగోళపుమూలమై రసాభాసపు
హేతువై వికటపద్ధతియై సిగపట్లగోత్రమై దాసరి పాటయై
బెహరదారన చేసిన యగ్రహార మాకాశము ముట్టితోకతెగి గాడిద
వాలకమయ్యె జూడగన్.

ఈ పద్యంలో కాసరకూసర, గందరగోళము, రసాభాసము, సిగపట్లగోత్రము, దాసరిపాట–అనే ఇతర ప్రయోగాలు మనవారి దృష్టిలో వికటకవిత్వానికుండే విలువ తక్కువ అనే విషయాన్ని స్పష్టం చేస్తాయి. సుప్రసిద్ధ లక్షణ గ్రంథకర్త అప్పకవి దృష్టిలో కూడా వికటకవిత్వానికుండే విలువ ఇంతేనని ఈ క్రింది పద్యంవలన మనము గ్రహింపవచ్చును.

వికటకవులు కొన్ని వింతలు కల్పించి
కవి జనాశ్రయమును గలిపినారు
వానిగైకొనంగవల, దప్రయుక్తంబు
లేల సెప్ప భీముఁ డెఱిఁగి యెఱిఁగి

అప్పకవీయము : 3 ఆ. 260.

అగ్రాహ్య విరామములను గూర్చి వివరించే సందర్భంలో అప్పకవి ఈ పద్యం వ్రాయడం జరిగింది. 'వికటకవులు' అనే అప్పకవి ప్రయోగానికి అర్థం నా మాటలలో కాక సుప్రసిద్ధ విమర్శకులు శ్రీ రావూరి దొరస్వామి శర్మగారి మాటలలో పొందుపరుస్తాను.

'వికటకవులు ప్రాచీన సంప్రదాయమును వికటించు కవులు. వికటమనఁగా వ్యత్యయము, వక్రము, ఎదురు తిరుగుట. వికటకవుల మతము వక్రమతము; గ్రాహ్యము కానిది'.

—అప్పకవీయ భావప్రకాశిక. 180 పేజీ.

శ్రీ దొరెస్వామిశర్మగారి ఈ వివరణ కేవలం అప్పకవి అభిప్రాయాన్ని వెల్లడించేదే ఐనా ఇంత నిర్దుష్టంగా వికట కవిత్వాన్ని నిర్వచించేందుకు తగిన ఆధారాలు మాత్రం మృగ్యం. వివరణకర్తలు కొన్ని ప్రత్యేకాంశాలను నిర్వచించేటప్పుడు వాని చరిత్ర సంక్షిప్తంగానైనా వీలైనమేరకు అందించడం ఉచితంగా కన్పిస్తుంది. సంస్కృత అలంకార గ్రంథాలతో కొద్దిపాటి పరిచయమున్న వారికి 'వికటకవుల మతము వక్రమతము. గ్రాహ్యము కానిది' అనే వివరణ విడ్డూరంగా కన్పిస్తుంది. ఒకానొక పదం లేదా ప్రయోగం కాలగతిలో అర్థ విపరిణామాన్ని పొందినా దాని పూర్వచరిత్రను దృష్టిలో పెట్టుకుని అందులోని సామంజస్యాన్ని గుర్తుచేసే ధోరణి వివరణకు వెలుగునిస్తుంది.

పూర్వుల దృష్టిని సరియైనదిగా అంగీకరిస్తే అనేక పదాలలాగే 'వికటకవిత్వం' అనే ప్రయోగంకూడా మన వ్యవహారంలో అర్థవిపరిణామాన్ని పొందిందని చెప్పవచ్చును. ప్రాచీనాలంకారికుడైన వామనుడు తన కావ్యాలంకార సూత్రవృత్తిలో వికటత్వమొక గుణముగా ప్రతిపాదించాడు.

'వికటత్వముదారతా–బంధస్య వికటత్వం యదసౌ వుదారతా యస్మిన్సతి నృత్యంతీవ పదానీతి జనస్య వర్ణనాభవతి తద్వికటత్వమ్. లీలాయమానత్వ మిత్యర్థః'—కావ్యాలంకారసూత్రవృత్తి.

వామనుడి తర్వాత చింతో కాలానికి పుట్టిన సాహిత్య దర్పణ కర్త విశ్వనాథుడుకూడా ఇదే అభిప్రాయం వెల్లడించాడు.

'ఉదారతా వికటత్వ లక్షణా. వికటత్వం పదానాం నృత్యత్ప్రాయత్వమ్' – సాహిత్య దర్పణము : అష్టమ. పై అలంకారికు లిద్దరూ వికట కవిత్వానికొకే ఉదాహరణ చూపించారు.

స్వచరణ వినివిష్టైర్నూపురైర్నర్తకీనామ్ |
ఝణిత రణిత మాసీత్తత్ర చిత్రంకలంచ–

ఈ శ్లోకంలో నర్తకీమణుల నృత్య సమయంలోని నాదాని కవి తదనుగుణమైన శబ్ద సంయోజనం వలన రూపు కట్టించడం వలన ఇది వికటకవిత్వ లక్షణం కలిగివుంది. అదే శ్లోకాన్ని 'ఝటితి రణిత మాసీన్మఞ్జు చిత్రంచ తత్' అనే విధంగా మార్పుచేస్తే నృత్యత్ప్రాయత్వంగాని, లీలాయ మానత్వముగాని సిద్ధించని కారణంగా అది వికట కవిత్వం కాకుండా పోతుందని వామనాచార్యుడు వివరించాడు. వామనుని అభిప్రాయాన్ని శ్రీ వేదాల తిరువేంగళాచార్యులవారు ఇలా

వివరించారు. — 'వికటత్వ మనఁగా పదము లాడునట్లు తోచుట మాత్రమే కారణమను కొనరాదు వాచ్యమగు లీలను స్ఫురించునట్లు అవికూడ నొయ్యారము కల్గియుండుట యని భావము. శబ్దము వినబడిన వెంటనే వాచ్యముల లీల లర్థ నిరపేక్షముగా స్ఫురించుట యని పర్యవసానము' — ఆంధ్రకావ్యాలంకార సూత్రవృత్తి; 63 పేజీ.

పై వివరణ వికటకవిత్వాన్ని గురించి స్పష్టమైన అవగాహనను కలిగిస్తుంది. 'వృత్యలీలా స్ఫోరకత్వము మాత్రమే వికటత్వము' అనే అభిప్రాయాన్ని శ్రీ వేదాలవారు కాదనడం సమంజసమైనది. అలా కాకపోతే 'విచితవర్ణ తలిర్చిన క్రొవ్విరి నిమ్మగు తావుల జొంపములన్' — నన్నయ. ఆది 4 ఆ.

మొదలైన స్థలాలన్నీ వికటత్వాని కుదాహరణములే అవవలసి వస్తుంది. ఇక్కడ ఛందస్సునుబట్టి పదాలు నృత్యం చేస్తూన్న రీతిగా నడక కొనసాగడం కన్పిస్తుందిగాని వానివలన కవి చెప్పదలచు కొన్న విషయం అర్థ నిరపేక్షంగా స్ఫురించడం జరగదు. అందుచేత ఇది వికటకవిత్వాని కుదాహరణం కాదు.

వామనాదులు వికటాక్షరబంధాన్ని ఉదారత అనే కావ్యగుణంగా భావించగా కావ్యప్రకాశకారుడైన మమ్మటుడు దానిని ఓజోగుణంగా గుర్తించాడు. కాని కావ్యప్రకాశకారుడు ఓజోగుణమున కవసరముగ భావించిన ప్రత్యేకాక్షర సంయోజనము స్వతంత్ర్యాయత్వమే లక్షణముగా గలిగిన వికటాక్షర బంధమున కవసరము లేదు. అక్షరముల ధ్వనులతో సంబంధము లేకుండ నిర్దిష్టమైన క్రమములో కూర్చబడిన పద సముదాయము పద్యగమనంలో ఒకరమణీయమైన ఊపును సాధించి, దానివలననే అర్థస్ఫురణ కలిగించడం వికటత్వ లక్షణం. దానిని ఉదారత అని అలంకారికులు వ్యవహరించారు.

వికటాక్షర బంధాన్ని ఉదారత అనే కావ్యగుణంగా గౌరవించడమే గాక సంస్కృతాలంకారికులు 'వికటకవి'ని కూడా గుర్తించారు. ప్రచురంగా ఉదారతాగుణాన్ని సంఘటింపజేసే కవిని వారు వికటకవిగా గుర్తించి గౌరవించినట్లు భావించవచ్చును. కవిత్వంలో వాచ్యాతిరిక్తమైన రమణీయార్థాన్ని మాత్రమే ఉన్నతమైన దానినిగా అంగీకరించిన ధ్వని మతప్రతిపాదకుడు, ఆలంకారిక శేఖరుడు అయిన ఆనందవర్ధనుడు వికటమనే గుణాన్ని గుర్తిస్తూ ఒక ప్రాకృతగాథను ఉదాహరించాడు.

అతథాస్థితానపి తథాసంస్థితానివ హృదయేయా నివేశయతి
అర్థవిశేషాన్ సాజయతి వికటకవి గోచరావాణీ.

ధ్వన్యాలోకము: చతుర్థోద్యోతము.

రసభావాదుల నాశ్రయించుటవలన కావ్యార్థములకు సంక్రమిస్తూ వుంటుందనే సందర్భంలో ఈ గాథ ఉదాహరింపబడింది. నిలకడలేక విచిత్ర రూపములను ధరించే అర్థాన్ని, వివిధ భావములకు నిలకడలమైన హృదయంతో ప్రవేశింపజేయడంద్వారా, ప్రసిద్ధార్థములకన్న విలక్షణమైన దానినిగా స్థిరత్వాన్ని పొందేటట్లు చేసే వికట గుణశోభితమైన కవివాణి బ్రహ్మసృష్టికంటె ఉన్నతస్థితిని పొంద గలదని ఈ గాథయొక్క భావము. ఈ సందర్భంలో లోచనకారుడు 'వికట' పదాన్ని వ్యాఖ్యానించలేదు. బాలప్రియాకారుడు 'వికటః కవి గోచరోయస్యా వికటకవి గోచరా' అనే వ్యుత్పత్తిని ప్రదర్శించాడు. శ్రీ వేదాలవారు 'ఆ వాణి యనుగ్రహము వలననే కవి వర్ణింప దలచిన యర్థము వికటమై — వక్రోక్తి సముజ్జ్వలమై మేరలేని విధమున నేర్పడుచున్నది; అని చెప్పారు. ఈ వాక్యం లోచనానికి అనువాద ప్రాయమే అయినా అందులో 'వికట' పదానికి 'వక్రోక్తి' అనే అర్థం కనబడదు. ఆ సందర్భంలో శ్రీ వేదాలవారి 'వక్రోక్తి సముజ్జ్వలమై' అనే వివరణకు ఆధారం విచారణీయము కాగలదు. వారు నిర్వచించిన 'వక్రోక్తి'నే 'వికట' పదానికి అర్థంగా అంగీకరించినా అదిమాత్రం శ్రీ రావూరి దొరస్వామిశర్మగారు చెప్పిన 'వికటకవుల మతము వక్రమతము, గ్రాహ్యము కానిది'— అనే విపరీతార్థానికి చెందినదిగాక, కుంతకుని వక్రోక్తిమార్గాన్ని సూచించేదిగా వుంటుంది. అందుచేత ధ్వనికారుని మతంలోను, వివరణకర్తల దృష్టిలోను వికటత్వము కావ్యమునకు ఉత్కర్షను కలిగించే గుణంగా కన్పిస్తుంది.

కవితా జగత్తును తన ఉచ్ఛిష్టముగ స్ఫురింపజేసిన బాణుడు కవిత్వానికి అవసరమని యెంచిన నాలుగు లక్షణాలలో వికటాక్షరబంధ మొకటిగా కన్పిస్తుంది.

నవోఽర్థో జాతిరగ్రామ్యా శ్లేషోఽక్లిష్టః స్ఫుటోరసః।
వికటాక్షర బంధశ్చ కృత్స్నమేకత్ర దుర్లభమ్॥

కేవలం ఏలా తోచిన అర్థాన్ని అలా ప్రతిపాదించేకంటె దానికొక క్రొత్త మలుపును కల్పిస్తే ఆకర్షణీయంగా వుంటుంది. ప్రకృతి సిద్ధమైన స్వభావాన్ని యథాతథంగా నిరూపించే వర్ణన 'జాతి' అనే లక్షణంగా నిరూపితమయింది. పూలు తమంత తాము విచ్చుకున్న సౌరభాన్ని వెదజల్లినట్లుగా శ్రవణమాత్రంచేతనే అర్థబోధకల్గించే శ్లేష మనోహరంగా భాసిస్తుంది. అక్షరాడంబరముతో కూడిన రచన విలక్షణ రామణీయకత్వాన్ని సంతరించుకుంటుంది. కాని ఈ నాల్గు గుణాలను ఒకేచోట సంఘటింపజేయడం దుర్లభము. అలా సంఘటించినవాడు నిస్సంశయంగా గొప్పకవి అని బాణుని అభిప్రాయము.

కావ్యాలంకార సంగ్రహ వ్యాఖ్యానంలో శ్రీ సన్నిధానంవారు వామనుని ఉదారతను సోదాహరణంగా వివరిస్తూ దీనిని మన ఆలంకారికులు కావ్యగుణంగా గుర్తిస్తే, ఆంగ్లేయులు అలంకారంగా పరిగణించారని వివరించారు. శబ్దము అర్థానికి ప్రతిధ్వనిగావుండే అలంకారచనను పాశ్చాత్యులు **Onomotopocia** అని వ్యవహరించారు. భాషలోని ధ్వనులవల్ల అర్థాన్ని స్ఫురింపజేయడంసాధ్యమని మాత్రమే కాక అది శబ్దార్థాలమధ్య సమగ్రమైన పొందికను సాధించే విధానమని కూడా పాశ్చాత్య విమర్శకులు భావించారు. వస్తువు ధ్వనికి సంబంధించినదైనపుడు ఈ విధానంవల్ల సులభంగా పూర్తి ఫలితాన్ని సాధించవచ్చును. ఆ పిమ్మట పరంపరగా కూర్చే శబ్దాల సామరస్యాన్నిబట్టి కూడా అర్థస్ఫురణ కల్గించవచ్చును. సౌమ్యత కఠినత

మొదలైన వివిధ గుణాలను ఈ విధానంలో స్ఫురింపజేయవచ్చును. పదసంయోజనమువలన చలనాన్ని సూచించవచ్చును. శబ్దధ్వనులు, వాని కదలికలమధ్య చేకూరిన ఐక్యతవలన కొన్ని నిర్దిష్టములైన అనుభూతులను అందించవచ్చును. ఈ విధానాలన్నింటిని పాశ్చాత్య విమర్శకులు హోమరు, పోపు, మిల్టను, గోల్డుస్మిత్తు, వర్డ్సువర్తు, షెల్లీ, బైరను, కీట్సు - మొదలైన కవిశేఖరుల ఉదాహరణలతో వివరించారు. అందుచేత వికటపద్ధతి ప్రాచ్యపాశ్చాత్య ప్రియంభావుకల మన్ననలు పొందిన పద్ధతి అని నిస్సందేహంగా అంగీకరించవచ్చును.

ప్రాచీనాంధ్రకవులు వికటపద్ధతిని కొద్దో గొప్పో అనుసరించిన వారే. అయితే తెలుగునాట 'వికటకవి'గా పేరుపొందిన పాండురంగ విభుని పదగుంఫనలోమాత్రం ఈ వికటపద్ధతి కనరాకపోవడం కొంత ఆశ్చర్యకరమైన విషయం. మిగిలిన వారికన్న ఈ విషయంలో పెద్దన పెద్దగా కన్పిస్తాడు. అతని శీతశైలవర్ణన ఉదారతా గుణానికి అనేకులచే ఉదాహరింపబడింది.

అటఁజనికాంచె భూమిసురుఁ డంబరచుంబి శిరస్సరజ్ఝరీ
పటల ముహుర్ముహుర్లుఠదభంగ తరంగ మృదంగ నిస్వన
స్ఫుట నటనానురూప పరిఫుల్ల కలాపి కలాప జాలమున్
గటక చరత్కరేణు కరకంపిత సాలము శీతశైలమున్

మను. 2. ఆ. 3. ప.

ఈ పద్యంలో 'అంబరచుంబి' అనేచోట ముద్దుపెట్టుకొనే రీతికి తగినట్టుగా బిందువు ముందుగాగల బకారాన్ని ప్రయోగించడం జరిగింది. 'అభంగ తరంగ మృదంగ' అనే స్థలంలో మద్దెల చప్పుళ్లను అనుకరించే విధంగా బిందువు ముందుగాగల గకారం కూర్పబడింది. 'పరిఫుల్ల కలాపి కలాపజాలమున్—' అనేచోట ద్విత్వలకారం, దీర్ఘలకారాలు నెమలి విస్తృతంగా పురివిప్పే ధోరణిని తెలియజేస్తున్నాయి. 'స్ఫుటనటనానురూప' అనేచోట 'ట'కారం అవ్యవహితంగా కూర్పబడడంచేత నాట్యరీతి స్ఫురిస్తూంది. ఈ విధంగా శబ్దధ్వనులు అర్థస్ఫురణ కలిగించి ఈ పద్యానికి వికటలక్షణాన్ని సాధించిపెట్టాయని వేదాలవారు, సన్నిధానంవారు చెప్పారు కాని వెంపరాలవారు మాత్రం ఈ పద్యాన్ని వ్యాఖ్యానిస్తూ ఇందులో ఓజోగుణముందని మాత్రం చెప్పారు.

పుల్ల లవలీ నవైలా
వల్లి మతల్లికలితోడ వాసంతిక లు
ద్యల్లీల నల్లిబిల్లిగ
నల్లికొనిన యొక లతాగృహాంతర సీమన్

మను : 3. 113.

ఈ పద్యంలో వెన్నెల తీగల, ఏలకి తీగల మృదుత్వాన్ని లకారావృత్తితో కూడిన మృదుశబ్దములద్వారా సూచించాడు కవి. 'ఉద్యల్లీల నల్లిబిల్లి నల్లుకొనిన' అనే స్థలంలోగల లకార ద్విత్వప్రయోగం అల్లికలోని చిక్కదనాన్ని సూచిస్తుంది.

కరకా చిటపట రవ భీ
కరమై పెళ పెళ నినాద ఘనమై ఝంఝా
మరుదుజ్ఝిత బిలమంధ
స్వరమై యక్కొండ నొక్క వర్షము గురిసెన్.

మను : 4.11.

ఈ పద్యంలో 'కరకాచిట పటరవ' అనే ప్రయోగంలోని రేఫ, టకారాల ఆవృత్తిచేత వడగండ్లయొక్క కాఠిన్యం, ఆధిక్యం సూచితమయింది. 'పెళ పెళ' అనే ధ్వన్యనుకరణం అర్థాన్ని మూర్తీభవింపజేస్తుంది. 'ఝంఝామరుదుజ్ఝిత' ఝకారావృత్తి గాలితీవ్రతను, ఘోషను వ్యంజితం చేస్తూంది. మొత్తం పద్యం చదవడం పూర్తయేసరికి వడగళ్ళు, ఉరుములు, గాలులతో కూడిన వర్షదృశ్యం లీలగా గోచరిస్తుంది. ఇలా పూర్తిగా పద్యమంతటా ఉదారతా గుణాన్ని సంఘటింపజేసిన స్థలాలేగాక స్థలానుగుణంగా అనేక పద్యాలలో పెద్దన వికట లక్షణాన్ని ప్రదర్శించాడు. 'నిబ్బరపుబ్బగు గబ్బిగుబ్బలు' ఘుమంఘుమ ఘుంఘుమార్భటి, 'మృదంగాతత తేహి తత్తహిత హోధిత ధంధణు ధాణు దిందిమి ప్రాతము' 'తవ తవ లేకరుగుదుము హుటాహుటి నడలన్','ఝళం ఝళత్కటక సూచితవేగ పదారవింద' 'జలజలఁ బ్రవహించు సెలల చప్పుళ్ళు', 'శిఖావలకుల కలకేకా కలకలములు' మొదలైన ఉదాహరణలు పెద్దన కవిత్వంలో ప్రచురంగా కన్పిస్తాయి. పై ప్రయోగాలన్నిటా శబ్దప్రయోగం పైగల వ్యామోహం కాక రసస్ఫూర్తిని కోరే అభినివేశమే స్పష్టంగా కన్పిస్తుంది.

పోతన శబ్దాలంకార ప్రియుడైనా సందర్భశుద్ధితో వికట గుణాన్ని సంఘటింప జేసాడు. గజేంద్రుని సంరక్షించే సంరంభంతో బయలుదేరిన శ్రీహరి అవస్థను రూపుకట్టించడంలో పోతన ప్రతిభ అసాధారణంగా కన్పిస్తుంది.

అడిగెద నని కడువడిఁ జను
నడిగిన దనుమగుడ నుడుగఁ డని నెడనుడుగున్
వెడ వెడ చిడిముడి తడబడ
నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్.

భాగ. అష్టమ. 103.

ఈ పద్యంలోని డకారావృత్తి కేవల వ్యామోహంతో కూడినది కాదు శ్రీహరి హృదయంలోని సంఘర్షణతోపాటు, తత్తరపాటుతో కూడిన అతని త్వరిత గమనాన్ని కూడా కవి ఇక్కడ స్పష్టత్వాయ మైన పదసంయోజనంతో భాసింపజేసాడు.

ప్రతి పద్య చమత్కృతి తన ప్రత్యేక లక్షణంగా చెప్పుకున్న చేమకూర వెంకటకవి కూడా వికటలక్షణాన్ని విస్మరించలేదు. అర్జునుడు సుభద్రను తీసుకొనిపోతున్నాడని విని యుద్ధ సన్నద్ధుడైన హలాయుధుని సంరంభాన్ని కవి ఇలా ప్రదర్శిస్తాడు :

హుటాహుటిన్ హలాయుధుండహో మహోగ్రుడై తనం
తటన్ దటాన నిప్పుడీ విధం బెఱింగి వచ్చెనో ?
ఘటాఘటీలనెల్లఁ ద్రోవఁ గట్టిపెట్టఁబంచెనో ?
యటో యిటో యెటో భటోద్భటార్భటుల్ ఘటిల్లెడున్.

విజయ విలాసం. ఆ. 3. 142:

ఇక్కడ 'హుటాహుటిన్' హలాయుధుని త్వరితగమనం, 'అహో మహోగ్ర' అనేచోట 'హో'లోని దీర్ఘంవల్ల కోపంయొక్క ఆధిక్యత. 'ఘటాఘటీల' అనే చోటగల వర్ణ యుక్, టకారాలవల్ల వీరుల దిట్టరితనము, 'అటో యిటో యెటో' అనేచోటగల విరుపుల వల్లయుద్ధ పయత్నంలోని తీవ్రత స్ఫురిస్తాయి. ఇలా మన పూర్వ కవు లనేకమంది తమ కావ్యాలు ఉదారతా గుణసమన్వితా లయే టట్లు చేసారు.

ఆధునికులలో కూడా రసనిష్యంలో శబ్దార్థాల సమ ప్రాధాన్యాన్ని గుర్తించిన వారున్నారు. నిజానికి అభ్యుదయ కవి శ్రీ శ్రీ శబ్దశిల్పంలోని రహస్యం వికట లక్షణమే. 'పదాలు గణిభే పు గర్ర గుళ్ళు' అన్న నారాయణబాబు మాట శ్రీశ్రీ రచనకు కూడా వర్తిస్తుంది.

'హరోం హర! హరోం హర!
హర హర! హర! హర!

హరోం హర! అని కదలండి - ఇక్కడ పదాల తీ నేచలనం ద్వారా తాను కోరిన త్వరిత గమనాన్ని కవి సాధించాడు రేఫ అవృత్తి ఓం అనే దీర్ఘము కదలిరావడంలోని వేగాన్ని స్పష్టంగా ఆవిష్కరిస్తున్నాయి.

'ఇదీ! నీ గళ గళన్మంగళ
కళాకాహళ హళాహళిలో
కలసిపోతిని! కరగిపోతిని!
కానరాకే కదలిపోతిని'- ఇక్కడ 'గళగళన్మంగళ'

అనేచోట 'గళత్' అంటూ జారిపోతూన్న ధ్వని కవి గొంతుకలోనుండి జారిపోయే అర్థాన్ని సమర్థవంతంగా స్ఫురింపజేస్తూంది. 'కళాకాహళ హళాహళి' అనేచోట 'ళ'కార ఆవృత్తి తూర్యనాదంలోని మంజులార్భటిని వెల్లడి చేస్తూంది.

'అవి ధరాగర్భమున
మానవాస్థికా పరంపరలు
సుప్తనిశ్శబ్ద సంపుటములు'—

మొదటి రెండు చరణాలలోని 'ధరాగర్భమున' అనేచోటగల దీర్ఘంవల్ల మిక్కిలి లోతైన ధరాగర్భం. 'మానవాస్థికాపరంపరలు' అనేచోటగల దీర్ఘం అస్థికల ఆధిక్యాన్ని ధ్వనితం చేస్తుండగా. 'సుప్తనిశ్శబ్ద సంపుటములు' అనే పాదంలోని హ్రస్వపరంపర ఆ దీనమానవుల సంకుచిత స్థితినీ, చైతన్య రాహిత్యాన్ని వెల్లడించేదిగా కన్పిస్తుంది. శబ్దాన్ని ఈ విధంగా సాధికారంగా వాడుకచేసే ఆధునికులలో శ్రీ శ్రీ సిద్ధహస్తుడు. 'యుద్ధగుంజన్మృదంగాలు', 'రుద్రాలిక నయనజ్వాలిక', తలవగిలెడి తూపుల గతుకులు', 'ఫేరవ భైరవ భీకరఘోషలు' 'చిటికెల మెటికెల చిటపటలు' 'నానాగానానూన స్వానావళితం' మొదలైన ప్రయోగాలు శ్రీశ్రీ శబ్దాధికారాన్ని ప్రదర్శిస్తాయి. అనేక విషయాలలో శ్రీశ్రీ నాయకత్వాన్ని అనుసరించిన ఆధునిక కవివర్గం ఆతని కవిత్వంలోని వికటలక్షణాన్ని కూడా ఆమోదించిందని భావించడంలో తప్పులేదు.

ఈ పరిశీలన వలన కవిత్వంలో వికటగుణాన్ని ప్రాచీన కవులు, పాశ్చాత్యకవులు మాత్రమేగాక ఆధునిక కవులుకూడా అవసరమైన రీతిలో పోషించడం జరిగిందని నిరూపితమైనది. కాని జనవ్యవహారంలో 'వికటకవిత్వం' అనేమాట అర్థవిపరిణామాన్ని పొందింది. 'వికటము' అనే మాటకు వ్యక్రము, విగుడు దిగుళ్లతో కూడినది మొదలైన అర్థాలు నిఘంటువులలో కనబడుతున్నాయి. 'వికటించింది' అంటే 'చెడిపోయింది, విరోధమేర్పడింది' అని వ్యవహారార్థం రూఢంగా వుంది. వీటి ప్రభావంవల్ల వికటకవిత్వానికి ప్రస్తుతం వ్యవహారంలో వున్న అర్థం ఏర్పడి వుండవచ్చును. అలా కాకపోయినప్పటికీ—కేవలం పదాడంబరానికి దాసులై రసస్ఫూర్తికి భంగం కలిగించిన కవిపరంపరా వ్యవహారంవలన వికటపద్ధతి పసచెడి అగౌరవ భాజనమైన కారణంగా ఆ దృష్టిమాత్రమే విమర్శకులలో, ప్రజలలో స్థిరపడి వుండ వచ్చును. కాని సాహితీ సంప్రదాయాలను గూర్చి వివరించేవారు దాని మూలతత్వాన్ని విస్మరించకుండా ప్రతిభావంతులచూర్ఘంలో ఆ గుణం రాణించిన తీరును ఆవిష్కరించడం ఉచితంగా కన్పిస్తుంది.

త్రికోణం

'విరిమల్లె'

రాక్షసుడు నమిలి ఉమ్మేసిన
    శవాల పిప్పిలా
ఆకాశంలో మేఘాలు
ముద్ద ముద్దగా పడిఉన్నాయి
ప్రకృతి అంతా పచ్చ పచ్చగా
అడవి గాచిన వెన్నెల్లా ఉంది
చుట్టూ నిశ్శబ్దంతో కూడుకున్న శబ్దం
అది ప్రకృతి ఏడుపేమో !
ఎక్కడో దూరంగా పేరు తెలియని పిట్ట కూస్తుంది

తన కూత తనకే అర్థంకాక !
చూచే కన్ను అనుభవించే మనసు
అర్థంకాకున్నా చూస్తున్నాయి ముందుకు
ముందుకు చూస్తున్న చూపులో
ఆలోచన వెనక్కు పరిగెడుతూంది
కొన్ని ముందుకు
మరికొన్ని వెనక్కు
దేన్నో కదిలిస్తున్నాయి
కదలిక వాటి జీవం
వీటికి మొదలు, తుది లేదు
అయినా
తొలి కేకతో మొదలయ్యి
తుది కను రెప్పతో ఆగిపోయిందనుకుంటాం
ఇలా ఎన్నివేలసార్లనుకున్నామో తెలీదు !

అదే చిక్కు !
అదే ట్రిక్కు !

* * *

ఇంద్రధనుస్సులోని రంగులు ఏడు కనపడవు

ఇంద్రజాలంలోని క్షుద్ర శక్తుల ఆగడం భువిలో
అవక తవకల 'జస్టిస్' లా
వివశెత్తమవ్వాడు అవతారాలు పది !
నీతికి నాల్గు కాళ్ళున్నా
నోర్లుమాత్రం జనాభా అంత
జనాభా నోరుమూసుకోదు
నీతి భూమ్మీద కాల్ నిలుపదు
అయినా దాన్నందుకోవాలి !

ఆదిలో సోమకుడు వేదాల్ని ఎత్తుకుపోయినట్లు
దాన్నందుకొని విక్కడో పాతి పెట్టాలి !
అప్పుడయినా 'సుగమం' అవుతుందేమో బ్రతుకుల బాట
అంతవరకూ ఇదో అతుకుల బావుటా
ఇదో కోణం ...

* * *

చంద్రుడికో నూలుపోగులా
ఒక్కోడి కో అంతర్యం
నూలుపోగు కనపడి చావదు
అంతర్యం అర్థమై విడవదు
హృదయాల్ని కొలిచే
ధర్మామీటర్ కావాలి !
కుడితిలో ఈగల్లాగ
తుమ్మకులాట చచ్చేదాక
కుడితి డబ్బయితే
ఈగ మనిషి !
విప్పుడు తాగేస్తోంది ఈగ మనిషి
ఆ డబ్బు కుడితిని
స్వపి గాలంలో
ఇదో ఎర
ఇదో కోణం...

* *

తొమ్మిది వాకిళ్ళమధ్యగా చిరుదీపం !
అన్నింటినుంచి హోరు
అన్నింటినుంచి పోరు
ఒక్కసారే ఆరుతుంది దీపం
ఆర్పేదాకా ఆపవు ఈ వాకిళ్ళు పోరాటం !

ఇందులో చీకటి వెలుతురు
గాలి ధూళి
చీమూ రక్తం
కామం క్రోధం
జ్ఞానం అజ్ఞానం
ఇంకేవేవో కొంత కొంత
ఇవన్నీ వెలుగుతున్న దీపానికి
అగుపించే రూపాలు
దీపానికి తెలుప
వాటి జీవిత కాలం
'తమ వెలిగేదాకా' అని
అందుకె చప్పున ఆరిపోదు !
ఇదో కోణం ...

* *

ఈ త్రికోణాల్ని కలిపితే
నేను
నీవు
మనం
మనందరి
'జీవితం'

ఆంధ్రపురాణము

శ్రీ యామిజాల పద్మనాభస్వామి

'ఏకస్స్వాదు న భుంజీత' - రుచ్యమైన పదార్థాన్ని ఒక్కడే భుజించరాదు నలుగురికీ కాస్త రుచి చూపినట్లు అయినా యిచ్చి తక్కినదంతా తాను ఆరగించవచ్చు. పెద్దలు ఈలాటి మంచిమాటలెన్నో చెప్పారు. కాని అవి అందరికీ ప్రస్తుతం అందుబాటులో లేకుండాపోతున్నాయి. కారణం? సంస్కృత భాషలో ఉండడం. సంస్కృతానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చాలా ప్రోత్సాహం ఇస్తున్నాయనే వినికిడి. వార్తాపత్రికలలో కూడా వస్తున్నాయి. అక్కడ అంత యిచ్చారు, ఇక్కడ యింత వెచ్చించారు అని. కాని ఆ ప్రోత్సాహం అందరికీ లభ్యం కాకుండా ఉందని నా ఉద్దేశం. సరే. అది అలా ఉండుగాక! ప్రస్తుత విషయం...

ఎప్పుడూ మనుచరిత్ర, వసుచరిత్ర—యిలా ఎంతకని? ఆధునిక కవుల కావ్యాలు చదవవద్దా? అని వ్రాశాను ఒకటి...అక్కడక్కడ కొన్ని పద్యాలు చదివాను. ఓహో! ఇది అవశ్యం పఠనీయం అని తొలి పద్యంనుంచి చివరంటా దీక్షగా చదివాను. ఈలాటి కావ్యాలకు విరివిగా ఎందుకు ప్రచారం రాదా? అని అనుకున్నాను. దీనిపై చిన్న పరిచయంలాగు నాలుగు మాటలు వ్రాద్దామని సంకల్పించాను. కాని సంకల్పం అలాగే ఉండిపోయింది. కొన్నేళ్లయిన తరువాత మొన్న మొన్నపుస్తకాలు సర్దుతూ మధ్యనున్న యీ కావ్యం తీసి 'శుభస్య శీఘ్ర'మ్మని యీ చిన్నవ్యాసం ఆరంభించాను. పేరు పైన ఉంది. సరాసరి పుస్తకంపేరే వ్యాస శీర్షికగా ఉంచడములో పాఠకమహాశయులు అర్థం గ్రహిస్తారని ఊహిస్తాను.

'నపుంసకమితిజ్ఞాత్వా ప్రియాయై ప్రేషితం మనః
తత్తు తత్రైవ రమతే హతాః పాణినినావయమ్'—అని పండితోక్తి. దీనిని కొంచెం వివరిస్తాను. సంస్కృతములో ఉంది. చాలా మందికి తెలియకపోవచ్చు. కాని మహా గమ్మత్తైన శ్లోకం యిది:—

ఒక ప్రియుడు ప్రియురాలి దగ్గరకు మనస్సును ప్రణయ దూతకార్యంకోసం పంపాడు. ప్రియురాలి దగ్గరకు పంపడంలో మనస్సునే ఎందుకు పంపాడయ్యా అంటే అది 'నపుంసకం' అని. పురుషుణ్ణి ప్రణయ దూతగ పంపితే ఏదేనా చిక్కురావచ్చు. కనుకనే స్త్రీలకు దూతికాత్వేన పంపినట్లున్న విషయాలు కావ్యాలలో (దృశ్య, శ్రవ్యములలో) చూస్తూ ఉంటాము. తీరా ఏమయిందంటే ఆ మనస్సు వెళ్లి ఆ ప్రియురాలితో ఉండిపోయిందట! అయితే ఏమయ్యా? అంటారా? ఏమవడమేమిటి? మోసం...పచ్చిమోసం! ఇది పాణిని చేసినమోసం. ఆ మోసములోపడి దెబ్బతిన్నాము. ఏమిటా మోసం? మనస్సు (మనశ్శబ్దం) నపుంసకం (సకారాంత నపుంసకం) అని పాణిని శాసించాడు. దానిని నమ్మినందుకు ఇంత చిక్కువచ్చింది—అని పై శ్లోకానికి వివరణ-ఇంతకంటె వివరించి చెప్పనక్కరలేదని అనుకుంటాను.

నేను మొన్న చదివిన 'ఆంధ్రపురాణము' అనే ఉద్గ్రంథం విషయములో నా మనస్సు పై శ్లోక తాత్పర్యానికి సరిగ సమన్వితమయింది.

'మానవుని జీవితమ్ము మేలైన కబ్బ
మందు సత్కవి యే టిన బిందువొకటి
యొక మహాకావ్యమౌ నది సుకవిజాలు;
కావ్యతాసిద్ధి కొక్క శ్లోకమ్మె చాలు-'

అనే పద్యం ఒక్కటే చాలు 'ఆంధ్రపురాణము' హృదయోత్కర్షత నావిష్కరించడమునకు-అని నేనేకాదు, దీనిని చదివిన సరస హృదయులందరూ అనుకుంటారు.

ఈ మహాకావ్యం మనకు సంబంధించిన మహనీయ కావ్యం.

ఇక కావ్యకర్తపేరు కూడా చెప్పి స్థాలీపులా కన్యాయంగా యీ గ్రంథ ప్రాశస్త్యాన్ని ప్రకటిస్తాను. 'ఆంధ్రపురాణము' అనే యీ సత్కృతికి శ్రీ మధునా పంతుల సత్యనారాయణశాస్త్రి జనకుడు. నిజంగా ఆయన జనకుడు. యీ కృతి సీతాదేవివంటిదే. మన జాతిపుట్టుపూర్వోత్తరాలు ఆణిముత్యాలదండలాగ దీనిలో కూర్చిచేర్చి భువనమోహనమూర్తిగా తీర్చిన ధన్యజీవి శ్రీ సత్యనారాయణశాస్త్రి.

తెలుగు పలుకుబడిపై మించి పలుకుబడిగల కవి. 'చరిత్ర' అని అనక 'పురాణము' అని చెప్పడంవల్ల కావ్యానికి గౌరవం ఇనుమడించింది. 'పర్వములు'గా ఉన్నాయి లోపలి భాగాలు. మన జాతిపుట్టిన నాటి దక్షిణాన నాయకరాజుల పాలనవరకు ఉన్న చారిత్రిక విషయం యీ పురాణానికి కథావస్తువు.

'నానృషిః కురుతే కావ్య'మ్మనేది యీలాటి కావ్యాలు చదివగానే 'ఔను'- అనిపించుతుంది. కాలప్రభావమును బట్టిగాని, సామాజిక జీవితమును బట్టిగాని కవులు తమ రచనలను సాగించాలి అనేది కూడా సత్యమే అవి యీలాటి కావ్యాలు ప్రాదుర్భవించినపుడు చప్పన

ఒప్పుకోవలసి వస్తుంది.

గద్యమైనా పద్యమైనా సమర్థుని చేతిలో సర్వజనామోదకర ముగా రూపొందుతుంది. అయితే ఆ సామర్థ్యం అనేది ఎలాటిది? అని ప్రశ్నిస్తే చాలా విషయం చెప్పవలసివస్తుంది. ముఖ్యంగా కవికి ఉండవలసే శక్తులు మూడు. సలక్షణమైన భాష; ఔచిత్య పోషణ, సజీవ పాత్రసృష్టి...ఇవి లేనపుడు రచన చెయ్యకపోవడమే మేలు. 'నా యిష్టం నేను వ్రాస్తాను—అని వ్రాస్తే ఎవరు కాదంటారు?...

మన జాతి ప్రాచీనతను తెలుపుతూ ఆరంభించి వ్రాసినకావ్యం కనుక ఇది 'పురాణము' అని అనడానికి ఆక్షేపణలేదు. అలాగే పర్వము లని కథావస్తువును విభజించి ఆ భాగాలకు పేరు పెట్టడం మరీ సము చితంగా ఉంది. సలక్షణంగా చదువుకున్న వ్యక్తి కనుక మొదటినుంచి చివరివరకూ సమగౌరవంగా రచన చెయ్యడములో సమర్థుడుగా కృతా ర్థుడైనట్లు పాఠకులందరూ ఏకోక్తిగా ప్రశంసిస్తారని నా విశ్వాసం. విషయస్థాయి ననుసరించి శబ్దం ప్రయోగించడం కవికి ప్రధాన గుణ ముగా భావిస్తే యీ గ్రంథములో ఆ గుణం సామాగ్రి సంచారతతో పరిఢవిల్లిం దనడానికి సంకోచించనక్కరలేదు. సహజమైన శైలీసుకు మారత యీ పురాణ గ్రంథానికి కట్టిన జరీ పట్టుచీర...నిర్దుష్టమైన సాహిత్య సౌహిత్యం దానికి రక్షాకవచం......

'భారతంచేక్కు ఖండంచ
సముద్రమపి వర్ణయ—భారతమును, చెఱకుగడను, సము ద్రమునూ వర్ణించమన్నాడట! ఒకరాజు.

'పాదేనైకేన వక్ష్యామి
ప్రతి పర్వరసోదయమ్ — ఒక్క పాదముతోనే వర్ణిస్తాను అని' ప్రతిపర్వమునందు రసావిర్భావము ఉంటుంది-అని సామూహికంగా శ్లేషచమత్కారముతో మూడింటినీ వర్ణించాడట! ఆ కవి.

ప్రతిపర్వమూ రుచ్యములై నీతిబోధక కథావాచ్యములై వేదసమ్మిత వచోగుంఫనములు కలిగి రసావిర్భూతి కలిగి ఉంటుంది భారతం.

కనుపు, కనుపునా రసం కలిగి ఉంటుంది చెఱకుగడ.

ప్రతి పర్వకాలములో ఉప్పొంగు నీటితో ఉప్పరానికి తాకు తుంది సముద్రం—పర్వ శబ్ద శ్లేషశక్తి ఆధారంగా ఇంత రసోదయ సౌభాగ్యముతో మూడువస్తువులనూ చెప్పాడన్నమాట! అలాగే శ్రీ సత్యనారాయణశాస్త్రిగారు యీ 'ఆంధ్రపురాణమును' ప్రతి పర్వ రసోదయము'గా సంతరించడంలో కృతార్థులైనట్లు స్వారస్యం తెలిసే సహృదయతాశక్తి ఉన్న చదువరి చప్పన గ్రహిస్తాడు. సానం దంగామై పులకరిస్తుంది.

అక్కడక్కడ నేను ఆస్వాదించిన రసోదయమాధురిని పాఠక హృదయ పుటాలకు నివేదిస్తాను.

మొట్ట మొదటిది ఉదయపర్వం హరిశ్చంద్రుడు అన త్యుడై విచారిస్తూ ఉంటాడు. వరుణుణ్ణిగూర్చి తపస్సు చేయగా ఆయన కనికరించి యజ్ఞపశువుగా కొడుకునిస్తానని నువ్వు వాగ్దానం చేస్తే నీకు కొడుకు పుట్టేట్లు వరమిస్తానన్నాడు. అనపత్యుడని మరణించినకంటె ఇది మంచిదే కొంతలో కొంత మేలు-అని అనుకొని హరిశ్చంద్రుడంగీకరిస్తాడు.

కొడుకు పుట్టాడు. ఒకనాడు వరుణుడు కోపించి నీ కొడు కును యజ్ఞములో పశువుగా సమర్పిస్తానన్నావు. కడుపు తమకముతో ఆ మాట మరచిపోయావా? అని అన్నాడు. అప్పుడు హరిశ్చంద్రుడు

'వరుణా! నువ్వు ఏఱుకకు మారుపేరు. నీకు గఱప
మేమెంత వారము-అని,
పురుటియంటు తొలగినంగాక యధ్వరబలికి తగునె
మూత విడువని కనుల లేలేత పశువు!—

అని అన్నాడు 'మూత విడువని' — అనే పాదంలో పదాల స్వారస్యం, లాలిత్యం—అర్థగాంభీర్యం మానవుల మాటకేమి వరుణుని మనస్సుకే మార్పు తెచ్చింది.

'అని యా భూపతి సర్వినన్ మనసు నీరై మారుమాటాడ
నేరనివాడై వరుణుడు-వెళ్ళిపోయాడు.

యీ పద్యమంతా ఒకయెత్తు. 'మనసునీరై' — అనేది ఒక్కటే ఒక యెత్తు.

హరిశ్చంద్రుని దైన్యోక్తికి వరుణుని మనస్సు మెత్తపడింది. జాలికలిగింది. అని భావం. అది అలాటి మాటలతో చెప్తే మరి కవిత్వమేమిటి? మనసు నీరైంది-అనడంలో కవి ప్రత్యక్షమౌతాడు. ఇది తెలుగు జాతీయం. ఆయన ప్రాక్తన సంస్కార సంజాతమైన కవితా పద్ధతిలో దానిని ఛందోబద్ధంచేసి మనస్సుగల చదువరి మనస్సు ఆనందంతో, అర్థగ్రహణశక్తితో 'నీరు' అయేట్లు ప్రయోగించాడు. శబ్దశక్తి అంటేయిది. దీనివల్లవచ్చే అర్థం వ్యంగ్యం అనండి, ఏమైనా అనండి. అదీ సిసలయిన కవిత అని నా అభిప్రాయం. యీలాటి శక్తిలేని కవిత కవిత అనడంకంటె ఎక్కాల బేరీజుగా జమకట్టవచ్చు, 'ఒక ఒక్క టొక్కటి ఒక రెండు రెండుగా

ఒక మూడు మూడౌచు నొప్పచుండు'. గణాలు, సరిపోయాయి. నడక ఒడుదుడుకులులేక సాఫీగాఉంది. సీసపద్యం అవుతుంది. అయితే యిదీ కవిత్వమేనా? ఏల కాకూడదూ?... శాంతం పాపమ్! ఇలాగూ వ్రాసే కవులు కోకొల్లలు!

వరుణుడు జలాధి దేవత — కనుక అతని మనసు నీరయింది. విశేషార్థమంతా మీరు చెప్పకోండి ... ...

విశ్వామిత్రునకు నూర్గురు కొడుకులు. వారిలో 'ఆంధ్రుడు' అనే పేరుగలవాడొకడు. అతడేలిన నేల ఆంధ్ర జగతి అందరి వారాంధ్రులు—అలాగే యయాతి వంశీయుడైన బలి కొడుకులలో ఒక డాంధ్రుడనేవాడు. అతడు పాలించడంవల్ల ఆ దేశానికి 'ఆంధ్ర రాష్ట్రం' అనే పేరు వచ్చింది. ఐతరేయ బ్రాహ్మణం, భాగవతం

వంటి పురాణోక్తులవల్ల ఆంధ్రజాతి పురాణ జాతిగా గణనీయమైనదని యీ 'ఉదయ పర్వం' చెప్తుంది.

'బన్నములెన్ని పైబడుచు నచ్చిన |
నొచ్చిన నాత్మ గౌరవ
సన్నుత సైపలేని గుణశాలి -
యుదాత్తము క్షత్రధర్మమా
సన్నుత నొంద నోరువని

పౌరుష వంతుడు శాంతుడు 'ఆంధ్రుడు' - అని విశ్వామిత్రుని కొడుకులలో ఒకనిని వర్ణించడం తఱచిచూస్తే ఆ గుణాలన్నీ యీ నాటికీ ఆంధ్రులలో అచ్చు కొట్టినట్టు కనిపిస్తాయి. ఆంధ్రత్వం శ్రీ సత్య నారాయణశాస్త్రి వర్ణించిన యీ పద్యములో ప్రత్యక్షర మునా ప్రత్యక్షమౌతూ ఉంటుంది. యీ 'పురాణానికి' యీ పద్యం బీజాక్షర సంకలితమైన మూలమంత్రం అని నేననుకుంటాను.

ఇక మన జాతికి ముప్పొద్దులా వంద్యుడైన మహానుభావుణ్ణి దర్శించి ఆనందించుదమా ?

'తొలు కారు మెఱవు నందులు చీల్చి వచ్చు నా,
కనుచూపు భావశీఘ్రతకు దాపు,
హరి సుదర్శనము రమ్యత నాకళించు నా
మోము గభీరతా ముద్ర గీము,
గంధాక్షతలకు చక్కని వాసినిచ్చు నా
నుదురు మేధా సుసంపదకు కుదురు,
తిలతండుల శ్రీని తలపించి మొలచు నా
బవిరిగడ్డము వయఃపటుత కెడము

అవిరళ ధ్యాన జప మహితాగ్ని హోత
సంభవంబైన బ్రహ్మ వర్చసము లోకకు
నా కుల బ్రాహ్మణాంశ నన్నయ్య విబుధు
డాంధ్రభారత కృతికి కన్నయ్య యతడు'—

'చాళుక్య పర్వము' లో నన్నయ్య దర్శనం యీలాటిది. 'కుల బ్రాహ్మణుడు' అంటే నోములూ వ్రతాలూ చేయించడం, తిలదానాలు పట్టడం, - వగైరా...గృహస్థుల యిళ్లలో 'పౌరోహిత్యం' నెరపే బాపడుకాడు ఇక్కడ నన్నయ్య . చాళుక్య రాజ కులంయొక్క అభ్యుదయం పెంపొందించిన 'బ్రహ్మణ్యుడు'. అతడంతవాడు కాకపోతే

'నన్నిపండితుల యానతి తీసికొని కాని చాళుక్య మన్మ
థుడు మాటాడడు'అని బరిగీసినట్టు చెప్పడం సాధ్యమేనా?

'తన కుల బ్రాహ్మణుడు, గురువు, అనుగమంత్రి,
కావలయువాడు, నెచ్చెలి, దైవము, అఖిలము
ఆ మహాత్ముడెయన నన్నపార్య నరసి
మఱచు నెల జగమున్మహీపరివృఢుండు' —

చూశారా రాజనరేంద్రునకు నన్నపార్యుడెలాటివాడో ? ... ...

అన్ని శుభలక్షణాలు ఉన్నాయి కనుకనే ఆయన నంతగా రాజమహేంద్రుడు ఆదరించాడు అంతేకాదు, అంతఃపురగాథలుకూడా నెచ్చెలి చెవిలో ఊదేవాడు—మతి బృహస్పతి నన్నిపండితుడు. ఈ విశేషణం భావ తావ తారికలోఉన్న పద్యం తనకుల బ్రాహ్మణు — అనే ఆరంభం కలది చెప్తుంది. మత్యమరాధిపాచార్యుడు — నిత్యసత్య వచనుడున్ను —

భారతం తెనుగులో చెప్పవలసిందని రాజరాజు నన్నయగారితో అంటాడీపద్యం చూడండి —

'మతమే మానవ జీవితమ్ము చివురింపంగా
వసంతంబు, భా
రతియే తన్మత సంస్థకున్ పరిగల్ ప్రాణంబు
వ్యాసోక్త భా
రతమ్ము భారతికిన్ మతంబునకు తీర్థ ప్రాయము
అట్లైట, ఆ
కృతి నాంధ్రీకృతిఁజేసి దేశహితమర్థిన్
గూర్పుమో సత్కవీ.'

'నీ గండంబున తెల్లవారి మనసుల్
నిండించు పాండిత్యమున్
ప్రాగల్భ్యమ్ము, కవిత్వ శక్తియును, ధారారక్తి
ప్రత్యక్షర
శ్రీ గంభీరిమ రమ్యతారుచు వెలర్చెన్, మత్పూరీ
పుణ్య సం
/ యోగం బియ్యది యో మహాకవి! మదాయూరశ్మి
మేల్కొల్పవే'—అనే యీ పద్యములో నన్నయకుగల కవితాగుణాలు అందునా—భారతామ్నాయం తెలుగులో చెప్పడమునకు తగిన లక్షణాలు సమృద్ధిగా ఉన్నాయని నిర్వివాదంగా అందరూ ఒప్పుకుంటారు.

ఈ ఘట్టం అంతా 'భారద్వాజఘట్టం' అని రామాయణంలో ఒకఘట్టం పేరొందినట్టు ఈ 'ఆంధ్రపురాణము'లో సర్వసుకవి పండితవంద్యమైన సుధామాధురీ మహిమమైన 'భారతఘట్టం' అనే చెప్పవచ్చు. శ్రీ మధునాపంతుల మధుమధురకవితావట్టం ఇది నా దృష్టిలో. ప్రతిపద్యములో నన్నపార్యుడు దివ్యవాణీసుందర మూర్తియై దర్శనమిస్తాడు.

భారతం తెనుగు చేయడములో నన్నిభట్టారకుని తీరు, దీక్ష క్రమబద్ధ పద్ధతిని నడిచాయి.

'వ్రాసిన యక్షరాక్షరము
భారత సారకవిత్వమున్ సహో
ద్యాసుని కర్ణశంఖముల
యందున ముందరబోసి తీర్థముం
జేసికొనున్ పదంపడి ర
చించుటలో సహపాఠి యూహలం
దీపికొన్. సమస్తమును
తెల్పును 'తానె రుగున్విసీతుడై'—

యీ పట్టంతా ఒక 'రసపట్టు'. భారతం రాస్తూన్న నన్నయ్యా, ఆ మహానుభావుని సహపాఠి నారాయణభట్టూ ఎట్టయెదుటకనిపిస్తూ ఉంటారు. పై పద్యములో చూశారా 'శంఖములో పోసిన తీర్థం' నానుడి ఎంతచక్కగా (పద్యములో) చోటు చేసుకుందో! ఈలాటి చమత్కారాలూ, జాతీయాలూ ఈపురాణములో ధారావాహికంగా దర్శనమిస్తాయి. అందుకే కవి 'లోకశాస్త్ర కావ్యజ్ఞుడై' ఉండాలని లాక్షణికు లన్నారు.

నన్నయ భాస్కరు డస్తమింపగా రాజరాజు పొందిన నిర్వేదం చదివితే 'అపి గ్రావా రోదితి' శ్లోకం జ్ఞాపకంవచ్చింది. భారతకృతి కన్యను తనకు ఇవ్వడం వేంగి రాజ్యానికే మాంగళిక విధి–అయిందని రాజరాజనుకున్నాడు. ఎంత కృతజ్ఞత!

'నీ మేలు వేంగిరాజ్య
శ్రీ మజ్జలజాక్షి నొసట చెరుగని బొట్టై
భూమిగల యంతకాలం
బోముత! మాంగల్యవిధి మహోమధురంబై'......

ఇది యీ 'పురాణము'లో మహిత జీవితఘట్టం. దీనిపైనే వింత విషయమైనా వ్రాయవచ్చు......ఇక్కడికి దానిని ఆపి 'కాకతీయ పర్వము'లోనికి వెళ్ళుదమా?

రుద్రుని మగువరూపు రుద్రాంబ. ఆమె కూతురు ముమ్మడాంబ. ఆ ముద్దరాలి ముద్దుబిడ్డడు ప్రతాపరుద్రుడు. ఆ శిశువు ముమ్మడాంబ పెంపకములో పెరిగిన విధం ఒక్క సీసపద్యం—

'పసినోట వ్రేల్పెట్టి కనుగందు కేల్దోయి
    పొసగబట్టుచు నుగ్గు పోయువేళ,
పసుపు మెరుంగద్ది పన్నీటితో బోరు
    కాడించి వెస తడియార్చువేళ,
మిసిమిమై దళుకొత్త నసలారు పువ్వుమాళి
    యలది క్రొందావి చూపాడువేళ,
పసిడి తొట్టెయలోన పవళింపగాబెట్టి
    వేడుక జోలలు పాడువేళ

కనులకు సుధాంజనం బొడికముగనద్ది
పెదవి చప్పుడుచేసి లే నుదుటి నడుమ
బొట్టు ముట్టించువేళ నా ముమ్మడాంబ
కరగి కరడయి బిడ్డలో కలసిపోవు'—

పసిపాపకు నీళ్ళు పొయ్యడం వగైరా తెలిసినవారికి చెప్పనక్కర లేదు. తెలియని బాలెంతరాండ్రకు శాస్త్రిగారు యీ పద్యంద్వారా ఆ పాఠం చెప్తున్నారు. ఈ వర్ణన చదివితే శాస్త్రిగారి 'లోకజ్ఞత'కు సరస హృదయుల హృదయాలు కరగి కరళ్ళవుతాయి. అదుగో కాలేదంటే అవి పాషాణ హృదయాలన్నమాట...

'పెదవి చప్పుడు చేసి లే నుదుటి నడుమ
బొట్టు ముట్టించడం' ఎంత హృదయంగమమైన అనుభూతి. అయితే యీ కాలంలో కొందరు బాలెంతరాండ్రకు ఇది తెలియదనే చెప్పాలి. అసలు బొట్టు పెట్టడంఎక్కడో – సుమంగలులు ఎందరో బొట్టులేని వింత మొగాలవారు కనిపిస్తూన్న ముదర పాకపు నవనాగరక దౌర్భాగ్యకాలం మహిమ అని లోలోన విచారిస్తూ ఉంటాను...

ప్రతాపరుద్రుని పరిపాలనను ఒక్క పద్యములో తెలుసుకోవచ్చు.

'రావులు-రెడ్డులుం చను పొరల్
తొలగించి తెలుంగు వారలన్
పూవులనుంచి యే యొకని
పోడిమియున్ పసిదప్పి నేలలో
రావడి ముట్టకుండగ న
రప్పర సఖ్యము తీవ సాగ నాం
ధ్రావని నా నృపాలుడు
జయధ్వజమెత్తె శుభోత్తరంబుగన్'!

ఆణిముత్తెంవంటి ఆదర్శ పద్యమిది. వ్యాఖ్యానం అనవసరమని మానివేశాను.

ఈ కాకతీశ్వరుని పెంపు ఏలాటిదో చూశారా?
'భరతఖండంబు జల్లించి పట్టితేర్చి
పొల్లు తొలగింప మిగిలిన పోటరులను
వాటముగ పెంచు కాకతీశ్వరుని పెంపు
ఢిల్లి రాజుల ప్రక్కలో బల్లెమయ్యె'—

తెలుగునాట ఆ నోటా యీ నోటా ఏ నోటా వినవస్తే యీలాటి మాటలు మూటలు మూటలుగా ఉన్నాయి. వాటిని ఛందోభంగిమలో ఇమడ్చడం ఎంతో తేలిక అని అనిపించిన మధునా పంతుల వారి గ్రథన నైపుణి అభినందనీయం.

నిజంగా యీ 'కాకతీయపర్వం' మహాభారతములో భీష్మ పర్వమును పోలిఉంటుంది అన్నివిధాలా...

ఇక విద్యానగరపర్వం గూర్చి రెండుమాటలు. ఇది నిజంగా తెలుగు రాజ్యానికీ, తెలుగు వాఙ్మయ రాజ్యానికీ కొత్త సృష్టితో తుష్టినీ పుష్టినీ కలిగించిన విశిష్టశకం. ఆంధ్రభోజుని ప్రశస్తికిది నిలువుటద్దం. యీ పర్వాన్ని ప్రతిపద్య రసోదయముగా శాస్త్రిగారు సృష్టించి వాఙ్మయ విశ్వామిత్రులయ్యారని ఆనందించాను.

'విద్యానగర పర్వము'లోనే ముందుగా వస్తుంది శ్రీనాథుని కనకాభిషేకవృత్తాంతం'–డిండిముడూ, శ్రీనాథుడూ వాదించుకుంటారు. శ్రీనాథుడు పైచేయి కాగానే మధ్యవర్తిగా ఉన్న 'చంద్రభూష క్రియాశక్తి' అనే వృద్ధ పండితుడు ఇలాగన్నాడు:

లలితోదాత్త రసోల్ల సత్కవన లీ
లాఖేలన ప్రౌఢి ను
ష్క్వల శాబ్దాదిక శాస్త్రవీధులను సం
చారించు విద్యా సనా
థులు శ్రీనాథులు; వీరి నర్యపదము దున్
నిల్పి స్వర్ణాభి షి
క్తులఁ గావించుటకంటె చేయనగు
విందుల్ చాల విప్పటు నన్'—

ఇక్కడ 'శ్రీనాథుడు విద్యాసనాథుడు'- అనే దానిని కొంచెం వివరిస్తాను. ఇది పెద్దలవల్ల విన్నదే—

'సకల విద్యాసనాథ శ్రీనాథ ప్రణీతంబు' అని ఉన్న గద్య చదివి యీ బిరుదుకి అర్థమేమిటా ? అని ఆలోచించాను. లౌకికంగా అర్థమయిందిగాని తృప్తి కలగలేదు. ఎవరెవరినో అడిగాను. 'ఏముంది? సకల విద్యలతో ఒప్పవాడు' అనే అర్థం నాకు తెలిసినదే చెప్పారు. కాని నాకేదో సందేహంగానేఉంది... ...

ఇలాఉండగా ఒక పీఠాధిపతిని దర్శించే భాగ్యం కలిగింది. ఆసమయములో శ్రీవారు ఒక్కరే ఉన్నారు. వారిని సవినయంగా అడిగాను 'అర్థం దయచేయించండి'—అని. వారు చిరునవ్వుతో స—కలా—విద్యా సనాథుడు—'విద్యా' అనేది బహువచనాంతంగాకాదు ఏక వచనాంతంగా గ్రహించి చెప్పుకోవాలి.

'కలయా సహితా = సకలా,

సకలా + విద్యా=సకలవిద్యా- తయాసనాథః—అర్థమయిందా? అన్నారు.

'చిత్తం ! కళను వివరించవలసిందని మనవి చేశాను. వారు వివరించి 'బ్రాహ్మీదత్త వరప్రసాదుడు' అనేది దీనినే చెప్తుంది. శ్రీనాధుని అసలుపేరు తాతగారిపేరు అయివుంటుంది. 'కమల నాథుడు' అని. దీక్షానామం 'శ్రీనాథుడు కానోపు'—అని వారు సెల విచ్చారు. నా సందేహం తీరిందని శ్రీవారికి మ్రొక్కి వేరే ప్రసంగం లోకి వెళ్ళాను. అప్పుడు నేను మహాభాగవతంలో 'కపిలదేవహూతి సంవాదఘట్టం వ్రాస్తున్నాను. దానిలో కొన్ని విషయాలు వారే సెలవిచ్చారు.

ఇదీ శ్రీనాథుడు 'సకల విద్యా సనాథుడు' అనేదానికి అర్థం... ఈ రహస్యం 'సంధ్రభాష క్రియాశక్తి మహోపాధ్యాయుడు గ్రహించే ఉంటాడు. కనుకనే 'విద్యాసనాథులు శ్రీనాథులు' — అని అన్నాడు. ఈ రహస్యం తెలిసి వేశారో తెలియక వేశారో యీపదం. శాస్త్రిగారు — సమయసందర్భాలను పట్టి టంకపు పొడిలాగా అతికింది... అలాగే యీపద్యం మొదటిపాదం

'లలితోదాత్తరసోల్ల సత్కవన

లీలా ఖేలన ప్రౌఢి' —

అనే భాగం శ్రీనాథుని ఆంతర విద్యాశక్తి బీజానికి సూత్రం... దానిని వివరించి చెప్పవచ్చు...ఆ సంప్రదాయంలో దీక్షితుడు కనుకనే శ్రీహర్ష నైషధ మహాకావ్యాన్ని అంత లలితంగానూ, ఉదాత్తంగానూ, రసోల్ల సత్కవన లీలాఖేలన ప్రౌఢితోనూ తెనుగు చేయగలిగాడు. దీని రహస్యం దమయంతీ స్వయంవర ఘట్టంలో శ్రీనాథుడు చెప్పిన అమూలకమైన దండకంవల్ల వివృత మవుతుంది.

ఏ కావ్యం చదివినా కొంత 'సరుకు' ఉండాలి. అది లేకపోతే ఆ కావ్యకర్తకుగల 'సరుకు' ఏమాత్రమో తెలియడం కష్టం. ఉబుసుపోకకూ, ప్రొద్దుపోకకూ చదువుతున్నామంటే దానికంటె ఏ 'న్యూస్‌పేపరో' చదివితే కొంతైనా ప్రయోజనముంటుంది. ఈ 'ఆంధ్రపురాణం' చదివేవారికికూడా సాహిత్యరీత్యా కొంత గ్రహణశక్తి, కృషి అవశ్యమని నా ఉద్దేశం...

ఇక, ప్రస్తుతానికి వస్తాను. వివాదావంతరం మధ్యవర్తి తీర్పు నమసరించి శ్రీనాథునకు కనకాభిషేకం జరిగింది. ఇక్కడ ఆణిముత్యంలాటి పద్యం సరసతాలాలిత్య వితానం......

'ఆంధ్ర కవిసార్వభౌమ హేమాభిషేక
పరమ సమ్మాన మంగళా చరణగాన
వాద్య నిస్వాన మది మొక్క స్వాతివాన
తనుపుగా మొగ్గ విచ్చె ముత్యాలశాల... '

స్వాతి వానకు ముత్యాలు పండుతాయి. దీనిని యీపద్యములో శాస్త్రిగారు ఎంత సరసంగా ఇమిడ్చారో చూడండి. కవిసార్వభౌముని సత్కార మంగళవాద్యధ్వని స్వాతివానకాగా ముత్యాలశాల మొగ్గ విచ్చిందట ! దక్షిణాధీశుని కొలువుకూటానికి 'ముత్యాలశాల' అనేది పేరు. ఇప్పుడది నిజంగా ముత్యాలశాల అయింది.

ఈ మహా కావ్యములో శ్రీకృష్ణదేవరాయల పేరుతోనే ఒక పర్వం రూపొందింది. దీనిలో 'శ్లేష్యోపాధ్యాయుక' అనే శీర్షికతో ఉన్న భాగములో

'నయనాంచలముల'— అనే ఆరంభముగల సీసపద్యములో వరుసగా ఆరు సీసపద్యాలున్నాయి. ఆ ఆరున్నూ తిమ్మరసు మహామంత్రి మంత్రిత్వానికి రూపాలు. యీ పద్యషట్కం శాస్త్రిగారి అసాధారణ ప్రతిభకు విలువుటద్దం ......

అయితే ఆ తిమ్మరుసు హృదయములో కృష్ణరాయలు ఏలా పెరిగి పెద్దవాడయ్యాడనేది కూడా యీ ఆరుపద్యాలలో నీడగా కనిపిస్తుంది.

కృష్ణరాయలను రాజును చెయ్యవలసే సమయం రాగా అంత వరకు 'అపరోక్షణముగా' తనయింట ఏర్పాటుచేసి ఉంచిన రాయలను బాహ్యప్రపంచానికి తెస్తూ తిమ్మరసు అంటాడు కదా!

'తల్లి నాగాంబ సుప్రజా ధన్యమయ్యె
పురుష శార్దూలమా! లెమ్ము పోదమింక
రాజమందిరమునకు; కర్తవ్యమెంతో
కలదు నీమీద వేయేల్క సుము కృష్ణ !—

ఆనాడు విశ్వామిత్రుడు రాముణ్ణి మేల్కొల్పిన తీరు చట్టున జ్ఞాపకం వస్తుంది. 'కౌసల్యా సుప్రజారామ!...

'ఇంద్రశాంతి' శీర్షికలో కృష్ణరాయల పట్టాభిషేకం వర్ణిస్తూ శాస్త్రిగారు వ్రాసిన యీ పద్యం (దూర్వాకిసలయాభిషేకం)

'క్రొత్తపుడమి నావర్జింతుగోరు తేని
తలపు జలసేకమునం జిలుమొలక లొలసె
అరసి యానందమున శతాంకుర సహస్ర
పరసు దూర్వానవిత్రి బాష్పములు కురిసె'

'సహస్ర పరమాదేవీ శతమూలా శతాంకురా...అనే శిష్టోక్తి ప్రతిబింబమై ఆధునిక సాహిత్య ధూమకేతువులకు ధూపకళిక లాగుంది.

శుభకార్యాలు జరిగే సమయములో పురోహితుడు ఎలా కూర్చోవాలి చేసేవారెలా కూర్చోవాలి! యీ ప్రశ్నలకు ఒక్క పద్యంలో సమాధానం:—

'ఉత్తరపుదిక్కు మోమయి యున్నవాడు
సాంగవేద విదుండు బ్రాహ్మణుడు పలుకు
ప్రాంబలుకు దీవెవలనావి ప్రాఙ్ముఖుండు
రాయ లింద్రాశకాదట దోయిలించె'—

శుభకార్యకర్త తూరుపు మొగంగాను, చేయించే పురోహితుడు ఉత్తరాభిముఖంగానూ కూర్చోవాలి. పురోహితుడెలాటివాడై ఉండాలి అంటారా? 'సాంగవేదవిదుండు' అని ఒక విశేషణం ఉంది పద్యములో. వేదాలూ, వేదాంగాలూ క్షుణ్ణంగా తెలిసినవాడై ఉండాలి. అయితే ఇప్పుడు అలాటి వాడున్నాడా? అంటారేమో? ఆ విద్యలను పోషించే 'పెద్దలు' ఉంటే అలాటి పురోహితులూ ఉంటారు. ఇక్కడ 'బ్రాహ్మణుడు' 'అంటే జాతిమాత్రోపజీవికాడు. బ్రాహ్మణ శబ్దార్థం వేరు.

బ్రహ్మణం ఆత్మతత్వంయోవేత్తి సబ్రాహ్మణః
బ్రహ్మణి నిష్ఠా గరిష్ఠః— బ్రాహ్మణః

విద్యాపోషణ పోయింది. దానితో విద్యాభూషణత్వం ఏమైపోయింది. మా తాతలు నేతులు తాగారు, మా మూతులు వాసన చూడండి అనే స్థితికి దిగజారింది భారతదేశములో (జన్మభూమిలో) వేదశాస్త్రాల బ్రతుకు.

తరువాత, ఈ పై పద్యములో 'రాయలు ఇంద్రాశకు దోయిలించె' అని ఉన్నది. ఇంద్రాశకు ఎందుకు దోసిలిపట్టాడు (నమస్కరించాడు) ఖగోళ భూగోళాధిపత్యం ఇంద్రునిది. అతని పాలనకు స్థానం ప్రాగ్దిశ. ఆదిత్యోదయానికి అదే ఆది. కాగా ఆదిత్యులస్థానం అయింది. ఇంద్రుడు ఆదిత్యుడు. అతనిని ప్రార్థించాలి. ఆ ప్రార్థన ఫలించి భక్తుడు కృతార్థుడౌతాడు. 'ఇంద్రో విశ్వస్యరాజతి'—అని కావ్యకంఠ గణపతి ముని నిర్ణయించి చెప్పిన వైదిక రహస్యం అర్థం చేసుకుంటే యీ విషయం అవగతమవుతుంది. ఇది

'ప్రతిమా వాహితమైంద్ర తేజము'—అనే పద్యం స్పష్టంగా చెప్తుంది.

కృష్ణరాయలు పట్టాభిషిక్తుడై ఊరేగు సంబర్భములో ఒకచోట తిమ్మరసు అనేమాట చమత్కారం—

'అదె విరూపాక్ష దేవదేవాలయమున
మ్రోగు ఘంటామహానాదమున కరంబి
తల్లి భువనేశ్వరీదేవి దయ తరంగ
తుంగయై భద్రగతుల ముందునకు వచ్చు,'

భువనేశ్వరీదేవి దయ తరంగతుంగయై భద్రగతులతో వస్తుందట ముందుకి—అదే తుంగభద్ర. శాస్త్రిగారి వర్ణనలో చమత్కృతి అలా ఉండుగాక! తుంగభద్రానదీ స్నానం భద్రప్రదం అనే పుణ్య భావం వస్తుంది అని సంతోషించాలి.

తరువాతిది రాయల విజయపర్వం. తరువాత రామరాయల వృత్తాంతం...కాని దీనిలో నంది తిమ్మనగారిని విశేషించి చెప్పవలసి ఉంది. తప్పుకొన్నారు శాస్త్రిగారు...

నాయకరాజ పర్వం చివరిది.

దక్షిణ భారతదేశానికి కృష్ణరాయల తరువాత అంత కీర్తిని సాహితీ సమ రంగాల సంతరించిన నాయకరాజుల చరిత్ర సరసంగా వర్ణితమయింది.

అచ్యుత నాయకుడు రాజు, అతనిమంత్రి గోవింద దీక్షితుడు. ఈ రాజమంత్రులిద్దరూ ఒక్క గీతపద్యములో ఎంత చక్కగా ఇమిడారో చూడండి.

'మహిపతియు మంత్రియును త్రినామమ్ములందు
మొదలు తుదినామములు తాల్చి పొదలుచుందు
రాఢ్యులిద్దరు నాహవహవములందు
చతురు లిరువురు శస్త్ర శాస్త్రములయందు'—

దీని సంకేతం ఇది:—

'అచ్యుతాయనమః అనంతాయనమః, గోవిందాయ నమః'— అని విష్ణునామ సంకీర్తనంచేస్తే యీ మూడింటిలో మొదటిపేరు అచ్యుతుడు, మూడవపేరు గోవిందుడు.

రాజు మొదటి పేరి వాడు — అచ్యుతనాయకుడు
మంత్రి మూడవ పేరి వాడు— గోవిందదీక్షితులు.

ఇక వీరు ఆఢ్యులు. ప్రసిద్ధులు. దేనికి రాజు ఆహవమునకు

శస్త్రవిద్యకు
మంత్రి హవమునకు
శాస్త్రములకు

రాజు కనుక యుద్ధవిద్యకు ఆవశ్యకమైన శస్త్రసంపద కలవాడై ఉన్నాడు.

మంత్రి కనుక యజ్ఞయాగ క్రియాచరణ శాస్త్ర సమ్యగ్జ్ఞాన ధనమూ కలవాడై ఉన్నాడు. కనుక ఇద్దరూ అర్హులు — (క్రమాలంకార పోషణ గ్రహించాలి). అచ్యుత నాయకుడు ముదిరి ముదిసినవాడయ్యాడు. గోవింద దీక్షితులు గ్రహించాడు. యువరాజా రఘునాథరాయలు రాజు కావచ్చు అనుకున్నాడు. దానిని శాస్త్రిగారు ఎంత హృదయంగమంగా ఎంత గంభీరంగా చెప్పారో చూడండి.

'అంతట దినాంతపక్వ భాస్వంతుఁబోని
యచ్యుతేంద్రు దని దెస నద్వయుత్త్య మెనసి
వరికె గోవిందయజ్వ కన్నొలకు లొరయ
అనుగు శిష్యుని వదన తేజోవహ్ని విరియ—

'సరాజ్యం గురుణా దత్తం ప్రతిపద్యాధికంబభౌ
దినాంతే నిహితం తేజః సవిత్రేవహుతాశనః' —

అనే కవి కులగురువు వాక్కు శాస్త్రిగారి రచనలో జీవంపోసింది యిక్కడ. మూడు నాలుగు పాదాల అర్థం స్పష్టం ... ...

ఒకచోట రఘునాథ నృపతి భద్రగజారూఢుడై 'ఆశ్లిష్ట సానువైన యాషాఢ మేఘమట్లున్నాడట.'

'ఆషాఢస్య ప్రథమదివసే మేఘ మాశ్లిష్ట సానుం
వప్రక్రీడా పరిణత గజప్రేక్షణీయం దదర్శ' —

అనే మహాకవి వర్ణన శాస్త్రిగారికి ఉపమగా ఉపయోగించి అనుపమమైన అర్థ గంభీరిమ నాపాదించింది.

మధుర ముత్తు వీరప్ప నాయడు యుద్ధములో పట్టువడగా రఘునాథభూజాని పరిహసించడం

'వీరెవ్వరయ్య! మధుర మ
హారాజటె! ఇట్లు కృపణులై పట్టువడన్
వీరికి వలసెనె! — అనేది

మన ఆదికవిగారు ద్రోణునినోట ద్రుపదుణ్ణి పరిహసించడం జ్ఞప్తికి తెస్తుంది 'వీరెవ్వరయ్య! ద్రుపదమహారాజులె - అనేతీరు.

ఆంధ్ర నాయకరాజు ముక్తామణీ దర్శనం అయాక శ్రీరంగ ధామేశ్వరిని స్తుతించడం పద్యాష్టకముగా దివ్యభావగర్భితంగా ఉంది. అనాటి నాయక రాజేకాదు. ఈనాడు అందరూ నిత్యమూ పారాయణ చెయ్యవలసే పద్యాష్టకమది.

'క్రతుసంతానము తీర్థరాజములు
క్షేత్ర శ్రేణియున్ గోత్ర సం
తతులున్ వాహినులున్ వనంబులును
విద్యావేత్తలున్ వృద్ధులున్
వతులున్ సర్వ చరాచరాత్మక
ధరా చ కంబు హసా బద
ర్శితమౌ నీదు నభీతి ముద్రకయి
కాంక్షిమన్ ముకుందప్రియా!......'

ఒక్కపద్యం మచ్చుకి ఉదాహరించాము.

ఈ కావ్యములో ప్రతిపద్యమూ నిరర్గళ ధారాశుద్ధికి లక్ష్యమే. ఇక తెలుగు పలుకు బళ్ళు బళ మీద వెళినట్లే. సంస్కృత సాహితీకి, శ్రౌత స్మార్త సంప్రదాయజ్ఞతకూ ఆకరమైన పట్లు ఎన్నో ఉన్నాయి.

నోరు జాఅని, తడిసి మోపగు గుండె చెఱువై పోవు, వీళ్ళ నములు—ఇలాటి జాతీయాలు కోకొల్లలు.

'అన్ని కళలందు చెవిగల యటివారు'-అంటే అర్థం?

'బహుశ్రుతులు' ఈలాటి ప్రయోగ స్వారస్యాలూ, గడుసు పోకడలూ తెలుసుకోవాలి.

'పారాధీన్యము' 'ఆంధ్యము'- వంటి శాబ్దిక గారుడాలు తెలిసిన పాఠకుడైతే శాస్త్రిగారి సంస్కృత పాండిత్య వైభవాన్ని గ్రహిస్తాడు.

అన్నివిధాలా 'ఆంధ్రపురాణం' సార్థకనామమయింది. దీనిపై యీ వ్యాసం 'పనుపు విఘ్నేశ్వరుడికి బెల్లం నైవేద్యం' వంటిది.

యిలాంటి యీనాటి అత్యుత్తమ గ్రంథాన్ని ఆంధ్రదేశాన పాఠశాలలో, కళాశాలల్లో విద్యార్థులై ఉన్నవారు ఎనిమిదవ తరగతితో ఆరంభించి విశ్వవిద్యాలయం పట్టం పొందేనాటికి క్రమంగా పూర్తి చేయడానికి ప్రణాళికవేసి పాఠ్యగ్రంథముగా దొరతనం వెరపుగా పెద్దలు నిర్ణయించవలసి ఉంటుంది. ఇది తెలుగుజాతి చరిత్రకదా! ఏవేవో చరిత్రలు చదువుతారుగాని స్వీయజాతి చరిత్రలు చదివేవారూ, చదివించేవారూ లేని దౌర్భాగ్యం మనకి పట్టకూడదు. ఏముంది ప్రభుత్వం తల్చుకుంటే! ఆ సుదినంకోసం ఎదురుచూస్తూ యీ పద్యముతో వ్యాసం ముగిస్తున్నాను.

'శతధాకృప్త సహ సధా విస్తృత
లక్షానేకశః కోటి శ
స్తుత విశ్వోదయ రమ్య రమ్య తర
శశ్వత్సృష్టి కళ్యాణికా
రతి పాత్రంబును నెత్తు ముమ్మొదలి
పేరంటాలివే నీదు కం
టి తుదన్ వెల్గు వికుంఠ నాయక
చిరంటీ! ఆంధ్ర హైమాభ్యముల్'

శంకర భగవత్పాదుల ద్వాదశ జ్యోతిర్లింగ స్తోత్రము

శ్రీ చిటిప్రోలు కృష్ణమూర్తి

కరుణామై లోకమున భక్తి నిరవు కొల్ప
రమ్యతరమైన విశద సౌరాష్ట్రసీమ
నవతరించిన జ్యోతిర్మయ స్వరూపు
శశిధరుని సోమనాథుని శరణుగొందు

అల తులాచలతుంగమ్ము నఖిల విబుధ
సంగమై పొల్చు శ్రీశైల శృంగమందు
నలరు భవవార్ధి వారధి నద్వితీయు
నర్జునుని మల్లికా పూర్వు నభినుతింతు

ఒప్పగ నకాలమృత్యువుం దప్పం ద్రోసి
సజ్జనశ్రేణి కెల్ల మోక్షం బొసంగ
నల అవంతీపురంబున నవతరిలిన
శ్రీ మహాకాళు నెంతు మహామహేశు

సర్వదా నర్మదా సహ్యజా సమాగ
మస్థలంబున మాంధాతృ మహిత నగరి
సర్వ సజ్జన తారణాసక్తి నుందు
స్వామి నోంకారనాథు నే సన్నుతింతు

సంయమీంద్రులు దేవరాక్షసులు యక్ష
లురగు లాదిగం బూజించుచుండ నెపుడు
హిమగిరి పార్శ్వతటమున నలరుచుండు
ప్రభునిం గేదారనాథునిం బ్రస్తుతింతు

శాకినీ డాకినీ సమాజములతోడం
బొలసుదిండులు నర్థిమైం గొలుచుచుండ
భక్త హిత కల్పకంబయై పరంగుచుండు
శంకరుని భీమ పద సుపశస్తుం గొల్తు

నిర్భరానందకందమై నెనరుం జిందు
పాప పరిహారు నానంద వన విహారు
దీన జనపోష వారణాసీ నివేశు
విశ్వనాథుని శరణంబు వేడం గొందు

భవ్య గోదావరీతీర భద్ర భూమి
సహ్యగిరిమౌళి మౌళిదేశమున నిల్చి
ధీయు సందర్శనోత్కృష్ట వితత కీర్తి
సుముగ వెల్గొందు త్ర్యంబకేశ్వరు భజింతు

సర్వదేవాసురులు పదాబ్జములు గొల్వ
శైల నందనతోడ నేకాంతసీమం
బ్రజ్వలి పావన క్షేత్రరాజ మేలు
వైద్యనాథేశ్వరున కివే వందనములు

యామ్యదిగ్వీథి రమ్యసదంగనగరి
భుక్తిముక్తి ప్రదాన తత్పరత నొప్ప
వివిధ భోగ విభూషణ విలసితాంగు
నభవు శ్రీ నాగనాథేశు నాశ్రయింతు

కడలిదరి తామ్రపర్ణి కెల్లలు ప్రపోలం
బ్రబల సేతువుగట్టి శ్రీరామచంద్రుం
డంచితమ్ముగ నర్చి సేవించి చన్న
స్వామి రామేశ్వరునకుం బ్రాంజలి ఘటింతు

పరమ రమణీయమగు శిలాపుర వరమున
విశ్వజగతి వరేణ్యుడై వెలసియున్న
సుమహితౌదార్య విలసద్విశుద్ధ మూర్తి
కెరఁగి శరణం బొందెదను ఘుశ్మేశ్వరునకు

ఫలశ్రుతి

భక్తిమై శంకరాచార్య వరకృతము శి
వాత్మకము ద్వాదశ జ్యోతిరమల లింగ
సంస్తవం బిది పఠియించు జనుల కెందుం
గలుగుం దద్దర్శనంబునం గలుగు ఫలము

హరిశ్చంద్రోపాఖ్యానములు వ్రాసిన కన్నడకవి

రాఘవాంక తెలుగుకవి గౌరన

—విద్వాన్ కె. సుబ్బరావప్ప

కన్నడ సాహిత్యంలో 13వ శతాబ్ది ఆదిలో హంపీక్షేత్రంలో రాఘవాంక అనే కన్నడ కవి హరిశ్చంద్ర కావ్యాన్ని షట్పదులలో వ్రాశాడు. ఇతడు శివకవి. తన కావ్యాన్ని నరాంకితంచేయక హంపీ విరూపాక్షునికి అర్పణ చేశాడు. "జన, బదుక బేకు" అని తాను ఈ కావ్యాన్ని వ్రాసినట్లు చెప్పుకొన్నాడు. అనగా తన కావ్యం విశ్వశ్రేయం కావాలని. అప్పుడు విజయనగరాన్ని ఏలుతూవుండిన దేవరాయలు ఈ కావ్యాన్ని బంగారు పళ్లెములో పెట్టి పల్లకిలో నగర వీధులలో మెరమణిగావించి సన్మానం చేసినాడు.

ఈ కాలంలోనే ఓరుగల్లులో రుద్రమదేవి రుద్ర ప్రతాప అనే పేరుతో పరిపాలన గావిస్తున్న రోజులు. కాకతీయులు శైవులు ఈ ఆస్థానంలో 'ఏకదండి' (ఏకసంత గ్రాహి) 'ద్విదండి' (ద్విసంత గ్రాహి) "త్రిదండి" (త్రిసంత గ్రాహి) అనే కుకవులుండేవారు. ఈ ఆస్థానంలో ప్రవేశం కోరిన కవులు తమ కృతులను ముందుగా వీరు వినిన పిమ్మట రాజాస్థానంలో ప్రవేశింపజేసేవారు. ఆస్థానంలో కవి తన కావ్యాన్ని చదివితే "మేము దీనిని ఎన్నడో రచించినాము" అని ఏకధాటిగా ఆశువుగా చెప్పేవారట. అంతటితో కవికి శృంగభంగమై వెళ్ళిపోయేవాడట.

ఈ సంగతి వినిన రాఘవాంక కవి ఓరుగల్లుపోయి రుద్రప్రతాపుని ఆస్థానంలో "వీరేశచరిత" అనే కావ్యాన్ని "మిసలు కవితగా"★ చెప్పి వీరభద్రస్వామికి అంకితం చేసినాడు. రాజసన్మానం ఈ కన్నడ కవికి దొరికింది. కుకవులను ఓడిపోయారు. 'వీరేశచరిత'లో మొదటి సంధిలోని 8వ పద్యం యిలా వుంది :

"కృతినామం వీరేశ్వర చరితం బగెగే
కృతిపతి యోరుంగల్లిన వీరేశ్వర నీ
కృతిగె సహాయరు సద్భక్త సమూహావు
కృతియం ముదదిం పేళ్వవను
యతిపతి హంపెయ హరదేవర కారుణ్యా ద
సుత శివకవి భృత్యం హంపెయ రాఘవ
పండిత నెనిపీ కృతియం మెచ్చద
సజ్జనరారీ వసుధా చ కదోళ్"

రాఘవాంకుని తరువాతి కవులు ఓరుగల్లులో రాఘవాంకుడు కుకవులను ఓడించి సన్మానమును పొందిన విషయమును పేర్కొని పొగడినారు.

హరిశ్చంద్ర కావ్యమును రచించిన పిమ్మట రాఘవాంక కవి శివపరముగా అనేక గ్రంథములను రచించెను.

15వ శతాబ్దపు ఆదిలో తెలుగున శివకవి అయిన గౌరన కూడ హరిశ్చంద్ర కథను 'హరిశ్చంద్రోపాఖ్యానము' అనే పేరుతో రచించినాడు. తరువాత "నవనాథ చరిత్ర" అనే శైవకావ్యాన్ని వ్రాసినాడు. ఇది కన్నడనాడులో కూడా ప్రసిద్ధి. కన్నడ భాషలోనికి కూడా అనువాదం అయింది. గౌరన అందరికి అర్థం కావాలనే ఉద్దేశంతో ద్విపదలో సూత్రశైలిలో వ్రాసినాడు.

రాఘవాంక గౌరన కృతులకు మూలగ్రంథములు తెలుసుకోవలెను. సామ్యములను అనుకరణములను పరిశీలించవలెను. విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని అసత్యమాడించవలెనని చేసిన పనులలోగల విభేదాలను చర్చించుట కూడా యీ వ్యాసంయొక్క ఉద్దేశం.

విశ్వవిద్యాలయాల ధనసహాయ సంఘంవారు నన్ను యు.జి.సి. ప్రొఫెసర్‌గా నియమించినారు. నేను ఈ కన్నడ తెలుగు గ్రంథాలను తులనాత్మకంగా పరిశీలించి పుస్తక రూపముగా వ్రాయడానికి ఎన్నుకున్నాను. (యు. జి. సి. పథకం క్రింద)

హరిశ్చంద్ర కథ చాలా పురాతనమైనది. వైదిక, పౌరాణిక, గ్రంథాలలో యాజ్ఞిక, ఐతిహాసిక, ధార్మికాంశములు యిందులో ముప్పిరిగొన్నాయి.

ఈ కథకు సంబంధించిన పూర్వవృత్తాంతంగల పురాణేతిహాసములివి:

		అధ్యాయము
1.	వాయుపురాణము	88
2	బ్రహ్మాండపురాణము	63
3	బ్రహ్మపురాణము	6 మరియు 34
4	మార్కండేయపురాణము	7-9
5.	లింగపురాణము	66
6.	శివపురాణము (5వ ఉమాసంహితలో)	38
7	స్కాందపురాణము(అరవసాగరఖండమున) 2నుండి 7 వరకు	48
8	దేవీ భాగవతము (7వ స్కంధము)	10-27

★ ప్రత్యేక పద్ధతిని చెప్పిన కవిత (దక్షాధ్వర ధ్వంస కథ)

ఇతిహాసములు

1 హరివంశము (మొదటి పర్వము) 12 13
2. మహాభారతము (సభాపర్వము) 12
,, (వనపర్వము) 77
3. రామాయణము (బాలకాండము) 58నుండి 60 సర్గలు

వైదిక గ్రంథాలు

1. ఐతిరేయ బ్రాహ్మణము-(పంచికా 7వ అధ్యాయము 3వ ఖండము) 1నుండి 6
2. సాంఖ్యాయన శ్రౌత సూత్రములు 17వ ఖండమునుండి 25 (15 అధ్యాయము)
3 వేదార్థ దీపికా (ఋగ్వేద భాగం) 1-24
4. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు వ్రాసిన ''కావ్యహరిశ్చంద్ర-వేదహరిశ్చంద్ర''

ఇంకా అనేక కన్నడ-తెలుగు గ్రంథాలు, యక్షగానాలు నాటకాలున్నాయి.

పై గ్రంథాల్లో సుప్రసిద్ధ హరిశ్చంద్రకథను కావ్యాలుగా, కథలుగా, వీధినాటకాలుగా, నాటకాలుగా రచింపబడినవే.

స్థూలముగా రాఘవాంకుని కృతినిగూర్చి యీరీతిగా చెప్పవచ్చు: ఈతడు విశ్వశ్రేయఃకావ్యం అనే ధ్యేయంపై ''జన బదుక బేకెందు కావ్యమిదిం పేళ్ద వనపేక్ష యింద కవి రాఘవాంకం'' (హరిశ్చంద్రకావ్య' 14-33) మానవులైన రాజులకుగాక హంపీలోని విరూపాక్ష స్వామికి అంకితం చేసినాడు.

పౌరాణికమైన యీ పుణ్యకథ రాఘవాంకుడు మధుర కావ్యముగా రసవంతముగా షట్పదులలో వ్రాసినాడు. హాస్యము దిహాసము, శోకక్రోధములు మొదలైన చిత్తవృత్తులను మనోజ్ఞముగా వర్ణించినాడు. హరిశ్చంద్రుని ధీరోదాత్తతయూ, సత్యనిష్ఠయూ, చంద్రమతి సౌజన్య సచ్చారిత్రములు, విశ్వామిత్రుని వంచనా నైపుణ్యము, పగ తీర్చుకునే పద్ధతులు పాఠకుల మనస్సులను ఆకట్టుకొంటాయి. ప్రకృతి వర్ణనలలోను సంభాషణా శైలిలో కావ్యమును నడిపిన రీతియు మనోజ్ఞముగా నుండును. ఇదే కన్నడ సాహిత్యములో మొదటి షట్పదీ రచన అంటారు.

గౌరన కావ్యంలో లేని హరిశ్చంద్రుని ఉవవన విహారమూ వేశ్యా వాటికలో సంచారముచేసి ప్రజా జీవితమును తెలిసికొనుటను రాఘవాంక తన కావ్యములో చేర్చినాడు.

రాఘవాంక గౌరనలు తమ కావ్యాదిలో శివుణ్ణే స్తుతిస్తారు.నవనాథచరితను గౌరన శ్రీశైల మల్లికార్జునికి అంకితం చేసినాడు. సామాన్య జనులకోసం ద్విపద శైలిలో హరిశ్చంద్ర చరిత నవనాథ చరితలను వ్రాసినాడంటే గౌరనకు జనులపట్లవున్న అభిమానం తెలుస్తుంది. రాఘవాంకునివలె జనులు తమ బ్రతుకును కావ్యములను చదివి చక్కదిద్దుకోవాలని ద్విపదలోనే వ్రాసి వుంటాడు. కాని పండితులను నిర్లక్ష్యంచేయలేదు. తన రచనలోని ''కవితా చమత్కృతిని గాంచి హర్షించి కవులందరు శిరఃకంపంబు చేయ నచరించి విమల పుడువుగా'' ఋగ్వేద ప్రసిద్ధుడైన హరిశ్చంద్ర చరిత వ్రాస్తానన్నాడు కాని వేద హరిశ్చంద్రునిగాని త్రిశంకు చరితను గాని ప్రస్తావించలేదు. వేదహరిశ్చంద్రుడు సత్యాన్ని పాలించలేదు. ఈ సంగతి రాఘవాంక విశ్వామిత్రుని చేత ప్రస్తావిస్తాడు. ప్రచారంలోనున్న హరిశ్చంద్ర కథకు వేద హరిశ్చంద్ర కథకు పోలికలే, కనపడవు.

గౌరన స్కాంధ పురాణంలోని కథను మార్కండేయ పురాణాన్ని కలిపి చెప్పినట్లున్నది. వనవాసంచేస్తూ వుండిన ధర్మరాజాదులకు మార్కండేయ మునీంద్రుడు హరిశ్చంద్ర కథను చెప్పినట్లు గౌరన తెల్పినాడు. మారనకవి మార్కండేయ పురాణంలో 144 గద్య పద్యాలలో హరిశ్చంద్ర కథను చిత్రించినాడు.

''ఉత్తర భారతదేశంలో హరిశ్చంద్రుని భార్యపేరు తారామతి అంటారు. చంద్రమతి అనేపేరు గౌరనే ప్రచారం చేశాడు'' అని ఆరుద్రగారి ''సమగ్ర ఆంధ్రసాహిత్యం'' 5వ సంపుటం 47వ పుటలో వుంది. 13వ శతాబ్ది వాడైన రాఘవాంక చంద్రమతి అనే తన కావ్యంలో పేర్కొన్నాడు.

ఆంధ్ర ప్రదేశ సాహిత్య అకాడమీ ముద్రించిన గౌరన హరిశ్చంద్రోపాఖ్యానము (1967)నకు పీఠిక వ్రాసిన డా॥ పి. యశోదారెడ్డిగారు ''మూలమునందు గానరాని ''నక్షత్రకుని పాత్ర'' గౌరన గావించిన సృష్టియే'' అన్నారు (పుట 12) రాఘవాంక కవి ''హరిశ్చంద్ర కావ్యంలో నక్షత్రకుని పాత్రవుంది'' అంతేకాదు వీరిద్దరికీ ముందే 10వ శతాబ్దంలో క్షేమీశ్వరుడనే సంస్కృత రచయిత వ్రాసిన ''చండకౌశికం'' అనే నాటకంలో నక్షత్రకుని పాత్రవుంది

వేటకై వచ్చిన హరిశ్చంద్రుని విశ్వామిత్రుడు తన ఆశ్రమానికి రప్పించుకోవడానికై (వసిష్ఠుడు పోవద్దని హెచ్చరించినా) విశ్వామిత్రుడు మాయా వరాహాన్ని సృష్టించి దానిని తరముకొని విశ్వామిత్రుని ఆశ్రమం చేరినట్లు వర్ణిస్తే, గౌరన తన హరిశ్చంద్రోపాఖ్యానంలో ''ముత్యంపు చిప్పల మురలింపు మోముతో కొత్తనీలపు రంగులకన్నోయితో లోచనోత్పలముగావించు.'' జింకను ప్రవేశ పెట్టినాడు.

గౌరన హరిశ్చంద్ర కావ్యాన్ని వేదం వేంకటరాయ శాస్త్రిగారు పరిష్కరించి 1912 లో ప్రకటించినారు. అవతారికలో యిలా వ్రాశారు: ''అతిహృద్యమయిన యీతని గ్రంథమందు రెండు తావుల గొప్ప పొరపాట్లు సంభవించినవి. ఎవ్వియనన్, గ్రంథారంభ ఘట్టంబునందును ఉపసంహారమందును వసిష్ఠ విశ్వామిత్రులు నీచుల వలె జగడమాడుట, ఆదిలో నరమూర్తులుగాను, అంతములో పక్షిమూర్తులుగాను. వసిష్ఠ విశ్వామిత్రుల పక్షిజగడం గౌరనయేకాదు-ఆది భాగవత పురాణంలోవుంది.

''ఇట్లు విశ్వామిత్రుండు హరిశ్చంద్రుడు నెగులు వరమటనిని వసిష్ఠుడు, విశ్వామిత్రుని గృధముగమ్మని శపించె; విశ్వామిత్రుడును వసిష్ఠుని బకంబుగమ్మని శపించె. పక్షిరూపులయ్యును నాయిరువురు యుద్ధంబు సేసిరి. బ్రహ్మ వారించి యెప్పటి నిజాకృతులుగా నొనరించె'' (భాగవత పురాణము 9-192)

రాఘవాంక యీ కథాంశమును ఎత్తనేలేదు.

మూడు సాయంత్రాలు

శ్రీ విజయచంద్ర

తీక్ష్ణమైన దిగులు
హృదయాన్ని అధితప్తమై ద్రవిస్తోంది
ఊరు ఊరంతా పేలికలై ఎగిరి పోయాను
ప్రశాంతత లేదు
ఊరులో ప్రశాంతత లేదు
మసక సాయంత్రం వీధుల్లో పిచ్చిది జుత్తు విరబోసుకు తిరుగుతుంది

అసహనం అక్షింతలు చల్లుకుంటూ —
రోడ్ల మీద ఎవరో పోతున్నారు
బారలుచాచుకున్న నిస్తబ్ధత
మధుమాసం ఎదురుగా మండిపోతోంది

ఊరవతల శ్మశానం చెప్తున్న విశ్వరహస్యం వినిపించడం లేదు
భారమైన మొగిలిపువ్వు నిశ్వసనం ఎవరూ వినటం లేదు

చీకటి స్త్రీ వెతుకుతున్న పురుషుడి జాడ ఇంకా తెలియదు
కనిపిస్తున్నది చుక్కలు కావు —
నిప్పుల కత్తులు, దారుణ కైజారులు, రవ్వల పిడిబాకులు

* * *

ఒక సాయం స్మృతి కదిలి
ఒక నక్షత్రం మెరుపు ఎదలో మెదిలి
నీరవం అడుగులు వేసుకుంటూ పోతున్న క్షణాలలో
కదిలిందొక అల
నీటిమీద వ్రాలిందొక నీడ

మొగిలి రేకుల్లో శిశువుల ఆక్రందన
సన్నజాజి చెప్పిన శోకార్త గాథ
మల్లెపువ్వుల నిరీక్షణలో విరహవేదన

రాత్రి పాడుకుంటున్న సుదీర్ఘమైన పాట
సముద్రంలో హాలాహలం
పగిలిన మధుకలశం
గతకాలపు పాతవాసన
రాత్రుల నిండా పరివేదన
వానకారు వృక్షాల కొమ్మల నిండ
వ్రేలాడుతున్న మృత సర్పాలు......
గాజుకళ్ళతో చూస్తున్న పిల్లలు
ఎదనిండా రగులుతున్న చిటపట మంటలు
నీలిమధూమం కక్కే రక్తిమ జ్వాలలు
నా చూపుల ముందు క్రొత్తగా మొలిచాయి
పాట్నిగోడలు
క్రొత్త ఇటుకలతో మొండిగా కట్టినవి
క్షితిజ రేఖ మీద నిల్చొని
నక్షత్రాల మెట్లు ఎక్కుతూ
ఆకాశం మీద అలా పోవాలని ఉంది —
సాయంత్రపు మైదానం నేలమీద నవ్వుతున్న
పచ్చటి గరిక వాడి హృదయాన్ని కోస్తున్నది
ఎగురుతున్న పక్షులు హృదయంలో చొరబడినట్లు
ఎవరో నా ఎదలో స్మృతులు ఉరికిస్తున్నారు
మళ్ళీ వెనక్కి లాగుతున్నారు

ఆగు..........ఆగు........
దూరాన దిగుడు బావిలో నీళ్ళతోడే పనివాడు
దీక్షగా శృతిలో గంభీరంగా పాడు కుంటున్న పాట.....
శ్మశానానికి పోయే రోడ్డు మీద
వంకరగా నడిచే రెండెడ్ల బండి చక్రపు ఇరుసు
శబ్దం చేస్తూ చెప్తున్న మాటలు.......
మైదానంనిండా మొలచిపోయిన జిల్లేళ్లూ, గాబు మొక్కలు
దూరాన దయ్యాల్లా కదులుతున్న సరుగుడు చెట్లు
ప్రాక్ పశ్చిమాన అంతరిస్తున్నది ఎరుపు.....
నిటారుగా ఉన్న కొబ్బరిచెట్లు వెనుక రాత్రి ఉదయిస్తోంది
ఆర్పేసిన దీపపు కొన నుండి
మెలికలు తిరిగి పోయే పొగలా ఉంది నా విషాదం.....

* * *

పెరటి ద్వారంలోంచి వెనక్కి పోయినట్లు గుర్తు...
అనుభవాల గదిలో ఏవో చప్పుళ్ళు...
శిథిలమైన కోటలాంటి ఆ భవనం తలుపులు తెరిచాను
వెలిసిపోయిన గోడలు, పైకప్పు చూరునంటిన సాలెగూళ్ళు...
కళ్ళు చెమర్చాయి
అనంతమైన ఆకాశం

దూది పింజల్లాంటి మేఘాల స్మృతులు
పరిగెత్తుకుంటూ వచ్చి నిండిపోయాయి
ఎన్నాళ్ళుగానో మూలపడిన వీణను చేతితో సవరించినట్లూ...

తిరిగొచ్చే పశువుల మందలు
మధుమాసపు సాయంత్రాల్ని జ్ఞప్తికి తెస్తున్నాయి.
కాలం రెక్కల మీద ఎగిరి పోయిన
సురుచిర జ్ఞాపకాలు, ఆ రోజులు
ప్రేయసి బుజంపై మోహాన్ని పెట్టినట్లు
చెంపకు చెంప తాకించినట్లు
చేలాంచలం నేలను స్పర్శించినట్లు
అందెల రవళులు, గుండెలను పిండే స్పర్శలు

నది ఒడ్డున ఇసుక తిన్నెల మీద
ఇప్పటికీ మాట్లాడు కుంటున్న నా మాటలు
ఇదిగో—ఎవరో నిమిష నిమిషానికి నా వెనుక తెరలు దించు తున్నారు

శృంగారం, విషాదం, ఆనందం, తీయనిమల్లె
మొగలి పరిమళంలా నన్ను హత్తుకుంటున్నాయి
ఎంత సమయమైనా నేనీ క్షణాల మీద నిలువ గలను
కానీ ఎదురుగా
ప్రపంచం రెండు చేతులతో నన్ను లాగుతోంది ఏం చెయ్యను?

ఇప్పుడే ఉదయించిన నక్షత్రం
రాత్రి ఆచ్ఛాదన అయినట్లు లేదు
ఎగిరిన గోధూళి ఎర్రని ఆకాశాన్ని అందుకుంటోంది
ఇండ్ల వెనుక నుంచి ఎగజిమ్ముతున్న పొగ
అప్పుడే కనిపించి
అంతలోనే మాయమౌతోంది
పగలు ముసలిదైంది
పక్షంతా రెక్కలు పుట్టు కొచ్చాయి
అది ఎగిరి పోతోంది
ఈ ఆకుపచ్చని సాయంత్రం ఒక ఆరని మంట
దీపపు కాంతితో
రాత్రి నిబిడి నవ్వుతోంది.

తెలుగు మాస్టారు (నవలిక)

శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం

(గతసంచిక తరువాయి)

10

మెరిసేదంతా బంగారం కాదని మీరు చెప్పేవారు మాస్టారూ. ఉప్పుకప్పురంబు పద్యం అతి తరచుగా చదువుతునేవారు. జీవిత సూత్రాలా పద్యంలో నిబిడీ ఉన్నాయనేవారు.

క్లాసులో - జీవితసారాన్ని బోధించినవారు మీరే.

విచిత్రంగా మీకు జీవితంలో రాజీపడటం తెలీదు!

ఏమిటి మాస్టారూ యిది?

ఎలా అర్థం చేసుకోమంటారీ విచిత్రాన్ని?

మీరు జీవించాలి మాస్టారూ,
నిశ్చింతగా జీవించాలి.

జీవనవాహిని వడిదుడుకుల కెదురు నిలిచి నిల దొక్కుకునే ఓపిక యీ వయసులో మీకింకా ఎక్కడుంది?

పొరపాటో గ్రహపాటో అనుకుంటూనే చిన్నమ్మాయి భవానిని స్కూలు ఫైనలువరకూ చదివించారు.

అది ఎంత మంచిపని అయింది!

జీవితాంతమూ స్వశక్తిమీద ఆధారపడుతూ జీవించగలగడం మహావరమే ఏనాడైనా జీవితం. మగతనం కలవారెవరూ కాదనలేని కఠిన సత్యమే. కాని—

అన్నివేళలా అందరికీ అన్ని వరాలూ లభిస్తే మానవజాతి మహా చరిత్ర యిలా ఎందుకుంటుంది మాస్టారూ?

అందని వరాలు మిగులుతూ ఉండబట్టే కదా జీవితం నిరంతరం ముందుచూపు చూసేదీ, ముందడుగు వేసేదీ!

మీకు తెలియదని కాదు.

ప్రమాదో ధీమతా మపి...

గుర్తు చేస్తున్నానంతే.

ఇప్పుడు మీకు మిగిలిందేమిటి మాస్టారూ?

ఆరోగ్యం అపకరించింది.

అబ్బాయిలు అందకుండాపోయారు.

పెద్దమ్మాయి అత్తారింట ఉంది.

మిగిలింది-చిన్నమ్మాయి భవాని!

ఆస్తిపాస్తులు లేవు.

అప్పులకి చెల్లుపెట్టేశారు.

అదీ ఓ విధంగా అదృష్టమే మాస్టారూ?

శేషం సున్నా అవడం ఎంతమందికి?

ఉద్యోగం మీనుంచి శలవు తీసుకుంది.

ఊరితో ఏ సంబంధమూ మిగలలేదు.

రేపు గడవడం సమస్య.

జీవితం-భవిష్యత్తు-ప్రశ్నార్థకం.

మిగిలిన ఒకే ఒక్క ఆశాకిరణం భవానీ.

అవకాశాన్ని చేజార్చుకోకండి.

భవానిని ఉద్యోగంలో చేరనివ్వండి.

ఇందులో తప్పేమీ లేదు.

కాలాన్ననుసరించి పోవాలికదా?

శ్రీనాథుడు-'వెల్లుల్లిన్ తిలపిష్టమున్ మెళకువన్ విశ్వస్త వడ్డింపగా' అని వాపోయిన సందర్భాన్నెంత చక్కగా విపులీకరించి-మానవుడెంత బలహీనుడో మాకు తెలియజెప్పిన వైనం-మీరే మరచిపోయారా తెలుగు మాస్టారూ?

కాలం మారింది మాస్టారూ.

భవానికి మీరు పెళ్లి చెయ్యలేరు.

ఆమె చదువుకున్న చదువుకి-గుమాస్తా ఉద్యోగం దొరకడం

యీ రోజులో గగనమే వాస్తవిక దృష్టితో ఆలోచించండి.

భవాని ఉద్యోగంలో చేరడంకంటె మార్గాంతరమేముంది?

మీ సమస్యకి మరో పరిష్కారంలేదు మాస్టారూ...లేదు.

అమ్మాయి ఉద్యోగం చెయ్యడం అంత క్షమార్హంకాని నేర మేమీ కాదిప్పుడు.

కట్నాలు గుమ్మరించి మీరేం పెళ్ళి చెయ్యగలరు?

అప్పుదొరకడానికయినా మీకు ఆస్తి ఏముందని?

మనిషికీ మనసుకీ విలువలేని కాలమిది. అందుచేత-మీకు అప్పు దొరకడం అసాధ్యమే.

విశాఖపట్నం నగరమే కావచ్చు.

నగరంలోమాత్రం మనుషులు జీవించరూ?

"సరేనయ్యా...అలాగే వెళ్ళాను. అమ్మాయి ఉద్యోగం చేస్తూంటే దానిమీదపడి బ్రతుకు వెళ్ళదీసుకుంటాను.

ఏం ఖర్మ రాసి పెట్టావయ్యా, భగవంతుడా! చివరి కీస్థితి రాసి పెట్టావా నా నొసట? వాపోయారు నేస్తారు. స్త్రీ విత్తం అధమాధమం. అమ్మాయికి పెళ్ళిచేసి అత్తారింటికి పంపవలసిందిపోయి-దాని సంపాదనతో కడుపు నింపుకోడమా! ...శివ శివా..."

"మీరలా విచారించవనవసరంలేదు మాస్టారూ. నగరంలో మీవంటి వారి విద్వత్తు కి పనితగలకమానదు. ఏ ట్యుటోరియల్ కాలేజీలోనో మీకు ఉద్యోగం దొరుకుతుంది.

అయినా నాకు తెలియక అడుగుతాను అమ్మాయిమీద ఆధారపడటం అంత అన్యాయంగా భావించాలా? అబ్బాయిమీద ఆధారపడటంలో లేనినేరం—

తెలుగు మాసారు కాస్త యిబ్బందిగా ముఖం పెట్టారు.

బాధ ప్రతి ఫలిస్తున్న కంఠంతో "నీకు తెలియదయ్యా... కుర్రవాడివి. స్త్రీ సంపాదనమీద ఆధారపడటంలో అనేక చిక్కులున్నాయి. అవి అనుభవైక వేద్యాలు. పెద్దలు ఊరికే చెప్పరయ్యా. పెద్దలమాట చద్దన్నం మూట. పోనీ. విచారించడంకంటే నేను మాత్రం చెయ్యగలిగేదేముంది? నా నొసట ఏం వ్రాసిపెట్టి ఉంటే అదే జరుగుతుంది. కానియ్." అని—దీర్ఘంగా నిట్టూర్చారు..

పరాన్న భుక్కులు కావడంలోనే పరమానందం పొందుతూ అదే ప్రయోజకత్వంగా భావించే అశేష ప్రజానీకానికి తెలుగుమాస్టారి స్వతంత్ర జీవనాదర్శం పంటికింద రాయి.

వినాదైన్యేన జీవనం—కోరుకున్నా — ఒకరిమీద ఆధారపడి తన మనుగడని సుఖవంతం చేసుకోడం సుతరామూ తెలుగుమాస్టారికి యిష్టంలేదు. అయితే-పరిస్థితులకు లోబడని మనుష్యులెవరుంటారు?

తెలుగు మాసారూ వారిలో జమ అయిపోయారు.

జీవితంముందు-ఎన్నోసార్లో ఓడిపోయారు.

11

ఏమిటి మాస్టారూ, మరీ యింత మొహమాటమూ, అభిమానమూ అయితే ఎలా? నగరంలో నరుడు-డాబుతోనే బతుకుతాడు.

ఈ వూరు-విశాఖపట్నం వచ్చాక—మీరెందుకో దిగులుగా ఉంటున్నారు. చెప్పండి మాస్టారూ, నాకు చెప్పండి.

"ఏం చెప్పమంటావయ్యా?"...నీళ్ళు నమిలారు మాసారు.

"ఫరవాలేదు, చెప్పండి మాస్టారూ. నేను మీ శిష్యుణ్ణి... మీ దిగులు నా ముందు దింపుకోండి. గుండెలు తేలిక పరచుకోండి."

"ఆ వూరు వదిలి యీ వూరు రావడం-తెలివి తక్కువపనే చేశానయ్యా!"

"ఎందుకని అలా అనుకుంటున్నారు మాసారూ?"

స్థాయి తగ్గించి—మెల్లగా అన్నారు తెలుగుమాస్టారు. "అక్కడయితే-గుమ్మం దిగేసరికి-ఆప్యాయంగా నమస్కారాలెదురయ్యేవి. నలుగురూ మాస్టారూ అంటూ పలకరించేవారు. కష్టమూ సుఖమూ చెప్పేవారు వినేవారు. ఇక్కడ పన్నెత్తి పలకరించే నాథుడే లేడు."

"అయ్యో మాస్టారూ ఇది పట్నం. ఇక్కడ జీవితమంటే పరుగు పందెం. నత్త నడకకాదు. ఇది పట్టి స్వార్థపరుల నిలయం. ఎవరికీ మరొకరి గోడు వినవలసిన సహృదయతా ఉండదు, సమయమూ ఉండదు నాగరిక జీవితమంటే ఎవరికివారే యమునాతీరే."

"అలా అయితే మనిషి బతుక్కి అర్థమేమిటి? ప్రయోజనమేమిటి? ఎదుటి మనిషి గురించి అక్కరలేని మనిషికి-మనస్సునేది ఉందని ఎలా అనుకోవడం? పదిమందితో చావు పెళ్ళితో సమానమన్నారు పెద్దలు. అంటే అర్థమేమిటి?

మనిషి సుఖసౌఖ్యాలూ శాంతీ — సహజీవనంలోనే ఉన్నాయి, ఈ చిన్న నిజంతెలుసుకుని ఆచరించలేకపోతే మనిషి ఆధిక్యతేముంది? పశుపక్ష్యాదులూ, క్రిమికీటకాదులూ — వీటిలోనే సహజీవన సౌభాగ్యాన్ని తెలుసుకోగలిగిన తెగలున్నాయే-చీమలవంటివి! మెదడున్న మానవులు ఒంటరి బతుకుని కౌగిలించుకుని బందికానాలోమల్లె బ్రతకడం ఎంత దౌర్భాగ్యం!"

వాపోయారు తెలుగు మాస్టారు.

ప్రవక్తలా వచించలేకపోయినా, రాజకీయ నాయకుడిలా వేదిక లెక్కి అబద్ధాలాడకపోయినా - తెలుగు మాసారు సంస్కర్త నిజమయిన సంస్కర్త. ఆయన సంస్కారం హృదయగతం. అనవసరంగా మాటలలో తొణికిపోదు

నేనేం చెప్పాలను ?

ఐకమత్యమే మహాభాగ్యము.

పదిమందితో చావయినా పెళ్ళితో సమానం.

కలసివుంటే కలదు సుఖం.

మానవులంతా ఒకటే...

ఓహో! చెప్పుకుందుకయితే బోలెడన్ని నీతివాక్యాలు, నుడులు - నానుడులు

ఆచరణలో ?... శూన్యం.

ఎక్కడో తెలుగుమాస్టారి వంటి వారుతప్ప — ఆదర్శాలను ఆచరణలో పెటగలిగే మనుషులెందరు ?

మా తెలుగు మాస్టారికి మరో ప్రత్యేకత ఉంది.

ఆత్మస్తుతి అంటే కిట్టదు,

అందుకే ఆయన యీ కాలానికి పనికిరారనుకుంటాము.

స్వంత డబ్బాతో ప్రపంచాన్నదరగొట్టాలని ప్రతివాడూ తల మునకలయ్యే యీరోజులలో – ఒకరి ఘనతను గుర్తించే ఓపికా తీరికా ఎవరికున్నాయి ?

పోనెండి మాస్టారూ. ఈ కుటిల నీతులతోనూ, కుహనా జీవన విధానాలతోనూ మీ మనసు కలుషితంచేసుకోకండి. మీ ఆలోచనా పద్ధతే సహజమైనదీ స్వచ్ఛమైనదీ. మీరెందుకు మారాలి ? కాలమే మారాలి. అదే మంచిది—సాధ్యమైతే.

వ్యవస్థా మహావృక్షం ఎంత ఎండిపోతూ వస్తున్నా – అక్కడక్కడ మళ్ళీ కొత్త చిగుళ్ళు వేయకపోవడంలేదు. ఆ చిగుళ్ళకి కారణం మీవంటి మంచివారే.

* * *

ప్రపంచాన్ని నేను తప్పుగా అంచనా వేసుకున్నాను !

వట్టి గొడ్డుని పాడి ఆవుగా పొరపడ్డాను.

తెలుగు మాస్టారికి ఒకంతట ఉద్యోగం దొరకలేదు ట్యుటోరియల్ కాలేజిలో. ఊరికే దరఖాస్తు పంపినంతమాత్రాన ఉద్యోగం దొరికే రామరాజ్యమా యిది ! ప్రజాస్వామ్యం పాలిస్తున్న రోజులు. ముసుగు తీస్తే అంతా స్వార్థమేకదా !

మనిషికంటె ఓటుకి విలువెక్కువ.

మంచితనం మారనినాణెమైపోయిన రోజులాయె.

ఉద్యోగంలో చేరిన భవాని–కొంత మారక తప్పలేదు.

యువతరం–వెల్లువలో పూచిక పుల్ల.

సుడిగాలిలో దూదిపింజె.

భవాని-వాతావరణానుగుణంగా వస్త్రధారణ వైఖరీ మార్చుకోడం ప్రారంభించింది.

మాస్టారి మనసులో ముల్లు గుచ్చుకుంది.

వ్యక్తిత్వాన్ని గౌరవించగలిగే ఉన్నతులు వేషధారణని పట్టించుకోరు. మనిషి గౌరవం సంపాదించుకోవలసింది విద్వత్తుతోనూ ప్రవర్తనతోనూ తప్ప వేషంద్వారా కాదని నమ్మే తెలుగుమాస్టారు— అమ్మాయి అసభ్య వస్త్రధారణని ఆమోదించలేక పోవడంలో ఆశ్చర్యమేముంది ?

Statement about ownership and other particulars about newspaper

BHARATI

FORM IV (Rule 8)

1. Place of Publication : Vijayawada
2. Periodicity of its Publication : Monthly
3. Printer's Name : Sri S. Radhakrishna
   Whether citizen of India : Yes
   Address : 16, Luz Avenue, Mylapore, Madras-4
4. Publisher's Name ; Sri S. Radhakrishna
   Whether citizen of India : Yes
   Address : 16, Luz Avenue, Mylapore, Madras-4
5. Editor's Name : Sri S. Radhakrishna
   Whether citizen of India : Yes
   Address : 16, Luz Avenue, Mylapore, Madras-4

Names and addresses of Individuals who own the newspaper and partners or share holders holding more than one percent of the total capital :

Names	Addresses
1. Mrs. S. Kamakshamma	16, Luz Avenue Mylapore, Madras.4.
2. Mr S. Radhakrishna	Do
3. Mr. S. Nageswara Rao	Do
4. Mrs. S. Rajeswari	Do
5. Mrs. S. Seshamma	Do
6. Mr. S. Sreeramamurty	14/15, Luz Church Road, Madras.4.

Trustee, Kasinadhuni Nageswara Rao, Sivalenka Sambhu Prasad Dharma nidhi.

7. Dr. P. S. N. Murthi, P. O. Yellamanchili, Vizag Dt

I, S. Radhakrishna, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

S. RADHAKRISHNA

1—3—'77 Signature of Publisher

తెలుగు మాష్టారెప్పుడూ నిరాడంబర ప్రియులే.

వారెప్పుడూ మోకాలు దిగని నలభయ్యో నంబరు పంచెలే తప్ప గ్లాస్కో పంచెలు కట్టలేదు.

బయటకు వస్తే చొక్కా – పొడవు చేతులది – కప్పుకునేవారు. దాదాపు నీర్కావిదే.

ఫ్యాషన్లెంతగా మారినా – మాదిగ కుట్టిన చెప్పులే వేసుకుంటారు కాని కంపెనీ జోడు నలంకరించరు.

నిరాడంబరత విషయంలో తెలుగు మాస్టారు మరో గాంధీయే! కాని – వారు గాంధీగారి కొన్ని సూత్రాలతో ఏకీభవించేవారు కారు. ముఖ్యంగా కులమత సమానత్వమూ, హరిజనులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించడమూ వీటితో. తెలుగుమాస్టారు ఆవేశపడుతూ తమ వాదనని వివరిస్తుంటే – వారి మాటలు నిజమేమో అనిపించేవి. హిందూ మతం, వర్ణ ధర్మమూ – మా కర్ణ(?)కాని పదాలు చాలా దొర్లించేవారు తమ ఉపన్యాసంలో. వారు చెప్తున్నంత సేపూ తమాషాగా ఉండేవి.

పులి కడుపున పిల్లి పిల్ల పుడితే-భరించడం కష్టమే మరి

భవాని ఆధునాతన నాగరికతలో కొట్టుకు పోతూంటే అంగీకరించలేకపోయారు తెలుగు మాస్టారు.

ఆఫీసులో చక్కగా పనిచేసి నలుగురి మెప్పూ సంపాదించాలమ్మా. దానివల్ల నీకూ చాలా తృప్తి కలుగుతుంది. సక్రమంగా కర్తవ్యం నిర్వహించడం మూలంగా కలిగే ఆనందం వర్ణనాతీతం.

సౌందర్యం-హృదయానికి సంబంధించినది.

నకిలీ మెరుపులు అశాశ్వతాలు. వీటికోసం ఎందుకలా కాలాన్నీ, ధనాన్నీ వృధా చేసావు?"

మాస్టారి మందలింపులు అమ్మాయికి నచ్చలేదు.

భవాని తప్పేమాత్రం ఏముంది?

యువతరం యుగసంధిలో కొట్టుమిట్టాడుతూంది. అదొక గడుక్కే సంఘర్షణే. నవనాగరికత అత్యంత ఆకర్షణీయం. యువతీ యువకుల హృదయాలకు పగ్గాలువేసి లాక్కుంటుంది ఆ పగ్గాల నుంచి భవానీ కూడా బయట పడలేని బలహీనురాలైపోయింది.

'పృధ్వాలు బుద్ధులు సంచలింపవే' అన్న భారతంలోని వాక్యం తండ్రి కాపాడించింది. ఆయన చెప్పే నీతులన్నీ గాలికబుర్లుగానే జమకట్టేసింది. నలుగురినీ బ్రతిమాలి – ట్యుటోరియల్ కాలేజీలో పొద్దుటోగంటా, సాయంత్రం ఓ గంటా-పాఠాలు కుదిర్చింది. దాంతో అమ్మాయి స్వేచ్ఛావిహారాలకు కొంత వెసులుబాటు కలిగింది.

అమ్మాయి కోరుకున్నది అదే.

చెప్పవచ్చేదేమిటంటే –

రికమెండేషన్ లేకుండా మాస్టారి విద్వత్తుకి గుర్తింపు దొరకలేదు.

బాగుపడమని చెప్పడం-ఛాదస్తమైపోయింది.

చెడిపోవద్దని చెవినిల్లుగట్టుకు పోరడం-నేరమైపోయింది.

భవానిని–కన్నతండ్రికంటె కుహనా నాగరికతే కట్టిపడేసుకుంది.

తండ్రిని తనయే దూరంగా ఉంచడం ప్రారంభించింది.

అవును.

ఆయన తెలుగు మాస్టారు

జీవితం ఎన్ని రకాలుగా వెక్కిరించినా ఏమీ ఎదిరించలేని తెలుగు మాస్టారు!

12

విపులాన పృథ్వీ–

మీరే చెప్పేవారుకదా తెలుగు మాస్టారూ!

అసలు మీరు చెప్పనిదేముందని?

మీరొక విజ్ఞాన సర్వస్వం

ఎందుకు మాస్టారూ మీలో మీరే అంతగా కుమిలిపోతారు ?

మానవ చిత్తవృత్తులు మహాద్భుతాలుకదా !

ఎప్పుడు ఎవరు ఏం చేసినా ఆశ్చర్యపోనవసరంలేదనీ కలియుగంలో ధర్మం ఒంటికాలుమీద నడుస్తుందనీ- అది కూడా కుంటికాతొతుందని తరచుగా చెప్పేవారు మరచిపోయారా?

ధర్మార్థ కామమోక్షాలలో మధ్య రెండే కలికాలాన్ని పరిపాలిస్తాయని వివరించేవారే! వీర బ్రహ్మంగారి పలుకులకు భాష్యం చెప్పేవారే! మరచిపోయారా మాస్టారూ ?

అన్నీ తెలిసిన మీరే యింత బాధపడితే-మాబోటి మామూలు మనుషు లేమైపోవాలి?

ఐనా-భవానీ నువ్వెందుకమ్మా, అటువంటి పనిచేశావు?

ఇంటా వంటా ఎవరూ యింతవరకూ చేయని సాహసం–నువ్వెందుకు మొదలుపెట్టావమ్మా?

ఆహితాగ్నులాటి కుటుంబమే!

కులమూ మతమూ కాదని-మీ నాన్నగారి గుండెలలో కార్చిచ్చురేపి–కులాంతర వివాహం చేసుకుంటావా !

మీ నాన్నగారేమైపోవాలని?

తల్లిదండ్రులు దైవసమానులే. మీ నాన్నగారు యీ పాతం

నీకు శోధించలేదా? వారి పితృవులు–కన్నబిడ్డనే పెడచెవిని పెడితే–ఎంత నగుబాటు! పెరటిచెట్టు మందుకి పనికిరాదన్న సామెతని నువ్వు నిజం చేశావా! గుండెలు తీసిన బంటువై పోయావా!

ఇంకెంతకాలం ఉంటారని నీ నాన్నగారు?

ఈ వృద్ధాప్యంలో–అసలే నెగడు తాడున్న వారి హృదయంలో మరిన్ని నిప్పులు చెరగి పోవడం–సంభవించేనా?

నువ్వు చేసిన తొందరపనికి ఆయన ఏం శిక్ష విధించుకున్నారో చూడు!

నీ హృదయం కంపించలేదూ?

నీకు జాలి కలగలేదూ?

అమ్మాయిని కంటికి దూరం చేసుకోగలిగేటంత కఠినులు కాలేక యింటిముందు పంచలో నివసించడం ప్రారంభించారు. భార్యాభర్తలు గడిలోకి అడుగు పెట్టడమే మానేశారు. వారి ఆహారాలూ నిష్ఠానియమాలూ అటువంటివి. అయినా అమ్మాయిని చూడకుండా ఉండలేదాయన నవనీత హృదయం.

తెలుగు మాస్టారు కరుణా సముద్రులు. దయా సింధువు.

ఎవరినీ శిక్షించలేని సున్నిత మనస్కులు.

అందుకే ఆ వయసులో చాలామందిలా అమ్మాయి కులాంతర వివాహం చేసుకుందని దూరం చేసుకోలేదు!

దూరంనుంచే అయినా అమ్మాయిని చూసుకునేవారు.

ఆయన ఆ ప్రాంతం అయినా–నియమాన్ని సడలించారంటే–అది ఆయన సహృదయతే. అంతవయసులో–నియమోల్లంఘనని సహించడానికి ఎంత శాంతమూ సంయమనమూ ఉండాలి!

ఆ పంచలో–ఇంత ఉడకేసుకుతింటూ–పలకరించే దిక్కు లేక–గడిపేవారు తెలుగు మాస్టారు.

ఆ రోజులలో ఆయన అలవాటుగా గొంతెత్తి భజగోవింద శ్లోకాలు పాడుకుందుకూ, భక్తి పద్యాలు పాడుకుందుకూ స్వేచ్ఛ కరవయింది. కంఠమెత్తి గానంచేయబోతే–

అమ్మాయీ అల్లుడూ ఏమిటీ న్యూసెన్సనేవారు!

నిజం. నిజం.

నాగరికులకు–భక్తిపాటలూ, ముక్తి గీతాలూ మహాన్యూసెన్సే.

సినిమాపాటలకి–ప్రేమగీతాలకి అలవాటుపడిన చెవులకి భజగోవింద శ్లోకాలు పడతాయా?

వసంతకాలంలో కంఠం తెగనరకబడిన కోయిలలా – వ్యధ

చెందుతూ గొంతులోనే పొడుకునేవారు తెలుగుమాస్టారు. అది — గొణుగుడు. ఎవరూ లేకపోడం ఎంత దుస్థితి !

ఉండీ లేకపోడం - అంతకంటే శాపం.

అయినా భరిస్తూ వచ్చారు.

తెలుగు మాస్టారంటే సహనశీలురు.

వార్థక్యంలో ఏకాంతం—ఎలా భరించారో !

13

ఎందుకు మాస్టారూ అలా నిలబడిపోయారు?

ఏమిటంత తదేకంగా చూస్తున్నారు ?

"ఈ వయస్సులో నన్నాకర్షించేది మరేమిటి, మృత్యువుతప్ప?"

"మృత్యువుకి గురి అయిన ఆ వ్యక్తిలో చూడటానికేముంది మాస్టారూ ?"

"ఉంది.. జీవితం ఘనంగా సాగించుకోడం గొప్పతనంకాదు. కాని-ఘనంగా మరణించగలగడం ఉందే — అది కేవలం అదృష్టం. ఆ శవాన్ని చూస్తే నాకు అసూయగా ఉంది !"

"మీరు అసూయపడుతున్నారా ! ?"

"ఔనయ్యా ! అసూయే కలుగుతూంది. చూడు. చక్కగా ఆ కొడుకులు అన్ని విధులూ శాస్త్రోక్తంగా జరిపించి — సంస్కారం ఏర్పాటు చేస్తున్నారు ఇంత సంప్రదాయంగా సంస్కారం జరగడాని కెంత పుణ్యాత్ముడై ఉండాలో ! నా కటువంటి పుణ్యం ఉందా అని ?

నా శవానికి యిలా దహన సంస్కారాలు జరుగుతాయా ? నాకు పుణ్యలోకాల ప్రాప్తి ఉందా ? అదే ఆలోచిస్తున్నాను.

నన్ను దహనం చెయ్యడానికేనా నాకొడుకులు వస్తారో రారో?

వాళ్ళకి నా మరణవార్త అందుతుందో అందదో !"

దిగులుగా భారంగా అన్నారు తెలుగు మాస్టారు.

జాలితో నా హృదయం ఆర్ద్రం ఐపోయింది.

ఏమిటిది మాస్టారూ ?

ఈ ఆలోచన లేమిటి ?

మీరు చిరంజీవులు కావాలి.

మీ మంచితనం కలకాలం ఉండాలి.

చావుగురించి ఆలోచించ కండి.

నాకు దిగులేస్తూంది.

ఒక్కసారి చిరునవ్వు నవ్వండి.

నాకు ధైర్యం చెప్పండి.

సమాజానికి పెద్ద దిక్కు మీరు.

మీరు కాకపోతే మాకు నీతులు చెప్పేదెవరు ?

మా బతుకులు తీర్చి దిద్దే దెవరు ?

తాజ్‌మహల్ అంతర్థానాన్నీ,

పృథివీతలం మాయం కావడాన్నీ,

వెన్నెల శాశ్వతంగా అంతరించడాన్నీ —

ఊహించుకోనయినా ఊహించుకోలేను మాస్టారూ.

ఆ తలపుకే నాడులు జలదరిస్తుంది భయంతో.

వద్దు మాస్టారూ, వద్దు.

మీరు యీ లోకం వదలవద్దు.

మీలాటి మంచి తెలుగు మాస్టారు మా కెప్పుడూ మిగిలి ఉండాలి.

అటువంటి అదృష్టాన్ని మా కనుగ్రహించండి.

మనస్ఫూర్తిగా ఆశీర్వదించండి.

మాకు మీరు మరో దేముడు.

మంచి మనిషిలో దేముడు కనిపిస్తాడని మీరే చెప్పారు.

మరచిపోకండి మాస్టారూ, మరచి పోకండి,

మమ్మల్ని—మీ శిష్యుల్ని మరచిపోకండి.

14

జీవితమంతా ఒకెత్తు.

చరమాంకం ఒకెత్తు.

తిరిగిరాని ప్రయాణానికి రైలెక్కే బాటసారికి వెచ్చని వీడ్కోలు ఎంతయినా అవసరం.

జీవితంలో ఎన్ని శాపాలనయినా భరించవచ్చుగానీ అంతిమ యాత్ర అసంతృప్తిగా సాగడం అతిదుర్భరము.

జీవిత కావ్యానికి ప్రారంభం ఎప్పుడూ ఒకటే. విలక్షణ్యం ముగింపులోనే వైవిధ్యమంతా.

ఈ చివరిఘట్టాన్ననుసరించే జీవిత కావ్యం సుఖాంతమో, విషాదాంతమో అయేది.

ఒక వెచ్చని వీడ్కోలు:

చెమర్చిన నేత్రద్వయం.

జాలిపడిన హృదయం.

లభించకపోబట్టేగా దేవదాసు జీవితం విషాదంగా ముగిసింది?

తెలుగు మాస్టారి జీవితమూ విషాదాంతమే!

జాలిగొలిపే కథకు నాయకులయ్యారు.

చివరి క్షణంవరకూ విషాదమే ఆవరించగా—

వెంటతీసుకు వెళ్ళేందుకు-తీరని కోరికలుతప్ప మరేమీలేకపోగా—

ఎంతవిషాదంగా నిష్క్రమించారు మాస్టారూ!

భావుకులయిన మీరు మృత్యువు గురించి కూడా ఎంతో సుందరంగా ఊహించుకునేవారు. నాకు తెలుసు మీ మనసు.

మృత్యువుకి కూడా దయలేదు తెలుగు మాస్టారిమీద.

ఆయన-జీవితాన్ని పట్టుకుని కౌగలించుకోలేదు.

మృత్యువుని తిరస్కరించనూలేదు.

ఎటొచ్చీ హుందా అయిన మృతిని కోరుకున్నారు.

అనాయాస మరణం...

ఊహుం.

అది ఆయనకి లభించలేదు.

యాక్సిడెంటులో....

కొన్ని నిముషాలు నరకయాతన ననుభవించి...

దిక్కులేకుండా...

కన్నుమూశారు.

ఆ చివరి క్షణాలలో ఎంత సంఘర్షణ ననుభవించారో?

ఎంత ఆవేదన పడ్డారో!

మాస్టారూ...దేముణ్ని క్షమించండి.

అనాయాస మరణమూ, వినాదైన్యేన జీవితమూ—

రెండు వరాలలోనూ ఒకటీ మీకివ్వలేదు దేవుడు.

దేవుడుకూడా మారిపోయాడు మాస్టారూ.

మునపటిలా మంచివారి మొరలు వినిపించుకోడంలేదు.

లంచాలు పట్టడం మరిగాడు.

లుబ్ధుడైపోయాడు.

మీకూ నాకూ అందడు.

మోసపోయారు మాస్టారూ,

మోసపోయారు.

* * *

చితి మండుతోంది.

నా కన్నీటికి ఆనకట్టలులేవు.

తెలుగు మాస్టారు యికలేరు.

ఈ భావన నన్ను దుఃఖితుణ్ని చేసివదులుతూంది.

ఒక విచిత్రమయిన ఆలోచన నన్ను విభ్రాంతుడిని చేస్తూంది.

అందరు తెలుగు మాస్టార్లూ యిలాగ లేకుండాపోతే ఏమౌతుంది?

అప్పుడు—తెలుగుదేశ స్వరూపం ఎలా ఉంటుంది?

ఊహే బహు భయంకరంగా తోస్తూంది.

మన ప్రాచీనత, సంస్కృతి, మంచితనం, మానవత్వం—యివన్నీ ఒక్కొక్క తెలుగు మాస్టారితోనూ, కొద్దికొద్దిగా అంతరించిపోతాయేమో! పతనంవంక సాగే పరుగు తాలూకు వేగం తగ్గించేందుకు తెలుగు మాస్టార్లు లేకపోతే సంఘం ఏమైపోతుందో!

ఉపాధ్యాయులు—సమాజానికి తోటమాలులు.

ఉపాధ్యాయులు పిల్లలకి-విజ్ఞానదాతలు.

ముఖ్యంగా-తెలుగుమాస్టారు—పిల్లలకి ఆప్తులు. ఆత్మీయులు.

జీవితం గురించి ఎక్కువ తెలియజెప్పేవారు తెలుగుమాస్టారే.

ప్రతివారి జీవితంలోనూ తెలుగు మాస్టారి ప్రభావం తక్కువేమీకాదు.

ఎంత పెద్దవారయినా – వెనక్కి తిరిగి చూసుకుంటే—తప్పకుండా తెలుగు మాస్టారిదగ్గర తీరుతారు.

* * *

మాస్టారూ,

తెలుగు మాస్టారూ,

మీ కివే నా నమోవాకములు.

స్వీకరించి—ఆశీర్వదించండి.

(అయిపోయింది)

తేవారం త్రయం కాలం

శ్రీ బి. జి. ఎల్. స్వామి

(గత సంచిక తరువాయి)

పరస్పర సమన్వయాలు

8. ప్రత్యేక అంశాలు, తేవారం త్రయంచేత దర్శించబడినవి అని చెప్పబడే దేవాలయాలు.

ముందర చెప్పినట్లు సాంప్రదాయం ప్రకారం తేవారం త్రయం దర్శించి పాడారని చెప్పబడే 275 ఆలయాలు ఈ క్రింది స్థాన వర్ణనాత్మకమైన పట్టికలో ఇవ్వబడ్డాయి.

చోళనాడు	190	ఆలయాలు
తొండైనాడు	32	,,
నాడునాడు	22	,,
పాండ్యనాడు	14	,,
కొంగునాడు	7	,,
వళనాడు	8	,,
ఈళనాడు	2	,,
తుళునాడు	1	ఆలయము
మలైనాడు	1	,,

ఇంతకుముందే వ్రాసినట్లు వళనాడు, ఈళనాడు, తుళువనాడు లోని ఆలయాలను వారు స్వయంగా దర్శించకుండానే వాటిని గురించి పాడారని మనము అనుకోవచ్చు. మిగిలిన భూ విభాగాలు మనకు తెలిసిన ఏ ఒక రాజకీయ, వంశీయ, భౌగోళిక మండలానికి చెందవనే విషయాన్ని ఇక్కడ దృఢంగా చెప్పాలి. కాని మొదటి అందు చివరి, విభాగాలు కలిసి సాంస్కృతికంగా, భాషా పరంగా ఒక సజాతీయమైన ఏకమండలాన్ని సూచిస్తాయి. ఈ భూవిభాగాలతో పరిపోయే ప్రాంతం 7వ శతాబ్దంలో సాంస్కృతికంగా, భాషాపరంగా విభిన్నమైన భూవిభాగాల కూటమి. ఇది పల్లవులు, పాండ్యులు, కొంగుణాలు మొదలైన వారందరి ఏలుబడి కింద పంచుకోబడి ఉండేది. దీనిలోకి ప్రవేశించడానికి పశ్చిమ చాళుక్యులు నిరంతరం ప్రయత్నిస్తూ ఉండేవారు. ఇటువంటి సంకులమైన పరిస్థితి, సజాతీయము స్థిరము అయిన నిర్మాణశైలి, శిల్పశైలి ఉద్భవించడానికి అనువైనది కాదని స్పష్టమే.

ఒకే విధమైన ఒక సాంస్కృతిక ఆశయంయొక్క పరిణామ, స్థిరీకరణాలకు, ఒక ప్రాంతమంతా ఒకే ఏలుబడి కింద ఉండటం అవసరం అనిపిస్తుంది. చోళనాడు, తొండైనాడు, నాడునాడు, పాండ్యనాడు, కొంగునాడు, భూవిభాగాలన్నీ అటువంటి పరిపాలన కిందకు, చరిత్రలో ఏదో ఒక కాలంలో వచ్చి వుండాలి. ఈ పరిస్థితి 9వ శతాబ్దంలో చివరా, 10వ శతాబ్దంలో చాలా భాగమూ. ఆదిత్యుడు I, ఉత్తమచోళుల రాజ్యకాలాల్లో ఉండేది.

బాలసుబ్రమణ్యం ఇటీవలి (1966, 1971) పరిశోధనలు 10వ శతాబ్దపు చోళరాజుల ఆలయ నిర్మాణ కార్యకలాపాలను వెలుగులోకి తెచ్చాయి. ఆయన పరిశోధనలు, ఇంకా అనేక ఇతర విషయాలతోబాటు, అన్ని నిర్మాణ, శిల్ప అలంకారాలతో కూడిన దాదాపు 100 శివాలయాల ఉనికిని తెలుపుతున్నాయి. సాంప్రదాయకమైన చోళనాడు, పాండ్యనాడు విభాగాల నతిక్రమించి ఇప్పటి తిరుచ్చి, తంజావూరు, దక్షిణ ఆర్కాటు, ఉత్తర ఆర్కాటు, చెంగల్పట్టు జిల్లాలు పరచుకొన్న ప్రాంతమంతటా ఈ ఆలయాలు కట్టబడి ఉన్నాయి.

బాలసుబ్రమణ్యంచేత ఇవ్వబడిన పట్టికలోని శివాలయాలలో దాదాపు 40% గుడులను గురించి తేవారం త్రయం పాడారు. ఈ ఆలయాల స్థానవిస్తృతి, వారు దర్శించారని చెప్పబడే దాదాపు 270 ఆలయాల స్థానవిస్తృతినే ప్రతిబింబిస్తోంది. ఆ అంకెల విశ్లేషణ ఈ క్రింది విధంగా ఉంటుంది:

	తేవారం త్రయం చేత పాడబడిన 10వ శ॥ చోళ ఆలయాలు	తేవారం త్రయం చేత పాడబడని 10వ శ॥ చోళ ఆలయాలు	మొత్తం
ఆదిత్యుడు I	19	26	45
పరాంతకుడు I	16	13	29
ఉత్తమ చోళుడు	5	15	20
మొత్తం	40	54	94

ఈ యథార్థమైన సమాచారం కొన్ని స్పష్టమైన అనుమానాలకు దారితీస్తోంది. 1) వ్యవస్థాపరంగా స్థిరత్వాన్ని పొందినవీ,

నిర్మాణ విషయకంగా పూర్తి అయినవి ఆయిన ఆలయాలు చాలా ఉండేవి. వాటిలో కొన్నింటిని మాత్రమే తేవారం త్రయం కీర్తించడానికి ఎంచుకున్నారు.

2) వీరిచేత పాడబడిన ఆలయాలలో చాలా భాగం 10వ శతాబ్దంలో, తమిళదేశపు నట్టనడిభాగంలో, అంటే తంజావూరు జిల్లా ముఖ్యప్రాంతంగా విజయాలయుడి వంశపుచోళులు ఏలిన ప్రాంతంలో ఉండేవి.

3) పరాంతకుడు I, ఆదిత్యుడు I కాలాలలో ఉత్తరము, దక్షిణము, పడమర దిక్కులకు చోళసామ్రాజ్యము విస్తరించటముతో బాటే శైవమత వ్యాప్తికూడా జరిగింది.

4) తత్ఫలితంగా చోళసామ్రాజ్యమంతటా శివాలయాలు కట్టబడ్డాయి.

తమిళదేశమంతటా ఎన్నో ఆలయాలుండగా, తేవారంత్రయం వాటిలో కొన్ని ఆలయాలను/ స్థలాలను మాత్రమే, ఇంకా ఎన్నో దగ్గరే ఉన్నవాటిని వదిలి, దర్శించడానికి ఎంచుకోవడానికి గల కారణం స్పష్టంగా తెలియటంలేదు. వారు ఎందుకు ఆయా దేవాలయాలను మాత్రమే దర్శించడానికి ఎన్నుకున్నారో సరియైన కారణం చెప్పడం సాధ్యంకాదు. ఏ ఊహ అయినా నిజమయిన కారణం అయి ఉండవచ్చు!

అన్బిల్ తామ్రశాసనంలో 18వ పద్యం ఆదిత్యుడుI కావేరీ తీరప్రాంతంలో అనేక దేవాలయాలను కట్టించాడని చెపుతుంది. బాలసుబ్రమణ్యం ఇటీవలి (1966) పరిశోధనలు ఈ రాజుచేత కట్టబడిన 45 ఆలయాలను గుర్తించాయి. వీటిలో ఎక్కువభాగం అన్బిల్ శాసనంలో చెప్పబడిన ప్రాంతంలో ఉన్నవే. ఇతని కొడుకు ఇంకొక 29 ఆలయాలను కట్టించాడు. వీటిలో కొన్ని పైన చెప్పిన ప్రాంతానికి అవతలగా ఉన్నాయి. (బాలసుబ్రమణ్యం, 1971) ఈ రెండింటి మొత్తంలో దాదాపు సగం ఆలయాలను తేవారం త్రయం దర్శించారు. వాటిని గురించి పదికములు (దశకాలు) పాడారు.

బాలసుబ్రమణ్యం పరిశోధనలు చాలా విషయాలను తెలిపేవి. అసాధారణమైన ప్రాధాన్యము గలవి. శాస్త్రీయ పద్ధతులలో ఆయన చేసిన సిద్ధాంతాలు, తేవారంత్రయంచేత దర్శించబడినవని చెప్పబడే ఆలయాల నిర్మాణం గురించిన సాంప్రదాయిక కాలనిర్ణయానికి వ్యతిరేకంగా ఉన్నాయి. ఆయన చేసిన దర్శనాన్వితమైన, శాస్త్రీయమైన సిద్ధాంతాలు ఈ ఆలయాలు 10వ శతాబ్దపు చోళరాజులచేత కట్టబడినవనే విషయాన్ని ధ్రువపరుస్తాయి. కాని ఆయన కూడా ఈ పురాణ సాంప్రదాయంచేత గాఢంగా ప్రభావితులయినట్టున్నారు. అందుచేతనే జాగ్రత్తగా, వివాదాంశమైనా, ఈ, యీ, ఆలయాలు ఒకరో, ఇద్దరో, ముగ్గురో తేవారంత్రయం కవులచేత దర్శించబడ్డాయి కనుక, ఈ ఆలయాలకు పూర్వమే కట్టించబడిన ఆలయాలు అక్కడ ఉండే పుణ్యక్షేత్రాలనే ఉపసిద్ధాంతాన్ని చేర్చారు. ఈ ఆలయాల మౌలిక రూపాలు 7వ శతాబ్దంలో ఉండేవని అనడం కేవలం మొండి పట్టుదలే.

9. తేవారం త్రయం సాపేక్ష కాలక్రమం

10వ శతాబ్దపు తమిళదేశంలో ప్రాచుర్యంలోఉన్న రెండు శైవమత శాఖలనుగురించి ఇంతకుపూర్వమే ప్రస్తావించబడింది. ఆ కాలంలో ఇంకా అనేకమైన ఇతర శైవమత శాఖలు ఉండి వుండవచ్చును. ఆ రెండింటిలో ఆగమాత్మకమైన (తాంత్రిక) శాఖ ఒకటి రెండవది తేవారం త్రయం వారి భక్తి ప్రధానమైనది. ఆ కాలంలో ఈ రెండూ ప్రత్యక్షంగా పరస్పరం ప్రభావితం అయి వుంటాయన డానికి ఆధారమేమీ లేదని కూడా గుర్తుంచుకోవాలి. తేవారం త్రయం యొక్క సాపేక్ష కాలక్రమాన్ని గురించిన చర్చలో ఈ పూర్వరంగం ముఖ్యమయినది.

సాంప్రదాయం తేవారంత్రయం 7వ శతాబ్దంలో జీవించారని చెప్పడమేకాదు, తిరునావుక్కరసర్, తిరుజ్ఞాన సంబందర్‌కి వయసులో పెద్దవాడయిన సమకాలికుడని చెపుతుంది. సుందరర్ వీరికి చాలా కొద్దికాలం తరువాత జీవించాడని కూడా ఈ సాంప్రదాయం చెపుతుంది. ఈ కాలక్రమాన్ని నిరూపించడానికి చాలా శ్రమతో కూడిన ప్రయత్నాలు జరిగాయి. దీనికిగల ఒకేఒక ఆధారం "తిరుమురైక్కండ పురాణం"లోని వృత్తాంతం (వెళ్ళైవరణన్, 1962). ఇది ఏదో ఒక కారణం మూలంగా అందరూ సాధారణంగా అంగీకరించేదే గనుక, ఒకవిధంగాచూస్తే, వెళ్ళైవరణన్ సమర్థన పిష్టపేషణమే అనిపిస్తుంది.

బాలసుబ్రమణ్యం (1966, 1971) కష్టపడి చేసిన ఫలవంతములైన పరిశోధనల వలన ఎన్నో కొత్త విషయాలు తెలిసాయి. వీటినిబట్టి తేవారంత్రయం వారి సాంప్రదాయిక సాపేక్ష కాల క్రమం యొక్క నిజానిజాలను నిర్ణయించవచ్చును. శాసనాలవలన తెలిసిన విషయాలను, నిర్మాణ శైలీలక్షణాలవలన తెలిసిన విషయాలను, ప్రతిమా విద్యకు సంబంధించిన విషయాలను, అన్నింటినీ దృష్టిలో ఉంచుకొని, అనేక దేవాలయ నిర్మాణ కాలాన్ని బాలసుబ్రమణ్యం నమ్మతగినట్లు నిర్ణయించారు. సుమారు పది పన్నెండు ఆలయాల విషయంలో వాటి నిర్మాణకాలం గురించి భిన్నాభిప్రాయం ఉండవచ్చు, కాని మొత్తంమీద మిగిలిన ఆలయాల విషయమై ఈ రచయితచేసిన నిర్ణయాలు నిర్దుష్టంగా ఉన్నాయని ఒప్పుకోవాలి. తేవారం త్రయం దర్శించి పాడారని చెప్పబడే ఆలయాల/స్థలాల పట్టిక ఈ క్రింద ఇవ్వబడింది.

ఆదిత్యుడు I (క్రీ. శ. 871-907)

జిల్లా	ఆలయం ఉండే స్థలం	తిరునావుక్కరసర్	తిరుజ్ఞాన సంబందర్	సుందరర్
తంజావూరు	వేదారణ్యం	×	×	×
,,	తిరువిడై మరుదూర్	×	×	×
,,	తిరుక్కొట్టుత్తురై	×	×	×
,,	తిరువైయారు	×	×	×
,,	తిరునాగేశ్వరం	×	×	×
,,	తిరుమళపాడి	×	×	×
,,	తిరువేంకాడు	×	×	×
,,	తిరుపురంబయం	×	×	×
చెంగల్పట్టు	తిరుక్కళుకున్ఱం	×	×	×
తంజావూరు	తిలైస్థానం	×	×	
,,	తిరువేదిక్కుడి	×	×	
,,	తిరుప్పళనం	×	×	
,,	కండియూర్	×	×	
,,	తిరుక్కాట్టుప్పళ్ళి	×	×	
తిరుచ్చి	తిరుపరైత్తురై	×	×	
తంజావూర్	తిరువేళ్విక్కుడి		×	×
,,	తిరుపూంతురుత్తి	×		
తిరుచ్చి	తిరువెరుంబూర్	×		
తంజావూరు	తిరుప్పునవాల్		×	
,,	తిరునాలూర్ మయానం		×	
తిరుచ్చి	కిల్వాలువుర్		×	
ఉ. ఆర్కాటు	తక్కోలం		×	
,	తిరువళం	×		
ద. ఆర్కాటు	తిరువక్కరై		×	

పరాంతకుడు I (క్రీ. శ. 907-955)


జిల్లా	ఆలయం ఉండే స్థలం	తిరునావుక్కరసర్	తిరుజ్ఞాన సంబందర్	సుందరర్
తిరుచ్చి	ఉయ్యక్కొండాన్	×	×	×
ఆర్కాటు	తిరువామత్తూర్	×	×	×
చెంగల్పట్టు	తిరువొట్రియూర్	×	×	×
తంజావూరు	విజయమంగై	×	×	
,,	తిరుక్కళవూర్	×	×	
ఉ. ఆర్కాటు	తిరుమల్పేఱు	×	×	
ద. ఆర్కాటు	తిరుక్కోవలూర్	×	×	
,,	గ్రామం	×		
తంజావూరు	తిరుపుళువ్వూర్		×	
ద. ఆర్కాటు	వడగూర్		×	
,,	తిరునావలూర్			×

ఉత్తమ చోళుడు (క్రీ. శ. 969-985)

జిల్లా	ఆలయం ఉండే స్థలం	తిరునావుక్కరసర్	తిరుజ్ఞాన సంబందర్	సుందరర్
తంజావూరు	తిరువారూరు	X	X	X
ద. ఆర్కాటు	తిరువెణ్ణెయ్ నల్లూర్	X	X	X
చెంగల్పట్టు	వృద్ధాచలం	X	X	X
తంజావూరు	తిరునారైయూర్	X	X	
,,	మయూరం	X	X	
,,	తిరుమెయ్యమ్పూర్	X	X	
,,	తిరుమణంచేరి	X	X	
,,	తిరుత్తురుత్తి	X	X	
,,	తిరుక్కోడిక్కావల్	X	X	
,,	ఆడుతురై	X	X	
,,	కోనేరి రాజపురం		X	
చెంగల్పట్టు	తిరుములై నాయబూర్			X

పై పట్టిక తేవారం త్రయం 10వ శతాబ్దంలో వరసగా పాలించిన ముగ్గురు చోళరాజుల కాలంలో జీవించేవారని అసందిగ్ధంగా చూపిస్తోంది. వీరి రాజ్యపాలన కాలం మొత్తం 114 సంవత్సరాలు. ఆదిత్యుడిచేత ఆలయాలు (తేవారం త్రయంచేత దర్శించబడినవి, వారిచేత దర్శించబడనివికూడా) కట్టించ బడడానికి 10, 15 సంవత్సరాలు పట్టి వుంటుందనుకుంటే వారు ముగ్గురూ 100 సంవత్సరాల కాల పరిధిలో ఉండి వుండాలి. ఒక్కొక్కరికి సరాసరి 33 సంవత్సరాలు కేటాయించాలి, ముఖ్యంగా వారు ముగ్గురూ ఒకరి తరువాత ఒకరు జీవించారు అనుకుంటే. అయితే ఇటువంటి అభిప్రాయానికి అణుమాత్రమైనా ఆధారంలేదు. ఎందుచేతనంటే తేవారం త్రయం కవులు ముగ్గురూ ఆదిత్యుడు I రాజ్యకాలంలో ఆలయాలను గురించి పాడారు; పరాంతకుడు I రాజ్యకాలంలో రెండు ఆలయాలను గురించి పాడారు, ఉత్తమ చోళుడి కాలంలో ఆలయాలను గురించికూడా పాడారు. దీనిని బట్టి వీరు ముగ్గురిలో ప్రతి ఒక్కరు 70/80 సంవత్సరాలు జీవించి వుండాలి. ఈ విధంగా పట్టికలోని విషయాలు దానిని సూచిస్తున్నా, చాలా అసంభావ్యమయిన ఒక నిర్ణయానికి రావలసి వస్తుంది.

ఈ పరిస్థితి ఇదివరకే(విమర్శ 2)వేయబడిన ప్రశ్నని మళ్ళీ వేసే టట్లు చేస్తుంది - తేవారం తయం నిజంగానే దశకము వ్రాసిన ప్రతి గుడిని స్వయంగా దర్శించారా? ఈ పట్టిక చూడగానే తిరునావుక్కరసర్, తిరుజ్ఞాన సంబందర్, సమకాలికులనే సాంప్రదాయాన్ని ధ్రువ



7వ శతాబ్దంలో చోళిక విషయం

పరుస్తున్నట్లే అనిపిస్తుంది; తిరునావుక్కరసర్, తిరుజ్ఞాన సంబందర్ కలిసి కొన్ని ఆలయాలను దర్శించినట్లు తోస్తుంది. కాని తరచి చూస్తే సాంప్రదాయకమైన ఈ నమ్మకాన్ని పూర్తిగా వమ్ము చేస్తుంది. ఎందుచేతనంటే వీరు ఆదిత్య పరాంతకుల కాలంలోనూ, తిరిగి ఉత్తమచోళుడి కాలంలోనూ కూడా ఈ విధంగా చేసారంటే నమ్మడం కష్టం కనుక. దీనిని నమ్మాలంటే వీరు ముగ్గురూ 70/80 సంవత్సరాలు జీవించారని, అంతేకాకుండా సమకాలికులుగా జీవించారని కూడా విశ్వసించాలి.

ఈ విధంగా పెరియపురాణం తిరుమురైక్కండ పురాణాల లోని తేవారం త్రయం వారి ఆలయదర్శనాన్ని గురించిన సాంప్రదాయాన్ని, చరిత్రవలన తెలిసిన విషయాల్ని కలిపిచూస్తే, వారి సాపేక్ష కాలక్రమాన్ని గురించి రెండు ప్రతిపాదనలు ఉత్పన్నమవుతాయి.

1) తిరునావుక్కరసర్, తిరుజ్ఞాన సంబందర్ సమకాలికులు అయివుంటే, వారు ఆదిత్యుడు I, పరాంతకుడు I, ఉత్తమచోళుల రాజ్యకాలాలలోని ఆలయాలను గురించి పాడారు కనుక వారి ముగ్గురి రాజ్యకాలాల్లోను, అంటే 10వ శతాబ్దంలో సుమారు 80 సంవత్సరాలు సమకాలికులుగా జీవించి వుండాలి. సుందరర్ కూడా ఆ కాల పరిధిలోనే వారితోపాటు 15 ఆలయాలను గురించి పాడారు కనుక ఆయనకూడా వారికి సమకాలికుడై ఉండాలి.


ii) ఈ ముగ్గురూ, 10వ శతాబ్దంలో వరసగా పాలించిన రాజులచేత కట్టబడిన ఆలయాలను గురించి పాడడం, తిరునావుక్కరసర్, తిరుజ్ఞాన సంబందర్, సుందరర్ ఈ క్రమంలో ఒకరి తరువాత ఒకరు జీవించారనే నమ్మకాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తోంది.

కాలక్రమాన్ని అనుశీలించడానికి, చరిత్ర పరిశోధనల వలన తెలిసిన విషయాలు ఆధార పడతగినవీ, నమ్మతగినవీ అనీ, సాంప్రదాయం వలన తెలిసిన విషయాలు ఆధారపడతగనివీ, నిరుపయోగమైనవీ అనీ మరచిపోకూడదు. తేవారం త్రయం ఆలయ దర్శనాన్ని గురించి కలిగిన సందేహం పూర్తిగా ధ్రువపడుతోంది. తేవారం త్రయం వారిది భక్తిమార్గము. దానిని ప్రచారం చెయ్యడానికి వారు పౌరాణిక గాథలమీద ఎక్కువగా ఆధారపడ్డారు. తాంత్రిక సిద్ధాంతాలమీద ఆధారపడిన శివాలయాలలోని మార్గంకంటె ఇది భిన్నంగా ఉండేది. కాని రెండుమార్గాలవారికీ 'పరమేశ్వరుడు' శివుడు. తేవారం త్రయం ప్రార్థనలద్వారా, భక్తిద్వారా శివుని మహిమను కీర్తించేవారు; ఆలయాలు ఆగమవిహితమైన కర్మకాండ ద్వారా దీనిని చేయడానికి ప్రయత్నించేవి. తేవారం త్రయంచేత ఏదైనా ఒక ప్రత్యేకమైన దేవాలయం/స్థలం ప్రస్తావించబడడం కేవలం ఆనుషంగికం. ఈ ప్రస్తావనల ఉద్దేశ్యం శివుడు ఏ ఆలయంలోఉన్నా, ఎక్కడఉన్నా ఒక్కడే అనీ, పరమాత్ముడైన ఇతడు అంతటా ఒక్కడే అని నొక్కి చెప్పటము. ఈ సందేశాన్ని చెప్పడానికి వీరు ఈ ఆలయాల నన్నింటిని స్వయంగా దర్శించి వుండనక్కరలేదు. హిమాలయాలలోను, సింహళంలోనుఉండే ఆలయాలలోని దేవునిగురించి దూరంనించే పాడినట్లు, ఇంకా అనేకమైన ఇతర ఆలయాలను గురించి కూడా దూరంనించే పాడివుండవచ్చు. పురాణాలలోని కొన్ని ఘట్టాలు, సంఘటనలు ఎన్నో దేవాలయాలను గురించిన తేవారంలలో ప్రీతితో వర్ణించబడడము, తేవారం త్రయముకు శివునియందుండే భావాన్ని తెలుపుతుంది. బాహ్య వ్యక్తీకరణము, స్థలము ఏదైనా, శివుడొక్కడే పరమాత్మ అనీ, సర్వాంతర్యామి అనీ వారు వ్యక్తపరచిన భావము. అందుచేత వారు ఏదైనా ఒక దేవాలయాన్ని పేర్కొనడం ఆనుషంగికము, అప్రధానము.

10. క్షేత్రయాత్రా సాంప్రదాయము

పెరియపురాణమే నిస్సందేహంగా తేవారం త్రయం వివిధ ప్రాంతాలలోని శివాలయాలను దర్శించారని పేర్కొన్నది. దీని రచయిత శేక్కిళార్ 'అనపాయుడ'ని బిరుదుకల చోళరాజుకు సమకాలికుడని నమ్మబడుతోంది. ఈ అనపాయుడు కులోత్తుంగుడు II. క్రీ. శ. 1133-1150 అని గాని, (నీలకంఠశాస్త్రి, 1955) కులోత్తుంగుడు III, క్రీ. శ. 1178-1186 (సదాశివ పండరత్తార్,

1967) అని గాని గుర్తించబడుతున్నాడు. 63 శైవభక్తులను కీర్తించవలెననే ధర్మప్రేరణచేత ఈ పవిత్ర గ్రంథాన్ని శేక్కిళార్ వ్రాశాడు. ఇటువంటి గ్రంధాలలో సాధారణంగా కథను చెప్పడంలో ఉపయోగించబడే యుక్తులు అన్నీ ఇందులోనూ కనిపించుతాయి. ఉత్ప్రేక్ష, సంభావ్యమైన యధార్థాలను వాటి వాస్తవికతను మార్చివేసి అంతటి మార్పులకు లోనుజెయ్యడం, కొత్త భావాలను, ఏదో ఒకవిధమైన దీక్ష ఇచ్చిన తరువాత- ప్రోత్సహించడం ఈ కలయికకు ఇంకొక నిదర్శనం. ఈ విధంగా బయటనించి వచ్చిన మతాల, దేశీయమైన మతాలమధ్య ఏర్పడిన సంబంధం పరస్పర ఆదాన ప్రదానాలు, సద్భావముతో కూడుకున్నది (స్వామి, 1972b). ఈ విధమైన సమ్మేళనము తరువాత చాలా కాలంవరకూ, 13వ శతాబ్దం వరకూ జరుగుతూ వచ్చింది.



మహేంద్రవర్మ I శాసనాలు, శిల్పాలు

ఆలోచనలను కల్పించడము లేదా ఉన్నవాటికి చేర్చడము, ఇవన్నీ ఊహచేత సృష్టించబడడము ఇత్యాది.

తేవారం త్రయం విగ్రహాలను ఆలయాలలో ప్రతిష్ఠించడము, తేవారంలను ఆలయాలలో పఠింపచేయడముబట్టి రాజరాజ కాలం నాటికే వారికి దైవత్వ మారోపించబడ్డదని గమనించాలి. ఇవి తేవారం త్రయం పాడిన గుడులకు మాత్రమే పరిమితమై ఉండకపోవడం కూడా తేవారాల సామాన్యతను తెలుపుతుంది. (స్వామి, 1972a).

ఈ సందర్భంలో రాజరాజ I కాలంలో శైవమతంయొక్క స్వభావాన్ని గుర్తించుకోవాలి. అది దేశంలో గోళకీమతం (అప్పు శైవం) రాజాదరణ వలన ప్రాచుర్యంలోకి వస్తున్నకాలం. ఈ కొత్త ఆగమ తమిళశైవాన్నంతటిని ముంచివేసి అక్కడి దేశీయమైన శైవమత శాఖల నన్నింటిని తనలో కలిపివేసుకున్నది. ఈ పరిణామం ఫలితంగానే ఆళుడైయ పిళ్లై తిరుజ్ఞాన సంబందర్ అనే కొత్తపేరుతో ఈ శైవవర్గంలో చేర్చుకోబడ్డాడు. తిరుప్పదియంలను (తేవారంలను) దేవాలయాలలో పాడడానికి పాటకులను నియమించి-బహుశా

ఈ సమ్మేళనము జరుగుతున్న కాలంలోనే పెరియ పురాణం వ్రాయబడింది. ఈ గ్రంథం పై రెండు శైవమార్గాల కలయికకు దారి చూపే ప్రయత్నమే. ఈ లక్ష్యాన్ని సాధించడానికే శేక్కిళార్ చేత తేవారం త్రయంవారు దేశకము వ్రాసిన ప్రతి ఆలయానికి స్వయంగా వెళ్లినట్లు, ఈ విధంగా వారి భక్తిమార్గానికి, ఆలయాలలోని ఆగమ మార్గానికి ఐక్యత కలిగించి వ్రాయబడింది.

పుణ్యక్షేత్రాలకు యాత్ర వెళ్లడం, బౌద్ధకాలంనుంచి వస్తున్న ప్రాచీన భారతీయ సాంప్రదాయం. జైనులు కూడా ఈ సాంప్రదాయాన్ని అనుసరించినవారే. సన్యాసులకు విధించబడిన కొన్ని నియమాల ప్రకారం వారు వర్షాకాలం తప్ప మిగిలిన సంవత్సరమంతా తీర్థయాత్రలు చేయాలి. నిజానికి ఈ సాంప్రదాయం ఇప్పటికీ అనుసరించబడుతోంది. శేక్కిళార్‌కు ఈ సాంప్రదాయం తెలియనిదికాదు. తేవారం త్రయం జీవితం గృహస్థ జీవితం కాదని గుర్తించుకోవాలి. వారు విధ్వంశమైన జీవితం జీవించినవారు. వారి జీవితంలోని ఈ ప్రవృత్తిని ఒత్తి చెప్పడం వారి మొదటి జీవిత చరిత్ర రచయిత

ముఖోద్దేశాలలో ఒకటి. శేక్కిళార్ ఊహలు, ఆదర్శాలు తేవారం త్రయం జీవితాల పైన, వారి తేవారంలను ఉపయోగించడంద్వారానే, ఆరోపించ బడ్డాయి.

దశకాలను గురించే ఒక విషయాన్ని గుర్తించాలి. తిరుజ్ఞాన సంబందర్ వ్రాసిన దాదాపు ప్రతిదశకము చివర 11వ పద్యము ఒకటి ఉంటుంది. ఈ చివరిది తరువాత ఎవరిచేతో వ్రాయబడి చేర్చబడిన దని తెలుస్తూనే ఉంది. ఈ 11వ పద్యము దానికి ముందున్న పది పద్యాలు ఉన్న ఛందస్సులోనే ఉన్నా, దానిలోని వస్తువు, ఆశయాలు, వాటిని చెప్పే శైలి అన్నీ పూర్తిగా భిన్నంగా ఉంటాయి. ఈ 11వ పద్యంలోనే జ్ఞానసంబందర్ అనే పేరు చాలాసార్లు కనపడుతుంది. వీటన్నింటినిబట్టి, ఈ 11వ పద్యాలు ప్రక్షిప్తాలని నిశ్చయించబడింది (స్వామి, 1972a) ఈ పని గోళకీమఠం దేశీయ శైవ మార్గాలను తనలో కలుపుకుంటున్న కాలంలో జరిగి వుంటుంది. పెరియపురాణం వ్రాయబడిన కాలానికి మాత్రం పూర్వమే జరిగివుంటుందని చెప్ప వచ్చు.


iv) ఈ నిర్ణయాల ఫలితంగా కలిగే ఆలోచనలు.

ఈ పరిశీలన వలన తేలిన ముఖ్య విషయం తేవారం త్రయం 7వ శతాబ్దపు పల్లవరాజులకు సమకాలికులు కారని. తిరునావుక్కరసర్, తిరుజ్ఞాన సంబందర్, సుందరర్‌లతో సాంప్రదాయకంగా సంబంధంకల ఆలయాలన్నీ 10వ శతాబ్దపు చోళరాజులచేత కట్టించబడినవే కనుక వీరి కాలము ఈ రాజుల రాజ్యకాలంతో సరి పోవాలి. అది ఆదిత్యుడు I నుంచి ఉత్తమ చోళుడి వరకు పాలించిన చోళరాజుల కాలం.

1) ఈ నిర్ణయం 7వ శతాబ్దపు పల్లవుల శైవమత స్వభావాన్ని గురించిన పరిశీలనలకు 'వ్యతిరేక' సాక్ష్యంగా ఉంటుంది. ఇంతవరకు ఈ విషయాన్ని పరిశీలించిన రచయిత లందరు తేవారం త్రయం (ముఖ్యంగా తిరునావుక్కరసర్, తిరుజ్ఞాన సంబందర్) మహేంద్రవర్మ I నుండి నరసింహవర్మ II వరకు పాలించిన పల్లవ రాజుల సమకాలికులు అన్న నమ్మకంచేత బలంగా ప్రభావితులైనవారే. ప్రస్తుత పరిశీలనల ఫలితంగా 7వ శతాబ్దపు తొండైమండలపు మత చరిత్రను, తేవారం త్రయంను ఆ రంగంనుంచి పూర్తిగా తొలగించి, పునః పరిశీలించి వ్రాయవలసి ఉన్నది.

తేవారంలలోను, పెరియపురాణంలోను, అక్కడక్కడ సందర్భ వశాత్తు కనిపించే పల్లవులు, ఆయా కథలకు నిండుతనాన్ని కలిగించ టానికి, నమ్మతగినట్లు కనిపింపచేయడానికి చేర్చబడిన వ్యక్తులు ఇంకొక విధంగా చెప్పాలంటే ఈ రచయితల ఉద్దేశ్యం నెరవేరడానికి ఈ సందర్భాలలో వేరే ఏ వంశానికి చెందిన ఏ రాజులయినా ప్రవేశ పెట్టి ఉండవచ్చు సాహిత్యంలో కనపడే ఇటువంటి వ్యక్తులను వారి త్రక పురుషులుగా భావించడమూ, వారిని మనకు ఇంకొక విధంగా తెలిసిన ఆయా వ్యక్తులనుగా గుర్తించడము వలన చరిత్ర అప రూపము పొందడము, అసత్యమవడము జరుగుతుంది.


2) తేవారం త్రయం 7వ శతాబ్దపు పాండ్యులకుకూడా సమకాలికులు కారు. తిరుజ్ఞాన సంబందర్‌ను ఆదరించిన పాండ్యరాజును మారవర్మన్ అరికేసరిగా గుర్తించడానికి విశ్వసనీయమైన ఆధారాలేవీ లేవు. ఒకవేళ దీనిని ఒప్పుకొన్నా ఈరాజు జైనమతానుయాయి అని అనుకోవడానికి ఏవిధమైన ఆధారము లేదు. ఈ రాజు మంగయార్



తేవారం త్రయం సందర్శించి, పాడినట్లు చెప్పబడిన దేవాలయాలు.

క్కరసి, కులచ్చిరై వలె 10వ శతాబ్దంలో జీవించిఉన్నా ఉండాలి, లేదా ఈ రచయితల ఊహలో కల్పించబడి అన్నా ఉండాలి.

3) తేవారం త్రయం 10వ శతాబ్దపు వారని నిర్ణయించ బడిన ఫలితంగా 63 శైవ భక్తులలో మిగిలిన 60 మంది శివ భక్తుల కాలాన్నికూడా పునః పరిశీలించ వలసి వస్తుంది. తిరునావుక్కరసర్ తేవారంలో వీరిని 10మంది పేర్కొనబడ్డారు. తిరుజ్ఞాన సంబందర్ తేవారంలో 13గురు పేర్కొనబడ్డారు. వీరిలో 5గురు తిరునావుక్కరసర్‌చేత పేర్కొనబడినవారే. 'తిరుతొండత్తొగై' రచయిత సుందరర్ అనుకుంటే అందులో 62 శివభక్తుల పేరు గల పట్టిక ఉన్నది. దీనిలో తిరునావుక్కరసర్, తిరుజ్ఞాన సంబం



చుక్కలుగా చూపించబడిన దేవాలయాలు 10వ శతాబ్దంలో చోళులు స్థాపించినవి. వీటినే తేవారం త్రయం సందర్శించినట్లుగా చెప్పబడుతుంది.

దర్ పేర్కొన్న పేర్లేకాక వారిద్దరి పేర్లుకూడా చేర్చబడ్డాయి. తేవారం త్రయంచేత పేర్కొనబడ్డ నయన్మారులందరు, సాంప్రదాయం చెపుతున్నట్లు సమకాలికులే అయితే, మొత్తం 63 శివ భక్తులు 10వ శతాబ్దంవారే అయివుండాలి.

కాని 'తిరుతొండత్తొకై' సుందరర్‌చేత వ్రాయబడిందనడానికి బలమైన సాక్ష్యమేమీలేదు. శివుడిని, ఆయన లీలలను కీర్తించడము, ఈ త్రయంలోని మిగిలిన ఇద్దరికీ సహజమైనట్లే సుందరర్‌కు సహజమే అనిపిస్తుంది. వారు సందర్భవశాత్తు కొందరు శివ భక్తులను పేర్కొనడం సహజమే. కాని శివభక్తులను (శివనడియార్లను) కీర్తించడము ఒక స్థిరపడిన వ్యవస్థగా 10 శతాబ్దంలో ఏర్పడి వుండడము సందేహాస్పదమే.

చాలా భారతీయ భాషల వాఙ్మయ చరిత్రలో విపులమైన దీర్ఘమైన గ్రంథాలు, వాటి సంగ్రహరూపాలకంటె ముందే వ్రాయబడేవి. ఉదాహరణకు కన్నడంలోని 'శివగణద రగళెగళు' శివ భక్తుల చరిత్రను విపులంగా వర్ణించే గ్రంథము. దాని సంగ్రహరూపాలు దానికి చాలా తరువాతి కాలంలో వ్రాయబడ్డాయి. తమిళభాషలో ఇందుకు వ్యతిరేకంగా జరిగిందనుకోవడానికి తగిన కారణమేమీలేదు. 'తిరుత్తొండత్తొకై', 'తిరుత్తొండ త్తిరువందాది' శేక్కిళార్ తిరుత్తొండర్ పురాణం (పెరియపురాణం) యొక్క సంగ్రహ రూపాలకి ఉదాహరణాలు.


ఈ సంగ్రహరూపాలకు ఒక నిర్దిష్టమైన ఉద్దేశ్యం ఉన్నది. మనస్సును ధ్యానాభిముఖంగా చేయటము, మనస్సును ఆ స్థితిలో నిలపడానికి సహాయపడడము. ఇవి ధ్యానము చేయడానికి, ముఖ్యంగా సంసారులకు, తమ జీవితాలను పూర్తిగా మతానికే అంకితము చేయని వారికి, సహాయము చేయడానికి వ్రాయబడినవి. ప్రతిదినము పారాయణ చేయడానికి ఇవి ఉపయోగించుతాయి. ఇదంతా ఆలోచించితే 'తిరుత్తొండ త్తొకై', 'తిరుత్తొండ త్తిరువందాది' పెరియ పురాణం తరువాత వ్రాయబడినవని అనిపించక మానదు. అందుచేత 60 మంది శివభక్తులలో ఎక్కువమంది తేవారం త్రయంకాలం (10వ శతాబ్దం) నుండి శేక్కిళార్ కాలం (12/13 శతాబ్దాలు) వరకు జీవించి వుండవచ్చు.

4) 7వ శతాబ్దంలో తమిళదేశంలో బౌద్ధజైన మతాలు ప్రాముఖ్యంలో ఉండేవని, తేవారంత్రయం-బహుశా వైష్ణవ ఆళ్వారులుకూడా-ఈ మతాలను అప్పటి కప్పుడే నిర్మూలించి తమ మతాలకు ప్రాముఖ్యాన్ని గడించారని చరిత్రకారులు గట్టిగా నమ్ముతున్నారు. కాని జైనమతం-బౌద్ధమతం [కాకపోయినా-తమిళ కన్నడ దేశాలలో 12వ శతాబ్దం వరకు ఒక ముఖ్యమైన మతంగా ఉండేదని సారస్వతము, శిల్పము, శాసనాలు తెలుపుతున్నాయి. 10వ శతాబ్దంలో జైనమతాన్ని, అవశిష్టంగా ఉన్న బౌద్ధమతాన్ని, తేవారం త్రయం ఎదుర్కోవలసి వచ్చింది. ఈ శైవమతోద్యమం పరిణామంగానే తమిళంలో పెరియ పురాణం, కన్నడంలో శివగణద రగళెగళు, 63 గురు శివ భక్తుల చరిత్ర క్రోడీకరించబడి, వ్రాయబడ్డాయి. ఈ సంఖ్య 63 గా ఎందుకు స్వీకరించబడినది అనేది వేరుగా పరిశీలించవలసిన ఇంకొక సమస్య.

హరి హరుడు శేక్కిళార్‌ను అనుకరించినట్లుగాని, శేక్కిళార్ హరిహరుని అనుకరించినట్లుగాని కనపడదు. తమిళంలో పెరియ పురాణానికి ముందరి రచనలలోనే 63 గురు శివభక్తులలోని కొందరి పేర్లు కనిపించినట్లే, కన్నడంలో శివగణద రగళెగళుకు ముందర వ్రాయబడిన 'వచనాల' లోను కనిపించుతాయి. కనుక వీరిద్దరికీ సామాన్యమైన ఆకరము ఒకటి ఉన్నట్లు తోస్తుంది. ఇది లిఖిత రూపమైన గ్రంథము అయివుండనక్కరలేదు. వారి కాలంలో ప్రాచుర్యంలోఉన్న గాథలు కావచ్చును.

భారతదేశంలో మతోద్యమాలకు రాజకీయమైన పరిహద్దులు అడ్డువచ్చేవికావు. మధ్యయుగపు మొదటి కాలంలో జైనులు, తమిళ కన్నడ దేశాల మధ్య ఒక విధమైన సంబంధ బాంధవ్యాలను నె

పెట్టారు ఈ విషయమై ఇంకా చాలా పరిశోధన జరగవలసిఉన్నా శైవం విషయంలో కూడా ఇటువంటి స్థితే ఉండేదని రెండు ఉదాహరణలు తెలుపుతున్నాయి. కన్నడదేశంనుంచి వచ్చిన కాలాముఖ మార్గము, తమిళదేశంలో తాత్కాలికంగానే అయినా కొన్నిస్థావరాలను ఏర్పరచుకొన్నది. చోళ రాష్ట్రకూట యుద్ధాలకు, ఈమత విస్తరణకు సన్నిహిత సంబంధం ఉన్నది. (స్వామి, నంజుండన్, 1972.) VIII వ తిరుముఱైలోని కొన్ని పద్యాలలో కోగిళి పీఠాధిపతి పేర్కొనబడడం, ఈపద్యాలు వ్రాసిన రచయితకు కోగిళి, 500లోని కాలాముఖ మతంతోకల సంబంధాన్ని నిరూపిస్తుంది. ఈ కోగిళి, 500 10/11 వ శతాబ్దాలలో బళ్ళారి, హరిపనహళ్ళి జిల్లాలలో భాగం. (స్వామి, 1974) తమిళ, కన్నడ దేశాలు రెండింటిలోను యోగమార్గము, గోరఖ్‌నాథుని తత్త్వము బాగా తెలిసినవే. (నంజుండన్, 1972), ఈ రెండు ప్రాంతాలలోను ప్రత్యభిజ్ఞాదర్శనము కూడా ఆదరించబడినది. (కృష్ణారావు, 1970; స్వామి 1972d ఇంకా ఇతరమైన అప్రధాన శైవమత శాఖలు-కాపాలిక, భైరవ(?) కాల ముఖ — తమిళ, తెలుగు, కన్నడ దేశాలలో ఈకాలంలో ప్రజాభిమానం పొందినట్లు తోస్తుంది. తమ తలను గాని, కాలు చేతులను



త్రికోణాలు 7వ శతాబ్దపు పల్లవ శైవాలయాలు. తేవారం త్రయం సందర్శించి పాడిన గుడులుగా చెప్పబడేవి సున్నాలు అన్నీ తొండై మండలంలోనివి.

గాని తామే తెగవేసుకోవడంవంటి సాంఘిక ఆచారాలు ఈ ప్రాంతాలన్నిటా ఉండేవి.

యుద్ధాలవంటి రాజకీయ ప్రభావాలవల్లనే కాకుండా మణిగ్రామం, అయ్యవోలు పట్టణ స్వాములు వీరబళంజులు మొదలైన వర్తక సంఘాల మూలాన కూడా ఈ సంబంధ బాంధవ్యాలు గట్టిపడి వుంటాయనిపించుతుంది. ఈ వర్తకులు తమ సరకులతో వేరువేరు భాషలుకల ఈ ప్రాంతమంతటా తిరుగుతూ ఉండేవారు. వీరు సాధారణంగా జైనులో, శైవులో అయి వుండేవారు. వారు అవలంబించిన ఈ మతశాఖలను ఇంకా వివరంగా పరిశీలించవలసి ఉన్నది.

5) అరుదుగానైనా, తమిళ వాఙ్మయ చరిత్రకారులు, తేవారంకు వ్యాఖ్యలెందుకు వ్రాయబడలేదు అనే ప్రశ్నను ఎదుర్కోవలసి వుంటుంది. ఆళ్వారుల దివ్యప్రబంధాలకు శైవ-సిద్ధాంత మత గ్రంథాలకు, తిరుములై గ్రంథావళిలోని 'ఎట్టుత్తొకై' తత్తుత్తొకైలకు (VIII, X, పుస్తకాలకు), శిలప్పదికారం, మణిమేకలైవంటి పెరుంకాప్పియంలకు, వ్యాకరణ, ఛందశ్శాస్త్ర గ్రంథాలకు ఎన్నింటికో వ్యాఖ్యలు (కొన్ని సమయాలలో ఒకటికంటె ఎక్కువ) వ్రాయబడడం చూస్తే ఈ ప్రశ్నయొక్క ప్రాముఖ్యం తెలుస్తుంది.

ఈ ప్రశ్న ఇంతకుపూర్వం కొంతమందికి తట్టింది. నాకు తెలిసినంతవరకు దీనికి రెండురకాల కారణాలు చెప్పబడుతున్నాయి. కొంతమంది పండితుల అభిప్రాయం ప్రకారం (ఇది అచ్చులో వచ్చిందో లేదో నాకు నిశ్చయంగా తెలియదు.) తేవారం 'దేవుని వాక్కు' దానిని వ్యాఖ్యానించడానికి మానవులు సమర్థులుకారు. ఈ వివరణను మతపరంగా సరసమైనదని గౌరవించినా, 'దేవవాక్కు'గానే పరిగణించబడే దివ్య ప్రబంధాలుమాత్రం ఎందుకు వ్యాఖ్యానించబడినాయి అనే సందేహము కలుగుతుంది. రెండవ వివరణ—ఇది వివరణే అయితే- ఉ. వే. స్వామినాథయ్యర్ తన ఆత్మచరిత్రలో వ్రాసిన ఒక సంఘటన. గొప్ప పండితుడు, పరమశైవుడు అయిన శ్రీ త్యాగరాజ చెట్టియార్‌ను తేవారంకు వ్యాఖ్య వ్రాయవలసినదని ఎంతోమంది గట్టిగా కోరుతువుండేవారు. దానికి అయన మౌనం వహించేవారు. ఒకరోజు స్వామినాథ అయ్యరు, త్యాగరాజ చెట్టియార్ కావేరీతీరాన నుంచుని ఉన్నపుడు అయ్యరు తమ పాత కోరికను అయనకు జ్ఞాపకం చేసారు. దాని కాయన ''మీరు దానిని గురించి బలవంతంచేస్తే నేను నదిలోకి దూకుతాను'' అని అన్నారు.

ఈ సంఘటన ఇంతవరకే వ్రాయబడింది. కాని దీని నీతి ఏమిటో వివరించబడలేదు. త్యాగరాజ చెట్టియార్ వ్యాఖ్య వ్రాయక పోవడానికి కారణం, అందుకు తగిన ప్రతిభా వ్యుత్పత్తులు లేకపోవడం కాదు. వేరే కారణమేదో ఉండి వుండాలి. ఇంతకుపూర్వమే తేవారం త్రయం కాలంలో, శైవమతంలో రెండు ముఖ్యమార్గాలు, 1) ఆగమాత్మకమైనది, 2) భక్తి ప్రధానమైనది ఉండేవనే విషయం గుర్తించబడింది. తరువాతి కాలంలో ఈ రెండు మార్గాలను సమ

స్థాయం చేకూడానికి అనేక ప్రయత్నాలు జరిగాయనే విషయం కూడా గుర్తించబడింది. ఈ ప్రయత్నాలు మతపరంగా, కర్మకాండ విషయంలో ప్రజామోదం పొందినా, దార్శనికతలంలో అంతఫలవంతము కాలేదని తోస్తుంది. ముఖ్యంగా సిద్ధాంతశాస్త్రాలు చెప్పే శైవ సిద్ధాంతములను అనుసరించే వారి విషయంలో ఇది నిజము. సిద్ధాంత–శాస్త్రాలకు వ్యాఖ్యానం వ్రాసిన వారెవ్వరు, తమ సిద్ధాంత వివరణలో గాని, విపులీకరణలోగాని, తేవారం త్రయంను ప్రస్తావించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. దీనినే ఇంకొక విధంగా చెప్పాలంటే, ఆగమ సాంప్రదాయులైన వీరి దర్శనంలో తమ సాంప్రదాయానికి వెలియైన 'భక్తి'కి స్థానంలేదు.

మత గ్రంథాలకుగాని, లౌకిక గ్రంథాలకుగాని వ్యాఖ్యానం వ్రాసే అలవాటు తమిళదేశంలో 12/13 శతాబ్దాలలో ప్రారంభించబడింది. ఈ ఆచారం తరువాతి శతాబ్దాలలో ప్రతిభావంతులైన పండితులనేకులచేత కొనసాగించబడింది. లౌకిక గ్రంథాలకు ఒక వర్గపు పండితులు వ్యాఖ్యలు వ్రాసారు; శైవ సిద్ధాంత గ్రంథాలకు ఇంకొక వర్గం వారు వ్రాసారు. ప్రేమ, శరణాగతులతో కూడుకున్న 'భక్తి' అంశము వైష్ణవమతపు మూలసిద్ధాంతములలో భాగం కావడంచేత ఆచరణ తలంలోను, తత్త్వ తలంలోను భాగముయి, ఆళ్వారుల సంకీర్తనలపై వ్యాఖ్యానాలలో చోటుచేసుకున్నది. కాని శైవ సిద్ధాంత దార్శనిక ప్రణాళికలో 'భక్తి' అంశం మూలసిద్ధాంతాలలో భాగం కాకపోవటంచేత, తేవారం ఈ ప్రణాళికలో అసంబద్ధంగా ఉండిపోయింది. ఈ స్థితి ఈ దర్శనానికి మాత్రమే పరిమితమయినదికాదు. ఆచరణ విషయకంగా ప్రజామోదం పొందినా కన్నడ భాషలోని వీరశైవుల 'వచన' వాఙ్మయము, వైష్ణవుల 'దాస' వాఙ్మయము, ఆ యా మతాల దార్శనిక తత్త్వాలలో అసమన్వితమైన వేరే ఉపప్రణాళికలుగా ఏర్పడ్డాయి. (కృష్ణారావు, 1970) తాంత్రిక యోగార్థకమైన "బెడగిన వచన" వాఙ్మయానికి తప్ప మిగిలిన వచన వాఙ్మయానికిగాని, దాస వాఙ్మయానికి గాని వ్యాఖ్యానాలు లేకపోవడం గమనించదగిన విషయం.

తేవారంలో శైవ సిద్ధాంత దార్శనిక తత్త్వబీజాలను కనిపెట్టడానికి జరిగిన ప్రయత్నాలన్నీ 20వ శతాబ్దపు ఇటీవలి కాలానివి ఈ ప్రయత్నాలు ఎంతవరకు ఫలవంతమవుతాయో ఇప్పుడే చెప్పలేము. చారిత్రక సింహావలోకనము, భక్తి, శైవ సిద్ధాంత ఉద్యమాల ఉత్పత్తి వేరని, వాటి పరిణామము సమానాంతరముగా సాగిందని నిరూపిస్తుంది. వీటిలో 'భక్తి' తత్త్వము రెండవ దానికంటె ప్రా[illegible]నది.

6) ఇ తను ముందే తేవారం త్రయం 7వ శతాబ్దపు పల్లవులు కట్టించిన ఆలయాలలో ఎందుకు పాడలేదు అనే ప్రశ్న వేయబడింది. సుమారు 250 సంవత్సరాలకాలం పల్లవులచేత అవిచ్ఛిన్నంగా పాలించబడిన వారి దేశం, దంతివర్మ కాలంనుంచి రాష్ట్రకూటులు, చోళుల దండయాత్రలకు గురి అయింది. పల్లవ వంశం ఆతని కాలంలో క్షీణించడం మొదలుపెట్టి, 9వ శతాబ్దానికి దాదాపు అంతరించిపోయింది. (మహాలింగం, 1969) తొండైమండలంలో దేశీయమైన మత జీవితం ఈ క్షీణకాలంలో ఉన్నతస్థితిలో ఉంటుందనుకోలేము. రాష్ట్రకూటులచేత ఈ కాలంలోనే ఒక కొత్త శైవమత మార్గము (కాలాముఖం) ప్రవేశపెట్టబడడం బట్టి ఈ స్థితి మరింత అసంభావ్యం అవుతుంది. (స్వామి, నంజుండన్, 1972.) పల్లవుల దేవాలయాలలోని కర్మకాండ మొదలైనవి క్షీణదశలో ఉండివుంటాయి. ప్రజలకు వాటిమీద నమ్మకం తొలగిపోయి వుంటుంది. తేవారం త్రయం జీవించిన 10వశతాబ్దంనాటికి ఈ పల్లవదేవాలయాలు. ఒకనాటివాటి ప్రజాదరణను కోల్పోయి, నిర్లక్ష్యం చేయబడి, నిరుపయోగంగా మిగిలిపోయాయి. అందుచేత తేవారం త్రయం పల్లవులచేత కట్టించబడిన ఆలయాలను దర్శించకపోవడానికి కారణం కాలక్రమంలోని విలంబనం.

7) తమిళదేశంలో చరిత్ర పరిశోధన పద్ధతులలో తమిళ వాఙ్మయంలోని సాహిత్య గ్రంథాలను విరివిగా ఉపయోగించే ధోరణులు ఎక్కువవుతున్నాయి. ఈ గ్రంథాలు వ్రాయబడిన కాలం సుమారుగానైనా నిశ్చయంగా తెలిస్తే ఈ పద్ధతి నుపయోగించడంలో ఆక్షేపించతగినదేమిలేదు. కాని తమిళ వాఙ్మయంలోని చాలా గ్రంథాల రచనాకాలం ఇంకా నిర్ణయింపబడకుండానో, లేక కేవలం అప్రమాణికమైన నమ్మకాల, వాదనలమీద ఆధారపడి నిర్ణయింపబడో ఉన్నది. ఇదేవిధంగా తేవారంత్రయం 7వ శతాబ్దంలో జీవించారనే విషయం నిరూపితమైనట్లు, కొంతమంది ప్రాచీన పల్లవ, పాండ్య, చోళ రాజుల కాలాన్ని నిర్ణయించడానికి అది ఆధారంగా ఉపయోగించబడింది. ఈ విధంగా చేయబడిన కాలక్రమాలు, వంశక్రమాలు సాంస్కృతిక, కళా, మత రంగాలలోని అనేక సంఘటనల కాలాన్ని నిర్ణయించడానికి విశ్వసనీయమైన ఆధారాలుగా ఉపయోగించబడ్డాయి. అందుచేత తమిళదేశ చరిత్రలో అనేక విషయాలు కాలక్రమాన్ని గౌరవించే నిర్మోహమైన నూతన పరిశీలనను కోరుతున్నాయి. అప్పుడే అవిచారపూర్వకమైన అభిప్రాయాలు, కాలవైరుధ్యాలు లేని చరిత్రను ఆశించడానికి వీలవుతుంది.

ఈ వ్యాసంలో ఉదహరించబడిన గ్రంథాల జాబితా వచ్చే సంచికలో ప్రచురించబడుతుంది. (సం)

[అ యి పో యి న ది]

ఉద్భటారాధ్య చరిత్ర సమీక్షావేశము

శ్రీ వంతరాం రామకృష్ణారావు

అముద్రిత గ్రంథములమాట అటుండగా, ముద్రిత గ్రంథములలో కొన్ని పెక్కేండ్లు పునర్ముద్రణ నోచుకొనక మరుగు పడిపోవు చున్నవి. పండితారాధ్య చరిత్ర, ఉద్భటారాధ్య చరిత్ర, హరిశ్చంద్ర నలోపాఖ్యానము, వరాహపురాణము, ప్రబోధ చంద్రోదయము లోనైన కావ్యముల కిటువంటి దుస్థితి పట్టుట శోచనీయము. ఇటీవల ఆంధ్ర గ్రంథమాలాధిపతులు పండితారాధ్యచరిత్రను పునర్ముద్రణ చేయించినారు. అట్లే తెనాలి లోటస్ పబ్లిషర్సువారు 1974లో, తెనాలి రామకృష్ణుని ఉద్భటారాధ్యచరిత్రము పునర్ముద్రించినారు. ఈ కావ్యము మొదట 1925లో ముద్రింపబడినది. కనుక, సుమారు అర్ధ శతాబ్దికి పునర్ముద్రణ భాగ్యము నందిన దన్నమాట. ఇట్లు చిరకాలము నకు పునర్ముద్రణ నోచుకొన్న గ్రంథములనుగూర్చి పాఠకుల దృష్టికి తేవలసిన ఆవశ్యకత కలదన్న తలంపుతో లోగడ 'భారతి'లో, పండితారాధ్య చరిత్ర పాఠములను గూర్చి వ్రాసియున్నాను. ఇప్పుడు తెనాలి రామకృష్ణుని ఉద్భటారాధ్యచరిత్రను గూర్చి వ్రాయుచున్నాను.

ఉద్భటారాధ్యచరిత్ర శ్రీ నిడదవోలు వేంకటరావుగారి విపుల పీఠికతో ప్రకటించుట చాల ముదావహము. పీఠికాకర్తల పరిశోధన పరమేశ్వరత్వము అడుగడుగున గోచరించును. కొన్ని ముఖ్యాంశముల నుదాహరించుచున్నాను.

(1) తెలుగు సాహిత్యమున వీరశైవమనగా, జంగమ శైవ సంప్రదాయము, ఆరాధ్యశైవ సంప్రదాయము రెండును అని గ్రహించవలెను.

(2) తిమ్మరుసు అల్లుడు, అప్పమంత్రికాని, గోపమంత్రి కాడు.

(3) కావ్యాలంకార సంగ్రహము రచించిన ఉద్భటుడు సోమనాథాదులచే ప్రపంచితుడైన ఉద్భటుడు వేరు వేరు వ్యక్తులుకారు.

(4) కవిత్రయ సాహిత్యమును, శివకవిత్రయ సాహిత్యమును సమ్మేళనచేసిన మొదటికవి శ్రీనాథుడు.

(5) కృతిపతియైన దేవమంత్రిగురువు చంద్రశేఖరుని కీర్తింమటయే ప్రధానముగా, ఆతని మూలపురుషుడగు ఉద్భటునిచరిత్రను రామకృష్ణకవి రచించెను.

(6) దేవమంత్రి కౌండిన్యగోత్రీయుడుగాన ఇందు కౌండిన్య మునికథ ప్రవేశపెట్టబడినది.

(7) పాండురంగవిజయ కర్త రామకృష్ణుడే.

(8) తెనాలి రామలింగేశ్వరాలయమున ఉత్సవ విగ్రహమును ప్రతిష్ఠించినవాడు రామకృష్ణునితండ్రి రామయ్య కాడు. అతడు రామలింగముగానున్న రామకృష్ణుడే.

(9) రామకృష్ణుని జననము : 1485.

(10) ఉత్సవ విగ్రహ సమర్పణ, లింగపురాణ రచనలు 1510.

(11) ఉద్భటారాధ్య చరిత్ర రచన 1516.

(12) రాయలఆస్థానమున నున్నకాలము : 1516-30.

(13) కందర్పకేతువిలాసము, హరిలీలావిలాసము, పాండురంగవిజయము రచించిన కాలము 1530-1540.

(14) పాండురంగ మాహాత్మ్యరచన : 1545-50.

(15) ఘటికాచలమాహాత్మ్య రచన : 1560.

(16) రామకృష్ణుని జీవితకాలము : 1485-60.

(17) రామకృష్ణుడాజన్మాంతము శైవుడేగాని వైష్ణవుడు కాడు. ఆతడు శైవసంప్రదాయానుసారముగనే కృష్ణనామము తాల్చినాడు. అతడు పేరుమాత్రమే మార్చుకొనెను, మతమునుకాదు. అల్లసాని పెద్దన కూడ వైష్ణవుడు కాలేదు. ఇత్యాదులు.

పీఠికాకర్తలు భక్తుల చరిత్రలను సంగ్రహముగా తెలిపినారు. అముద్రితములు చాలవరకు పదర్శించినారు. కందర్పకేతువిలాసాదులలో ఉదాహృతములయిన రామకృష్ణుని పద్యములను చూపినారు. ప్రసంగవశమున రామకృష్ణుని పాండురంగమాహాత్మ్యములోని అపపాఠము లను కొలదిగా సూచించినారు. వాటిలో క్రింది విషయములు పరిశోధకులు గుర్తించవలసి యున్నవి.

(1) క్షణము క్షణార్ధమైన (ముయిన?)దీ, క్షణ (పాండు 4-131) అను పరిష్కరణ తప్పు. 'క్షణము క్షణార్ధముయి వీక్షణ'' సాధుపాఠము.

(2) వ్రాయసప్రవృత్తి, (పాండు 1-20) అన్నదే సాధు పాఠము 'రాయస'కాదు.

(3) ఎవ్వఁడాదేసటింటికి (పాండు 3-68) కవి పాఠము– 'రెడ్డి యింటికి' కాదు. ఇట దేస్టి–ఉపలబ్ధపాఠము కనుక, ఎవ్వఁడా దేస్టి యింటికి–అని గ్రహించ వచ్చును. దేసటి=దేస్టి కావచ్చును. (చూ. నారాయణీయ ముక్తలక్షణ కౌముది-ప్రకీర్ణక–8 సూ.)

(4) పాండు 3-98 పద్యమున, "కలితేఁజాలు" సరియైన పాఠము. కలి=కలియుగము. కలిగితే=కలితే–అయ్యెనమట అసంగతము.

(5) పాండు 4-173 పద్యమున, 'శాణమూకటన్' అని ఉండవలెను. 'శాణ' తత్స–శాణము. చరిత్రాదులలోనిది. (చూ. ము. కౌ. తత్సమ 38 సూ)

(6) పాండు 5 – 179 లో, మునిపట్టు – సాధుపాఠము. ముని=మొదటి, అని యర్థము.

(7) పాండు 5 – 273 పద్యమున "తరళదళ దుమ మూర్తి" అని ఉండవలెను. తరళదళము=చలదళము, అశ్వత్థ వృక్షము. 'తరళతర' అనుచో అర్థము లేదు.

(8) నెత్తురు దార లుదార (పాండు 3 ఆ.) అను శ. ర. పాఠము సరియయినది.

ఇట పునరాలోచించవలసిన విషయములు ఒకటి రెండున్నవి. (1) "బమ్మలున్నార రప్పురిఁ బెమ్మ పెరిగి" (పాండు) అని శ.ర.లో 'బమ్మ' శబ్దము నొద్దనున్నట్లు వ్రాసినారు. కాని శ.ర.లో "బమ్మలున్నార లప్పురి" అనియే కలదు. "ఉన్నారరు" అన్నది యుష్మద్విశేషణము. 'బమ్మలు' అన్యము. కాన "ఉన్నారలు" అను పాఠమే సరియైనది. (2) "ఆ కపి లపనుచే ననుమతుండై చూచి" (పాండు 2-189) అనుచో నందీశ్వరుడు కపివదనుడుకాని కపి లపనుడు గాడు అని కలదు. "ఆననం లపనం ముఖమ్". అని అమరము. కాన "కపి లపనుఁడు" అని, ఉండవచ్చును. కపి వదను డనగా విఘ్నేశ్వరుడని టీకా కారులు వ్రాసియున్నారు. అది మాత్రము తప్పు. నందీశ్వరుడు–అన్న అర్థమే ఒప్పు.

దిన వెచ్చము, (పాండు 3-16) కనక క్రోవి (పాండు 4 8 మిశ్ర సమాసములని చెప్పబడెను. దినవెచ్చము–వైరి సధ మనక మిశ్ర సమాసమనుట మెచ్చదగి ఉన్నది (చూ - ము. కౌ. సమాస 42) కనప క్రోవి – ఉపలబ్ధ పాఠము. 'కనప' తత్త్వము తెలియక 'కనక' అని టీకా కారులో, మరి ఎవరో దిద్దినారు. అది తప్పు. కనుము + క్రోవి-కనప క్రోవి అగుననియు, రెల్లు గొట్టమను అర్థము సరిపడదనియు, వైరి పదమును తప్పించుట కెవరో 'కనక' పాఠమును 'కనప' గా దిద్దిరనియు, పరిశోధకు లొకరు సెలవిచ్చినారు. కనుము + క్రోవి-కనుప క్రోవి, అగును గాని, కనప క్రోవి- ఎట్లగునో! దురూహ్యము. సరళములకు పరుషములు వ్రాయుట లేఖన సంప్రదాయమని గుర్తింపక పోవుట ఈ అనర్థములకు మూలము. గనప క్రోవి– సాధుపాఠము.

పాఠ లోపాదుల మూలమున, గణ యతి భంగాదులు కలిగిన పట్టులు గలవు. సిద్ధ సాలోక్య లక్ష్మిఁ జెందంగఁ గలఁడు" (1-200) అనుచో యతి తప్పినది. 'సాధు' అను సవరణలోను యతి తప్పియే యున్నది. కాన, "సిద్ధ సాలోక్య లక్ష్మిని జెందఁగలఁడు" కవి పాఠ మనవగును. "ఉద్భటారాధ్యునకు వీశ్వరుండు దెలుప" (3-318) యతిభంగము. "ఉద్భటారాధ్యునకును శర్వుండు దెలుప" కవిపాఠము కావచ్చును. "ఉ వు" యతి నంగీకరింపవలెను. "కలిదే. వునకు ననుంగువాఁడవని యుత్సుకతన్ నుతియింతు" (వృషాధిప శతకము) ఇత్యాదులలో ఉ-వు, యతి కలదు "తొడికె నవ దమ్మ దోయితోడ" (2-174) అనుచో, "తొడికిన వలి దమ్మ దోయి తోడ" అని గ్రహింప నగును.

ఉద్భటారాధ్య చరితమునకు లభించినవి రెండే వ్రాత ప్రతు లట. వాటిలో ఒకటి శిథిలము రెండవది అసమగ్రము, శిథిలము. కనుక అప పాఠములు పూర్తిగా తొలగించుటకు వేరే ప్రతి లభించినచో సులభమగును.

ఈ కావ్యరాజమును పాఠకలోక మాదరించి ప్రకాశకుల కృషికి చేయూత ఇవ్వవలసిన ఆవశ్యకత కలదని విన్నవించుచు విస్తర భీతిచే ఇంతతో విరమించుచున్నాను. కావ్యవిశేషములు మరియొకసారి వ్రాసెదను. ఇప్పటికి స్వస్తి.

కవిత్వమంటే ఏమిటి?

శ్రీ ఇస్మాయిల్

రెండో క్లాసు వాచకంలో ఆవు గురించి పాఠముంటుంది. ముందు ఆవు బొమ్మ ఇచ్చి, కింద దాన్ని వర్ణిస్తాడు. 'ఆవంటే ఏమిటి?' అనే ప్రశ్నకి ఇది సరైన సమాధానమనుకుంటాను. ఆవుని చూడని పిల్లలుంటారనుకోను. కాని, కవిత్వమంటే తెలీని వాళ్ళు కొంతమంది ఉండొచ్చు. వేరే మృగాన్ని దేన్నో చూసి, కవిత్వమని భ్రమపడుతున్నవాళ్ళుకూడా ఉండొచ్చు. కనుక, కవిత్వమంటే ఏమిటో వివరించబోయేముందు, దీని తాలూకు దృష్టాంతాలివ్వటం అవసరమనుకుంటున్నాను.

నలుగురికీ సులభంగా బోధపడే ఉదాహరణలే ఇస్తాను. అంటే, చూడగానే 'ఇది కవిత్వం సుమా' అని ఎవరికైనా అనిపించేవన్నమాట. ఈ కారణంవల్ల, ప్రబంధాల జోలికి వెళ్ళను. వాటిల్లో, శబ్ద సందోహాల కోలాహలం మధ్య కవిత్వం గొంతు మాటుమణిగి ఉంటుంది.

మొదటిది జానపద గేయం:

'తొలకరి ఒక మబ్బు తొంగి చూసింది —
          మబ్బులో ఒక మెరుపు మెరిసిపోయింది.
పెరటిలో ఒక జల్లు కురిసి వెలిసింది —
          జల్లులో నామనసు జారిపోయింది.
ఏ కొమ్మమీదనో ఎండతాకిన పిట్ట —
          ఏటి తోవలు పట్టి ఎగిరి పోయింది.
ఏరువాక నాటి కోడది దాటింది —
          ఎదురు చూసిన గుండె చెదిరి పోయింది.'

రెండూ, మూడూ కృష్ణశాస్త్రిగారివి:

ఏల ప్రేమింతును?

సౌరభము లేల చిమ్ము పుష్ప వ్రజంబు?
చంద్రికల నేల వెదజల్లు చందమామ?
ఏల పరిమళంబు [illegible]? గాడ్పేల విసరు?
ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను?

మావి గున్న కొమ్మను మధుమాసవేళ
పల్లవము మెక్కి కోయిల పాడు టేల
పరుల రంజించుటకొ? తన బాగు కొఱకొ?
గాన మొనరింపక బ్రతుకు గడవబోకొ?

ఆ శ్రీ

కన్నీటి కెరటాల వెన్నెలేలా?
నిట్టూర్పు గాడ్పులో నెత్తావి యేలా?
ప్రళయకాల మహోగ్ర భయద జీమూతోరు
గళ ఘోర గంభీర ఘోర ఘోషార్భటులలో మెఱుపేలా?

అశని పాతమ్ముతో నంబువేలా?
హాలాహలమ్ములో నమృతమేలా?
ప్రబలి నీరంధ్రాభ్ర జనిత గాఢ ధ్వాంత
నిబిడ హేమంత రాత్రీ కుంతలములలో జాబిల్లేలా?

శిథిల శిశిరమ్ములో చివురేలా?
పాషాణ పాళిపై ప్రసవమమేలా?
వికృత క్రూర క్షుధా క్షుభిత మృత్యు కఠోర
వికట పాండుర శుష్క వదన దంష్ట్రాగ్నిలో వత్తేలా?

కన్నీటి కెరటాల వెన్నెలేలా?
నిట్టూర్పు గాడ్పులో నెత్తావి యేలా?

నాలుగోది మిత్రులు హనుమయ్య గారిది:

జీవులంటే జీవితానికి
ప్రయోజనాతీతమైన ఇష్టాగోష్ఠి;
పసి పిల్లలకు పాలివ్వాలని
రసలబ్ధులకు పానకం పోయాలని

భయస్థులకు బ్రాందీ తాపాలని
సోక్రటీసును గా తమే
విషపాత్రికలో సకాలు చేయాలని
దానికి తెలుసు.

వీటిలో ఒక్కొక్క ఖండికా ఒక్కొక్క విధమైన అనుభవాన్ని మన అనుభూతికి తెస్తోంది. అనుభవాన్ని వ్యక్తం చెయ్యటమేకాదు, అది మనకు అనుభూతమయేటట్టు చెయ్యటం కవిత్వం పని. అంటే, జీవితాన్నీ, ప్రపంచాన్నీ అర్థవంతం చెయ్యటమన్నమాట. అవ్యక్తమైన మన దైనందిన అనుభవాలకి ఒక క్రమాన్నీ, అర్థాన్నీ ఆపాదిస్తుందన్నమాట. ఐతే, తత్వం మన జీవితాలకు ఒక అర్థమూ, లక్ష్యమూ నిర్దేశిస్తుందనీ, ఈ పని అమూర్తమైన ప్రత్యయాల ద్వారా నిర్వహిస్తుందనీ, శాస్త్రంకూడా మన చుట్టూ జరుగుతున్న ప్రాపంచిక సంఘటనలని గణిత శాస్త్రీయ సూత్రాల ద్వారా అర్థవంతాలుగా చెయ్యటానికి ప్రయత్నిస్తుందనీ వింటుంటాం. మరి వీటి

అర్థవత్త్వానికీ కవిత్వం సాధించే అర్థవత్త్వానికీ తేడా యేమిటి? ఏ అమూర్త ప్రత్యయాల, శాస్త్రీయ సూత్రాల నిమిత్తత్వం లేకుండానే, జీవితానుభవాలు ప్రత్యక్షంగా అనుభూత మయేటట్లు చెయ్యగలిగే శక్తి కవిత్వానికుంది. కవిత్వంలో అనుభవాన్ని అనుభవ రూపంలోనే తెలుసుకొంటాం. మామిడి పండును నోటితో తెలుసుకున్నంత ప్రత్యక్షంగా.

ఐతే, కవిత్వం ద్వారా అనుభవాన్ని ప్రత్యక్షంగా తెలిసికోవటం ఎలా సాధ్యమౌతోంది? అసి ప్రశ్న. ముందు ఒక విషయం అంగీకరించక తప్పదు. ఈ తెలిసికొనేదేదో కావ్యంలోనే కాని, కావ్యాన్నించి విడదీసికాదు. అంటే, కాయనుంచి పప్పును తీసినట్లు వెలికిదీయటానికి వీల్లేనిదన్నమాట ఈ కవిత్వ జ్ఞానం. కావ్యమూ, అనుభవమూ అద్వైతాలు. అదే కావ్యంలో, అదే పదసంవిధానంలో ఆ అనుభవం అనుభూయమాన మౌతుంది. ఎందుకంటే, కావ్యంలోని పదాలకి మామూలుగా ఉపయోగించే పదాలకన్నా అర్థవత్త్వం అధికంగా ఉన్నట్లు తోస్తుంది. ఈ పదాలని విడివిడిగా తీసికొంటే, మామూలు అర్థాలే. కాని కావ్యంలో వీటిని ఒక క్రమంలో పేర్చటం వల్ల వీటి అర్థవత్త్వం హెచ్చువేసినట్లౌతుంది. మొదటి గేయాన్నే తీసుకోండి. ఇందులో ఉన్నవి-తొలకరి మబ్బూ, మెరపూ, వానజల్లూ, ఎండ తాకినపిట్టా, ప్రియునికోసం ఎదురుచూసే మనసూ. వివిధమైన ఈ వస్తుసామగ్రి ఒకచోట ఒక క్రమంలో పేర్చేటప్పటికి వీటిని అధిగమించిన ఒక తెలివిడి, ఒక అనుభవం భాసించింది. ఈ తెలివిడి మన హేతుబుద్ధికి పట్టుబడేదికాదు. బుద్ధికాక మరో జ్ఞానేంద్రియమేదో ఉంది మనలో. అనుభూతికీ, ఉద్రేకానికీ, సంబంధించింది. హృదయమంటాం దాన్ని. ఈ జ్ఞానం దాన్ని సూటిగా తాకుతుంది. అనుభవాన్ని బుద్ధిలా ఖండ ఖండాలుగా విశ్లేషించకుండా, సమగ్రంగా సంపూర్ణంగా స్వీకరించగలదు ఈ హృదయమనేది.

విడిగా ఉన్నప్పుడు లేని అర్థవత్త్వం ఈ పదాలకి కావ్యంలో ప్రవేశించినప్పుడు ఎలా కలుగుతోంది? రెండో ఖండిక తీసుకుందాం, కృష్ణశాస్త్రిగారిది. ఇందులో పదాలన్నీ సామాన్యమైనవే. తొమ్మిది ప్రశ్నార్థక వాక్యాలున్నాయి. ఇవి రెండు తేటగీతలో ఇమిడాయి. తేటగీతకి ఛందశ్శాస్త్రనియతమైన నడక ఒకటుంది. ఐతే, పదశబ్దాలూ, విశిష్టలయాకలిగిన ఈ సంవిధానానికీ, ఈకావ్యం అర్థానికీ సంబంధం ఉందంటారా? కొంతఉండొచ్చు. కాని, కారణ కార్యసంబంధంమాత్రం లేదు అంటే, వట్టి శబ్ద సంవిధానం అర్థసంవిధానాన్ని అనుశాసించలేదు. శబ్దాలంకారాలు అర్థాన్ని శాసించగలవనే భ్రమ అప్పుడప్పుడు కవులకి కలుగుతో వచ్చింది. ముఖ్యంగా మన పూర్వ కవులకి. దౌడు తీసే శబ్దం వెనకాతల అర్థం కాళ్ళీడ్చుకుంటూ నడవటం మన ప్రబంధాలో తరమా చూస్తుంటాం. అర్థాలతో సంబంధం లేకుండా వట్టి శబ్ద శబలిత వల్లనే రసోత్పత్తి కలిగించవచ్చునని మలార్మే (Mallarame) అనే ఫ్రెంచ్ కవి నమ్మి, కొన్ని ప్రయోగాలు చేశాడు. ఆ తరవాత ఫ్రాన్స్‌లో డాడాయిస్టులూ, ఇటలీ, రష్యాల్లో ఫ్యూచరిస్టులూ పదాలచేత వ్యభిచరింప చెయ్యటానికి చాలా ప్రయత్నాలు చేశారు. కాని ఇవేవీ సఫలం కాలేదు. ఇటీవల మన తెలుగులో శ్రీశ్రీ ఇటువంటి ప్రయోగాలు చేశాడు.

కావ్యానికి అర్థవత్త్వం వట్టి శబ్దసంవిధానంవల్ల మాత్రమే కలగదన్నమాట. ఛందస్సుకి మన మనుకున్నంత ప్రాధాన్యం నిజంగా లేదన్నమాట. పైనుదహరించిన దృష్టాంతాలు నాల్గింటిలోనూ నాలుగు విధాల శబ్ద సంవిధానాలున్నాయనే విషయం మీరు గమనించే ఉంటారు. మొదటిది, జానపదం గీతం నిర్మితి ద్విపదకు దగ్గిరగా ఉంది. ఐతే, శిష్ట సంఘానికి చెందిన ద్విపదలా ముడుచుకుంటూ కాకుండా, పల్లెపడుచులా నిసర్గ సుందరంగా నడిచింది. కృష్ణశాస్త్రిగారి మొదటికావ్యంలోని తేట గీతుల నిర్మితి గురించి ఇతఃపూర్వం వివరించే ఉన్నాను. శాస్త్రిగారి రెండో గేయంలో గేయ సంవిధానానికీ, అర్థానికీ కొంత మైత్రి ఉన్నట్లు తోస్తుంది. పల్లవి రెండు పాదాల్లోనూ ఐదేసి మాత్రల మూడు ఆవృతాలూ, మొదటి పాదం చివరన ఒక గురువూ, రెండోపాదం చివరన రెండు గురువులూ. తరవాత రెండేసి చరణాలు. ఒక్కొక్కదాంట్లో ఐదు మాత్రల నాలుగు ఆవృతాలూ. చివర్న ఆరు మాత్రలతో ఉపచరణం; 'మెఱపేలా?' వంటిది. హనుమయ్యగారి కావ్యంలో బాహ్యగోచరమైన శబ్ద నిర్మితి లేదుకాని, ఒక అంతరయా, అందులో భావాలన్నిటినీ శాసించే ఒక రూపమూ ఉన్నాయని పరిశీలనగాచూస్తే మీకు తెలుస్తుంది. దీనివల్ల మనకు అవగాహన అయేదేమిటంటే, శబ్ద సంవిధానమూ, అర్థసంవిధానమూ ఒకటి కాదనీ, కానఖర్లేదనీ. అర్థ సంవిధానమే దాని కవిత్వాన్ని నిరూపిస్తుందనీ, దాని అర్థసంవిధానమే ఆ కావ్యానికి అవశ్యకమైన, అంటే మరే కావ్యానికీ సాధ్యంకాని, ఆకృతిని (form) ప్రసాదిస్తుందనీ, మరో విధంగా చెప్పాలంటే, కవియొక్క అద్వంద్వమైన అనుభవమే ఆ కావ్యంయొక్క అర్థ సంవిధానాన్నీ, ఆకృతినీ నిర్ణయిస్తుందన్నమాట. మార్గ ఛందస్సులూ, దేశి చందస్సులూ, మాత్రా చందస్సులూ అనేవి పైపై వేషాలు. ఏ ఛందస్సు గొప్పదని బుర్రలు పాడుచేసుకోనఖర్లేదూ, బద్దలు కొట్టుకోనఖర్లేదూ. ఏ ఛందస్సునీ పట్టించుకోకుండా హనుమయ్యగారిలా స్వేచ్ఛగా వ్రాసుకుపోతే, ఆ పద్యం తన ఛందస్సుని, ఆకృతినీ తనే నిర్మించుకుంటుంది. అందుకునే, 'వచనకవిత్వ' మనే పదం అర్థహీనమనుకుంటున్నాను. నిజమైన కవిత్వానికి ఒక అర్థ సంవిధానమూ, ఒక ఆకృతీ ఉంటాయి. ఈ లక్షణాలే కవిత్వాన్ని వచనాన్నించి వేరు చేస్తాయి. అటువంటప్పుడు, కవిత్వం వచన మెలా ఔతుంది, వచనం కవిత్వమెలా ఔతుంది? ఏమిటీ వచన కవిత్వం, వంధ్యా పుత్రుడు లాగ?

ఐతే, ఇంతదూరం వచ్చినా మనం వేసుకున్న ప్రశ్న ప్రశ్నగానే ఉండిపోయింది. విడిగా ఉన్నప్పుడు లేని అర్థవత్త్వం పదాలకి కావ్యంలో ఉన్నప్పుడు ఎలా సిద్ధిస్తోంది? ఈ అర్థవత్త్వాన్ని సిద్ధింపచేసే అర్థ సంవిధానం ఎటువంటిది? దీనికి సమాధానం కావ్యాల్లోనే దొరకాలి. మన నాలుగు దృష్టాంతాల్ని పరిశీలించి చూద్దాం.

'తొలకరి ఒక మబ్బు' అనే జానపద గీతంలో అర్థ సంవిధానం తేట తెల్లంగా ఉన్నట్టే పైకి తోస్తోంది. ఇందులో ఏడు వాక్యాలున్నాయి. ఒక మబ్బు తొంగిచూసింది. ఒక మెరుపు మెరిసిపోయింది. ఒక జల్లు కురిసి వెలిసింది. పిట్ట ఎగిరిపోయింది. వేటికవి సరళంగానే ఉన్నాయి. ఐతే, వీటిమధ్య తార్కికమైన సంబంధమేమీ

ఉన్నట్లు కనిపించదు. కాని, వీటన్నిటినీ కావ్యంలో ఒకచోట పక్క పక్కగా చేర్చినప్పుడు, ఈ సంకలత అదృశ్యమైపోయి, ఒక నూత్నమైన అర్థసత్త్వం ఉద్భవిస్తుంది. ఈ వాక్యాలకు ఈ అర్థసత్త్వం కావ్యంలోనే; కావ్యాని కివతల లేదు. 'ఏరు వాకనాటి కేదారి దాటింది ఎదురుచూపినగుండె చెదిరిపోయింది' అని అన్నప్పుడు మబ్బూ, మెరుపూ, వానా, పిట్టా, తళుక్కున మెరసి, హేతుబుద్ధి కలితమైన పరస్పర సంబంధాల్ని పెనవేసుకుని, హృదయ స్పర్శియైన ఒక నూత్న అర్థసత్త్వాన్ని ఉత్పాదిస్తున్నాయి.

కాని, విడమరచి చూపినప్పుడు, ఈ అర్థ సంవిధానం ఎలా ఉన్నట్లు తోస్తుంది? వచనం ఎవరూ ఇంత అతార్కికంగా వ్రాయరు. మబ్బు, మెరుపు, వాన, పిట్టలమధ్య బుద్ధిద్వారా గ్రహించే తార్కిక సంబంధమేమీలేదు. కాని, పాటలో ఇవన్నీ ఒకచోట కూడేటప్పటికి, అనుభూతికి (feeling) లేదా ఉద్వేగానికి (emotion) మాత్రమే గ్రాహ్యమయే ఒక అర్థసత్త్వం పుట్టుకొచ్చింది.

కృష్ణశాస్త్రిగారి 'ఏల ప్రేమింతును' తీసుకోండి. 'ఎందుకు ప్రేమిస్తావు?' అనడిగితే, నీరెందుకు పారుతుంది? గాలెందుకు వీస్తుంది? అని ఎవరూ సమాధానం చెప్పరు. ప్రేమించటానికీ, గాలి వీయటానికీ సంబంధం బుద్ధికి లబ్ధమయేది కాదు. ఈ సంబంధాన్ని గ్రహించగలిగేది, ప్రపంచంలోని ఏకసూత్రతని దర్శించ కలిగేది ఒక్క అనుభూతి లేదా హృదయమంటామే అది మాత్రమే. పువ్వుకీ, చందమామకీ, గాలికీ ఐక్యత దానిస్థాయిలోనే.

'ఆశ' అనే ఖండిక కొన్ని పరస్పర విరుద్ధమైన జంటల సమాహారం. ఈ జంటల్లో ఒకటి దుఃఖానికీ, మరొకటి ఆశకీ ప్రతీకలు. ఆశకన్నా దుఃఖానిదే పైచేయి. కన్నీటి కెరటాల్లో మునిగిపోయేవాడికి వెన్నెల ఏమాత్రం ఉపశాంతి కలిగించ కలదు? ప్రళయకాల మహోగ్ర భయద జీమూతోరు గాఢఘోర గంభీర ఘోష ఘోరార్భటులలో మెరుపు ఎంతసేపు నిలుస్తుంది? కాని, ఆశ ఆశే. ఆశాపథి చివర ఎక్కడో మినుకు మినుకు మనే దీపమే కన్ను పొడుచుకున్నా కానని కటిక చీకటిలో మనిషిని నడిపిస్తుంది. ఇక్కడ దుఃఖానికి ప్రతీకలు దీర్ఘంగా, కర్కశంగానూ, ఆశకి సంకేతాలు సున్నితంగా, మెత్తగానూ ఉండటం గమనార్హం. ఐతే, కావ్యంలోనించి ఊడదీసి తార్కిక దృష్టితో చూస్తే, వీటిమధ్య సంబంధం మృగ్యమౌతుంది. కాని, కావ్యంలో సరసన నాటిని అమర్చేటప్పటికి, ఒకదాన్నొకటి పెనవేసుకుని, అనంతమైన దుఃఖపారావారమూ, ఒక చిన్ని తెప్పా మనకు స్ఫురింపచేస్తాయి. ఈ ఆశ మనల్నేమన్నా పారం ముట్టిస్తుందా? ఎంత దుర్బలమైనా ఆశ ఆశే.

నాలుగోది హనుమయ్యగారి కావ్యం. జీవులంటే జీవితానికి ప్రయోజనాతీతమైన ఇష్టాగోష్ఠి. ఔనో కాదో సామాన్య బుద్ధికి తర్కవిషయాంశమేమోకాని, ఈ కావ్యంలో అది పరమ సత్యం. ఇందులో నాలుగు దృష్టాంతాలు వరసగా ఇవ్వబడ్డాయి. మొదటి మూడూ నిత్యానుభవంలోనివే — పసిపిల్లలకు పాలూ, రసలుబ్ధులకు పానకం, భయభ్రాంతులకు బ్రాందీ. కాని, నాలుగోది వీటికి విపరీతమైంది. వీటి పక్కచేరి, మొదటి మూడింటిపైనా, మన జీవితానుభవం మొత్తంపైనా కొత్త వెలుగుని ప్రసరింపచేసింది. ఈ కవి అనుభవం మనకు స్వంతమయేటట్లు చేసింది. జీవితం అందరిచేతా విషం తాగించదు. ఒక్క సోక్రటీస్‌నే ఎన్నుకుంటుంది ఈపనికి. ఇక్కడ తర్కానికి చోటులేదు. ప్రగాఢమైన ఈ జీవితానుభవం మన అనుభూతిని ప్రత్యక్షంగా, అపరోక్షంగా హత్తుకుంటుంది.

ఈ నాలుగు కావ్యాల్లో వ్యంజితమైన జీవితానుభవాలు బుద్ధికి అతార్కికంగా తోచవచ్చు. వచనానికీ కవిత్వానికీ ముఖ్యమైన భేద మిక్కడే ఉంది. వచనంలో అర్థసంవిధానమిలా ఉండదు, హేతుబద్ధంగా ఉంటుంది; తార్కిక సంబద్ధత పాటిస్తుంది. కాని, కవిత్వానికి తార్కికక్రమంతో పనిలేదు. ఐతే, ఈ అతార్కికమైన అర్థాలు కావ్యంలో నిలిచినప్పుడు ఒక అర్థసత్త్వాన్ని సిద్ధింపచేసుకుంటాయి. ఈ అర్థసత్త్వం అనుభూతి లేదా ఉద్రేకాలద్వారా మనం గ్రహించగలుగుతున్నాం. తర్కానికి అందని ఈ అర్థసంవిధానం ఉనికి ఎక్కడన్నమాట? మన అనుభూతుల్లోనూ, ఉద్రేకాల్లోనూ.

శబ్ద సంవిధానానికీ అర్థసంవిధానానికీ వ్యత్యాసం తెలుసుకున్నాం. ఐతే, మొత్తం కావ్యాన్ని తీసుకున్నట్లయితే, దాని నిర్మితి లేక సంవిధానం ఎటువంటిది, అనే ప్రశ్నరావచ్చు. కవిత్వమంటే ఏమిటి? అనే ప్రశ్న వేసి, కవి అంటే ఎవరు, అనే ప్రశ్నా ఇదీ ఒకటే నన్నాడు కూల్‌రిజ్. "భావన (imagination) అనే అద్భుత, సంశ్లేషణాత్మక శక్తిచేత మానసిక శక్తుల్ని ఒక్కటిగా మేళవించ చెయ్యగలిగే వాడు కవి. పరస్పర విరుద్ధాలైన రెండు గుణాల్ని సమీకరించటంలో ఈ శక్తి వెల్లడి ఔతోంది...మోతాదుకు మించిన ఉద్రేకాన్ని మోతాదుకుమించిన నియమం (order)తో ఇది సమీకరిస్తుంది" అని అన్నాడు. ("The Poet) blends...(the faculties) each in to each by that Synthetic and magical power to which I would exclusively appropriate the name of imagination. This power reveals itself in the balance or reconcilement of discordant qualities...a more than usual state of emotion with more than usual order"

ఐతే, ఈ మోతాదుకు మించిన ఉద్రేకమూ, నియమమూ కావ్యంలో ఎక్కడున్నాయి? ఈ రెంటిని కవి ఎలా సమీకరిస్తాడు? ఏ కావ్యాన్ని పరిశీలించినా ఈ మోతాదుకు మించిన నియమం మనకు స్పష్టంగా అగుపిస్తుంది. వచనంలా కనిపించే కావ్యాలు కూడా ఒక నియమబద్ధమైన ఆకృతిని ప్రదర్శిస్తాయని గమనించాం కదా. శబ్ద సంవిధానంవల్ల నియతమైన ఈ ఆకృతే 'మోతాదుకు మించిన నియమ' మన్నమాట. మరి, 'మోతాదుకు మించిన ఉద్రేక' మెక్కడుంటుంది కావ్యంలో? దాని స్థానమేది?

ఒక చిన్ని చైనీ కావ్యాన్ని పరామర్శిద్దాం. పాఠకుల సౌలభ్యం కోసం దీన్ని ఎంచాను. ఏడో శతాబ్దంలో జీవించిన లిపో (Lipo) అనే కవి రచించాడు దీన్ని. యుద్ధాలమూలాన బహుకాల ప్రవాసం గడిపిన మీదట ఒక రాత్రి అనుభవం.

Moonlit Night

Over My bed the moonlight streams,
making it look like frost covered
ground; lifting my head I see

The brightness, Then dropping it,
am I filled with thoughts of home.

చాలా సరళమైన పద్యం. ఇందులో ఏముందనిపిస్తుంది కాని కవిని వేధించిన ఒంటరితనం మనల్ని బాధపెట్టక మానదు. ఈ అనుభూతి ప్రాతకులకు ఏవిధంగా రవాణా అయిందనేదే ప్రశ్న. పక్కమీద వెన్నెలపడి మంచు కప్పిన నేలలా ఉందట. తలెత్తి చూస్తే అంతా కాంతివంతంగా ఉందట. తలవాలిస్తే, ఇంటి గురించి ఆలోచనలు ముంచుకువచ్చాయిట. ఇక్కడ రెండు పదచిత్రాలతో (images) గాఢమైన ఫలితాన్ని సాధించాడు. వట్టినే, 'ఇంటిగురించి ఆలోచనలు ముంచెత్తాయి' అనంటే మన మెవరమూ స్పందించం. ఆ రెండు పద చిత్రాల వెనకా ఈ మాట వచ్చేటప్పటికి మనలో ఒక నిశితమైన అనుభూతి - ఒంటరితనం, దిగులూ—ఎగజిమ్మింది. ఏవి ఈపద చిత్రాలు (images)? వెన్నెల పడిన పక్క మంచుకప్పిన నేలలా ఉండటం, ఒకటి. మంచుమీద అడుగు వెయ్యటమే బాధాకరంగా ఉంటుంది. పక్క మంచుగడ్డలా తోచిందన్నమాట. తలెత్తిచూస్తే అంతా కాంతివంతంగా ఉంది; వెంటనే తలవాల్చాడు-ఇది రెండోది. ప్రియురాలు లేని కాంతి ఎందుకనుకున్నాడేమో. తల వాల్చగానే ఇంటి ఆలోచనలు పైకొన్నాయి. ఈ పదచిత్రాలు ఒకదాని పక్క ఒకటి పేర్చగానే, ఏదో ఒంటరితనమూ, దిగులూ, ఉత్కంఠా ఉద్భవిస్తున్నాయి.

ఏతావతా, ఈ 'మోతాదుకు మించిన ఉద్రేకం' పద చిత్రాల్లో ఉండి ఉండాలి. మొదట్లో ఇచ్చిన నాలుగు దృష్టాంత కావ్యాల్ని మీరు పరిశీలించి చూడవచ్చు. మచ్చుకి జానపదగీతం. తొంగిచూసిన మబ్బు, మెరిసిపోయిన మెరుపు, కురిసి వెలిసిన జల్లు, ఏటి తోవలుపట్టి ఎగిరిపోయిన పిట్ట. ఈ నాలుగు పదచిత్రాల పరస్పర సాన్నిధ్యంవల్ల 'ఎదురు చూసిన గుండె చెదిరి పోయింది' అనే వాక్యానికి గుండెల్లో గాలుపెట్టే ఒక తీక్ష్ణత వచ్చింది. 'మోతాదుకు మించిన ఉద్రేకం' ఏ ప్రత్యేక పదచిత్రంలోనూ లేదు. వీటన్నింటి కలయికనించి ఇది ఉద్భవించింది.

కనక, పదచిత్రాల పరస్పర సంబంధంవల్ల కావ్యానికి అర్థవత్త్వం సిద్ధిస్తుందనీ, ఈ అర్థవత్త్వం అనుభూతి లేదా ఉద్రేకంవల్ల గ్రాహ్యమేకాని, బుద్ధివల్లకాదనీ మనం నిష్కర్షించవచ్చు. ఐతే, మరో ప్రశ్న ఎదురౌతుందిక్కడ. ఈ పదచిత్ర సమాహారం వల్ల వ్యంజితమయేది ఒక్క అనుభూతియేనా? ఇంకేమైనా ఉందా? అంటే, పదచిత్రాలద్వారా ఒక అనుభూతిని లేదా ఉద్రేకాన్ని అందుకున్నట్టు, ఈ ఉద్రేకం ద్వారా అందుకోగలిగింది ఇంకేమైనా ఉందా? అని. జీవితానుభవాన్ని ప్రత్యక్షంగా, సజీవంగా అనుభూతికి అందివ్వటమేనా కవిత్వ ధ్యేయం, లేక ఇంతకన్నా గొప్ప సిద్ధి ఏదేనా ఉందా? అసంబద్ధాలైన పదచిత్రాల సాన్నిహిత్యాన్నించి ఉద్భూతమయే ఈ అర్థవత్త్వ స్వభావ మెటువంటిది? దీనికి సమాధానం ఫ్రెంచ్ కవి బోద్‌లేర్ (Baudelaire) వద్ద లభిస్తుంది. "కవి భావన మానసిక శక్తుల్లో కెల్లా శాస్త్రీయమైనది; ఎందుకంటే, అదొక్కటే సార్వత్రిక సాదృశ్యాన్ని (Universal analogy) గ్రహించగలదు" అంటాడు.

అసంబద్ధమైన నాటిమధ్య సంబంధమే కవిత్వానికి అర్థవత్త్వమిస్తుందని దీనర్థం. ఈ సంబంధమే కవిత్వ సారమూ, అది ప్రసరించే కాంతినీ. కవిత్వంలో పదచిత్రాలని కూర్చటం అనుభూతిని ఉత్తేజింపచెయ్యటానికి మాత్రమేకాదు. వీటి పాత్ర ఏమిటంటే, సార్వత్రిక సాదృశ్యాన్ని అనుభూతికి ఎరుకపరచటం. ఐతే, ఈ సార్వత్రిక సాదృశ్యాన్ని తెలుసుకోవలసిన అవసరమేమొచ్చింది? దీనికి సమాధానం ఇది. ఈ సార్వత్రిక సాదృశ్య జ్ఞానమే మన అనుభవాన్ని అర్థవంతం చేస్తుంది. శాస్త్రమూ, తత్త్వమూ వాటి విశిష్ట పద్ధతుల్లో సారూప్యతనీ, ఏకసూత్రతనీ సాధించటానికి ప్రయత్నిస్తాయి. శాస్త్రం సాధ్యమైనంతవరకు గణిత శాస్త్రీయ సమీకరణాలద్వారానూ, తత్త్వం అమూర్తమైన ప్రత్యయాలద్వారానూ. ఐతే, వీటిలా భిన్న పరిభాషలో కాకుండా, అనుభవాన్ని అనుభవంలాగే సజీవంగా అర్థవంతం చేసేది కవిత్వ మొక్కటే. మానవ అనుభవంలోని ఏకసూత్రతని ఆవిష్కరించటంద్వారా ప్రపంచాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించే మూడు మానవ వ్యవసాయాల్లో కవిత్వం ఒకటి.

భూమిమీద మనిషి అడుగు పెట్టినప్పట్నించీ తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసికోటానికీ, ఈ ప్రపంచంతో సంధానం (adjustment) కుదుర్చుకోటానికీ ప్రయత్నిస్తున్నాడు. ప్రపంచాన్ని అర్థం చేసికోవటమంటే విభిన్నమైన ప్రాపంచిక అనుభవాల్లో ఏకసూత్రతని, సాదృశ్యతని సాధించటమన్న మాట. ఈ ప్రయత్నం శాస్త్రంద్వారా, తత్త్వంద్వారా, కవిత్వంద్వారా మూడు విధాలుగా సాగింది. భౌతిక సంఘటనల్లో ఏకసూత్రతని సాధించటానికి శాస్త్రం పూనుకుంది. వివిధ శాస్త్రాలకు చెందిన భౌతిక సూత్రాలనీ, మానసిక, ఆత్మిక విషయాలన్నిటినీ కలిపి ఒకే సూత్రానికి గుచ్చటానికి తత్త్వం పరిశ్రమించింది. మన సజీవ అనుభవాల్లోని ఏకసూత్రతని దీన్నే సార్వత్రిక సాదృశ్యమన్నారు- అనుభూతిద్వారా ఆవిష్కరించటం కవిత్వం లక్ష్యంగా పెట్టుకొంది. ఒకే గమ్యానికి మూడు మార్గాలివి.

కవిత్వానికిదీ ప్రయోజనం: అసదృశాల్లో సాదృశ్యాన్ని గ్రహించటంద్వారా ఏకసూత్రతని దర్శించటం. ఈ ఏకసూత్రతని దర్శించగలిగినప్పుడే అనుభవం అనుభవంగా మనకు అర్థమౌతుంది. అనుభవం అనుభవంగా అంటే శాస్త్ర, తత్త్వాల్లో లాగ మరో పరిభాషలో కాదన్నమాట. ఈవిధంగా, శాస్త్రజ్ఞ తాత్త్వికుల మల్లే కవికూడా ద్రష్ట ఔతున్నాడు.

శాస్త్రమూ, తత్త్వమూ, కవిత్వమూ ముఖ్యమైన ఆధిభౌతిక అవసరాలకోసం మనిషి సృష్టించుకున్నాడు. ప్రపంచాన్ని బోధపరచుకుని, తద్ద్వారా ఒక సంధానం (adjustment) సిద్ధించుకోటానికి వీటిని ఉపయోగించుకున్నాడు. ఐతే, ఈమధ్య ఎవరో కొందరు బయలుదేరి, 'మేం కవిత్వానికి ప్రయోజనం కని పెట్టాము; ఇంతకాలమూ ఏ ప్రయోజనమూ లేకుండా అది మూలన పడుంది' అని డబ్బాలు వాయిస్తున్నారు. వీళ్ళ చిటిపొట్టి ఊహాకందని మహా ప్రయోజనాన్ని అది అనాది నించీ నిర్వర్తిస్తోనే ఉంది. ఇప్పుడు వీళ్ళ కురచబుద్ధులకు అందుబాటులోఉన్న కుటిల స్వార్థ ప్రయోజనాలకు దీన్ని నిర్బంధించాలనుకుంటున్నారు. కాని, కవికి రాజకీయపు గంతలు కడితే, కవెలా ఔతాడు? ఏ మార్క్సిస్టు గంతలతోనో అతని దర్శనాన్ని అవరోధిస్తే, ఇక కవిత్వమేం చెబుతాడు? ఏ కవి దర్శనం వానిది. ఇది అనన్యమూ, అద్వైతమూ. ఏ రాజకీయ దృష్టితోనో చూడమంటే, మరి తన దృష్టేంకాను? దృష్టిదోషం కలిగాక ఇక కవిగా మిగులుతాడా? ఇవి ఆలోచనీయాంశాలు.

కలగూరగంప

1976-భారతి., కవితా సమీక్ష

1976 భారతి "శ్రీరస్తు అవిఘ్నమస్తు" అనే కవితతో ప్రారంభింపబడి "పుడమి పడవ"తో ముగింపబడినది. ఈ మొత్తం 12 సంపుటాలలో దాదాపు నూరు [97] కవితా ఖండికలున్నాయి. వస్తు వైవిధ్యంవుంది. లబ్ధ ప్రతిష్ఠులైన ఒకరిద్దరి సంప్రదాయ కవిత్వాన్ని మినహాయిస్తే మిగిలిన వాటిలో కరపత్ర రచన ఎక్కువగా వుంది. ఇది అభ్యుదయమని వర్తమాన సంఘకవులంటున్నారు కనుక ఈ అభ్యుదయ కవితలలో కొన్నిటిని మాత్రమే ప్రస్తావిస్తాను.

జనవరి : డా॥ మాదిరాజు రంగారావు

ఫిబ్రవరి : అద్దేపల్లి రామమోహనరావు, సోమసుందర్

మార్చి : రామాచంద దవౌళి. డా. సి. నారాయణరెడ్డి

ఏప్రియల్ : దిలావర్

మే : డా. ముకురాల రామారెడ్డి, వేగుంట మోహన్ ప్రసాద్, సాంధ్యశ్రీ

జూన్ : నాయుని కృష్ణమూర్తి, కొంపెల్లి రామకృష్ణమూర్తి, నణతుల రామచంద్రయ్య

జులై : డా. మాదిరాజు రంగారావు, సాంధ్యశ్రీ

ఆగష్టు : సోమసుందర్, వి. లక్ష్మీపతిరావు, వేగుంట మోహన్ ప్రసాద్

సెప్టెంబరు : రామా చంద్రదవౌళి

అక్టోబరు : ఆకొండి వెంకటరత్నం

నవంబరు : ...

డిసెంబరు : సాంధ్యశ్రీ

మిగిలిన వారు ఏవో వ్రాసినారు. ఇవి ఈ సమీక్షకు నోచుకోనంత మాత్రాన తక్కువ తనాన్ని చూపటంకోసమే నను ఎహ్వానము లైన రచయితలు భావించవద్దని మనవి. రాశి ఉన్నంతగా వాసి లేదని మాత్రం మనవిచేసుకోగలము.

"శబ్దమై, ప్రాణమై; కాలాన్ని నిరీక్షణం" ఈ రెండు కవితలు వ్రాసిన డా. మాదిరాజు రంగారావుగారు మనిషి జీవితాన్ని మనసుతో జోడించి ఒక వ్యూహాను రేకెత్తించగలరు అనుభవానికి ఆత్మకు, వాస్తవికతకు సన్నిహితత్వానికి చక్కని రూపకల్పనతో విశ్లేషించి చూపగలరు.

"ప్రాణంనుండి
బీజ భూతమైన ప్రపంచం
సంకల్పంతో
శాఖాకీర్ణమైన జీవితం
అనుభవానికి వాస్తవం
ఆత్మకు సన్నిహితం..."

"ముళ్ళు",-"వసుమతి కిరీటంలో తురాయి పూలు" – ఈ రెండు కవితలు వ్రాసిన సోమసుందర్, తన ఈ రెండు ఖండికలలో కవిత్వాన్ని మాత్రం వదలివేశారు. మొదటి దాంట్లో వయసు చెలిన విరహం ధ్వనిస్తుంది. రెండవ కవితను గురించి మాత్రం కాస్త చెప్పాలి. ఇది కట్టుబడి కవిత. అంటే ఆకాశవాణివారు నిర్దేశించిన వస్తువు చుట్టూ మాటలల్లిన రచన. ఇది ఆకాశవాణి నియమాలకు తలఒగ్గి (భావ ప్రకటనకు కవికి స్వేచ్ఛలేదుకదా ...) వ్రాసింది కాబట్టి; ఆ నియమ ప్రయోజనత్వాన్ని తప్ప మరేమీ సాధించదు. మాస్కోలో పుంస్కోకిల్ని పలికించిన ఈకవి, అధోజ్ఞాపిక లివ్వటం జగత్ ప్రసిద్ధ సంప్రదాయమంటారు. అది కాదు. వేస్ట్ లాండ్ కవి అధోజ్ఞాపిక లెందుకిచ్చాడో – ఆయనే చెప్పిన మాటల్ని చదివితే తెలుస్తుంది. లేదా బుచ్చిబాబుగారి ఎలియట్‌మీద వ్యాసం చదివితే తెలుస్తుంది.

"పరిధి" – రామాచంద దవౌళిగారు వీరి పరిధిలో ఆంగ్ల పదాలున్నాయి. ఒక కార్య ప్రయోజనాన్ని, ముఖ్యంగా తెలుగుకవి, తన రచనలో చూపటంకోసం ఆంగ్లపదాలు వాడటం విచార్యం. భావ ప్రకటనకు తెలుగేమీ తీసిపోదు. అదే సంచికలోని డా. సి. నారాయణ రెడ్డిగారి కవితకూడావుంది. రెడ్డిగారి కలం అంత్యప్రాసలకంకితమై పోయింది. ప్రాస ప్రియులకు విందుచేయగల కవితాగిడ్డి నారాయణ రెడ్డిగారి "ఒకేపక్షి".

"జన్మకొక శివరాత్రి" డా. ముకురాల రామారెడ్డి. ఇది కవిత్వానికి చక్కని ముకురం. మూడవపద్యం చూడండి.

"నిండిన ఈతమ; ప్రకృతి నీ పరమాంశముగా
గ్రహించియే
మండగాజేసినాను. చరమాశను వత్తిగ దార్చి పెట్టి
నా గుండెను గుండ దీపముగ

కోర్కెలు మళ్ళీల నాగు బుస్సలై ధండలల్లుకొన్నవిగదా
కయిలాసము బొందితోడిదే!

చలాన్ని వ్రాసిన వేగుంట మోహన ప్రసాద్‌గారి మీద నూటికి నూరుపాళ్ళు పాశ్చాత్యకవుల ప్రభావంవుంది ఈయన భాష సంకరంగా వుంటుంది. ఈయనే వ్రాసిన "అందాక అందాకా...అన్‌దాక...అనే కవితను ఆయనే English లో వ్రాస్తే బాగుండేది ఎక్కడ విరవాలో అక్కడ పాదాంతంకాని ఈ వచన కవితలో తెలుగుతనం తక్కువ.

చెట్లగొంతుల్లో - ఇరుకులోంచి... - సారాణి ఈ కవితా ఖండికలను వ్రాసిన సౌంద్యశ్రీగారిది విలక్షణమైన సుకుమార శిల్పం. ఈరీతి భావానుభవ సమన్వయత ఆమె... ? [ఆయన... ?] వాడిన నాద సౌందర్యంతో మేళవించిన పద చిత్రాలు పాఠకునిపై మంచి ముద్రను వేస్తాయి. ఈ నేత (Texture) చాలా కొద్దిమందికి తెలిసిన కళ.

అయ్యో
దినం జరుగుతోంది
సుతారంగా కరుగుతోంది...
ఆయువు ఇంధనంగా వెలిగే దీపం. (సారాణి)

మంచుతెర పల్చగా జారుతున్నట్లు
చెట్ల గొంతుల
అవ్యక్త గానాలతో
వన పవనాలను అల్లుతున్న
ఈ నీలి దీపుల ప్రాచీరేఖమీద
కవిగా
ఈలోకాని కరుదెంచిన శిశువును" (చెట్ల గొంతులో)

మంచి భావమేళన. చక్కని పద చిత్రాలు. ఇరుకులోంచి అనే ఖండికలో సూర్యుడికి ఒక విచిత్రమైన నిర్వచనం ఇచ్చారీమె (ఈయన ?)

"రాత్రి, నిదతో మలచబడే"దిగా నాయుని కృష్ణమూర్తి గారి "రంజన కియ" స్త్రీ కోసం "పరాజిత కేతనంలా నేలకొరిగే" కొంపెల్ల రామకృష్ణమూర్తిగారి "స్త్రీ" చదవవలసిన మంచి కవితలే.

"రససిద్ధి"లో పణతుల రామచంద్రయ్యగారు భ్రాంతిమదాన్ని వదిలివేయమంటూ, చివరకు ఆ భ్రాంతిలోనే ఆయనపడి పాఠకుడ్ని కూడా పడవేస్తారు. "ఇక భయంలేదు"... అనే హామీకూడా ఒక రకం పాఠకుడ్ని భ్రాంతిలోనే పడేస్తుంది. మిగిలిన కవితలు పాఠకుడ్ని ఆలోచింప చేయటానికి పనికివస్తాయి.

ఏమైనా ఈ సంవత్సరం కవితలన్నీ సంప్రదాయాన్ని కాదనే వస్తు పరిధిలో తిరిగినవి; కొన్ని మినహాయించి. నూతన కవులకు 'భారతి' ఈ సంవత్సరం ప్రోత్సాహం ఇచ్చింది.

నేను సమీక్షించిన రచనల భావపుష్టిని తక్కువ అంచనా వేసినానని మాత్రం తలంచక, సహృదయతతో ఆ రచయితలు సహించగలరని విశ్వసిస్తూ. —

— శ్రీమతి పి. శారద



అత్యద్భుత చతుర్ముఖనందీశ్వర లింగము - పశుపతినాథ దేవాలయము

అనంతపురంజిల్లా రాయదుర్గం తాలూకాకు చెందిన చదుము అను గ్రామానికి దాపునగల కొండపై నిర్మింపబడిన ప్రాచీన దేవాలయము స్థానికులచే - "పశుపతి నాథాలయమని పేర్కొనబడుచున్నది. ఈ దేవాలయంలో ప్రతిష్ఠింపబడిన శివలింగమే" చతుర్ముఖ నందీశ్వరలింగము. ఆలయంతోటి ఈ గుట్ట నిండుగ లింగాకారములో పెక్కు గుండ్లు ఉన్నందున కాబోలు ఈ గుట్టను యిచ్చటి వారు "లింగాలబండ" అంటూ ఉంటారు. ఇచటిగల చతుర్ముఖనందీశ్వర లింగాన్నిగూర్చిన ఫోటో, రాష్ట్ర పురాతత్వ శాఖవారికి అందజేసిన శ్రీ నిష్ఠల రంగారావు గారికి ధన్యవాదాలు.

దేవాలయముచుట్టూ ప్రాకారమున్నది. నాలుగు మూలల నందులున్నాయి. నాలుగువైపులనుండి ఆలయంలోకి ప్రవేశించేందుకు నాల్గు ద్వారాలు, ద్వారాలపై చిన్న గోపురాలు అమర్చబడి యున్నవి. ప్రతి గోపురానికి నాల్గు మూలల దేవకోష్ఠములతో నాలుగు 'వృషభవాహనారూఢ శివవిగ్రహాలు తీర్చబడి ఉన్నాయి. లోపల ఒకమూల పాకశాల, దానికి కొంత దూరములో ఒక మంటపము ఉన్నాయి గర్భగృహం, అంతరాలమంటపం, అర్ధముఖ మంటపం వగైరాలు అన్ని ఆలయాలలోవలెనె శాస్త్రప్రకారం నిర్మింపబడి ఉన్నాయి. కాని గోడలపైగాని, ఆలయం లోవైపునగాని, వెలివైపున గాని, స్తంభాలకు గాని, కన్నులగావి చెప్పదగిన ఏ రకమైన కళాత్మకమైన శిల్పం ఈ ఆలయంలో కనిపించదు. ఉన్న పరమాశ్చర్యకరమైన విషయమంతా ఈ ఆలయంలో ప్రతిష్ఠింపబడిన చతుర్ముఖ నందీశ్వర లింగమే!

ఈ ఆలయం ఏ కాలంలో కట్టబడిందో, ఆలయ నిర్మాత యెవరో తెలియదగిన శాసనాధారంకూడ ఇప్పటిలేదు. అన్ని ఆలయాల్లో ధ్రువబేరమనీ, మూలవిరాట్టనీ, చెప్పబడే ప్రధానమూర్తి గర్భగృహం మధ్యభాగంలో వేదిలేక పానవట్టంపై ప్రతిష్ఠింపబడుట సంప్రదాయము, శాస్త్రవిహితము అయ్యుండగా ఈ ఆల

యంలో ఇందుకు విరుద్ధంగా గర్భగృహం ఖాళీగా ఉంచబడి మూల విరాట్టు గర్భగృహానికి ముందు భాగాన ఉండే అంతరాల మండపం మధ్యలో వేదిపై ప్రతిష్ఠింపబడి ఉన్నది. మూలవిగ్రహం చుట్టూ భక్తులు ప్రదక్షిణం చేయడానికి వీలుగా ఈ అంతరాల మండపము చతుర సాకారంలో విశాలంగా నిర్మింపబడి ఉన్నది. మండపంమధ్యలో చక్కని సనితనం గల వేదిపై నల్ల సేనపు జాయితో మిక్కిలి నును పుగా మల్చబడి నాల్గువైపులా నాలుగు నందిముఖాలతో కలిసిన శివ లింగం ప్రతిష్ఠింపబడి ఉన్నది. లింగము నాలుగు నందులు ఒకే జాయితో కలిసికట్టుగా మలచబడి యుండుట ఇచట విశేషము. నందులు సర్వాలంకారాలు గలిగి ఉండునట్లు చక్కగా తీర్చబడినవి. విమానమాత్రం గర్భగృహం పైననే కట్టబడి వున్నది. గర్భ గృహంలో మతేదైనా విగ్రహం స్థాపింపదలచినారేమో అనడానికైన దానికితగిన సన్నాహం, ఆధారం అందులో కానరాలేదు. విమానం నాలుగు మూలలా నాలుగునందులు ఉన్నాయి. ఇది యీ దేవాలయ స్వరూపం.

ఇంత క్రొత్త పద్ధతిలో నిర్మితమైన ఈ ప్రాచీన దేవాలయాన్నిగూర్చి తెలిసికోలేదామని ఆలయంచుట్టూ పరీక్షగా తిరిగి చూచినా ఏ ఆధారము దొరకక పోవుట ఆశ్చర్యాన్నేగాక, విషాదాన్ని కూడా కలిగించింది. ఇక యిందులో చెప్పుకోదగిన ఏ విధమైన శిల్పమూ లేనందునకూడా ఈ ఆలయం ఏ కాలానికి చెందినదో చెప్పు కొనుటకు వీలు పడుటలేదు. ఇక మిగిలిన ఒకే ఒక ఆధారం మూల విగ్రహం—చతుర్ముఖ నందీశ్వర లింగం మాత్రమే!! నాకు తెలిసి నంతవరకూ ఇటువంటి నిర్మాణాన్నిగూర్చి "ఆగమ"శాస్త్రాలేమియు చెప్పినట్లు లేదు. దేవాలయ శిల్ప నిర్మాణాలనుగూర్చి, ఆగమశాస్త్రా లను విరివిగా పరిశోధించిన పెద్దలు ఆచార్య శ్రీ సి.శివరామమూర్తి శ్రీ టి గోపీనాధరావు, శ్రీ బి. యన్. శర్మ, శ్రీ హెచ్. కె. శాస్త్రి మొదలగువారు చతుర్ముఖ నందీశ్వరలింగ నిర్మాణాన్నిగూర్చి గానీ, ఉనికినిగూర్చిగాని తమ రచనలలో ఎక్కడ పేర్కొని యుండ లేదు.

నంది, నందీశ్వర, నంది కేశాది నామాలతో శివునకు పరివార దేవత లున్నట్లు హేమాద్రి ప్రవచించినాడు. వరాహపురాణంలో నందికేశ్వరుడు శివునిగూర్చి కఠోరమైన, తపస్సునేసి ఆ దేవుని అను గ్రహానికి పాత్రుడై శివసారూప్యమును పొంది ప్రమధ గణాల కన్నింటికి అధిపతి చేయబడినట్లు చెప్పబడియున్నది. శివ పురాణంలో లింగపురాణాలలోకూడా భక్తుడైన నందికి శివస్వరూపంవచ్చినట్లు చెప్పబడినదేకాని శివునికి నందిరూపము వచ్చినట్లు ఎక్కడా చెప్పబడి నట్లు లేదు.

దక్షిణ భారతంలో సాధారణంగా మూల విగ్రహం శివలింగానికి ఎదురుగా నంది విగ్రహం ప్రతిష్ఠింపబడి ఉంటుంది. భక్తులు నందీశ్వరుని తలపై రెండు కొమ్ములమధ్యనుండి కొంత దూరంలో చీకటి కోణంగాఉండే గర్భ గృహంమధ్య మినుకు, మినుకు మంటూ వెలుగుతూఉన్న అఖండదీపం మసక వెలుగులోవున్న శివలింగాన్ని కొంత ప్రయత్నంతో దర్శించి తృప్తిపడుతూ ఉంటారు. మధ్య రాష్ట్రాలలో అనేక శివాలయాలలో శివలింగం ప్రక్కనే నందికి స్థానం కల్పింపబడిఉన్నది. కాని ఈ 'చదుం' గ్రామంలోని పశుపతి నాధాలయంలోని మూర్తివలె శివలింగంతో కలిపి ఒక నందిగాక నాలుగు నందులు ఒకేజాయిలో ఏకరూపంగా నిర్మింపబడి ఉండలేదు. దక్షిణ భారతంలో అధికారనంది విగ్రహాలున్నాయి కాని అవి వృషభ శిరస్సుతో మనుష్య శరీరంతో నిర్మితాలై శివలింగానికి బదులుగా నెలకొల్పబడిన నందికేశ్వరాలయాలు మాత్రమే. నాకు తెలిసినంత వరకు మన హిందూదేశంలో ఎక్కడకూడా చతుర్ముఖనందీశ్వర శివ లింగాలున్నట్లు లేవు

కాగా ఈ పరిస్థితిలో ఈ అపరూపమైన చతుర్ముఖ నందీశ్వర లింగాన్నిగూర్చి కొంత పర్యాలోచన చేయదగియున్నది. అట్లే దక్షిణ భారతంలో మతములలో కొంత సంస్కారం జరిగి నవీన — రూపంలో విరివిగా ప్రచారం జరిగిన నాటి పరిస్థితులుగూడ కొంత పునః పరిశీలన చేయవలసిఉన్నది. శాసనాలు, శిల్పనిర్మాణాలు ఆధారం గాను, ప్రమాణంగానూ, తీసికొని చూచినచో 12వ శతాబ్దంలో చాళుక్య ప్రభువు మూడవ తైలప దేవుని పరాజయం తర్వాత వీర శైవం ప్రాధాన్యానికి వచ్చుటతో శివాలయాలలోగూడ నందీశ్వరునకు— ప్రముఖ స్థానం యిచ్చినట్లు తెలియుచున్నది. కాలచుర్య బిజ్జలుని భాండాగారాధిపతి బసవేశ్వరుడు లేవదీసిన మత విప్లవంతో ఈ నందీశ్వరుడు ప్రాధాన్యానికి వచ్చినాడు. వీరశైవులు లేక లింగాయతులన బడు బసవ మతానుయాయులకు ఆరాధ్యదైవమైనాడు. అంతకు ముందున్న కాలముఖ, పాశుపత, కాపాలికాది శైవమతశాఖలు ప్రజల నాకర్షింపజాలక పాతపడి పోగా ఈ వీరశైవ తీవ్రవాదం, 12వ శతాబ్దంలో—ప్రజల ఆదరణతోబాగా పుంజుకొన్నది. బసవేశ్వరుడు కర్ణాటకరాష్ట్రంలోను,మల్లికార్జున పండితారాధ్యుడు ఆంధ్రరాష్ట్రం లోను ఈ వీరశైవానికి పట్టుగొమ్మలై ప్రముఖస్థానం ఆక్రమించి నారు. బసవపురాణము, పండితారాధ్య చరిత్రలు ఈ యిరువురి మహిమాన్విత జీవితాన్ని విశదంచేస్తూ ఉన్నాయి. బసవేశ్వరుడు ప్రాచీన శైవమతాన్ని సంస్కరించి పూజావిధానంలో, ఆచారాలలో క్రొత్త విధానాలు ప్రవేశపెట్టినాడు. ఈ నూతన పద్ధతిలో శివలింగంతో సమానంగా, నందికీ ఎనలేని ప్రాధాన్యం ఈయబడింది. ఈ విధానాల వలన బసవేశ్వరుడు అచిరకాలంలోనే పెద్ద సంఖ్యలో శిష్యకోటిని ప్రోగుచేసికోగలిగినాడు. అంతేకాక ఆ అనుయాయుల పాలికి బసవేశ్వరుడు శివాపరావతారమై ప్రచారాన్ని పొందగలిగినాడు. అతని అనుయాయులు తర్వాతి కాలంలో మత ప్రచారకులై గురువులుగా పేరు గడించు కొన్నారు. వారే జంగములు అనబడువారు.

బసవేశ్వరుని వీరశైవమత సిద్ధాంత ప్రకారం గురుదేవుడు, శివస్వరూపుడు, బసవేశ్వరుడు నందీశ్వరావతారంగా తన్మతాను యాయులచే పూజ లందుకోసాగినాడు. ఈ పరిస్థితులన్నింటినీ పర్యాలోచించి చూడగా నాకొక ఆలోచన పొడగట్టుచున్నది. వీరశైవం విస్తారంగా వ్యాపించి నేటికినీ ఆ మతస్థులకు కాణాచిగా ఉన్న కర్ణాటక రాష్ట్రానికి రాయదుర్గం మిక్కిలి సమీపంలో వున్నది. చదుము గ్రామంలోవున్న ఈ చతుర్ముఖ నందీశ్వరరూపంలోని పశుపతినాధా

లయం 13, 14 శతాబ్దాలలోగాని, ఆ తర్వాతగాని వీరశైవం సర్వోచ్ఛస్థితిలో ఉండుకాలంలో నిర్మింపబడి వుండవచ్చును. లింగానికి నలువైపులా నందిముఖాలు బసవేశ్వరుని నిర్వచనం లేక సిద్ధాంత ప్రకారం వీరశైవ మతాధిదేవత అయిన గురు-నంది-ఈశ్వరుని (లింగ) సమ్మిళితరూపనమే.

చివరిమాటగా ఒకటి మనవి చేయుచున్నాను. అధిష్ఠానపీఠంపై ఏకశిలలో నాల్గువైపుల నాల్గు నందిముఖాలతో నమిరిన శివలింగంతో సలక్షణంగా ఉన్న ఈ ఆలయం వీరశైవమతానికి, సంప్రదాయానికి ఒక నమూనాగా, ప్రత్యేకించి లింగాయతులకు పవిత్ర యాత్రాస్థలంగా చదువు గ్రామమందలి పశుపతినాథాలయం వర్ధిల్లి వుండవచ్చును. ఈ వ్యాసంలోని నా అభిప్రాయాలు సిద్ధాంతాలుకావు. పెద్దలు, విజ్ఞులు శాస్త్రీయ సాంకేతిక విషయాలు క్షుణ్ణంగా పరిశీలించి లోకానికి వెల్లడింతురు గాక యని మనవి చేయుచున్నాను.

—శ్రీ జి జవహార లాల్

"పాండవగీత"

ఈ పుస్తకము నాకు మిత్రుడు శ్రీ వెలిదండ వేంకటరావు గారిచ్చిరి. ఇది వారింటియందలి పీచుకాగితముల ప్రతులలో బయటపడినది.

ఈకృతి సంస్కృతమందలి పాండవగీత కనువాదము. కృతికర్త మంత్రవాది వేంకటరావుగారి కుమారుడు కస్తూరిరంగకవి. ఈతడు తన గ్రంథమును కావేరి తీరమందలి శ్రీరంగ క్షేత్రమున గల శ్రీరంగస్వామి కర్పణము జేసినాడు. ఇది మొత్తము నూటిరువది పద్యముల లఘుకృతి. అనువాదము నాతి ప్రౌఢముగా నున్నది. మచ్చునకు మూలముతోగూడ మూడు పద్యము లుదహరింతును.

శ్లో॥ యం త్వస్య గుణదోషేన-యంత్రిణః పురుషోత్తమ
అహంయంత్ర భవాన్ యంత్ర మమదోషో న విద్యతే
ఓ యదునాథ యంత్రధరుడుండగ యంత్రమువందు దోషమే
చాయదనర్చువయ్య? వినుసర్వ జనాంతరవాపివైన నీ
వీ యెడయంత్రధారుడవు; నేనొక యంత్రమునింతె! కావునన్
నాయెడ నించుకైనను గనంబడు దోషములేదు చూచినన్.

శ్లో॥ ఇదంశరీరం శతసంధి జర్జరం, పతత్యవశ్యం పరిణామ దుర్భరం
కిమౌషధంపశ్యసి మూఢ దుర్మతే, నిరామయంకృష్ణ రసాయనం పిబ!
నమ్మగరాదు లేదు పరిణామము, మున్ శతసంధి జర్జరం
బెమ్మెయి జాచినన్ పడుటయే సహజం బిటువంటిదీ శరీ
రమ్మని! నౌక్కమందెది? నిరామయ విష్ణు రసాయనంబు పా
నమ్మొనరింపు దుర్మతి ఘనమ్మగు జాడ్యము మానునిత్యమున్

శ్లో॥ ఆలోల తులసీమాలా మారూఢ వినతాసుతం
జ్యోతి రింద్రీర శ్యామ మా విరస్తు మమా గ్రతః
అతి వేగాన త వెనతేయ భుజ మధ్యారూఢమై, కౌస్తుభో
ద్ధత కాంతిస్ఫు గితాతి లోల తులసీదామ ప్రతానాభి రం
జితమై, నీల పయోజ పత్రనిభమై, చెన్నొందు తేజంబు సం
తతమున్ దోచు మద గ్రభాగమున భక్తత్రాణ పారీణమై.

అనుష్టుప్పులు వృత్తములం దను వదించుటచే కవికి మూలమునకు విషయ విస్తృతి తప్పలేదు అయినను అనువాదము చక్కగనే యున్నది.

ఈకవి ఎప్పటివాడో, ఎక్కడివాడో తెలియదు నేడు "మంత్రవాద" అనే యింటిపేరు గలవారచ్చంపేట తాలూకాలోని ?పనూతల గ్రామమున నున్నారు. వారు బ్రాహ్మణ వంశమునకు జెందిన దౌరలి శాఖలోనివారు.

నేడు మున్నూరియందలి విజయ గోపాలస్వామి యాలయమునగల "గరుడ కంబము"న గల శాసనమున మంత్రవాద నారాయణస్వామి అనునొక వ్యక్తి పేర్కొనబడి యున్నాడు. అతని ప్రతిమ గూడ నా కంబము పై గండరింపబడియున్నది.

ఈ నారాయణస్వామి గురుపు గోపాలస్వామియైనటు శాసనము చేతనే తెలియును. అతనికి జెందిన మఠమొకటి అప్పర్ ప్లాటలోని సిద్ధాపురమున నున్నది. అతని సమాధి ప్రస్తుత మచ్చంపేటలోని కోటలోనున్నది. కాని ఈ గురుశిష్యుల కాలముగూడ తెలియదు. అందువలన పాండవ గీత కృతికర్త కు శాసనస్థుడైన నారాయణ స్వామికి ఏమైన సంబంధమున్నదో లేదో సమన్వయముజేయ వీలుగాదు.

ఇది లముద్రిత కృతి గనుక ఈ వివరములు కవి చరిత్రకారుల కుపకరించునను నుద్దేశమున తెలిసినంతవరకు వ్రాసితిని. ప్రస్తుత మీవంశీయులెవరైననున్న పత్రికాముఖమున కృతికర్త ను గూర్చి ఇంకను వివరము లేవైన నున్నయెడల తెలిపినచో కవుల చరిత్రకు లాభము చేకూరును.

— శ్రీ కపిలవాయి లింగమూర్తి

'నా తెలంగాణ కోటి రత్నాలవీణ'

1976 నవంబరు భారతి సంచికలో ప్రచురింపబడిన శ్రీ సర్దేశాయితిరుమలరావుగారి "సాహిత్యంలో సృజన" ఒక చర్చలో సుప్రసిద్ధాంధ్రకవి శ్రీ దాశరథిగారంటే చప్పన స్ఫురించి, ప్రతి తెలుగువాని హృదయాన్ని కదిలించి, రసరంజితంచేసే 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అన్న పద్య పాదం తెలంగాణా ప్రజల పోరాటంలో ప్రచారం పొందిన ఒక నినాదం మాత్రమేనని వారు చెబుతూ, అందులో అర్థం స్పష్టంగానే ఉందన్నారు. కాని ఆ అర్థం ఏమిటో

వారు విప్పి చెప్పలేదు తరువాత "నా తెలంగాణ......"లో ఉపమాలంకారం, అతిశయోక్త్యలంకారం ఉన్నాయన్నారు. సూక్ష్మదర్శినితో చూసినా నాకు ఆ వాక్యంలో ఉపమాలంకారం అగుపించలేదు ఉపమా వాచకమైన పదమేదీ ఆ వాక్యంలో లేదని ఎటువంటి సామాన్య పాఠకుడికైనా తెలుస్తుంది. అది వారికెలా తెలియలేదో అసలందున్నది రూపకాలంకారంకానీ ఉపమాలంకారం కాదు. అతిశయోక్తి అసలుకు లేదు.

శ్రీ సుదర్శనంగారు తమవ్యాసంలో కవిత్వంలో సృజన ఒక రసాత్మకమైన వాక్యంలో ఒక పదబంధంలో వ్యక్తంకావచ్చు అన్నారు. ఈ నిర్వచనం 'వాక్యం రసాత్మకం కావ్యం' 'రమణీయార్థ ప్రతిపాదక శబ్దంకావ్యం' అనురెండు కవితా నిర్వచనములనూ జోడించి తయారుచేసినది. అందుకే వారు 'రసాత్మకమైనవాక్యం, పదబంధం' అను మాటలు చాల జాగ్రత్తగా వారి నిర్వచనంలో పొందుపరచారు. శ్రీ సుదర్శనంగారి మతంలో 'నా తెలంగాణ...' ఒక రసాత్మక వాక్యం. అందులో 'కోటిరత్నాలవీణ' అన్న పదబంధం ఉంది. ఆ పదబంధమే ఆ పద్యపాదాన్ని అతిమహత్తరమైన కావ్యఖండంగా మార్చింది.

శ్రీ దాశరథిగారు ఉత్తకవి కాదు తెలంగాణా స్వాతంత్ర్యోద్యమంలో వ్యక్తిగా తాను పాల్గొని కూడా ఉద్యమ నాయకుడైనాడు తెలంగాణా ప్రజలపట్ల అతనికున్న ప్రేమ, ప్రౌఢ దేశభక్తి అతని హృదయంలో రేకెత్తించిన ఉత్సాహోద్రేకాల అక్షర రమ్యరూపమే "నా తెలంగాణ..." అనే పద్యపాదం. కవులు ప్రతీకలద్వారా తమ అనుభూతులకు రూపకల్పన చేస్తారు ఇచట 'రత్నము' మనిషికి ప్రతీక. 'వీణ' 'తెలంగాణకు ప్రతీక. ఈ ప్రతీకలూ, ఈ పదబంధమూ ఈ పద్యపాదానికి హృద్యతాన్నీ, ఆ స్వారస్యాన్నీ ఆపాదించినవి. దాన్ని మహోన్నత శిఖరాలకు ఎత్తినవి. ఇది మొదటి కవిత్వం; తరువాత నినాదం. ఇది కవితా వాసనలేని వట్టి శుష్కనినాదమే అయి ఉంటే నేటికీ, మాటిమాటికీ, ప్రతి తెలుగువాని హృదయాన్నీ విన్నంతనే ఎందుకు స్పందింపచేస్తుంది? అంటే, ఆ పద్యపాదంలో కాలదేశాతీతమైన, ఒక అనిర్వచనీయమైన హృదయ స్పందన కలిగించే గుణం ఉందన్నమాట. అదేమంటే శ్రీ దాశరథిగారికి మానవ స్వాతంత్ర్యంలో, మానవ పురోగతిలోఉండే ఆవేశం. అదే మనల్ని నేటికీ ఆ వాక్యం కదిలించడానికి కారణం. అత్యుదాత్తమూ, అతిమహత్తరమూ, అయిన మానవత్వానికి ప్రాతినిధ్యంవహించే రసఖండం కాబట్టే శ్రీ సుదర్శనంగారు ఆ వాక్యాన్నే ఉత్తమమైన సృజనాత్మక రచనకు ఉదాహరణంగా స్వీకరించారు. ఒక మహాస్వాతంత్ర్య ఉద్యమానికి నినాదంగా బంకిం చంద్రుని వందేమాతరం గీతంలోని పల్లవి మారిందంటే, ఆనాటి రాజకీయాలు కానీ, దేశపరిస్థితులుకానీ, అందుకు కారణాలుకావు. వందేమాతరం గీతం ప్రజల్లోని కవితా శక్తినేత ఉదాత్తమైన దేశభక్తిని ఉద్దీపించింది. "నా తెలంగాణ..."కూడ అంతే చేసింది అందువల్ల తెలంగాణా స్వాతంత్ర్యోద్యమానికి నినాదం అయింది. ఈ సందర్భంలో 'మానిషాద 'శ్లోకం కూడ శ్రీ దాశరథిగారి 'నా తెలంగా..."ను సమర్థించేందుకు బాగా ఉపయోగపడుతుంది. 'మానిషాద' శ్లోకం వాల్మీకికి క్రౌంచపక్షిపై గల జాలీ, వ్యాధునిపై గల ఆగ్రహం రెండూ ఏకమై అతని హృదయంనుంచి వెలువడిన రసవాక్యం. అలాగే శ్రీ దాశరథికి తన తోటి ప్రజలమీదగల అభిమానమూ, వారి బాధలను నివారించవలెననే ఉత్సాహమూ, హృదయంలో రసాయనిక సమ్మేళనం చెంది "నా తెలంగాణ..." జాలువారింది. వాల్మీకి 'మానిషాద' ఎంతటి మహత్తరకవిత్వమో, "నా తెలంగాణ..." కూడా అంతే.

శ్రీ తిరుమలరావుగారు శ్రీ సుదర్శనంగారు కొత్త సిద్ధాంతాలు ప్రతిపాదిస్తున్నారని చెబుతూ, వెక్కిరిస్తూనే, తాము కూడా కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అది ఇది. 'ఫలానా సంఘ పరిస్థితులుండే కారణం వల్లనే మహాకావ్యం రాదు. మహాకవి ఉండినందువల్లనే మహాకావ్యం వస్తుంది' అసలుకు ఒక రచనకానీ, ఒక కవితకానీ ఉద్భూతమవడానికి, కవీ, సమాజం రెండూ కారణాలే. కవిమీద సమాజం, సమాజంమీద కవీ, పరస్పరం ప్రభావాలు పడవేసుకుంటూ వుంటారు. ఇది మనం నిత్యం చూస్తున్న విషయమే. నిత్య చైతన్యవంతమై, అతి సూక్ష్మమూ, సునితమూ అయిన కవి హృదయం సమాజంలో క్షణక్షణమూ కలిగే పరివర్తనలకూ, పరిణామాలకూ స్పందిస్తూ వుంటుంది. కనుకనే కవిత్వంకానీ, ఒకరచనకానీ, ఆవిర్భవిస్తుంది. ఉదాహరణకు నన్నయను తీసుకుందాం, నన్నయ్య భారతాన్ని వ్రాయడానికి కారణములు అతడు మహాకవి అయినందువలన మాత్రమేకాదు అతనిలో కవితావిర్భావానికి దోహదం కల్పించిన సామాజిక వాతావరణం కూడ అతని కవితా రచనకు చాలా తోడ్పడ్డది. నన్నయ్య కాలంలో తెలుగుకు కావ్యరూపం లేదు. తెలుగువాడు 'నాది' అని చెప్పుకోదగ్గ కావ్యంలేదు. కన్నడ భాషలో అప్పటికే పంపభారతం ఉంది. తెలుగులో కూడ దానికి సాటియైన కావ్యాన్ని నిర్మింపచేయాలనే ఆలోచన రాజరాజుకు కలిగింది. అతడు తన కులబ్రాహ్మణుడూ, ఉభయ భాషాకావ్య రచనా భిశోభితుడూ అయిన నన్నయ్యను భారతరచనకు ప్రోత్సహించాడు. కావ్యం ఏవిధంగా ఉండాలి, ఏ ఏ పద్యాలు తెలుగుకు అనువైనవీ, మొదలగు విషయములను వింగడిస్తూ నేడోడు వాదోడుగా పాకశాసనికి భారతయుద్ధంలో నారాయణుని వలె నన్నయ్యకు తన శిష్యుడూ, సహాధ్యాయుడూ, వాఙ్మయ ధురం

ధరుడూ, అయిన నారాయణభట్టు ఉండినాడు. ఒప్పు తప్పరయు పండిత పరిషత్తులుండినవి. ఇన్ని హంగులుండినవి కావుననే నన్నయ్య 'భారత సంహితా రచన బంధురు' డయినాడు. తిక్కనకూడా సామాజిక పరిస్థితుల ప్రభావంవల్లనే 'ఆంధ్రావళి మోదముం బొరయునట్లుగ చేయుటకు ధర్మాద్వైతాన్ని స్థాపించేందుకు హరిహరనాథుణ్ణి సృష్టించి, తన కావ్యాన్ని ఆ అద్వైతమూర్తి కంకితమిచ్చినాడు. సమాజమే లేని శూన్యంలో కవి కూర్చుండి ఎవరికోసం తన కావ్యం వ్రాస్తాడు? అతని హృదయాన్ని స్పందింపచేసే అనుభూతులకు ఆటపట్టు తన చుట్టూరా విత్యచైతన్యవంతంగా ఉండే సమాజమేకదా? సమాజంలో కలుగుతూవుండే క్షణక్షణ పరిణామాలే కవిహృదయ సరస్సులనుండీ కావ్య సరోజాలను వికసింపించి, పరిమళింపచేస్తాయి. శ్రీ దాశరథిగారిని కూడా కవిగా నిలచినది ఆనాటి తెలంగాణమే. ఆ నాటి తెలంగాణా పరిస్థితులే లేకపోతే, శ్రీ దాశరథి మనకు నేడు కవిగా మిగిలి ఉండడని నా నమ్మకం. తెలంగాణా విమోచనోద్యమమే, మహోం ధ్యేయమే దాశరథి హృదయంలో ఆవేశంపోసి, అతని కవితకు ఊపిరులిచ్చినాయి. అతడిని ఆకాశమంత ఎత్తు అందుకొనేటట్టు చేసినవి. అందుచేతనే పునఃపునః వచిస్తున్నా, ఉత్తమాశయాలనూ, ఉదాత్త భావాలనూ, మహాశక్తివంతంగా ప్రకటించే పద్యపాదం, రసమయ కవితావేదం • 'నా తెలంగాణ...' అని.

'కృష్ణపక్షం', 'మహాప్రస్థానం'లలో 'నవనీత' ఉంది అని నా భావం అని అన్నారు శ్రీ తిరుమలరావుగారు. లేదన్న వాదన్న వివడు? కానీ ఆ 'నవీనత' హృదయాన్ని ఎలా స్పందింపచేస్తుందో చెప్పలేదు. ఉత్త నవీనతే కవిత్వం కాదు. హృదయాన్ని స్పందింపచేసే నవీనతే కవిత్వం. అదే కావ్యగ్రథన కౌశలం. ఆ కావ్యగ్రథన కౌశలంలో ఒక అవిభక్త భాగమే కొత్త పదబంధాలను సృష్టించడం. అట్టి పదబంధమే 'కోటిరత్నాలవీణ' శ్రీ దాశరథిగారు తమకుగల అగాధమైన మానవ ప్రేమనూ ప్రగాఢమైన దేశభక్తినీ, రమణీయంగా, ఆ పదబంధంద్వారా స్ఫురింపచేశారు. అందుచేతనే 'నా తెలంగాణ...' రసాత్మకకావ్యం. క్షణక్షణ నూతనానంద పదం.

ఇక కవిత్వంలో అంతు చిక్కని 'కిటుకు' విషయం. అది పిల్లవాళ్లను ఆటలనుంచీ, ముసలివాళ్ళను కుంపటి మూలలనుండీ ఆకర్షించుకునే, ఆకట్టుకునే అనిర్వచనీయ పదార్థం అని కదా ఒకానొక ప్రసిద్ధ విమర్శకుని వాక్యం. అదేదో వివరించేందుకు "నా తెలంగాణా..." నే ఉదాహరణంగా స్వీకరిద్దాం. శ్రీ దాశరథిగారి 'తెలంగాణ' పద్యాలను శ్రావ్యమైన కంఠంతో, ఆవేశం డిందుపోకుండా గానం చేశారంటే, ఆటలాడుకునే పిల్లవాళ్ళేకాదు, కుంపటి వద్ద కూర్చున్న ముసలివాళ్ళేకాదు. ఆబాల గోపాలం వేణుగోపాలుని మురళీగానానికి ఆనాడు ఆకృష్టులైన వ్రేపల్లె ప్రజలవలె వచ్చి వింటారని నా నమ్మకం. శ్రీ దాశరథి కవితలోగల నాదమాధుర్యం, లయ సౌందర్యం, పదాల ప్రవాహశీలింపూ, యతి ప్రాసలను ప్రతిధ్వనించటంలో నేర్పూ, పదాల కందని ఆవేశాన్ని పదాలద్వారా వ్యక్తపరచడంలో గల అనితర సాధ్యమైన ప్రతిభా అన్నీ మూర్తీభవించిన వారి కవితా కీర్తిపతాక 'నా తెలంగాణ ... ...' శ్రీ శ్రీగారు తమ 'కవితా, ఓ కవితా' ఖండికలో నాగీతం గుండెలలో ఘూర్ణిల్లగ నాజాతి జనులు పాడుకొనే మంత్రంగా మోగించాలని' ఆశించారు. ఆయన ఆశ పూర్తి సఫలమైందోలేదో చెప్పలేము కానీ, శ్రీ దాశరథిగారి 'నా తెలంగాణ......" నాటికి, నేటికీ, ఏనాటికీ తన జాతి జనులు పాడుకునే మంత్రమైంది. ఆ పద్య పాదంలోని మంత్రశక్తియే దాని కవితా శక్తికి తార్కాణము. కవిత్వంలో ప్రత్యక్షమయ్యే భావస్ఫోరకమైన శబ్దాల రసాయనిక సంయోగమే విమర్శకులనూ, కవులనూ, అను నిత్యంతిక పెడుతున్న అనిర్వచనీయమైన, అస్పష్టమైన, అచుంబితమైన అందం. అదే బ్రహ్మపదార్థమునకు సబ్రహ్మచారి. ఆ పదార్థ సాక్షాత్కారానికోసమేకదా కవులు సదా సాధనాయానమైన రసతపస్సు చేసారు. అందుకేకదా కవులను ఒకానొక సుప్రసిద్ధ కన్నడకవి 'రసఋషులు' అన్నది. ఋషులు మంత్రద్రష్టలు, మంత్ర సష్టలు కదా. మరి, రసఋషులైన కవులు 'నా తెలంగాణ ... ...' లాంటి మంత్రశోభాయములైన పద్య పాదాలను సృష్టించడంలో వింత ఏముంది? ఎంతమంది ఎన్ని రకాలుగా, ఎన్ని యుగాలుగా, అన్వేషించినా అగమ్య గోచరంగా ఉందికదా బ్రహ్మపదార్థం. బ్రహ్మపదార్థ సబ్రహ్మచారి అయిన కవిత్వంలోని కిటుకుకూడా అన్వేషిస్తే దొరికేదైతే ఏనాడో దొరికి ఉండేది. అది అన్వేషిస్తే దొరకకుండా మనల్ని తికమక పెడుతూ ఉందికనుకనే మన విమర్శలూ సిద్ధాంతాలూ, రాద్ధాంతాలూ. శ్రీ తిరుమలరావుగారుకూడా తక్కువ రకపు విమర్శకులుకారు కదా. వారుకూడా తీవ్రంగా గాఢంగా శ్రీ సుదర్శనంగారికన్న ఎక్కువగా అన్వేషణచేసి, త్వరలోనే ఆ 'కిటుకు'ను కనుగొంటారని ఆశిస్తాను!

— శ్రీ కంబరగంటి రంగాచార్యులు

ఒక నివృత్తిమార్గం ఒక సందేహ కంటకం

వసుచరిత్ర ఇష్టదేవతా వందనంలో "సకల లోకాభివంద్య..." అన్న పద్యం రామునికి ద్వితీయం. అందులో అలంకారం శ్లేష సంకీర్ణరూపకమని వ్యాఖ్యాతల నిర్ణయం. అది అవితర్కితం! ఈ విషయం 1976 భారతి జూన్ సంచిక—సీత లక్ష్మికాని సీతా లక్ష్మిగారు లో నిరూపితం.

దానిపైని అక్టోబరు సంచికలో ఎస్. టి. పి. వి. రామానుజాచార్యులు అనేవారు విమర్శించేరు. విమర్శకు కారణం ముందే సూచించేరు. "...నాగార్జునశ్రీ" అనేవారు పై పద్యంలోని అలంకారం అపహ్నుత్యలంకరమే కాని శ్లేష సంకీర్ణ రూపకమన్న వ్యాఖ్యాతృ నిర్ణయం అవితర్కితమన్నారు. భవతునామ— "ప్రమాదో ధీమతామపి" అని సరిపెట్టుకోవచ్చు.

ఆచార్యులుగారి బాధంతా వ్యాఖ్యాతలనిర్ణయం 'అవితర్కితం'

అన్నందుకు నిస్సందేహం! ఆ మాటలో, వారా విమర్శ ముగించినట్లయితే సహృదయంతో వారి సహనాన్ని మెచ్చి నా అసహనశీలితను ఒప్పుకొందును. కాని ఆచార్యులుగారు వ్యాఖ్యాతలు చేసిన ప్రమాదభూయిష్ఠమైన ఆ వ్యాఖ్యానాన్ని సమర్థించడానికి ప్రయత్నం చేసేరు. అందుకు పోషకంగా కొన్ని లక్షణాలను ఉల్లేఖించారు. ఇంతా చేసి తమ రచనమీద తామే అవిశ్వాసాన్ని బహిర్గతంచేసేరు. లేకుంటే అది వారి సహనశైలి కావచ్చు.

ఇక్కడ నేను గ్రంథాన్ని పెంచడానికి పూనుకోను. ముఖ్యంగా ఒక విషయం విశదీకరిస్తాను. వ్యాఖ్యాతలు చేసిన వ్యాఖ్యాన విధానం పరిశీలించవలసివుంది. పై పద్యం దగ్గరుంచుకొంటే విషయం సులభగ్రాహ్యమవుతుంది.

"సీతాపరమైన యర్థము,... నెమ్మోము=వక్త్రాని ముఖమనెడి, చందురునితోడన్=సోమునితోఁగూడను, లక్ష్మీపరమైనయర్థము,... నెమ్మోము=తనముఖమును బోలిన, చందురునితోడన్=సోమునితోడఁగూడను,"

ఈ పద్యంలో కీలకం కారకం. దాన్ని గుర్తించక వ్యాఖ్యాతలు ప్రతి "తోడ" వర్ణకానికి "కూడను" అనే ఏకమాట అతికించేరు. దానిజోలికి పోవలసిన అవసరమేంలేదు. మరి "నెమ్మోము" అన్నమాటకి "తన ముఖమును బోలిన" అని అర్థం చెప్పడానికి వీలెక్కడుంది?

అలాగే చెప్పవలసివస్తే సీతాపరంగా నెమ్మోమనెడి చందురునితోడను, లక్ష్మీపరంగా నెమ్మోము, చందురునితోడను అని చెప్పాలి! అప్పుడాచార్యులుగారన్న 'సొగసు' కనిపిస్తుంది. కాని ఆ ప్రకారం; నెమ్మోము చందురునిలోనూ, కెమ్మోవి తూనికంలోనూ సరిపడుతుంది. ఉరోభవ సుధాపూర్ణకుంభాల్లోనూ, లలిత భుజాకల్పలతల్లోనూ సరిపడదు. ఈ రెండూ సంస్కృతాలు, పై రెండూ తెలుగులూ గనక. 'నెమ్మోము చందురుని' వ్యస్తంగానూ సమస్తంగానూ గ్రహించవచ్చు. సంస్కృత సమాసాల దగ్గర ఈ పద్ధతి సాగదు.

ఇక గీతిలోవున్న రూపకాలకు వ్యాఖ్యాతలు చేసిన వ్యాఖ్యానం 'వ్యాఖ్యానం'గానే మిగుల్తుంది. అది వారి పాండిత్య ప్రకర్షను సుస్పష్టం చేస్తుంది. కాబట్టి ఆచార్యులుగారి సమర్థనా అవితర్కితమయింది.

ప్రస్తుత పద్యంలో అలంకారం అపహ్నవమూ, అది హేతుపూర్వకమూ అయినప్పుడే కారకం దీప్తిమంతమవుతుంది. గీతిలోని రూపకపదాలు సీతను ధ్వనింప చేస్తాయి.

"ఉపమేయము కాదిది

ఉపమానమె యనఁగ" అపహ్నవమని వరసభూపాలీయం. ప్రస్తుత పద్యంలో సీత ఉపమేయం. సిరి ఉపమానం–ఈ ఉపమానోపమేయాలు అప్రసిద్ధాలు. ఉపమేయం లుప్తం. లుప్తను విశేషంగా భావించి అపహ్నవం అలంకారంగా నిరూపించడం జరిగింది. గతానుగతికాలయిన కొన్ని ఉపమానాలు (జూన్ సంచికలో ఉపమాన సామర్థ్యమని చెప్పవలసి, కవి సమయాల సహకారంగా తప్పుపడ్డాను.) జనక వంశాదుల్ని క్షీరసాగరాదులుగా ఆరోపించడానికి హేతుభూతాలయినాయి. శ్లేష విశేషణ సాధర్మ్యానికి పాటుపడింది.

కాబట్టి ఆచార్యులుగారికి మనవి చేసేదేమంటే మనం సరిపెట్టుకోవలసిందీ విమర్శించుకోవలసిందీ కవుల్ని. కవి హృదయం మెరగని వ్యాఖ్యాతల్ని కాదు ఈ వాక్యం కటువుగా వినిపించినాసరే!

"...ఈ (శ్లేషసంకీర్ణరూపక) అలంకార నిర్వహణలో కవి చేసిన చమత్కృతిని మనం ఓపికగా అర్థం చేసుకోవాలి" అంటారు ఆచార్యులుగారు. కవి చేసిన అనేకంటే వ్యాఖ్యాతలు చేసిన అంటే పోయేది. ఇక్కడొక చోటేకాదు. ఇంకా చాలా చోట్ల చేసేరు 'చమత్కృతి'. వాటిని సావకాశంగా మరొకసారి మననం చేసుకుంటాను.

వసుచరిత్ర పై తాతాచార్యులముద్ర, అది శ్లేషకావ్యమని. 'భవతునామ!' అందుకు ప్రతిపద్యమూ శ్లేషసంకీర్ణం కానక్కరేదు.

చివరగా ఒకమాట చెప్పక తప్పదు. "అపహ్నుతి రూపక లక్షణాలు మనం జాగత్తగా పరిశీలిస్తే, ఇక్కడ ఏ అలంకారం సొగసు కల్గిస్తోందో గమనించవచ్చు" అంటారు ఆచార్యులుగారు. అయితే సాహిత్యం ఆలోచనామృతమని అనూచానమూ సమీచీనమూ అయిన అభిప్రాయం. ఆ యాలోచన చిత్తసంస్కార విశేషాన్ని అనుసరించి వుంటుందన్నది నిజం!

— శ్రీ నాగార్జున శ్రీ

లేఖలు

రాయలసీమలోని అనేక దేవస్థానాలలో కుడ్యచిత్రాలు వున్నాయి. వీటిలో అనంతపురం జిల్లాలోని లేపాక్షి వీరభద్రస్వామి ఆలయం చిత్తూరు జిల్లాలోని సోంపాలెం చెన్నకేశవస్వామి ఆలయం రెండూ 'ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, వారి అధీనంలో వున్నాయి. కాని అన్ని చిత్రాలకు కనీసం ఫోటోలయినా తీసారో? లేదో? అలాగే కదిరిలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానములోని చిత్రాలు సున్నపుపూతల అడుగున వుంటూ ఆర్కియాలజీ డిపార్టుమెంటు వారికోసం ఎదురు చూసున్నాయి. నా స్వగ్రామమైన వాయలపాడులో (చిత్తూరు జిల్లా) శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలోని కల్యాణ మండపంలో 10అడుగులు × 5 అడుగుల శేషతల్పశాయి చిత్రం (తెలుపు-నలుపు) ఉండేది. ఈ మధ్య దానికీ సున్నం కొట్టారు. ఈ విధంగా ఎన్ని దేవస్థానాలలో అమూల్యమైన చిత్రాలు సున్నపుపూతల అడుగున నిదపోతున్నాయో? ఆర్కియాలజీ డిపారుమెంటు వారు వీటి గురించి శ్రద్ధవహించాలని కోరుతున్నాను.

శ్రీ తి మోహనరావు
హిందూపురం.

ఒక సందేహము

గత నాలుగైదు మాసములుగ భారతిలో ధారావాహికముగా వెలువడి 1977 జనవరితో సమాప్తమైన శ్రీ కెయస్వి నరసింహం గారి 'పంచపాత్ర'ను చదివిన తరువాత నాకొక సందేహము కలిగినది. కథా లేక నవలికా రచనలో నూతన సంవిధానము ననుసరించిన శ్రీ కెయస్వీగారి పాటవము అభినందనీయమైనదే. కాని, శీర్షికకు పెట్టినపేరు అంత సముచితము సమర్థనీయము సరియైన అర్థము నిచ్చునదిగా తోపదు. 'పంచపాత్ర' అను పదము విభిన్నములైన ఏ ఐదింటియొక్క ఏకత్వమునో సూచకము చేయునట్లేది. ఉదాహరణకు: పంచమి; పాంచాలి; పంచశరుడు వగైరా పదముల నెన్నియైనా చూపవచ్చును. 'పంచపాత్ర' అనగా పంచలోహములతో కలిపి తయారు చేయబడి భగవదార్చన సందర్భమున తీర్థమిచ్చుటకై 'ఉద్ధరిణె'తో బాటు ఉపయోగింపబడు పాత్ర అను అర్థము వెనువెంటనే సహజముగా అందరికీ స్ఫురించును తన కెదురైన ధనపతి-కైక పొన్నమ్మ చందకాంత్ రూప అను నీ అయిదుగురు వ్యక్తులను పాత్రలుగా రచనలో ప్రవేశపెట్టి కథకు 'పంచపాత్ర' అను పేరిడితినని రచయిత గారనవచ్చును. 'పంచపాత్ర' అనునది ఏదో లోహసంబంధమైన అర్థమును స్ఫురింపజేస్తుంది గాని, కథలోని పాత్రలనుస్ఫురింప చెయ్యదు. 'పంచ ప్రాణములు'- 'పంచతన్మాత్రలు' అను సుప్రసిద్ధార్థము నిచ్చు వాక్యములవలె తన కథకు 'పంచపాత్ర' అని అసమగ్రముగా గాక సమగ్రముగా సరియైన అర్థము స్ఫురింపజేయునట్లు 'పంచపాత్రలు' అని గాని 'పంచపాత్రీయము' అని గాని పేరు పెట్టియుండిన బంగారమునకు తావి అబ్బినట్లు వారి రచనకు మరింత వన్నె-వాసి వచ్చియుండునని నే నభిప్రాయపడుచున్నాను. నా సూచన లేక నా యభిప్రాయము సరికానిచో విభిన్న మనస్తత్వములు-వ్యక్తిత్వములుగల పైన వివరించిన అయిదుగురు పాత్రలను తీసుకొని కథ నడిపి 'భిన్నత్వంలో ఏకత్వం'లా అయిదుగురిని కలిపి ఒకే 'పంచపాత్ర'గా చెప్పటంలో రచయితగా వారి యుద్దేశము లేక ఇంకేదైనా నిగూఢార్థము వున్నచో తెలిపినయెడల జిజ్ఞాసువుల పాఠకుడనుగా నా సందేహ నివృత్తి చేసుకొని సంతోషింతును.

— శ్రీ శ్రీనివాసపురం రామాచార్యులు

శంఖఫలకము

భారతి ఫిబ్రవరి 76 సంచికలో 53వ పేజీలో న. చ. వంకాయల అప్పలాచార్లుగారు 'ధూర్జటి మహాకవి శంఖఫలకము' అను వ్యాసమును చూచిన తరువాత నా ఊహను వ్రాస్తున్నాను వారు వ్యాసంలో ముఖ్యంగా మూడు మాటలన్నారు.

1. శంఖఫలకమును సంఘఫలకముగా దిద్దుకుంటే ధూర్జటిపై నేరంపోతుంది.

2. అపుడు శంఖనిర్మితమగు ఫలకమని యర్థం చెప్పిన బులుసు వేంకటరమణయ్యగారు చిక్కుపడతారు.

3. చివరకు ధూర్జటి ఈ విషయంలో అనాలోచితంగా అంగీకరించాడు.

కవి హృదయాల నెరుంగక విందరో పండితులు ఎప్పో తాటాకు గంథాలను ఇష్టం వచ్చినట్లు దిద్దేశారు. దానికి ఫలితంగా అనేక పాఠాంతరాలు వెలిశాయి.

ఇచట బులుసువారిని చిక్కులంబడ దోయడం కంటె. ధూర్జటిపై అనాలోచితంగా అంగీకరించాడని నేరాన్ని మోపడంకంటె అర్థం మార్చుచేసి చెప్పుకొనవలెగాని పదాన్ని దిద్దడ మెందులకు ?

తిరుప్పావై పాశురాలలో మూడుచోట శంగు పదాన్నిచూపి దానికి శంఖమర్థమని యన్నారు నిజమే. కాని శంఖమువకు, సంఘమునకు సంబంధమేమి?

కావున దిద్దడం, చిక్కులపాలు చేయడం, నేరారోపణలు చేయడంకంటే అర్థాన్ని ఇట్లా చెప్పుకొంటె సరిపోతుందని అనుకొంటున్నాను.

శంఖఫలకము-"ధూర్జటి"
శంఖ నిర్మితఫలకము-"బులుసువారి వివరణ"
సంఘఫలకము-"ఆచార్యులవారి సవరణ"

ఇచట శంఖనిర్మిత ఫలకమును మాటకు తృతీయాసమాసము చేసి శంఖముచేత నిర్మితమని "సిమెంటులాగ" చేయడమెందుకు? శంఖఫలకమను ధూర్జటి పదమునకు బులుసువారి వివరణ శంఖనిర్మిత ఫలకము. దానిని శంఖాకార నిర్మిత ఫలకమని అర్థం చెప్పుకొన్నచో మొదటి మూడు దోషాలు పోతాయిగదా! ఇదీ నాకు తోచిన అభిప్రాయం.

సహృదయులగు పండితులతో మనవి ఏమంటే-ఈ యర్థం కాదని నిరూపిస్తే అభిప్రాయం మార్చుకుంటాను. కావున శంఖ ఫలకమునుగూర్చి అర్థమును వివరించి చెప్పగలరు.

—శ్రీ కాండూరి రామాచార్యులు

గ్రంథ విమర్శలు

శ్రీ శేషాద్రిస్వామి జీవితము

[రచన శ్రీ విశాఖ, క్రౌను సైజు 38+182 పుటలు. వెల రూ. 5. ప్రకాశకులు – సాధన గ్రంథమండలి, తెనాలి.]

భారతదేశంలో మహాశక్తి సంపన్నులైన యోగులకూ, సిద్ధ పురుషులకూ, అవధూతలకూ ఏమీ లోపంలేదు. అట్టివారిలో శ్రీ శేషాద్రిస్వామి ఒకరు. ఈయన ప్రతిభా విశేషంవల్ల బాల్యంలోనె వేదశాస్త్రాలను కరతలామలకం చేసుకొన్నారు. తొలుత వైదికంగా ఉంటూ తర్వాత దానిని అతిక్రమించి అవధూతలై నరిష్ఠ విశ్వ తిరువణ్ణామలైలోనే ఉంటూ అక్కడే సిద్ధిపొందారు. ఈయన ప్రవృత్తి ఈయనను గురించి తెలియనివారికి ఉన్మత్తుల ప్రవృత్తి వలె కానవచ్చినా, తెలిసినవారు ఈయన మహనీయమూర్తి అని యీయన అనుగ్రహం కోసం ఎదురుచూచేవారు. వీరి నోటివెంట ఏ మాట వెలువడినా అది దైవవాక్కే. వీరు మెచ్చిన చోటల్లా మేలిమి బంగారమే! ఈయన ఏ వస్తువునయినా స్పృశిస్తే చాలు. ఆ వస్తువుగల వ్యక్తికి విజయం తప్పదు. పిలిచిన చోటికి వెళ్లక పోవడం, పిలవని చోటికి కోరి వెళ్లడం వీరికి పరిపాటి. దేవాలయ మండపంలోనే నివాసం. శీతాతపాలుగాని, వర్షాలుగాని లెక్కచేయ కుండానే సంచారం. వారి హితోపదేశాలు అమూల్యాలు, అద్భుతాలు. ఆయన స్థితప్రజ్ఞులు.

శ్రీ శేషాద్రిస్వామి శ్రీరమణ మహర్షి వలెనే అరుణాచలం లోనే ఉండి ఆయన వలెనే ప్రజానీకాన్ని ఆకర్షించేవారు. శరీరం శుద్ధంగా ఉన్నా మురికిగా ఉన్నా – ధరించినది జీర్ణ వస్త్రమయినా, విలువైనదయినా ఒక్కటే! భౌతిక శరీరంపై అణుమాత్రం శ్రద్ధ లేదు. మహాయోగుల పద్ధతి యిదేగదా! శ్రీస్వామి జీవిత చరిత్రను కులుమణి – నారాయణ శాస్త్రిగారు తమిళభాషలో రచించగా, దానికి సుప్రసిద్ధ రచయిత 'శ్రీ విశాఖ' భావానువాదం చేశారు. కొన్ని చోట్ల విషయం విశదంకాక సంక్షిప్తం చేయబడిందిట! ఇందులో స్వామివారి మహిమలతోపాటు వారు పలికిన అమూల్య వాక్కుల అంత రార్థంకూడా చాలా సులభమైన పద్ధతిలో వివరించబడింది. అక్క డక్కడ చక్కని శ్లోకాలూ వాని వివరణ ఈయబడినవి. ఆంగ్లంలో వ్రాయబడిన "Sri Seshadriswamigal of Tiruvannamalai and the Spirit Mediaum", దానికి సుప్రసిద్ధ విద్వాంసులు భాగవతుల కుటుంబరావుగారి ఆంధ్రానువాదం, వారి 'సుమాంజలి' కూడా గ్రంథానికి మెరుగు పెడుతున్నవి. కాని ముద్రణ స్ఖాలిత్యాలు చాలా కాన వస్తున్నవి. ఒక్క ఉదాహృతి –

'కాశీక్షేత్రం శరీరం త్రిభువన జననీ వ్యాపినీ జ్ఞానగంగా'

అని దానికి 'త్రిభువన జనని జ్ఞానగంగయే ప్రవాహం' అని ఉన్నది. ఇది సరికాదు. 'శరీరమే కాశీక్షేత్రము.. జ్ఞానమే గంగా ప్రవాహం' అని ఉండవలసి ఉన్నది (పుట 142)

ఇందు రెండు భాగము లున్నవి. మొదటిదానిలో శ్రీ స్వామి జీవిత చరిత్ర, రెండవ దానిలో వారి ఉపదేశములు వివరింపబడినవి. ఈ యుపదేశములు నాలావరకు వాచ్యంగా ఉండవు. వ్యంగ్యంగా ఉంటాయి. వాటి వివరణకూడా ఆ ఉపదేశాల క్రిందనే అనువాదకులు స్పష్టపరచారు. ఈ శేషాద్రిస్వామి జీవిత చరిత్రతోపాటు 18 పుటలలో కుళంద్తై ఆనందస్వామి జీవితచరిత్రకూడా యీ గ్రంథంలో యీయబడినది.

శ్రీ స్వామి జీవిత చరిత్రను సరళమైన భాషలో సులభ మైన శైలిలో రచించిన 'విశాఖ' గారున్నూ, దీనిని ప్రకటించిన సాధన గ్రంథ మండలివారున్నూ అభినందనీయులు.

— "అంగీరస"

నాలుగు నవకవితలు

1. నవచేతన

[కవితా సంకలనం; సంకలనకర్త – కందుకూరి వెంకటేశ్వర్లు.]

కవులుగా తీరవేసినవారి ఉత్సాహాన్ని ప్రతిబింబించే సంకలనం – ఇది. ప్రగతి రాకకు, అజ్ఞానపు పోకకు ఎదురుచూచె యువకోత్సాహము–ఆశ–ఇందు పైకుబుకుతున్నవి. విషయం సర్వసాధారణమే, రచన యింకా మెరుగు తేలవలసి యున్నది కాబట్టి నిలబడ గలిగిన సత్తా కొంత తగ్గుతున్నది. ఈ వేదిక స్థానం బందరు అయినా, దేశం నాలుగు మూలలందలి యువకుల రచనలు చేర్చబడి, విశాలాంధ్ర

త్వాన్ని పొందినది. ఈ వ్రాతలు ముమ్ముందు తీరిన రచనలకు సాధనంగా ఉంటున్నవి. ప్రోత్సహించవలసిన ప్రయత్నం.

ఇంగ్లీషు మాటల శీర్షికలు కనుగాయ తగాన్ని తెలుపుతున్నవి. మినీ కవిత కుదిరిక ఇమిడిక బాగా ఏర్పడితే సూక్తులు (సామెతలు)గా పనికివస్తవి. కొన్నిటిలో మంచి నుడికారం తలచూపుతున్నది. 'బీభత్సం' అనే దానిలో 'భీ' అనడమెందుకు? దినపత్రికల పలుకుబడి కాటోలు. "మరి మహా చెట్టు" సొంపులేని విశృంఖల రచన. (మరి మహా వృక్షమని చిన్నయసూరి ప్రయోగమున్నా) రచనలు పక్వానికి వచ్చే సూచనలు ఉన్నవి. ఈ వ్రాతగాండ్రు వేగునుండి పగటి పూటలో బడగలరు.

[1/8 క్రౌన్-48 పుటలు; వెల రు. 2/-; పుస్తకాలకు-సౌందినీ పబ్లికేషన్సు; బచ్చుపేట, మచిలీపట్నం.]

2. చుక్కలు

[కవితోక్తులు: పొట్లపల్లి రామారావు.]

ఇది భావశబలత. రవీంద్రనాథ ఠాగూరు మిణుగురు బూదులు వంటివి. పాఠకుడు ఏరుకోదగినవి చాలా ఉన్నవి. గ్రంథకర్త-"పాఠకుడు ఆత్మీయం అనే ద్వారంగుండా రచనలో ప్రవేశించాల-అంటాడు; అంటే సహృదయం కావాలంటాడు. మంచిమాటేగాని అనుభవించలేని పాఠకునివల్ల రచయితకు ఏమినష్టము? "నానాసూన వితాన వాసనలకానందించు సారంగము గంధఫలిని అంటనట్లే" పువ్వు వెనుక పిందెఉన్నట్లు-ఆలోచనలో ఆచరణ ఉన్నదని కవి విశ్వాసం. ఇది ఆశా కిరణం గలిగిన గంభీరభావం.

సకల కళాకుశలుడు-సంజీవదేవుగారు, ఈ గ్రంథాన్ని (నెల వంక శీర్షిక క్రింద) సాకల్యంగా సమీక్షించినారు. ఇది పేరుకు నెల వంకేగాని విషయంలో పండువెన్నెల గాస్తున్నది.

ఈ చుక్కలు అజాండాన్ని నింపిన అణువులువంటివిగా, రచయిత పండిన అనుభవం కలిగించిన భావాలతో నిండి ఉన్నవి. మన సంస్కృత గాథలు-చాటువులవలె, దేనికి అది తనీగా ఉన్న ఖండికలు ఇవి. చక్కటి అనుభవాలు - భావాలు-ఇంకా చక్కటి భాషలో పొందు పరుపబడి ఉన్నవి. ఇవి చాలవరకు లోకగతి తలపోతలు. చదివిన వానిని ఆలోచనలోకి దింపుతవి. ఇదేగదా కవిత ఫలితం!

[1/8 డెమ్మి: 132 పేజీలు; వెల రు-5-/ప్రతులకు-ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు, రాష్ట్రపతిరోడ్, సికిందరాబాదు, 500003.]

3. రోజీ

[నవ్యకవిత; రంధి సోమరాజు.]

డబ్బు బాగా వెచ్చించిన అచ్చు అందులో ఒయ్యారం! ప్రతి పుటకు క్రింద రెండు పంక్తులలో కవిపేరు. ఇక భాష, నీచగ్రామ్యపు తెలుగు, మర్డర్ చేయబడిన ఇంగ్లీషు. అంతా వెరిబట్టిన ఎక్సెంట్రిసిటీ! ఈ గ్రామ్యానికి మిత్రులు మురిసిపోయినా, అందరికీ నవ్వాలగదా. పూర్వకవి-చంద్రశేఖర శతకం నిన్నగ్రామ్యమైనా అర్థమౌతున్నది. వేదంవారి ప్రతాపరుద్రీయంలో తురక తెనుగు-పేరిగాడి తెనుగు, గురజాడ గిరీశం ఇంగ్లీషు ముక్కలు హాస్యరసాన్ని ఊరిస్తున్నవి. అట్టిదికాదే ఈ గోడు (రంధి) ఇంగ్లీషు పదాల స్వరూపం తెలుసుకొనే తల ప్రాణం తోకకునస్తున్నది. చదవడం ఆనందానికే గదా, ఇక ఈ రచన కష్టమైన చదువు కావడంవల్ల మనసుకు కష్టాన్నేకలిగిస్తున్నది. వ్యావహారికం వ్రాయడం చాలా కష్టమని, ఉన్నవ లక్ష్మీనారాయణ తమ "మాలపల్లి" పీఠికలో చెప్పకొని ఉన్నారు; ఇది నిజమైనమాట. ఈ రచన రంధిగారికంటె, అర్థం చేసుకోను పాఠకుడికే సంకటంగా ఉన్నది. దీనికితోడు ఈయన భాషలో అవసరమైన సమతూకంలేదు. "సీను" నోటిపలుకులు ఒకచోట, అపభ్రంశపు ఇంగ్లీషు ఇంకొకచోట, దీర్ఘ సంస్కృత సమాసాలు మరొకచోట. ఇంగ్లీషు ఘోరకలి. ఈరచనంతా చూస్తుంటే ఈయన భాషాప్రయోగాభిరుచి వక్రించిన దనాల; అంతే.

పొగడిన మిత్రులు రచయితకు అపకారమే చేసినారనాలి; ఒక్క అర్. ఎస్. సుదర్శనందప్ప. ఆయన అన్న-"ఎత్తుగడలో భావుకతలో సుందరమైనకావ్యం-మీ రోజీ. కాని మీ భాషాప్రయోగ చాపల్యం నాకు సుతరాం నచ్చలేదు. అనవసరమైనదీర్ఘాలు పెట్టడంవల్ల, అనవసరంగా ఇంగ్లీషుపదాల్నీ పదబంధాలనీ కలపడంవల్లా, ఇంగ్లీషుపదాల్ని చాలచోట్ల మార్చిగుర్తించేదుకు వీలులేకుండా సాగదీయడంవల్లా, మీకావ్య బాహ్యరూపం భాషాస్వరూపం చాలా చోట్ల నచ్చేలాలేదు. "ఈ మాటతో ప్రతివాడూ అంగీకరిస్తాడు. "కృష్ణశాస్త్రి" అన్న నోరు ఉష్ట్ర నాదం నోరు **అంటుందా! అతాకృతకం. అభిప్రాయాలిచ్చిన** ఇంకొక మిత్రుడు "కాక్టెయిల్" శీర్షికలో తెగ పొగుడుతాడు. రచయిత ఇంగ్లీషు వీరికి అంటువ్యాధి అయినట్లున్నది. **ఇక ఈ పకం** అర్థంకోసరం తాగుబోతు ఏక్కడ కానులేండి.

రోజీ వీధిలో ఎంగిలాకులుమధ్య దొరికి, **సినిమాస్టార్** అయిన అదృష్టవంతురాలు. ఈ అపస్వరాలపుట్ట, నేటి పెద్ద ఇంగ్లీషు నటకుల పేర్లపట్టీ పల్లిస్తుంది-(స్వచ్ఛంగా) క్రింది చూపులేనందున మనవారెవరూ కనబడలేదు. ఇది కొందరు తారల విత్తిపాడుపు అయినా, బెర్నార్డ్‌షా వ్రాసిన పిగ్మ్యాలియన్ (మై ఫేర్ లేడీ)లోని సొగసు ఇందులేదు; అంతా మొరటుదనమే. ఇందలి మూరెడు పొడుగు చిత్రం-ఫిలిం షూటింగు ఘట్టం గాబోలు; గలివర్ లిల్లిపుట్‌దేశం పోయినప్పటి దృశ్య మనసుకువచ్చి వ్రాయించినట్లున్నది.

మంచిభావాలు గల కవి; విపరీత పాకానబడి రసాభాసం చేసుకొన్నాడు. ఈ పిచ్చి కుదిరితే మంచి కవి అవుతాడు. కోపమాసార్.

[1/8 డెమ్మి 40 పారటలు; వెల రు. 5/ ; పుస్తకాలకు: శశిధర్ పబ్లికేషన్సు; ఎ. టి. రెడ్డి బిల్డింగ్స్; మ్రరిపాలెం; విశాఖపట్నం-7.]

4. మేం

[కవితా సంకలనం—సంపాదకుడు నాగిసేని భాస్కరరావు.]

అనేక పుస్తకాలు అచ్చువేసిన అనుభవం కాదు వినుగుతో యువభారతి వారు, ఇక్కడ అచ్చును అడ్డం తిప్పినట్లున్నది. ఇద్దరు కవుల వ్రాతను ప్రక్క ప్రక్కన 'కాలము' బడవేసి, పాఠకుని తడుముకొనేటట్లు చేస్తున్నారు. అందువల్ల ప్రతి పొరటలో ఇద్దరి పేర్లు తప్పినవి కావు మొదట కొంత పయాసపడి క్రింద మీద ప్రక్కన చూచుకొని. తేరుకొని సాగిపోవలసి వస్తున్నది. యువతరం ఇంత ప్రయాస కోర్చుకోగలదా? వేరువేరుగా వేస్తే కొత్త అనిపించుకోదనా? అట్లా రెండు ఇక్కలా ఒకటే ఇందు చిన్నకష్టం: "గంగ కిద్దరిమేలు అద్దరి కీడునుంగలదె?" అని పుస్తకం తెరిస్తే అక్షరాలు తల క్రిందు వుతున్నవి. ఇప్పుడున్నా అచ్చు బాగున్నది. ఇదే యువ భారతివారి సినితనం.

ఈ సంకలనం అప్పుడప్పుడు పత్రికలలో పడిన వాటిని చేర్చినారు.

ఇక, ఈ రచయిత లిద్దరూ నిర్దిష్ట భావ ప్రేరితులు (అంటే – కవి పెడ్ రచయితలు) కమ్యూనిష్టులలో ఇరువాగులవారు కాని సభలో దూరి మంత్రులైయున్న యీనాడుగూడ. ఈ గీతాలు సాయుధ పోరాటం కావాలని, క్రింద గీతగీసి పలుకుతున్నవి. బహుశః ఈ వ్రాత తెలంగాణా పోరాటపు దినాలలోనిది గామాల.

సుధామ రచనలో స్పష్టత తక్కువ; మర్మధోరణి ఎక్కువ. తెలుగు నుడికారం ఇంకా బాగా తీరవలసి ఉన్నది. కత్తి "అంచు"ను వాడర అంటే బాగుండేది. "నీళ్లను నిరాశను నైలు నదిలో విసరి" అంటాడు; నీళ్లను నదిలో గలపను, ఈ జిప్టుకు అంతదూరం పోవేల? "మేడిపండు సమాజం" వంటి ప్రయోగాలు బాగున్నవి.

నాగిసేని భాస్కరరావు – భావత భాష గంభీరంగా హృద్యంగా ఉన్నవి; చేయి తిరిగినవ్రాత. "వానతో పిడ్చిన ఆకాశం వెన్నెలతో నవ్వుతుంది" - మంచికూర్పు. "హింసించేడి సర్పాన్ని చంపేటందుకు చలిచీమలో పుంది కట్టుబాటు" మంచి భావం.

[1/4 పూల్సుక్యాప్; 64 పొరటలు; వెల రు. 5/- దొరకుచోటు: యువభారతి, 5 – కింగ్స్వే; సికింద్రాబాద్ – 500003.]

వందేమాతరమ్

[అనువాదం—డాక్టర్ ప్రసాదరాయ కులపతి; కౌను 210 పొరటలు; వెల రు. 6-50 పతులకు సాహిత్య నికేతన్, సంగ్రామ చౌక్, ఏలూరు రోడ్, విజయవాడ-2]

స్వచ్ఛజాతీయతా ప్రేరకమైన ఈ గ్రంథం, భారత స్వాతంత్ర్య చరిత్రకు శబ్దచిత్రణము. వందేమాతర నినాదం స్వాతంత్ర్య సమరానికి ఊపమంతమై జాతీయతను పెంచిన అమృత రసము. రవీంద్రుడు అన్నట్లు: శిలా సదృశమైన హృదయ కవాటాలను సైతం ఛేదించి, మనోసింహాసనం అధివసించగల అద్భుతశక్తి – వందేమాతరగీతంలో ప్రతిమాటకు ప్రతి వాక్యానికి గలదు. ఈ గీతం భారత మాతృదేవి సజీవమూర్తి చిత్రీకరణము. ఈమంత్ర చరిత్రను దానితోబాటు 1905 మొదలు స్వరాజ్యం వచ్చేవరకు భారతీయులు సాగించిన దాస్యవిముక్తి సమర చరిత్రను ఈ గ్రంథం కండగల తెలుగుతో వర్ణిస్తున్నది ఇది పాఠకుని అడుగడుగున ఉత్తేజపరచి, పులకితగాత్రునిగా జేసి, ఆ తేజోమయ దినాలను మరల మన ఎదుట నిలబెట్టుతున్నది.

దీనిమూలమును – విశేష పరిశోధక పరిశ్రమ ఫలితంగా శివరాం గారు; "బందుకథే బందువ్యథే" అన్న కన్నడ గ్రంథమున వెలయించినారు దానిని జి హెచ్. ప్రహ్లాదరావు ఇంగ్లీషులో Story of a songగా అనువదించినారు. దానికి తెనుగుసేతే యీ ప్రసాదరాయ కులపతి – వందేమాతరమ్. దీని విషయం – భారత జనవాణి, సమగ్రజాతి జీవన రక్తము స్వాతంత్ర్య బీజమునై ఉన్నది. ఈ ఆంధ్రానువాదం ప్రాణవంతమై ప్రసన్నతాగుణం గలిగిన భాషలో ఉన్నది. అనువాద మనిపించుకోకుండా, జాతీయతా ప్రోత్సాహిగా, మరుగులు గక్కుతూ ప్రవహించిపోతున్నది. ఆత్మబలిదాతలు చిందించిన రక్తబిందువులతో పవిత్రభూతమైన ఈ చరిత్ర, వినాయక దామోదరసావర్కర్ వ్రాసిన 1857 వత్సర ప్రథమ భారతీయ విప్లవగాథవలె ఉద్బోధాత్మకంగా ఉన్నది. చరిత్రయొక్క అస్థిపంజరానికి, యీ రచన కండనెత్తురు కల్పించి, ఊపిరి పోసినది. తెలుగు పూదోటలో ఈ నడుమ మొలచి ఎదిగే చాలా కలుపు మొక్కలతో ఈ పుస్తకం ఒక పారిజాత మహీజంగా వెలుస్తున్నది.

ఈ వందేమాతర మంత్రమును, 1882లో వంగమహాకవి – బంకించంద్ర ఛటోపాధ్యాయుడు, తమ నవల "ఆనందమఠ్"లో దేశమాత మూర్తి ఎదుట స్తోత్రగీతంగా ప్రవేశపెట్టినాడు. ఇది

సన్యాసుల పేర వంగవీరులు సాగించిన స్వాతంత్ర్య సమరగాథ (ఓ. వై. సి. దొరస్వామయ్యగారి ఆంధ్రానువాద — ఆనంద మఠము 70 ఏండ్లనాడే వావిళ్లవారిచే ప్రచురింపబడినది) 1886లో కాంగ్రెసు సభలో పాడబడినది. 1903లో జాతీయ నినాదమైనది. 1906 బారిసాలు కాంగ్రెసునుండి జాతీయతకు మహామంత్రమైనది. ఒక సభలో రవీంద్రనాథ ఠాగూరు దీనిని పాడిపరవశింపజేసినాడు.

ఈ నినాదపు కార్చిచ్చు బ్రిటీషు సింహానికి వేడి పుట్టించినది వెంటనే ఈ పాట, కడకు యీ మాటగూడ నిషేధింపబడినది. దీనితో ఈ మాట విద్యార్థి లోకంలో మహోజ్వలమైన సమర గీతమైనది. ఈ మంత్రోచ్చారణంతో యువకులు చిందించిన వేడినెత్తురు, వంగవిప్లవపు పాదులనునింపి, భారత జాతీయతావృక్షాన్ని పెంచినది. చేత భగవద్గీత, నోట వందేమాతరంతో బెంగాలు యువకులెందరో ఉరికంబాలెక్కినారు.

వంగ విప్లవ గాథను; వివిధ రాష్ట్రాలలో తలయెత్తిన జాతీయోద్యమాలను ఈ పుస్తకం చక్కగా వర్ణిస్తున్నది. వంగ జాతీయ మహాయజ్ఞంలో కుదీరాంవంటి యువకులు ఎందరో జీవితాలను హవిస్సుగా తేల్చినారు; అట్టివారి జీవితాలు ఎన్నో మాతృదేవి మెడలో మణిమాలలైనవి. తిలక్-లాజపతిరాయి — బిపిన చంద్రపాలు అరవిందులు నాయకులైనారు — సావర్కార్ విప్లవ వీరుడైయుండినాడు. వివేకానంద, సోదరి నివేదిత మొదలగు ఋషిపుంగవుల శంఖారావం ధ్వనించినది. ఆ పాత కథను నేటి యువతరానికి యీ గ్రంథం, జాతీయావేశాన్ని కలిగించేటట్లు వర్ణిస్తున్నది. గాంధి యుగసమరం కన్నులారచూచిన వారికి, ఈ గ్రంథపఠనంవల్ల ఆ మహోద్యమం పునర్దర్శన మిస్తున్నది.

నాగపూరుకు యీ గీతజ్వాలను కొనిపోయినది — కేశవరాం బలీరాం హెడ్గవార్. యీ తెనుగుబిడ్డే రాష్ట్రీయ స్వయంసేవక సంఘ జనకులు. ఆంధ్రలో బందరుబోగాడ యీ జాతీయ జ్యోతి వెలిసినది! కాని విందులకో ఆ విషయాన్ని యీ పుస్తకం దిగవేసినది. మొదటి పుస్తకం వ్రాసిన కన్నడులకు ఇది తెలియరాలేదేమో.

బ్రిటిషు రాజనీతి హిందూముస్లిములను జాతీయ రంగమున చిట్టదీసినది. వందేమాతరం తమ మతానికి వ్యతిరేకమన్నారు ముస్లిములు. గాంధి, నెహ్రూ మొదలగువారు సమైక్యత దృష్టితో లొంగిపోయినారు. దీని స్థానే ఇక్బల్ ఉరుదూ పాట కొంతకాలం కాంగ్రెసు సభలలో జాతీయ గీతమైనది. స్వరాజ్యం వచ్చిన తర్వాత జనగణమన దానిస్థానే దూర్చబడినది; త్యాగ చిహ్నము — ఆత్మబలిదాతల రక్త సంకిలము అయిన వందేమాతరం మూలబడిపోయినది. బృందగానానికి, బ్యాండు వాద్యానికి అనువుగాదని దీనిపై ఒక నెపం పెట్టినారు. ఇట్లా ఆ మంత్రశక్తి జ్వాల కొడిగట్టి మిణుకు మిణుకుమంటుండిన దీన సమయంలో, మహారాష్ట్ర గాయకుడు —(శాంతారాం ప్రభాత కంపనీ సంగీత దర్శకుడు—) మాస్టర్ కృష్ణరావు రామచంద్ర పులాంబికర్ దీనికి పునరుత్థానం కల్పించినారు. ధర్మదీక్షతో రేయింబవలు చమటూడ్చి, యీ మాస్టరు వందేమాతర గీతానికి స్వరకల్పన గావించి, మరల ప్రాణం పోసినారు. గాంధిజీ, రాజేంద్ర ప్రసాదు, రాజాజి మొదలగు నాయకులకు వినిపించి మెప్పించి ఒప్పించినాడు. యీలోపల కృష్ణరావు వ్యయ ప్రయాసలతోడు అవమానాలనుగూడ అనుభవించవలసి వచ్చినది. ఆయన పుణ్యాన యిప్పుడు సభాంతర గీతంగానైనా దానిని వింటున్నాము.

ప్రాణవంతమైన యీ పవిత్రగాథను, అమూలాగ్రంగా యీ పుస్తకం ఆంధ్రులకు కానుక పెట్టుతున్నది. యువతరానికి ఇది పారాయణ గ్రంథం కావలసి ఉన్నది.

—శ్రీ మరుపూరు కోదండరామరెడ్డి.

"ముని మాణిక్యాలు"

[హాస్యకధానికల సంపుటి, సంపాదకుడు: తుంగతుర్తి విశ్వనాథ శాస్త్రి. ప్రచురణ: శ్రీనివాస సాహితీ సమితి, హైదరాబాదు. వెల : రూ 3-00.]

శ్రీనివాస సాహితీ సమితి హైదరాబాదువారు స్వర్గీయ శ్రీ మునిమాణిక్యం నరసింహారావుగారి పేర పోయినేడు జరిపిన హాస్య కథలపోటీలో బహుమతిపొందిన కథలతోపాటు పోటీకి వచ్చిన కథల్లో మంచివనుకున్నవి మరికొన్ని ఏరి, జతచేసి "మునిమాణిక్యాలు" పేర ప్రచురించిన పుస్తకమిది.

ఇందులోని పదిహేడు కథల్లో కొన్నిటిలో హాస్యం పాలు కొంచెం తక్కువైనట్లనిపించినా మొత్తంమీద కథల ఎంపిక బాగున్నది. ప్రతి కథలో చక్కని కథావస్తువున్నది. "ఒకనాటి భారతం"లో సామాన్య వుద్యోగి వో రోజు జీవిత సంఘటనలను రచయిత శ్రీ యం. కామేశ్వరరావు చక్కగా చిత్రించారు. "ఉద్యోగసమరం"లో ఒక వుద్యోగం కోసం తమ తమ పలుకుబడులను ఏ ఏ ప్రాణులు ఎలా ఎలా వుపయోగిస్తారో, తాపత్రయ పడ్తారో రచయిత శ్రీ జ్యోతిప్రసాద్ రచించారు.

తెలుగునాట యీ శ్రీనివాస సాహితీ సమితివంటి చక్కని సంస్థలు ఎంతైనా అవసరం. రచయితలను తీర్చిదిద్దటంలో, వో వ్యక్తిలో దాక్కునివున్న రచనాశక్తిని ప్రోత్సాహపరచి, క్రియారూపంలోకి వచ్చేలా చేయటంలో యిటువంటి సత్ సంస్థల పాత్ర ఎంతైనా వున్నది.

శ్రీనివాస సాహితీ సమితి, ఆ సమితి కార్యనిర్వాహకులు ఎంతైనా అభినందనీయులు.

—"పాలాక్షుడు"

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones : 75667 & 75226.